బుధవారం 2-8-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 319

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'



సిరీస్ కోసం భారీ స్కోర్

వెస్టిండీస్‌తో చివరి వన్డేలో 351 పరుగులు చేసిన టీమిండియా - 12లో



జీఎస్టీ వసూళ్ల ఉత్సాహం

దేశవ్యాప్తంగా జూలైలో 1.60 లక్షల కోట్లకు పైగా వసూళ్లు - 13లో



నిర్మాణదశలో ఘోర ప్రమాదం

మహారాష్ట్రలో నిర్మాణంలో ఉన్న సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వే వద్ద గిర్డర్ లాంఛర్ కుప్పకూలడంతో 20 మంది ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▶



అవిశ్వాసంతో అభివృద్ధి సాధ్యం కాదు

పుణేలో లోకమాన్య తిలక్ అవార్డు'ను ప్రధాని మోదీ స్వీకరించారు. అవిశ్వాసం ఉన్నచోట అభివృద్ధి సాధ్యం కాదని ఆయన అన్నారు.

వివరాలు 6లో ▶



నితీశ్‌కు ఊరట

కులగణన వద్దంటూ దాఖలైన పిటిషన్లను పట్నా హైకోర్టు కొట్టివేసింది. బిహార్‌లో కులగణన కొనసాగింపునకు గ్రీన్ సిగ్నల్ లభించింది.

వివరాలు 6లో ▶



సూకీకి క్షమాభిక్ష

అంగ్ సాన్ సూకీకి మయన్మార్ సైనిక ప్రభుత్వం ఆరేళ్ల జైలు శిక్షను తగ్గించింది. ఆమె మరో 27 ఏళ్లు జైల్లో గడపాల్సి ఉంది.

వివరాలు 6లో ▶

రూపు మారుతున్న ఉత్తరాంధ్ర

విశాఖపట్నంకు ఆణిముత్యంలా ఇనార్బిట్ మాల్

దక్షిణాదిలోనే అతిపెద్ద మాల్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భూమి పూజ

- రూ.600 కోట్లతో 12-13 ఎకరాల్లో భారీ స్థాయిలో నిర్మాణం.. 8 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి
- రెండో దశలో 2.5 లక్షల చదరపు అడుగుల్లో 'ఐటీ స్పేస్'.. మరో 3 వేల జాబ్స్
- అంతర్జాతీయ స్థాయిలో కన్వెన్షన్ సెంటర్ దిశగా ప్రణాళికలు.. నగరంలో 7 స్టార్ హోటల్ నిర్మాణానికి రహేజా ఉత్సాహం
- హిందూపురంలో 350 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు సన్నద్ధం
- దీని ద్వారా మరో 15,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు.. పెట్టుబడులు పెట్టే వారికి ప్రతి అడుగులోనూ తోడుగా ఉంటాం
- ఎలాంటి సహకారం కావాలన్నా ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు..
- జీవీఎంసీ పరిధిలో రూ.134.58 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన
- ఏయూలో రూ.130 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులను ప్రారంభించిన ముఖ్యమంత్రి

2 లో



విశాఖలోని కైలాసపురంలో ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన చేస్తున్న సీఎం జగన్. చిత్రంలో రహేజా గ్రూప్ ప్రెసిడెంట్ నీల్ రహేజా తదితరులు

"రాష్ట్రంలోని నాయకత్వం వాణిజ్య, వ్యాపార, పారిశ్రామికాభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలందిస్తోంది. ఇనార్బిట్ మాల్‌తో మరింత అభివృద్ధికి బాటలు పడాలని ఆకాంక్షిస్తున్నా. ఇక్కడ త్వరలో నిర్మించబోయే ఐటీ స్పేస్ ద్వారా ఐటీ రంగం అభివృద్ధి కార్యక్రమాలను చేపడతాం. హిందూపురంలో 350 ఎకరాల్లో టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ పార్కు అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. దీని ద్వారా 15 వేల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి.
- నీల్ రహేజా, రహేజా గ్రూప్ ప్రెసిడెంట్

"సీఎం జగన్ నాయకత్వంలో రాష్ట్రంలో వ్యాపారాభివృద్ధికి ఎంతో అనువైన వాతావరణం ఉంది. అతి తక్కువ సమయంలో ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయడం శుభ పరిణామం. ఇనార్బిట్ మాల్ ప్రజల షాపింగ్ అవసరాలు తీర్చడమే కాకుండా ఆహ్లాదకరమైన, వినోదాత్మక ప్రదేశంగా అందరినీ ఆకట్టుకుని అలరిస్తుంది.
- రజనీష్ మహాజన్, ఇనార్బిట్ మాల్ సీఈవో

ఫ్యాక్ట్ చెక్

డేటా భద్రం.. 'ఈనాడు' మెదడే ఛిద్రం

- బాబు హయాంలోలా పథకాలకు సంబంధంలేని ఏ సమాచారమూ ఇప్పుడు సేకరించలేదు
- సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన వివరాలే సేకరణ
- అప్పట్లో.. ప్రజా సాధికార సర్వే పేరుతో రాష్ట్ర ప్రజలందరి ఓటరు ఐడీ వివరాలు సేకరించిన చంద్రబాబు
- అవి టీడీపీ సంఘమిత్ర యాప్‌లో సైతం ప్రత్యక్షం..
- చంద్రబాబు ప్రభుత్వం సేకరించిన డేటాలో ఎవరికెన్ని లోన్లు ఉన్నాయో కూడా ఆరా

3 లో



తీరం దాటిన తీవ్ర వాయుగుండం!

మూడు రోజులు తేలికపాటి వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: ఈశాన్య బంగాళాతంలో కొనసాగుతున్న వాయుగుండం మంగళవారం మధ్యాహ్నానికి తీవ్ర వాయుగుండంగా బలపడింది. అనంతరం అది పశ్చిమ వాయవ్య దిశగా పయనించి సాయంత్రం 3.30–4.30 గంటల మధ్య బంగ్లాదేశ్‌లోని ఖేపుపరా వద్ద తీరాన్ని దాటింది. ఆపై ఈ వాయుగుండం మళ్లీ పశ్చిమ బెంగాల్‌లో తీరంలోని దిఘా సమీపంలోకి ప్రవేశించి కోల్‌కతాకు తూర్పున 120 కి.మీ.ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది తీవ్ర వాయుగుండంగా కొనసాగుతూ గురువారం నాటికి బలహీన పడుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) మంగళవారం రాత్రి బులెటిన్‌లో తెలిపింది. మరోవైపు రాష్ట్రంలో పశ్చిమ, వాయవ్య గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో రానున్న మూడు రోజులు ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షా లు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. అదే సమయంలో గంటకు 30–40 కి.మీ.ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది.




నిజాలు దాచి.. నిర్భయంగా అబద్ధాలు

- పోలవరం ప్రాజెక్టుపై ఈనాడు మరో అసత్య కథనం
- చంద్రబాబు పాపాలను దాచిపెట్టి.. ప్రస్తుత ప్రభుత్వంపై బురద జల్లే యత్నం
- చంద్రబాబు నిర్వాకం వల్లే పోలవరానికి నిధుల సమస్య
- అడ్డంకులన్నింటినీ తొలగించుకుంటూ వడివడిగా పోలవరాన్ని పూర్తి చేస్తున్న సీఎం జగన్
- సీఎం జగన్ కృషితో తొలి దశ పూర్తికి రూ.12,911.15 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకారం
- బిల్లుల చెల్లింపులో విధించిన పరిమితులు తొలగింపు
- తాగునీటి విభాగం వ్యయాన్నీ ఇస్తామని కేంద్రం వెల్లడి
- ఇవే విషయాలను రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర మంత్రి బిశ్వేశ్వర్ తుడు

14 లో

8న అవిశ్వాసం



లోక్‌సభలో మూడు రోజులపాటు జరగనున్న చర్చ

- లోక్‌సభ బీఏసీ సమావేశంలో నిర్ణయం
- పార్లమెంట్‌లో కొనసాగిన 'మణిపూర్' అలజడి
- ఉభయ సభలు బుధవారానికి వాయిదా

10వ తేదీన సమాధానం ఇవ్వనున్న ప్రధాని మోదీ


న్యూఢిల్లీ: మణిపూర్ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ నోరు విప్పకపోవడాన్ని నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఈ నెల 8వ తేదీ నుంచి 3 రోజులపాటు లోక్‌సభలో చర్చ జరుగనుంది. 10వ తేదీన ప్రధాని మోదీ దీనిపై సమాధానమిచ్చే అవకాశం ఉంది. మంగళవారం లోక్‌సభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అవిశ్వాస తీర్మానంపై బుధవారం నుంచే చర్చ చేపట్టాలంటూ తాము డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ విపక్ష 'ఇండియా' కూటమి సహా ఇతర ప్రతిపక్ష ఎంపీలు బీఏసీ సమావేశం నుంచి మధ్యలోనే బయటకు వెళ్లిపోయారు. కేంద్రంపై గత నెల 26న విపక్ష 'ఇండియా' కూటమి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. 2014 తర్వాత మోదీ ప్రభుత్వం అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొంటుండడం ఇది రెండోసారి. 2018 జూలై 20న అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగింది. తీర్మానానికి వ్యతిరేకంగా 325 మంది ఎంపీలు ఓటేశారు. మోదీ సర్కారు సునాయాసంగా గట్టెక్కింది. ఈసారి కూడా గెలుపు లాంఛనమే. ప్రస్తుత లోక్‌సభలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి కనీసం 332 మంది ఎంపీల మద్దతు ఉంది. నెంబర్ గేమ్‌లో తాము ఓడిపోతామని తెలుసని, మణిపూర్ అంశంపై మాట్లాడేలా ప్రధాని మోదీపై ఒత్తిడి పెంచాలన్నదే తమ ఉద్దేశమని విపక్షాలు చెబుతున్నాయి.

మణిపూర్ అంశంపై విపక్షాల ఆందోళన

మణిపూర్ వ్యవహారంపై పార్లమెంట్‌లో రగడ కొనసాగుతూనే ఉంది. వాయిదాల పర్వం ఆగడం లేదు. మణిపూర్ హింసపై పార్లమెంట్‌లో చర్చించాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సైతం ఉభయ సభల్లో విపక్ష ఎంపీలు

మిగతా 6వ పేజీలో ▶

లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా పోడియం వద్ద విపక్ష కూటమికి చెందిన ప్లకార్డు



రాజ్యాంగ యంత్రాంగం కుప్పకూలింది

6 లో

- మణిపూర్‌లో శాంతిభద్రతలు అస్సలు లేవు:సుప్రీంకోర్టు
- దర్యాప్తు చేసే దమ్ము అక్కడి పోలీసులకు లేదు

టీడీపీ నేత రాయపాటి నివాసాల్లో ఈడీ సోదాలు

- ట్రాన్స్‌స్ట్రాయ్ కంపెనీ ఆర్థిక అక్రమాలపై కొరడా
- రాయపాటి ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు
- గుంటూరు, హైదరాబాద్‌లో 15 చోట్ల ఏకకాలంలో తనిఖీలు.. పలు కీలక పత్రాలు స్వాధీనం?
- బ్యాంకు రుణాలు రూ.9,394 కోట్లు మళ్లించినట్లు ఆరోపణలు
- షెల్ కంపెనీల ద్వారా నిధులు మళ్లించినట్టు నిర్ధారించిన సీబీఐ
- మనీలాండరింగ్ వ్యవహారంపై ఆరా తీస్తున్న ఈడీ

3 లో





45.46 లక్షల మందికి రూ.1,250 కోట్లు

3 లో

తిరుపతి 27వ డివిజన్‌లో వృద్ధురాలు చంద్రమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ రేఖ



మన పెళ్లికి మా ఇంట్లో వారు ఒప్పుకున్నారు!

నిర్మాత ద్వారా పవన్‌కు బాబు ప్యాకేజీ

'చంద్రబాబు ముఠా అమెరికాలో డబ్బులు వసూలు చేసి బ్రో సినిమా నిర్మాత విశ్వప్రసాద్‌కి ఇస్తే.. ఆ మొత్తాన్ని పవన్ కళ్యాణ్‌కు ప్యాకేజీ రూపంలో అందించారు. నన్ను కించపరిచేలా బ్రో సినిమాలో ఓ పాత్ర పెట్టి పవన్ కళ్యాణ్ శునకానందం పొందుతున్నారు. కలెక్షన్లు పెంచుకోవడం కోసమే ఈ పని చేశారు. ఆ సినిమా అట్టర్ ఫ్లాప్. పవన్ రెమ్యూనరేషన్ కూడా తిరిగిరాదు' అని మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు.

- వివరాలు 10లో



తెలంగాణ విద్యుత్ బకాయిలు రూ.6 వేల కోట్లు వసూలు చేస్తాం

- న్యాయ, ఆర్థిక శాఖలతో చర్చిస్తున్నాం.. తెలంగాణకు ఇచ్చే పన్నుల వాటా నుంచి ఈ బకాయిలు మినహాయించాలని ఆర్బీఐని కోరేందుకు ప్రయత్నాలు
- ఏపీకి ఈ బకాయిలు చెల్లించేలా చూడాల్సిన బాధ్యత కేంద్రానిదే
- రాజ్యసభలో స్పష్టం చేసిన కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్.కె.సింగ్
- వైఎస్సార్‌సీపీ పీపీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చిన మంత్రి

10 లో

వరద పైనా 'బురద' రాతలేల?

కోనసీమ జిల్లా అప్పనపల్లికి పూర్తి వరద రాకపోయినా వచ్చినట్లు రామోజీ శివాలు

- టీడీపీ సానుభూతిపరులను స్నానాల ఘాట్‌కు తీసుకెళ్లి 'ఫొటోషూట్'.. వారితో సాయం అందలేదంటూ విషప్రచారం
- అధికారులు ఊరంతా ఆహార పొట్లాలు పంచినా 50 మందికే పంచారని గగ్గోలు
- సాయం అందలేదని 'ఈనాడు'కు తాము చెప్పలేదంటున్న బాధితులు
- తాము చెప్పని విషయాలను చెప్పినట్లు రాశారని వాపోతున్న వైనం
- టీ తాగి జీవిస్తున్నట్టు తాము 'ఈనాడు'కు చెప్పలేదన్న నర్సింగరావు దంపతులు
- వరద సహాయ చర్యలపై ఈ 'బురద' ఏమిటని బాధితుల మండిపాటు
- అధికారుల పరిశీలనలో వెలుగులోకి అసలు వాస్తవాలు



తాము చెప్పని విషయాలను ఈనాడులో రాశారన్న గంటా నర్సింగరావు దంపతులు



ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: గోదావరి పరీవాహక ప్రాంతంలో ఎగువన పడిన భారీ వర్షాలు, ఉప నదుల ప్రవాహంతో వచ్చిన వరదకు ప్రభుత్వం ముందుగానే అప్రమత్తమై అన్ని సహాయక చర్యలు చేపట్టినా 'ఈనాడు' రామోజీరావు మాత్రం తన వంకర బుద్ధిని పోనిచ్చుకోవడం లేదు. మంత్రులు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, జిల్లాల కలెక్టర్లు మొదలుకుని క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో

మిగతా 14వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఈఎన్‌సీ చీఫ్‌గా రాజేష్ పెందార్కర్ బాధ్యతల స్వీకరణ



గౌరవ వందనం స్వీకరిస్తున్న వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళాధిపతిగా వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. విశాఖలోని ఈఎన్‌సీ ప్రధాన కార్యాలయంలో కొత్త చీఫ్‌కు నౌకాదళ వర్గాలు ఘన స్వాగతం పలికాయి. ఐఎన్ఎస్ సర్కార్ పరేడ్ గ్రౌండ్స్‌లో చేంజ్ ఆఫ్ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ సెరిమోనియల్ గార్డ్ తనిఖీ చేశారు. అనంతరం ఈస్టర్న్ నేవల్ కమాండ్‌లోని వివిధ యుద్ధ నౌకలు, జలాంతర్గాములకు ప్రాతినిధ్యం వహిస్తున్న అధికారులు, సిబ్బంది ప్లటూన్లని సమీక్షించారు. ఈ సందర్భంగా తూర్పు నౌకాదళంలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, నౌకాదళ సిబ్బందితో ఈఎన్‌సీ చీఫ్ ముచ్చటించారు.

బీడీఎస్ 2, 3 సంవత్సరాల ఫలితాలు విడుదల

లబ్బీపేట(విజయవాడ తూర్పు): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఈ ఏడాది జూన్,జూలై నెలల్లో నిర్వహించిన బీడీఎస్ రెండు, మూడు సంవత్సరాల పరీక్షల ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఈ ఫలితాలపై రీ టోటలింగ్ కోరుకునే విద్యార్థులు సబ్జెక్టుకు రూ.2 వేలు చొప్పున చెల్లించి ఈ నెల ఏడో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడొచ్చని పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన పీజీ, డిప్లొమా ఫలితాలు విడుదల చేశారు. ఈ ఫలితాలపై రీటోటలింగ్ కోరుకునే వారు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్

సాక్షి, అమరావతి: నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల కోసం సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని స్టడీ సర్కిల్స్‌లో ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని మూడు ప్రధాన కేంద్రాల్లో ఎస్సీ, ఎస్టీలతో పాటు మిగిలిన సామాజిక వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్‌కు ఏర్పాట్లు చేశారు. సివిల్ సర్వీసెస్ (యూపీఎస్సీ) పరీక్షలకు విశాఖ, ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్-1కు విజయవాడ, గ్రూప్-2 పరీక్షలకు తిరుపతి కేంద్రాల్లో ఉచిత కోచింగ్ ఇస్తారు. రూ.6లక్షల లోపు వార్షిక ఆదాయం కలిగిన అభ్యర్థులు ఇందుకు అర్హులు. ఈ నెల 5వ తేదీలోపు https://apstdc.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయ కృష్ణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పీజీ మెడికల్ దరఖాస్తుదారుల జాబితా విడుదల

సాక్షి, అమరావతి: 2023-24 విద్యా సంవత్సరానికి పీజీ మెడికల్, డెంటల్ కోర్సుల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితాను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ మంగళవారం విడుదల చేసింది. https://drysr.uhsap.in/ లో వీటిని అందుబాటులో ఉంచారు. ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయని అభ్యర్థులు ఆగస్టు 3 సాయంత్రం 6 గంటల్లోగా అప్‌లోడ్ చేయాలని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ప్రాథమిక మెరిట్ జాబితాను విడుదల చేస్తామన్నారు.

సెయిల్‌లో విలీనంతోనే 'ఉక్కు' సమస్యకు పరిష్కారం



ఉక్కునగరం: సెయిల్‌లో విలీనం చేయడంతో నే విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని సెయిల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు అన్నారు. మంగళవా రం నుంచి 3 రోజు ల పాటు స్టీల్‌ప్లాంట్ అంబేడ్కర్ కళాక్షేత్రంలో నిర్వహిస్తో న్న బీఎంఎస్ జాతీయ స్టీల్ ఫెడరేషన్ శిక్షణ తరగతులు, కార్యవర్గ సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. బీఎంఎస్ పెద్దల సహకారంతో స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తద్వారా ప్రైవేటీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. బీఎంఎస్ జాతీ య ఉపాధ్యక్షులు రాజ్ బిహారీ శర్మ మాట్లాడుతూ రాజకీయ పార్టీలకతీతంగా నడపబడుతున్న యూనియన్ బీఎంఎస్ మాత్రమే అన్నారు. స్టీల్ ఫెడరేషన్ అధ్యక్షులు కృపాల్ సింగ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జా తీయ ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.కె.పాండే, ఎన్‌జేసీఎస్ సభ్యులు డి.కె. పాండే, జాతీయ ఉపాధ్యక్షులు మళ్ల జగదీశ్వరరావు, బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంపీఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పటంలో విశాఖ..

- నగరీకరణ, పారిశ్రామికీకరణ అంశాల్లో ఎంపికైన నాలుగు నగరాల్లో వైజాగ్‌కు చోటు శుభపరిణామం: ముఖ్యమంత్రి జగన్
- ఏపీలో జరుగుతున్న అభివృద్ధి, ప్రభుత్వ పనితీరుకు 'నీతి ఆయోగ్' కితాబు
- సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సీఎంను కోరిన బృందం
- ఏపీకి పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడి
- నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి వి. రాధ నేతృత్వంలో బృందం సీఎంతో భేటీ
- రాష్ట్రంలో స్టేట్ ఇనిస్టిట్యూట్ ఫర్ ట్రాన్స్‌ఫార్మేషన్ కేంద్రం ఏర్పాటు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నీతి ఆయోగ్ బృందం సభ్యులు

సాక్షి, అమరావతి : విశాఖపట్నాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి అంతర్జాతీయంగా ప్రపంచ పటంలో పెట్టే ప్రయత్నాన్ని తమ ప్రభుత్వం చేస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి వి. రాధతో పాటు పార్థసారథిరెడ్డి, నేహా శ్రీవాత్సవ, అభిషేక్ తదితరుల ప్రతినిధుల బృందం మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల గురించి జగన్ ఈ సందర్భంగా వారికి వివరించారు. నగరీకరణ, పారిశ్రామికీకరణ అంశాల్లో దేశంలో ఎంపిక చేసిన నాలుగు నగరాల్లో విశాఖకు చోటుకల్పించడం శుభపరిణామమని ముఖ్యమంత్రి జగన్ అన్నారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, ఎయిర్‌పోర్టు-సీపోర్ట్ కనెక్టివిటీ రోడ్డు, డేటా సెంటర్, మూలపేట పోర్టు, ఇనార్బిట్ మాల్.. ఇలా అనేక విధాలుగా విశాఖపట్నాన్ని అభివృద్ధి చేసి అంతర్జాతీయంగా, ప్రపంచ పటంలో పెట్టే ప్రయత్నాన్ని తమ ప్రభుత్వం చేస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. అంతేకాక.. రాష్ట్రంలో నూతనంగా నిర్మిస్తున్న సీపోర్టులు, వ్యవసాయం, వైద్య, ఆరోగ్య, విద్యారంగం, నాడు-నేడు, నవరత్నాలు, ఆర్బీకేలు, గ్రామ, వార్డు సచివాలయాలు ఇలా.. ప్రతి విషయంలో కూడా ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, వాటి ఫలితాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధి, ప్రభుత్వ పనితీరును నీతి ఆయోగ్ బృందం అభినందించింది. ఈ సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలన్నింటినీ సమగ్ర నివేదిక రూపంలో తమకు అందజేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని బృందం కోరింది. ఏపీకి అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వెల్లడించింది. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, రాష్ట్ర ప్రణాళికా శాఖ కార్యదర్శి గిరిజా శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై నీతి ఆయోగ్ ప్రత్యేక దృష్టి

మరోవైపు.. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై నీతి ఆయోగ్ ప్రత్యేక దృష్టిసారించింది. అందుకు రాష్ట్రంలో స్టేట్ ఇనిస్టిట్యూట్ ఫర్ ట్రాన్స్‌ఫార్మేషన్ కేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చింది. నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి వి.రాధ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డితో పాటు వివిధ శాఖల కార్యదర్శులతో సమావేశమై పలు అంశాలపై చర్చించింది. ఈ సందర్భంగా రాధ మాట్లాడుతూ.. రాష్ట్రం అధిక వృద్ధి రేటు సాధించే విషయంలో అభివృద్ధి వ్యూహాల రూపకల్పనకుగాను రానున్న రెండేళ్లలో నీతి ఆయోగ్ రూ.5.28 కోట్లు అందించడంతోపాటు అవసరమైన ఇతర సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. దేశాభివృద్ధిలో నగరీకరణ అత్యంత కీలకపాత్ర పోషిస్తోందని ఆమె అన్నారు. రానున్న సంవత్సరాల్లో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు భారత్ పరుగులు తీస్తోందని.. అందుకు రాష్ట్రాల సహకారం ఎంతో ముఖ్యమని రాధ అన్నారు.

నవరత్నాలతో అధిక వృద్ధి రేటు: సీఎస్

ఇక రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను సీఎస్ జవహర్‌రెడ్డి వివరించారు. నవరత్నాలు పేరిట పెద్దఎత్తున సంక్షేమాభివృద్ధి పథకాలను అమలుచేయడంవల్ల రానున్న రోజుల్లో అధికవృద్ధి రేటు సాధనకు అన్నివిధాలా అవకాశం కలుగుతుందని ఆయన తెలిపారు. నీతి ఆయోగ్ సలహాదారు పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ.. ఆయా రంగాల వారీగా ఆర్థికాభివృద్ధికి గల అంశాలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికాశాఖ కార్యదర్శి గిరిజాశంకర్, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



జీవీఎంసీ పరిధిలో అభివృద్ధి పనుల శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం జగన్



ఏయూలో అల్గారిథమ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



ఇనార్బిట్ మాల్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రూపు మారుతున్న ఉత్తరాంధ్ర



సీఎం జగన్‌తో మాట్లాడుతున్న నీల్ రహేజా



ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన అనంతరం మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖ అభివృద్ధికి మరింత దోహదపడేలా నగరానికి ఆణిముత్యంలా ఇనార్బిట్ మాల్ నిలిచిపోతుందని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. విశాఖలో మరో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మంగళవారం విశాఖ పర్యటన సందర్భంగా కైలాసపురం ప్రాంతంలో రూ.600 కోట్ల పెట్టుబడులతో రహేజా గ్రూప్ చేపట్టిన ఇనార్బిట్ మాల్ నిర్మాణ పనులకు సీఎం జగన్ భూమి పూజ చేశారు. రూ.134.58 కోట్లతో జీవీఎంసీ తలపెట్టిన అభివృద్ధి పనులకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. ఏయూలో రూ.130 కోట్లతో నిర్మించిన 5 భవనాలను సీఎం ప్రారంభించారు. దక్షిణాదిలో అతి పెద్దదైన ఇనార్బిట్ మాల్‌తో పాటు 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ స్పేస్, కన్వెన్షన్ సెంటర్‌ను కూడా తర్వాత దశలో రహేజా సంస్థ నిర్మించనుందని సీఎం జగన్ చెప్పారు. లగ్జరీ హోటళ్ల నిర్మాణానికి కూడా రహేజా ఆసక్తి చూపుతోందన్నారు. కేటాయించిన మొత్తం స్థలం విస్తీర్ణం 17 ఎకరాలు కాగా 12-13 ఎకరాల్లో మాల్ ఏర్పాటు కావడం చాలా తక్కువ ప్రాంతాల్లో మాత్రమే జరుగుతుందన్నారు. ఇదే రహేజా గ్రూప్ హైదరాబాద్‌లో ఇనార్బిట్ మాల్‌ను 7-8 ఎకరాల్లో నిర్మించగా విశాఖలో 12-13 ఎకరాల్లో నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఇంకా ఏమన్నారంటే...

ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చేలా..

ఇంత భారీ మాల్ ఏర్పాటుతో విశాఖ రూపురేఖలు మారడమే కాకుండా దక్షిణాదిలో అతి పెద్దదిగా నిలవనుంది. 8 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. 12-13 ఎకరాల్లో మాల్ నిర్మాణం పూర్తయిన తరువాత రెండో దశ కింద మిగిలిన 4 ఎకరాల్లో 2.5 లక్షల చదరపు అడుగుల్లో ఐటీ స్పేస్ కూడా అందుబాటులోకి రానుంది. అంతర్జాతీయ స్థాయిలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి కూడా ప్రణాళికలు రూపొందించారు. ఐటీ స్పేస్ ద్వారా మరో 3 వేల మందికి ఇక్కడ ఉద్యోగాలు రానున్నాయి. గత పర్యటన సందర్భంగా విశాఖలో అదానీ డేటా సెంటర్, ఐటీ స్పేస్, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశాం. అంతకుముందు శ్రీకాకుళం జిల్లా మూలపేటలో పోర్టుకు శంకుస్థాపన చేసుకున్నాం. ఇవన్నీ రానున్న రోజుల్లో విశాఖ, ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చుతాయి. మాల్ కూడా అదే కోవలోకి వస్తుంది.

సాగర తీరంలో 7 స్టార్ హోటళ్లు..

రహేజా గ్రూప్ దేశంలో పలు చోట్ల ఫైవ్‌స్టార్ హోటళ్లను నిర్మించింది. ఏపీలో కూడా రాజ్ విలాస్ తరహాలో సూపర్ లగ్జరీ ఫైవ్ స్టార్, సెవెన్ స్టార్ హోటళ్లు నిర్మాణం కానున్నాయి. ఇప్పటికే ఒబెరాయ్ సంస్థ రాజ్ విలాస్ తరహాలో 7 స్టార్ కేటగిరీలో రిసార్ట్, మే ఫెయిర్ సంస్థ సూపర్ లగ్జరీ 7 స్టార్ హోటళ్ల నిర్మాణానికి ముందుకొచ్చా యి. అదే తరహాలో నీల్ రహేజా కూడా 7 స్టార్ హోటల్‌ను నిర్మించేందుకు ముందుకు వచ్చారు. ఇవన్నీ విశాఖ రూపురేఖలను మార్చే గొప్ప ప్రాజెక్టులు. హిందూపూర్‌లో 350 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్, టెక్స్ టైల్స్‌కు సంబంధించిన పార్క్ రా నుంది. దీని ద్వారా 15 వేల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యుద్ధ ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు నీల్ రహేజా చెప్పారు. దీనికి ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది.

పారిశ్రామికవేత్తలకు ఒక్క ఫోన్ కాల్ దూరంలో..

రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్న వారికి ప్రతి అడుగులోనూ తోడుగా ఉంటాం. కేవలం ఒక్క ఫోన్ కాల్ దూరంలో వారికి అందుబాటులో ఉంటాం. ఈ విషయాన్ని మనసులో పెట్టుకోవాలని కోరుతున్నా. మిగిలిన రాష్ట్రాల కంటే మిన్నగా ఏపీలో పారిశ్రామికవేత్తలకు ఎలా సహాయ, సహకారాలను అందిస్తామో మీరే చూస్తారు. దేవుడి దయ వల్ల వారు బాగుపడటంతోపాటు విశాఖలో మరింత అభివృద్ధి జరగాలని ఆకాంక్షిస్తున్నా. దీన్ని సాకా రం చేసిన నీల్ రహేజా, సీఈవో రజనీష్ మహాజన్, సీవోవో శ్రావణ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలియచేస్తున్నా.

రూ. 134.58 కోట్ల పనులకు సీఎం శంకుస్థాపన

జీవీఎంసీ పరిధిలో రూ.134.58 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. అమృత్ పథకంలో భాగంగా రూ.107.42 కోట్లతో 32 పనులను చేపడుతున్నారు. స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా రూ.16.10 కోట్లతో 7 పనులు చేపడుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 11.06 కోట్లతో 8 పనులను తలపెట్టారు. మొత్తం 47 అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.

ఏయూలో ఐదు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం

ఇనార్బిట్ మాల్, జీవీఎంసీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం సీఎం రోడ్డు మార్గంలో నేరుగా ఏయూ వద్దకు చేరుకున్నారు. గత మూడేళ్లుగా ఏయూలో 18 ప్రాజెక్టులను చేపట్టగా వీటిలో ఐదు ప్రాజెక్టులు సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభమయ్యాయి. టెక్ స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్ (ఆ హబ్), ఫార్మా ఇంక్యుబేషన్ ఎలిమెంట్, ఏయూ డిజిటల్ జోన్ అండ్ స్మార్ట్ క్లాస్ రూమ్ కాంప్లెక్స్ (అల్గారిథమ్), ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ (ఏయూ సిబ్), ఏయూ అవంతి ఆక్వా కల్చర్ ఇన్నోవేషన్ స్కిల్ హబ్స్ వీటిలో ఉన్నాయి. యువత నైపుణ్యాలను ఇతోధికంగా పెంచేలా ఇది దోహదం చేయనున్నాయి. వీటి పనితీరును ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి సీఎంకు వివరించారు. ఎలిమెంట్ భవనంలో నెలకొల్పిన ఫార్మసీ లేబరేటరీని పరిశీలించిన సీఎం జగన్ వివిధ పరికరాల పనితీరును తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స, రజని,అమర్నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారా యణ, మేయర్ వెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, సీపీ త్రివిక్రమ్ వర్మ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

దారి పొడవునా పూల వర్షం



సాక్షి, విశాఖపట్నం: అందరి అభిమాన నేతపై కుంభవృష్టిని తలపించేలా పూల వర్షం కురిసింది! సంక్షేమ సారథిపై అనురాగం వెల్లువెత్తింది. మంగళవారం విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. అడుగడుగునా మహిళలు నీరాజనం పలికారు. ఉదయం 11.13 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సీఎం జగన్ కొద్దిసేపటి తర్వాత బయలుదేరారు. విమానాశ్రయం నుంచి పోర్టు ఆస్పత్రి జంక్షన్ వరకు జాతీయ రహదారి పక్కన సీఎం సార్‌కు స్వాగతం అంటూ ప్లకార్డులతో కిలోమీటర్ల మేర పెద్ద సంఖ్యలో మహిళలు స్వాగతం పలికారు. 7 కి.మీ. మేర భారీ మానవహారంగా ఏర్పడి జై జగన్ అంటూ నినదించారు. ఈ స్థాయిలో ఘన స్వాగతం పలకడం ఇదే మొదటిసారి అని పేర్కొంటున్నారు. హైవేపై వాహనంలో వస్తున్న సీఎం జగన్‌పై దారి పొడవునా పూల వర్షాన్ని కురిపించారు. ముఖ్య కూడళ్లలో తన వాహనాన్ని కొద్దిసేపు నిలిపిన ముఖ్యమంత్రి అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఎయిర్‌పోర్టు నుంచి ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన చేసే పోర్టు ఆస్పత్రి జంక్షన్‌కు చేరుకునేందుకు 45 నిమిషాలకు పైగా సమయం పట్టింది. ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకుని పార్టీ నాయకులు విమానాశ్రయం నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయం వరకు సీఎం కటౌట్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పలుచోట్ల వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడాయి. ముఖ్యమంత్రి జగన్‌ను చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు జాతీయ రహదారిపైకి రావడంతో కిక్కిరిసిపోయింది. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. విశాఖ పర్యటనను ముగించుకుని సీఎం జగన్ మధ్యాహ్నం 2.28 గంటలకు విమానంలో గన్నవరం పయనమయ్యారు.

ఏపీలో ఎంతో అనువైన వాతావరణం

ముంబైలో 2004 జనవరిలో అద్దె ప్రాతిపదికన ఆరంభమైన ఇనార్బిట్ మాల్ సరికొత్త బెంచ్ మార్కును సృష్టించింది. రెండు దశాబ్దాలుగా ఉన్న మాల్స్ రంగంలో కొనసాగుతూ తాజాగా మరో మూడు మాల్స్‌ను ప్రారంభించాం. 100కిపైగా ప్రసిద్ధ జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు భారతీయ మార్కెట్‌లో రిటైల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు ఒక వేదికను సృష్టించాం. విశాఖలో కొత్త చాప్టర్‌ను ప్రారంభించాం. దార్శనిక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలో రాష్ట్రంలో వ్యాపారాభివృద్ధికి ఎంతో అనువైన వాతావరణం ఉంది. అతి తక్కువ సమయంలో ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయడం శుభ పరిణామం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ వరుసగా అగ్రస్థానంలో నిలవడానికి ఇవే కారణం. ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపనపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రితో ముంబైలో పలు విషయాలపై చర్చించాం. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అద్భుతం. ఇనార్బిట్ మాల్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించడంతోపాటు స్థానికంగా రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించిన విశాఖ పో ర్టు అథారిటీకి కృతజ్ఞతలు. రూ.600 కోట్లతో 6 లక్షల చదరపు అడుగుల్లో నిర్మిస్తున్న ఈ మాల్ ద్వారా 8 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇది ప్రజల షాపింగ్ అవసరాలు తీర్చడమే కాకుండా ఆహ్లాద కరమైన, వినోదాత్మక ప్రదేశంగా అందరినీ ఆకట్టుకుని అలరిస్తుంది.

– రజనీష్ మహాజన్, ఇనార్బిట్ మాల్ సీఈవో

మాల్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దుతాం

విశాఖలో మా ఉత్సాహవంతమైన ప్రయాణం ప్రారంభమైంది. ఇనార్బిట్ మాల్ భూమి పూజ కార్యక్రమం మధుర జ్ఞాపకాలను గుర్తు చేస్తోంది. కొన్నేళ్ల క్రితం ఏపీలో దివంగత సీఎం వైఎస్సార్ సమక్షంలో జరిగిన శంకుస్థాపనలో పాల్గొన్నా. ఇనార్బిట్ మాల్స్ ఏర్పాటు ద్వారా వ్యాపార ఒరవడిని మార్చాం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 221 డిపార్ట్‌మెంట్ స్టోర్ లున్నాయి. విశాఖలో మా డిపార్టుమెంటల్ స్టోర్లున్నాయి(షాపర్స్‌స్టాప్). విజయవాడ, గుంటూరు, రాజమండ్రిలోనూ ఉన్నాయి. త్వరలోనే కాకినాడ, నెల్లూరు, తిరుపతిలో ప్రారంభించనున్నాం. ఇటీవల విశాఖను సందర్శించిన సందర్భంగా నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ త్వరలో నిర్మించబోయే ఐటీ స్పేస్ ద్వారా ఐటీ అభివృద్ధి కార్యక్రమాలను చేపడతాం. మాకు ప్రపంచవ్యాప్తంగా రాజ్‌విల్లాల తరహాలో లగ్జరీ హోటళ్లున్నాయి. అదే కాన్సెప్ట్‌ను విశాఖతో పాటు ఏపీలో తేవాలనుకుంటున్నాం. హిందూపూర్‌లో 350 ఎకరాల్లో టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ పార్కు అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం. దీని ద్వారా 15 వేల ఉద్యోగాలు వస్తాయి. రాష్ట్రంలోని నాయకత్వంతో సంతోషంగా ఉన్నాం. వాణిజ్య, వ్యాపార, పారిశ్రామికాభివృద్ధికి పూర్తి సహాయసహకారాలను అందిస్తున్నారు. విశాఖలో ఇనార్బిట్ మాల్‌ను ప్రపంచ స్థాయి మాల్‌గా అభివృద్ధి చేస్తున్నాం. మాల్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దుతాం.

– నీల్ రహేజా, రహేజా గ్రూప్ ప్రెసిడెంట్

నేనున్నా...!

- బాధితులు కనిపిస్తే కాన్వాయ్ నిలిపేస్తున్న సీఎం జగన్
- తన వద్దకు పిలిపించుకుని వివరాలు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి

వివిధ సమస్యలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాసటగా నిలుస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా బాధితులు కనిపించిన వెంటనే పరామర్శించి భరోసా కల్పిస్తున్నారు. వెంటనే ఆదుకోవాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశిస్తున్నారు. తాజాగా విశాఖ పర్యటన సందర్భంగా పలుచోట్ల ఈ దృశ్యాలు కనిపించాయి. -సాక్షి, విశాఖపట్నం

వెన్నుపూస బాధితుడికి ఓదార్పు

పెందుర్తి మండలం వేపగుంటకు చెందిన వీరవల్లి మోహన్ (17) నాలుగో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తూ పడిపోవడంతో వెన్నుపూస దెబ్బతింది. ఆరోగ్యశ్రీ దయవల్ల వైద్యం అందినా ఫిజియోథెరపీ కోసం చాలా ఖర్చవుతున్నట్లు ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన కోసం వచ్చిన సీఎం జగన్ ఎదుట బాధితుడు మొర పెట్టుకున్నాడు. దీంతో సీఎం జగన్ ఆదేశాల మేరకు కలెక్టర్ డా.మల్లికార్జున వైద్య ఖర్చుల కోసం బాధితుడికి రూ.లక్ష చెక్కు అందజేశారు.



మోహన్ సమస్యను తెలుసుకుంటున్న సీఎం వైఎస్ జగన్

తొమ్మిదేళ్ల చిన్నారికి ఊరట..

కంచరపాలెం బాపూజీ నగర్‌కు చెందిన సంతోషి తన కుమారుడ్ని తీసుకొని సీఎంని కలిసేందుకు రాగా భద్రతా సిబ్బంది అడ్డుకునేందుకు ప్రయత్నించారు. వారిని వారించిన ముఖ్యమంత్రి బాధిత కుటుంబాన్ని లోపలికి పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తన కుమారుడు గవిడి ఢిల్లీశ్వరరావు (9) చిన్నప్పటి నుంచి ఆర్థోపెడిక్ సమస్యతో బాధపడుతున్నాడని, వైద్యం కోసం ప్రతి నెలా వేల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు మహిళ తెలిపింది. వారి సమస్య విని చలించిపోయిన సీఎం జగన్ ఆర్థిక సాయం చేయాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి కలెక్టర్ వెంటనే రూ.లక్ష చెక్కును అందజేశారు.



ఢిల్లీశ్వరరావు తల్లి సంతోషికి ధైర్యం చెబుతున్న సీఎం జగన్

క్యాన్సర్ బారినపడ్డ వలంటీర్‌కు సాయం

క్యాన్సర్ బారినపడి చికిత్స పొందుతున్న ఓ వలంటీర్‌కు ఆర్థిక సహాయం అందింది. పద్మనాభం మండలం కొవ్వాడ గ్రామ వలంటీర్ అంకాబత్తుల తులసి క్యాన్సర్ బారినపడి చికిత్స పొందుతోంది. ఆమె భర్త ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఏయూలో సీఎం జగన్‌ను తన కుటుంబంతోపాటు కలుసుకుంది. ఆమె అనారోగ్య సమస్య గురించి తెలుసుకున్న సీఎం జగన్ తక్షణ సాయంగా రూ.లక్ష అందించాలని ఆదేశించారు. చికిత్సకు అవసరమైన సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇవ్వడంతో తులసి కుటుంబం చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపింది.



తులసీ సమస్యను వింటున్న సీఎం

బాలుడికి భరోసా..

అనారోగ్యంతో బాధ పడుతున్న పెదవాల్తేర్‌కు చెందిన బాలుడు కె.రమేష్ (11)కి తక్షణ ఆర్థిక సాయంగా రూ.లక్ష ఇవ్వాలని సీఎం జగన్ ఆదేశించారు. బాధితుడి తల్లి కె.లక్ష్మి, ఏయూలో సీఎంను కలుసుకుని తన కుమారుడి అనారోగ్యం గురించి వివరించారు.



రమేష్ తల్లి లక్ష్మితో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్

క్లుప్తంగా...

శ్రీవాణి ట్రస్టుపై మీడియా నిజనిర్ధారణ కమిటీకి టీటీడీ ఓకే



తిరుమల: శ్రీవాణి ట్రస్టుపై కొంతమంది వ్యక్తులు పనిగట్టుకుని ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఈ విషయంలో వాస్తవాలను తెలుసుకోవడానికి ఏర్పాటైన తిరుపతి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలోని నిజనిర్ధారణ కమిటీకి టీటీడీ అనుమతించింది. శ్రీవాణి ట్రస్టు ద్వారా తెలుగు రాష్ట్రాల్లోని అనేక పురాతన ఆలయాల జీర్ణోద్ధరణతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి టీటీడీ నిధులు అందిస్తోంది. దీంతోపాటు ఆయా ప్రాంతాల్లోని ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు ఆర్థికసాయం కూడా చేస్తోంది. టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి శ్రీవాణి ట్రస్టుపై ఇటీవల శ్వేతపత్రం విడుదల చేశారు. అయినప్పటికీ కొందరు వ్యక్తులు శ్రీవాణి ట్రస్టు నిర్వహణపై ఆరోపణలు చేస్తుండడంతో వాస్తవాలు వెలుగులోకి తీసుకురావడానికి మీడియా నిజనిర్ధారణ కమిటీకి టీటీడీ అనుమతించింది.

టీటీడీ సీనియర్ న్యాయవాదిగా రఘు

సాక్షి, అమరావతి: టీటీడీ తరఫున హైకోర్టులో కేసులు వాదించేందుకు మరో సీనియర్ న్యాయవాది నియమితులయ్యారు. ఈ మేరకు చిత్తరవు రఘును నియమిస్తూ టీటీడీ లా ఆఫీసర్ వీర్రాజు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

56 మంది వైద్యులకు ఉద్వాసన నోటీసులు

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) పరిధిలో విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న వైద్యులకు ఉద్వాసన పలకడానికి రంగం సిద్ధమైంది. ఏడాదికిపైగా విధులకు హాజరు కాని, ముందస్తు సెలవు మంజూరు అనుమతిలేని 56 మంది వైద్యులకు ఉద్యోగాల నుంచి తొలగింపునకు కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం నోటీసులిచ్చారు. సబ్‌కలెక్టర్‌లు ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినప్పుడు విధుల్లో లేని వైద్యులకు షోకాజ్ నోటీసులిచ్చారు. ఇటీవల మార్కాపురం, బేతంచర్ల, ఆదోని ఆస్పత్రులను అక్కడి సబ్‌కలెక్టర్‌లు ఆకస్మికంగా తనిఖీ చేపట్టగా ఆ సమయంలో విధుల్లో ఉండాల్సిన వైద్యులు ఆస్పత్రుల్లో లేకపోవడంతో వారిచ్చిన నివేదికల ఆధారంగా 18 మంది వైద్యులకు షోకాజ్ నోటీసులిచ్చారు.

బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు సభ్యుడిగా కోటేశ్వరరావు



సాక్షి,అమరావతి: ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు మెంబర్‌గా పెద్దపోగు కోటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహించి కార్మికులకు మేలు చేస్తానని వివరించారు.

టంగుటూరిని విస్మరించడం బాధాకరం

ప్రకాశం పంతులు జయంతి ఉత్సవ కమిటీ ఆవేదన



మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సత్యనారాయణపురం (విజయవాడ సెంట్రల్): ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో తెలుగుజాతి గర్వించదగిన స్వాతంత్ర్య సమర యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులును విస్మరించడం బాధాకరమని ప్రకాశం పంతులు జయంతి ఉత్సవ కమిటీ సభ్యుడు దమ్మాలపాటి చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని సత్యనారాయణపురం గాయత్రి ఫంక్షన్ హాల్‌లో ప్రకాశం పంతులు జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో ఈ నెల 23న టంగుటూరి 151వ జయంతి వేడుకలను నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తామని తెలిపారు. కార్పొరేటర్ శర్వాణి మూర్తి, కమిటీ సభ్యులు మైలవరపు రామకృష్ణ, చల్లా సుధాకర్, జేకే సుబ్బారావు, కనపర్తి కొండ, కమ్మిలి రత్నకుమార్, కె.మారుతి, పొన్నలూరి సనత్, శివ, శ్రీనివాసరావు, నాడర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వివేకా హత్య కేసులో తులసమ్మ అప్లికేషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ దాఖలు చేసిన మిస్‌లీనియస్ అప్లికేషన్‌పై సుప్రీంకోర్టు విచారణను వాయిదా వేసింది. ఈ అప్లికేషన్ మంగళవారం జస్టిస్ సీటీ రవికుమార్, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. వాదనలు వినిపించడానికి సమయం కావాలని ఇరుపక్షాల న్యాయవాదులు కోరడంతో ధర్మాసనం తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.



ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా మామిడిపూడిలో పి. వెంకటశేషయ్యకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ హసీనాబేగం



నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలం క్రిష్టిపాడులో వృద్ధురాలు సువార్తమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ పీఎస్ లక్ష్మి



శ్రీకాకుళం నగరంలోని 17వ వార్డులో లలితకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ సోనీ



గుంటూరులోని ఆర్‌టీసీ కాలనీకి చెందిన సాధు సుబ్బమ్మకు వృద్ధాప్య పింఛను అందిస్తున్న వార్డు వలంటీర్ మాబూనీ



విజయనగరం జిల్లా బుచ్చన్నకోనేరు ప్రాంతంలో లక్ష్మమ్మకు వితంతు పింఛను అందజేస్తున్న వలంటీర్ మణికంఠ

47.60 లక్షల మందికి రూ.1,309.93 కోట్లు

- ఒకటో తేదీనే ఠంఛనుగా అవ్వాతాతల చేతికి పింఛను డబ్బులు
- సర్వర్‌లో ఇబ్బందుల వల్ల రెండు గంటలు నిలిచిన పింఛన్ల పంపిణీ
- అయినా తొలి రోజే 75.84 శాతం మందికి చేరిన డబ్బులు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 47,60,305 మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వివిధ చేతివృత్తిదారుల చేతికి ఠంఛనుగా ఒకటో తేదీనే రూ.1,309.93 కోట్లు పింఛను డబ్బులు చేరాయి. ఈ నెలకు సంబంధించి మొత్తం 62.77 లక్షల మంది లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు రూ.1,729.22 కోట్లను సోమవారమే సచివాలయాల వారీగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన విషయం తెలిసిందే. వలంటీర్లు మంగళవారం తెల్లవారుజాము నుంచే లబ్ధిదారుల ఇళ్లకు పింఛన్ల పంపిణీ ప్రయత్నించగా... కంప్యూటర్ సర్వర్‌లు రెండు గంటలపాటు మొరాయించినట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ తొలి రోజే 75.84శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు తెలిపారు. మరో నాలుగు రోజులపాటు మిగిలిన లబ్ధిదారుల ఇళ్లకే వలంటీర్లు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని వివరించారు.



అనంతపురంలోని హమాలీ కాలనీలో దివ్యాంగురాలు సావిత్రికి పింఛను ఇస్తున్న వార్డు వలంటీర్ లక్ష్మి



వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులోని టీచర్స్ కాలనీలో దివ్యాంగురాలు ఆఫ్రిన్‌కు పింఛను అందజేస్తున్న వలంటీర్ పవన్



ఒంగోలు నగరం గొడుగుపాలెంలో వృద్ధురాలు ఎం.రామకోటమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ జయలక్ష్మి



ఏలూరు నగరంలో వృద్ధురాలు అలనే బసంతికి పింఛను అందిస్తున్న వార్డు వలంటీర్ టి.జగదీష్



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జి.మామిడాడకు చెందిన యిడ్లపల్లి మంగయమ్మకు పింఛను అందిస్తున్న వలంటీర్ సంతోషి



విజయవాడలోని దుర్గాపురం 27వ డివిజన్‌లో పాండురంగ లక్ష్మణరావుకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ వెంకటలక్ష్మి



విశాఖ నగరంలోని గొల్లకంచరపాలెం తోటవీధిలో గుమ్మడి సూర్యకాంతకు వితంతు పింఛను అందిస్తున్న వలంటీర్ పల్లా ప్రశాంతి

డేటా భద్రం.. 'ఈనాడు' మెదడే ఛిద్రం

పథకాలకు సంబంధంలేని ఓటరు ఐడీ వివరాలు ఏనాడు సేకరించని ప్రభుత్వం

అయినా ఓటరు ఐడీ, పాన్ వివరాలు సేకరిస్తున్నారంటూ ఈనాడు పచ్చి అబద్ధాలు ప్రచారం

- వలంటీర్లు సేకరించే ఏ డేటా ఎందుకోసమో స్పష్టంగా పేర్కొంటూ ప్రభుత్వం వివరణ
- సేకరించిన డేటా పూర్తి ప్రభుత్వ సర్వర్‌లోనే నిక్షిప్తం
- ప్రైవేట్ వ్యక్తులకు చేరే అవకాశమే లేదంటూ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: అవసరంలేని ప్రజల వ్యక్తిగత, సున్నితమైన సమాచారాన్ని ఏమాత్రం సేకరించడంలేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. 'సంక్షేమ పథకాలలో అర్హులు ఏ ఒక్కరూ మిగిలిపోకుండా సంతృప్త స్థాయిలో ఆయా పథకాలను అర్హులందరికీ అందజేసేందుకు.. ఆయా పథకాల అమలులో అవినీతి అన్నదే లేకుండా పూర్తి పారదర్శకంగా వాటిని అందించేందుకు అవసరమయ్యే సమాచారాన్ని మాత్రమే ప్రభుత్వం సేకరిస్తుంది. కానీ.. 'ఈనాడు', ఆ సంస్థ యజమాని తమకు నచ్చని జగన్ ప్రభుత్వంపట్ల ప్రజల్లో విషబీజాలు నాటేందుకు అబద్ధపు రాతలనే నమ్ముకుంది. నిజానికి.. ప్రభుత్వ పథకాల అమలులో ఏ సంబంధంలేని ప్రజల ఓటరు ఐడీ, ఎవరు ఏ మొబైల్ ఫోన్లు వాడుతున్నారు, పాన్‌కార్డు వివరాలు ఏంటి, ఎవరికెంత అప్పు ఉంది వంటి ప్రజల సున్నిత సమాచారాన్ని సైతం చంద్రబాబు తన హయాంలో ప్రజాసాధికారిత సర్వే పేరుతో సేకరించింది. ఈ డేటాను సరిగ్గా ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసే 'సంఘమిత్ర' ప్రతినిధుల మొబైల్ ఫోన్లలో ప్రత్యక్షమయ్యాయి. ఆ యాప్ వినియోగించే ఐటీ సంస్థలపై అప్పట్లో తెలంగాణ ప్రభుత్వం పోలీసులు కేసు నమోదు చేయడం పెద్ద రాజకీయ దుమారం రేపింది. రాష్ట్ర ప్రజల వ్యక్తిగత గోప్యత నిజంగా ప్రమాదంలో పడిన ఆ సమయంలో ప్రజల పక్షాన నిలబడాల్సిన 'ఈనాడు' కళ్లు మూసేసుకుంది. తమకేమి తెలీదన్నట్లు బోధ్యం చూసింది. కానీ, అదే 'ఈనాడు' ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఓటరు ఐడీ తదితర వివరాలేవీ సేకరించకపోయినా, సేకరించి రాజకీయ దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు నానా యాగీ చేస్తూ మెదడు చిట్లినట్లు రంకెలు వేస్తోంది. 'ప్రమాదంలో వ్యక్తిగత గోప్యత' అంటూ తప్పుడు రాతలతో జగన్ ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకుంది'.. అంటూ రాష్ట్ర ప్రభుత్వం మీడియాకు 'ఫ్యాక్ట్‌చెక్'ను విడుదల చేసింది. ఆ వివరాలివీ..

ఈనాడు ఆరోపణ: ప్రజల డేటా సేకరణకు సంబంధించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వంపై ఆరోపణలు చేసి, ఇప్పుడు తనూ ప్రజల సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారు..

వాస్తవం: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ప్రజా సాధికార సర్వే పేరుతో ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలకు సంబంధంలేని అనేక వ్యక్తిగత వివరాలను సేకరించారు. ఓటరు



ఐడీ, ఒక్కో ఇంట్లో ఎన్ని మొబైల్ ఫోన్లు వంటి ఎల్రక్టానిక్ పరికరాల వివరాలు, ఇంటి విస్తీర్ణం ఎంత, ఎన్ని గదులున్నాయి, ఒక్కో ఇంట్లో ఉన్న బ్యాంకు లోన్లు వంటి అతి సున్నిత సమాచారం సేకరించింది. పథకాలకు సంబంధంలేని ప్రజల వ్యక్తిగత డేటా అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం సేకరించినా 'ఈనాడు' ఏనాడూ దానిని తప్పుపట్టలేదు. కానీ, అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం ప్రజా సాధికార సర్వేలో సేకరించిన ఈ డేటా ఇతరుల చేతికి వెళ్లింది. ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పథకాల అమలుకు సంబంధంలేని ఓటరు ఐడీ వంటి వివరాలను సేకరించలేదు.

ఈనాడు ఆరోపణ: ప్రజలకు సంబంధించిన సమాచారం ఈ ప్రభుత్వం ఎందుకు సేకరిస్తోంది?

ప్రభుత్వం సమాధానం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు–సేవల కోసం లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియకు అవసరమైన సమాచార సేకరణ మాత్రమే జరుగుతోంది. ఇందులో ఏ సమాచారం ఎందుకంటే..

- **కుటుంబ సభ్యుల వివరాలు:** పథకాల అమలులో ఆయా కుటుంబాల్లో అర్హులను గుర్తించేందుకు..
- **కులం:** కాపునేస్తం, ఈబీసీ నేస్తం వంటి కులం ఆధారిత పథకాల్లో అర్హుల గుర్తింపునకు.. కుల ధ్రువీకరణ పత్రాలు వంటివి జారీ కోసం..
- **ఆధార్ నెంబరు (ముసుగు ఫార్మాట్‌లోనే):** పథకాల అమలులో అక్రమాలకు తావులేకుండా బయోమెట్రిక్ ఆధారంగా లబ్ధిదారుల గుర్తింపునకు..
- **మతం:** వైఎస్సార్ షాదీ తోఫా వంటి మత ఆధారిత పథకాల అమలుకు..
- **అడ్రసు:** లబ్ధిదారులకు ఇంటి వద్దే పథకాల అమలుకోసం..
- **మొబైల్ నెంబరు:** పారదర్శకత ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ పథకాల సమాచారం నేరుగా ఆ లబ్ధిదారులకే ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్ రూపంలో తెలియజేసేందుకు..
- **వృత్తి:** ప్రభుత్వం అమలుచేస్తున్న నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా వంటి వృత్తి ఆధారిత పథకాల్లో లబ్ధిదారుల గుర్తింపు కోసం..
- **పుట్టిన తేదీ:** వివిధ పథకాల అమలులో లబ్ధిదారుల వయస్సు నిర్ధారణ కోసం..
- **లింగం (మగ లేదా ఆడ వివరాలు):** కేవలం మహిళల కోసమే ప్రభుత్వం ప్రత్యేకంగా అమలుచేస్తున్న పథకాల కోసం..
- **కుటుంబంలో మిగిలిన సభ్యుల బంధుత్వం వివరాలు:** పుట్టిన తేదీ, ఆదాయ ధ్రువీకరణ, మరణ ధ్రువీకరణ వంటి పత్రాల జారీకోసం..
- **వివాహ పరిస్థితి:** వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం ద్వారా లబ్ధిదారుల గుర్తింపునకు..

ఈనాడు ఆరోపణ: సేకరించిన సమాచారం ప్రైవేట్ వ్యక్తుల చేతికి వెళ్తుంది..

వాస్తవం: అందుకు అవకాశమేలేదు. సేకరించిన సమాచారం వెంటనే పూర్తి భద్రత ఉండే ప్రభుత్వ డేటా సర్వర్‌కు మాత్రమే నేరుగా చేరుతుంది. సర్వే పూర్తయిన తర్వాత ఆ వివరాలు కూడా వలంటీర్ల యాప్‌లో ఉండవు. 'ఈనాడు' పేర్కొన్నట్లు గృహ సర్వేలో ఇచ్చిన వివరాలను ఉపయోగించి భూమి యాజమాన్యాన్ని మార్చడం వంటివి ఎట్టి పరిస్థితిలోనూ సాధ్యపడదు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు డ్రా చేయడం ఎట్టిపరిస్థితుల్లో సాధ్యపడదు.

ఈనాడు ఆరోపణ: పౌరుల నుండి బయోమెట్రిక్ తీసుకుంటున్నారు. ఈ వివరాలు సేకరణ సురక్షితం కాదు..

వాస్తవం: ఆధార్ నెంబరు ఆధారంగా లబ్ధిదారుని బయోమెట్రిక్ తీసుకునే సమయంలో ఈ బయోమెట్రిక్‌లు మొబైల్ పరికరంలో లేదా స్టేట్ డేటాబేస్‌లో నిల్వచేయబడవు.

కట్టుదిట్టంగా డేటా సేకరణ..

గ్రామ, వార్డు సచివాలయాల శాఖ పటిష్ట భద్రతా చర్యలతో రూపొందించిన యాప్‌ల ద్వారానే ప్రభుత్వ కార్యక్రమాలకు అవసరమైన డేటాను సేకరిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టంచేసింది. వలంటీర్ల ద్వారా వివరాలు సేకరించాక అవి నేరుగా ప్రభుత్వ డేటా సెంటరుకు చేరతాయని.. అవి వలంటీర్ల యాప్‌లో కూడా నిల్వఉండవని తేల్చిచెప్పింది. అలాగే, ప్రభుత్వ డేటా సెంటరు నుంచి ఆ డేటాను గుర్తింపు పొందిన ప్రభుత్వ అధికారులు అనుమతి పొందిన కంప్యూటర్ ద్వారా మాత్రమే వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని.. అది కూడా వ్యక్తి సమాచారం మొత్తం కాకుండా పరిమిత పరిధిలోనే ఆ డేటాను వినియోగించుకునేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లున్నాయని ప్రభుత్వం పేర్కొంది. మరోవైపు.. అన్ని యాప్‌లు హైలెవల్ సెక్యూరిటీ ఫీచర్లతో డెవలప్ చేయబడ్డాయని, సైబర్ దాడులకు సైతం అవకాశంలేకుండా భద్రతా చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం వివరించింది.

ఇంజనీరింగ్ కనీస ఫీజు రూ.42,500

- ఇంతకంటే ఎక్కువ ఫీజున్నవి అదనంగా 10 శాతం వసూలు చేసుకోవచ్చు
- మధ్యేమార్గంగా హైకోర్టు ప్రతిపాదన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్ ఫీజుల విషయంలో హైకోర్టు మధ్యేమార్గంగా ఓ ప్రతిపాదన చేసింది. కనీస ఫీజుగా రూ.42,500 ప్రతిపాదించింది. ఇంతకన్నా ఎక్కువ ఫీజులున్న కళాశాలల్లో తాము ప్రతిపాదించిన ఫీజుకు అదనంగా 10 శాతం వసూలు చేసుకునేందుకు అనుమతినిస్తామని తెలిపింది. ఈ ప్రతిపాదనపై ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు తమ అభిప్రాయం చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2020–23 సంవత్సరాలకు ఫీజుల ఖరారుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాల సంఘం 2022లో హైకోర్టులో పిటిషన్లు వేసింది. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర్లు మంగళవారం మరోసారి విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది మతుకుమిల్లి శ్రీవిజయ్ వాదనలు వినిపిస్తూ.. ప్రవేశాలు, ఫీజు నియంత్రణ కమిటీ (ఏఎఫ్ఆర్‌సీ) సిఫారసులకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ఫీజులు ఖరారు చేయడం వల్ల కళాశాలలు నష్టపోతున్నాయన్నారు.

సదుపాయాల ఆధారంగానే ఫీజులు: ప్రభుత్వం

ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఫీజును ఖరారు చేయలేదని తెలిపారు. ఫీజులు ఖరారు చేసేందుకు అన్ని వివరాలు సమర్పించాలని కళాశాలల యాజమాన్యాలను ఆదేశించామన్నారు. చాలా కళాశాలలు ఇప్పటికీ ఆ వివరాలు సమర్పించలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. త్వరలో ప్రవేశాలకు వెబ్ కౌన్సెలింగ్ మొదలు కాబోతుందన్నారు. ఆ ప్రక్రియను కొనసాగించుకునేందుకు అనుమతినివ్వాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. ప్రస్తుతం ఉన్న ఫీజుకు అదనంగా 10 శాతం ఫీజును వసూలు చేసుకునేందుకు అనుమతినిస్తామన్నారు.

టీడీపీ నేత రాయపాటి నివాసాల్లో ఈడీ సోదాలు

సాక్షి,అమరావతి/నగరంపాలెం(గుంటూరు)/సాక్షి, హైదరాబాద్: టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు ఆర్థిక అక్రమాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కొరడా ఝుళిపించింది. రాయపాటి కుటుంబానికి చెందిన ట్రాన్స్‌స్ట్రాయ్ కంపెనీపై నమోదైన మనీ లాండరింగ్ కేసులో గుంటూరు, హైదరాబాద్‌లోని ఆయన ఇళ్లు, కార్యాలయాల్లో, ట్రాన్స్‌స్ట్రాయ్ పవర్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ మాలినేని సాంబశివరావు కార్యాలయాల్లో ఈడీ అధికారులు మంగళవారం సోదాలు చేపట్టారు. మొత్తం 15 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేసి పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. రాయపాటి సాంబశివరావు డైరెక్టర్‌గా ఉన్న ట్రాన్స్‌స్ట్రాయ్ కంపెనీ బ్యాంకులను మోసం చేయడమేకాకుండా షెల్ కంపెనీల ద్వారా రూ.9,394 కోట్లు అక్రమంగా మళ్లించినట్లు సీబీఐ 2019లో కేసు నమోదు చేసింది. రాయపాటి సాంబశివరావు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాన్ని అక్రమ మార్గాల్లో ట్రాన్స్‌స్ట్రాయ్ పవర్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ మాలినేని సాంబశివరావు కంపెనీల్లోకి, షెల్ కంపెనీల్లోకి మళ్లించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలను సీబీఐ నిగ్గు తేల్చింది. రాయపాటి, మాలినేని సాంబశివరావు, ట్రాన్స్‌స్ట్రాయ్ కంపెనీ సీఎండీ చెరుకూరి శ్రీధర్, ఇతర డైరెక్టర్లపై క్రిమినల్ కుట్ర, మోసం, ఫోర్జరీ, అవినీతి నిరోధక చట్టాల కింద కేసులు నమోదు చేసింది. సీబీఐ ఎఫ్ఐఆర్ మేరకు ఈడీ అధికారులు కూడా మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద రాయపాటి సాంబశివరావు, ట్రాన్స్‌స్ట్రాయ్ కంపెనీపై కేసు నమోదు చేసి సోదాలు చేయడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

షెల్ కంపెనీల ద్వారా భారీగా నిధుల మళ్లింపు

చంద్రబాబు ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టరుగా వ్యవహరించిన ట్రాన్స్‌స్ట్రాయ్ కంపెనీ యథేచ్ఛగా ఆర్థిక అక్రమాలను పాల్పడినట్టు సీబీఐ ఆడిట్ నివేదిక నిర్ధారించింది. ట్రాన్స్‌స్ట్రాయ్ కంపెనీ కెనరా బ్యాంక్‌తోపాటు 13 బ్యాంకుల నుంచి రూ.9,394 కోట్ల రుణాలను సేకరించింది. ఆ నిధులను మళ్లించేందుకు రాయపాటి తమ ఇంట్లో పని మనుషులు, డ్రైవర్లను డైరెక్టర్లుగా చూపి పలు షెల్ కంపెనీలను సృష్టించారు. పద్మావతి ఎంటర్‌ప్రైజస్, యుక్ ఇంజినీర్స్, బాలాజీ ఎంటర్‌ప్రైజస్, రుత్విక్ అసోసియేట్స్ మొదలైన షెల్ కంపెనీల ద్వారా రూ.7,153 కోట్లను మళ్లించారు. ఆ కంపెనీలు తిరిగి రూ.6,202 కోట్లను ట్రాన్స్‌స్ట్రాయ్ కంపెనీకి బదిలీ చేశాయి. మరో రూ.350 కోట్లను ట్రాన్స్‌స్ట్రాయ్ కంపెనీ ప్రమోటర్ల ఖాతాలకు మళ్లించారు. దీనిపై కెనరా బ్యాంక్‌తోపాటు బ్యాంకుల కన్సార్షియం దాఖలు చేసిన పిటిషన్‌ను హైదరాబాద్‌లోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ విచారణకు స్వీకరించింది. సింగపూర్‌లోని ట్రాన్స్‌స్ట్రాయ్ సింగపూర్ పీఈటీ లిమిటెడ్‌కు కూడా నిధులు మళ్లించినట్టు ఫెమా కేసు నమోదు చేసింది. తాజాగా ఈడీ కూడా రాయపాటి, ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీపై కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేసింది.

రాష్ట్రంలో నాలుగు ఆస్పత్రులకు ముస్కాన్ గుర్తింపు

సాక్షి, అమరావతి: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు సీఎం జగన్ చేపట్టిన చర్యలకు జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తోంది. తాజాగా రాష్ట్రంలోని నాలుగు ప్రభుత్వాస్పత్రుల పిల్లల విభాగాలు 'ముస్కాన్' గుర్తింపు పొందాయి. శ్రీకాకుళం రిమ్స్, కర్నూలు జీజీహెచ్, మార్కాపురం జిల్లా ఆస్పత్రి (ప్రకాశం), బాపట్ల జిల్లా రేపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రాలకు ముస్కాన్ గుర్తింపును ఇస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి విశాల్ చౌహాన్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుకు లేఖ రాశారు. పన్నెండు సంవత్సరాల్లోపు పిల్లలకు వైద్యసేవల్లో నాణ్యతను మెరుగుపరచడానికి కేంద్రం ముస్కాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ క్రమంలో కేంద్ర వైద్యశాఖ సూచనల మేరకు మన ఆస్పత్రుల్లోని పిల్లల విభాగాల్లో ప్రభుత్వం సదుపాయాలు, సేవలను మెరుగుపరచడంతోపాటు ఆకర్షణీయమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పారు. అనంతరం ముస్కాన్ గుర్తింపు కోసం దరఖాస్తు చేయగా, కేంద్ర ఆరోగ్యశాఖకు చెందిన ఉన్నతాధికారుల బృందం ఆయా ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించింది. ఆస్పత్రుల్లో వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, ఇతర వనరులను పరిశీలించి, వైద్యసేవలు పొందిన ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఈ సమాచారాన్ని విశ్లేషించి నాలుగు ఆస్పత్రుల్లోని పిల్లల విభాగాలకు ముస్కాన్ గుర్తింపు జారీచేశారు.

జీవో ప్రకారమే కళాశాల విద్యా శాఖలో బదిలీలు

కమిషనర్ హామీతో ఆందోళన వాయిదా

సాక్షి, అమరావతి: ఏపీలోని కళాశాల విద్యాశాఖ బదిలీల విషయంలో జేఏసీ తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను వాయిదా వేసినట్లు ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ టీచర్స్, ప్రభుత్వ కళాశాల టీచర్స్ అసోసియేషన్ల నేతలు శ్రీనివాసరెడ్డి, శ్యామ్‌బాబు మంగళవారం తెలిపారు. జీవో86 ప్రకారం బదిలీలు చేపట్టాలని కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్‌కు వినతిపత్రం అందించామన్నారు. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అధ్యాపకులకు జీవో ప్రకారమే బదిలీలు ఉంటాయని కమిషనర్ హామీ ఇచ్చారన్నారు. 30–6–2025 నాటికి ఉద్యోగ విరమణ పొందే వారిని బదిలీల నుంచి మినహాయించినట్లు చెప్పారన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంటెక్, ఎం.ఫార్మసీ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

26 నుంచి పీజీ సెట్ అడ్మిషన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎంటెక్, ఎం.ఫార్మసీ, ఫార్మా–డి కోర్సుల్లో ప్రవేశాలకు తిరుపతిలోని వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మంగళవారం కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించింది. గేట్, జీపాట్‌లో నిర్దేశించిన స్కోర్ కలిగిన అభ్యర్థులు ఈ నెల 4వ తేదీ వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. 9 నుంచి 11వ తేదీ వరకు సర్టిఫికెట్ల అప్‌లోడ్, 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, 22వ తేదీన సీట్లు కేటాయించనుంది. పీజీసెట్–2023లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ నుంచి 31వరకు రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల అప్‌లోడ్ చేయాలని పేర్కొంది. సెప్టెంబర్ 8 నుంచి 11వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం ఇచ్చింది. 15న సీట్లు కేటాయించనుంది.

హథీరాంజీ మఠం మహంతుపై చర్యలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడి



సాక్షి, అమరావతి: తిరుపతి హథీరాంజీ మఠానికి సంబంధించి గతంలో అక్కడ మహంతుగా పనిచేసిన అర్జున్‌దాస్ పలు అక్రమాలకు పాల్పడినట్లు త్రిసభ్య కమిటీ పలు ఆధారాలతో ధ్రువీకరించిందని, ఆ మహంతుపై తదుపరి చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ధార్మిక పరిషత్ నిర్ణయించిందని ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హథీరాంజీ మఠం కోట్లాది రూపాయల ఆస్తుల్ని అన్యాక్రాంతం చేసినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు త్రిసభ్య కమిటీని నియమించామన్నారు. ఆ కమిటీ పూర్తి స్థాయిలో విచారణ జరిపి 16 ఆరోపణలను ధ్రువీకరిస్తూ ఆధారాలతో నివేదికను అందజేసిందన్నారు. దానిని పరిశీలించి అర్జున్‌దాస్‌పై చర్యలు తీసుకునేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. త్వరలో ధర్మ ప్రచార పరిషత్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ధర్మ ప్రచార పరిషత్ తొలిగా ఈనెల 6న అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయం పరిధిలో సనాతన ధర్మ ప్రచార కార్యక్రమాలను ప్రారంభించి నెల రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైఎస్ జగన్‌కు అండగా ఉందాం

కాపు నాయకులతో కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కాపుల సంక్షేమం, అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న సీఎం జగన్‌కు అండగా ఉందామని కాపు సంఘాల నాయకులకు ఏపీ కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన ఎన్టీఆర్ జిల్లా కాపు నాయకులతో సమావేశమయ్యారు. అడపా శేషు మాట్లాడుతూ.. రాజకీయ లబ్ధి కోసం కాపులకు అనేక హామీలిచ్చిన చంద్రబాబు ఆ తర్వాత అధికారంలోకి వచ్చాక మోసం చేశారని గుర్తు చేశారు. తాను చేయగలిగిందే చెబుతానని స్పష్టంగా ప్రకటించిన సీఎం జగన్ రాష్ట్రంలో కాపులను ఎంతగానో ఆదరించారని పేర్కొన్నారు. కాపులను ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం జగన్ అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వివరించారు. చంద్రబాబు ప్రయోజనాల కోసం పనిచేస్తున్న పవన్‌కళ్యాణ్ మాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. అనంతరం మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గను సత్కరించారు.

సాక్షి
బుధవారం, 2 ఆగస్టు 2023

సైన్యం చెరలో నైజర్

అగ్రరాజ్యాల చంపుడు పందెంలో దశాబ్దాలుగా చిక్కిశల్యమైన పశ్చిమ ఆఫ్రికా దేశాలు ఆ నీడలోనే ఇప్పటికీ బతుకీడుస్తున్నాయని నైజర్‌లో నాలుగురోజుల క్రితం చోటుచేసుకున్న సైనిక తిరుగుబాటు నిరూపించింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అధ్యక్షుడు మహమ్మద్ బజూమ్‌ను అధికారం నుంచి పడగొట్టి ఆయన భద్రతా వ్యవహారాల చీఫ్ ఒమర్ చియానీ పీఠం అధిష్ఠించాడు. అతనికి రష్యా అధ్యక్షుడు పుతిన్ మద్దతుందని అంటున్నారు. అవిద్య, ఆకలి, ఆర్థిక అసమానతలు పుష్కలంగా ఉన్నచోట నియంతలదే పైచేయి అవుతుందని చరిత్రలో తరచు రుజువవుతున్న సత్యమే. తూర్పున ఎర్ర సముద్ర తీరంలోని సూడాన్‌తో మొదలుపెట్టి, పడమట అట్లాంటిక్ మహాసముద్ర తీరానికి చేరువలో వుండే గినియా బిసావూ మధ్య వరసగా కొలువుదీరిన ఎనిమిది దేశాలున్న ప్రాంతాన్ని సహేల్ ప్రాంతం అంటారు. వీటిల్లో మిగిలినవన్నీ సైనిక పాలకుల పరం కాగా... తాజాగా నైజర్ సైతం ఆ ఖాతాలో చేరింది. తన అండదండలు పుష్కలంగా ఉన్న బజూమ్ ఉన్నట్టుండి అదృశ్యం కావటం, రెండురోజుల తర్వాత తిరుగుబాటు ప్రకటన రావటం అమెరికాకు మింగుడు పడని అంశం. పశ్చిమాసియా, దక్షిణాసియాలతో పోల్చినా జీహాదిస్టుల బెడదను అధికంగా ఎదుర్కొంటూ నిత్యం నెత్తురోడుతున్న ప్రాంతం సహేల్ ఆఫ్రికా. అత్యంత వెనకబడిన ప్రాంతం కావటం వల్ల అక్కడి మరణాలు మీడియాకు పట్టవుగానీ... నిరుడు ఉగ్రవాదుల హింసాకాండకు ప్రపంచ వ్యాప్తంగా బలైన 6,701 మంది అభాగ్యుల్లో 43 శాతం మంది అక్కడివారే!

సహేల్ ప్రాంతం గురించి ఐక్యరాజ్యసమితి వెబ్‌సైట్ వెతికితే దాన్ని 'అవకాశాల గడ్డ'గా అభివర్ణిస్తుంది. ప్రపంచంలోనే యువత అధికంగా ఉన్న ప్రాంతమని చెబుతుంది. ఆ ప్రాంతానికి చినుకు గగనం కావొచ్చు. అక్కడి నేలపై పంటలు పెద్దగా పండకపోవచ్చు. కానీ దాని లోలోపల యురేనియంతో సహా అపురూపమైన ఖనిజాలున్నాయి. విస్తృతంగా జలాశయాలున్నాయి. పునరుత్పాదక ఇంధన వనరులకు అది నిలయం. జనాభాలో 64.5 శాతం మంది ఇరవై అయిదేళ్లలోపువారే. ఇవన్నీ సహేల్ ప్రాంతానికి శాపంగా కూడా మారాయి. అమెరికా, ఫ్రాన్స్‌లు ఈ ప్రాంతంపై పట్టుబిగించేందుకు బాహాటంగా ప్రయత్నిస్తుంటే జర్మనీ, ఇటలీ, చైనా వంటివి చడీచప్పుడూ లేకుండా ఆ పని చేస్తుంటాయి. తిరుగుబాటు జరిగే సమయానికి నైజర్‌లో 1,100 మంది అమెరికా సైనికులున్నారు. అవసరాన్నిబట్టి డ్రోన్ దాడులు నిర్వహించేందుకు ప్రత్యేక స్థావరం ఉంది. కానీ తన మద్దతుదారును అది కాపాడుకోలేకపోయింది. నిజానికి 2021లో అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన 48 గంటల్లోనే బజూమ్ సైనిక జనరళ్లకు లక్ష్యంగా మారారు. కానీ అప్పట్లో ఆయన్ను వ్యక్తిగత భద్రతా బలగాలు కాపాడాయి. ఇప్పుడు ఆ బలగాలే అదును చూసి కాటేశాయి. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అమెరికా, సోవియెట్ యూనియన్‌ల మధ్య పశ్చిమ ఆఫ్రికా దేశాల వనరులను చేజిక్కించుకునేందుకు సాగిన పోటీతో సగటున ప్రతి 55 రోజులకూ ఒక సైనిక తిరుగుబాటు ప్రయత్నం జరిగిందని, అందులో చాలా భాగం విజయవంతమయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. తమ ప్రయోజనాలు నెరవేరే వరకూ స్థానికంగా ఏ పాలకులున్నా, వారు ఎలా పాలిస్తున్నా అగ్రరాజ్యాలు పట్టించుకోవు. ఆ ప్రయోజనాలు దెబ్బతింటే మాత్రం సైనిక నియంతలను గద్దె దించేందుకు ప్రజాస్వామ్య మంత్రాన్ని పఠిస్తాయి. అంతక్రితం దశాబ్దాలపాటు అగ్రరాజ్యాల చెరలో చిక్కుకున్న పశ్చిమ ఆఫ్రికా దేశాలు ఆ తర్వాత ప్రజాస్వామ్యానికి చేరువైనా, నయా ఉదారవాద ఆర్థిక విధానాల పడగనీడలోనే ఆ ప్రభుత్వాలు కొనసాగటం వల్ల స్థానికులకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. పేరుకు ఎన్నికలేగానీ పెత్తనమంతా స్థానికంగా ఉండే సాయుధ ముఠాలదే! ఆ ముఠాల ప్రాపకంతోనే ఏ పాలకులైనా ఎన్నికల్లో గద్దెనెక్కుతారు. కూడు, గూడు, విద్య, వైద్యం, మంచినీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనలోనూ, ఉపాధి చూపటంలోనూ ఆ పాలకులు ఘోరంగా విఫలం కావటం తరచు కనబడేదే! ప్రజల్లో ఆ పాలకుల పట్ల ఉండే అసంతృప్తిని సైన్యంలోని ఉన్నతాధికారవర్గం సాకుగా తీసుకుని అధికారాన్ని చేజిక్కించుకుంటుంది. పర్యవసానంగా ముందో వెనకో ఆ దేశాలన్నీ ఒకదాని తర్వాత ఒకటి సైనిక కుట్రలకు తలవంచాయి.

సహేల్ ప్రాంతంలో తిరుగుబాట్లు చేసినప్పుడల్లా సైనిక నియంతలు చెప్పే మొదటి కారణం అవినీతి. ఇప్పుడు నైజర్‌లో గద్దెనెక్కిన ఒమర్ చియానీ దానికి ఉగ్రవాద బెడదను కూడా జోడించాడు. దేశంలో ఉగ్రవాదం ముప్పు పెరగటం వల్ల సైన్యం జోక్యం తప్పనిసరైందని ప్రకటించాడు. నిజానికి వేరే దేశాల 'ప్రజాస్వామ్య' పాలకులతో పోలిస్తే బజూమ్ ఎంతో నయం. అల్ కాయిదా, ఐఎస్ వంటి ఉగ్రవాద సంస్థల దాడులను పూర్తిగా అదుపు చేయలేకపోయినా, వాటిని చాలా మేరకు నియంత్రించారు. పాశ్చాత్య దేశాల మద్దతు పుష్కలంగా ఉండటంతో నిధులు కూడా దండిగానే వచ్చాయి. విద్య, వైద్యంతో పాటు ఉపాధి కల్పన చర్యలు ప్రారంభమయ్యాయి. వాటి ఫలితాలు కూడా ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి. బజూమ్‌కు సైన్యం మద్దతు దండిగా ఉన్నదని, దేశంలో రాజకీయ సుస్థిరత ఏర్పడిందని అందరూ అనుకుంటుండగానే చియానీ రూపంలో సైనిక నియంత అవతరించాడు. సహేల్ ప్రాంతంలోని వేరే దేశాల్లో ఉగ్రవాద బూచిని చూపి, పాలకుల భద్రతకు పూచీపడుతూ పబ్బం గడుపుకుంటున్న కిరాయి సైనిక ముఠా నాయకుడు ప్రిగోజిన్ ఇప్పుడు నైజర్‌ను ఉద్ధరిస్తానని ముందుకొస్తున్నాడు. అమెరికా, రష్యాల మధ్య సైతం మున్ముందు ఇక్కడ ఘర్షణ రాజుకునే ప్రమాదం ఉంది. ఇన్నిటిమధ్య నైజర్ మనుగడ ఎలా ఉంటుందన్నది ప్రశ్నార్థకమే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.10.24 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** శ్రవణం ప.3.33 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.7.17 నుండి 8.45 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.40 నుండి, 12.30 వరకు, **అమృత ఘడియలు:** తె.4.11 నుండి 5.43 వరకు (తెల్లవారితే గురువారం).

సూర్యోదయం : 5.42
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ప్రపంచ వాణిజ్యంలో ఎక్కడున్నాం?

విశ్లేషణ



సుష్మా రామచంద్రన్

జూన్ నెలలో దేశ ఎగుమతులు 22 శాతం తగ్గిపోయినట్టు తాజా నివేదికలు చెబుతున్నాయి. గూడ్స్ మార్కెట్లో భారత్ వాటా 2 శాతమే. ఐర్లాండ్ లాంటి చిన్న దేశాల కంటే ఇది తక్కువ. చైనా వాటా ఏకంగా 12.5 శాతం. ప్రపంచంలోని ఏ దేశానికైనా ఇది అత్యధికం. దేశంలోని చాలా పరిశ్రమలు స్థానిక అవసరాలు తీరి వస్తువులు అదనంగా ఉన్నప్పుడు మాత్రమే ఎగుమతుల గురించి ఆలోచిస్తున్నాయి. సహజ సిద్ధంగా ఎగుమతులకు మొగ్గు చూపడం లేదు. దేశం ఏదో ఒక భారీ ప్రాంతీయ వ్యాపార గ్రూపులో భాగంగా లేకపోవడం ఎగుమతులు పెరగకపోవడానికి మరో కారణం. అయితే ఐటీ, వ్యాపార సేవల విషయంలో మాత్రం చాలా మెరుగ్గా ఉన్నాం. ఇది సానుకూలాంశం.

విదేశాలతో వ్యాపారం చేయడం భారత్‌కు చాలా పాతవిద్య. ఆర్థిక వ్యవస్థ గణనీయంగా, వేగంగా క్షీణించిన వలస పాలకుల ఏలుబడిలోనూ చైనా సహా ఇతర ఇరుగు పొరుగు దేశాలతో విదేశీ వ్యాపారాన్ని కొనసాగించిన ఘనత మనది. అయితే శతాబ్దాల విదేశీ వ్యాపార అనుభవమున్నప్పటికీ పలు దశాబ్దాలుగా విదేశీ వ్యాపారం దేశ ఆర్థిక వ్యవస్థలో అతి బలహీనమైన లంకెలా మిగిలిపోయింది. 2022–23లో వర్తకపు సరుకుల ఎగుమతులు 45,000 కోట్ల డాలర్లకు చేరడంతో విదేశీ వ్యాపారం పరిస్థితి కొంత మెరుగైనట్లు కనిపించింది. కానీ ఈ రికార్డు స్థాయి వ్యాపారం కోవిడ్ తదనంతరం అకస్మాత్తుగా పెరిగిన డిమాండ్ వల్లనే అని తేలింది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో వ్యాపారం మళ్లీ తగ్గిపోయింది. జూన్ నెలలో ఎగుమతులు 22 శాతం తగ్గిపోయినట్లు తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనానికి, అధిక ద్రవ్యోల్బణం, కఠినమైన ద్రవ్య విధానాలకు ఇది నిదర్శనం.

అయితే ఇక్కడ ఓ సానుకూల అంశం లేకపోలేదు. సేవల ఎగుమతులు ఇప్పటికీ పెరుగుతున్నాయి. ఈ విషయంలో భారత వాణిజ్యం ప్రతికూల పరిస్థితులను కాదని ముందుకు సాగుతున్నది. సమీప భవిష్యత్తులోనే కాకుండా దీర్ఘకాలంలోనూ ఇదే ధోరణి కొనసాగవచ్చు. సేవల రంగంలో భారత్ భాగస్వామ్యం రికార్డు స్థాయిలో 4.9 శాతానికి చేరుకున్నట్లు మోర్గన్ స్టాన్లీ ఇటీవల విడుదల చేసిన ఓ నివేదిక తెలియజేయడం చెప్పుకోవాల్సిన అంశం. ఇది ప్రధానంగా ఐటీ సేవల (46 శాతం) వల్లనే. దీంతోపాటు వ్యాపార సేవలు కూడా 24 శాతంతో తమదైన ముద్ర వేశాయి.

సేవల విషయంలో పరిస్థితి ఇలా ఉంటే, వస్తువుల విషయంలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నం. వస్తువుల ఎగుమతులు అమెరికా, యూరప్ వంటి మార్కెట్ల డిమాండ్లపై అధికంగా ఆధారపడి ఉన్నాయి. గూడ్స్ మార్కెట్లో భారత్ వాటా కేవలం రెండు శాతం మాత్రమే. ఐర్లాండ్ లాంటి చిన్న దేశాల కంటే ఇది తక్కువ. మన పొరుగునే ఉన్న చైనా వాటా ఏకంగా 12.5 శాతం. ఒక దేశానికి సంబంధించి ప్రపంచంలోనే ఇది ఎక్కువ.

శేష ప్రశ్నలు ఎన్నో...

దేశంలో చెప్పుకోదగ్గ స్థాయిలో పరిశ్రమలు ఉన్నాయి. అంటే అంతర్జాతీయ వాణిజ్యంలో మన పాత్ర పెంచుకునేందుకు అవకాశం ఉంది. అయితే ఎగుమతుల విషయంలో వెనుకబడి ఉండేందుకు కారణాలేమిటి? మొదటిది... దేశీ మార్కెట్ ఒకటి లేకపోవడం. దేశీ మార్కెట్ ఒకటి ఉండి ఉంటే స్థానిక చిన్న, మధ్యతరహా పారిశ్రామికవేత్తలు ఇక్కడే వ్యాపారం చేసుకునేందుకు వీలు ఏర్పడుతుంది. వ్యయప్రయాసలకు ఓర్చి విదేశీ మార్కెట్లను వెతుక్కునే శ్రమ తగ్గుతుంది. దేశంలో కొన్ని పరిశ్రమలు కేవలం ఎగుమతులపైనే దృష్టి పెట్టి



పనిచేస్తున్నాయి. వీటిల్లో కొన్ని సంప్రదాయ రంగాలకు చెందినవీ ఉన్నాయి. రెడీమేడ్ గార్మెంట్స్, హస్తకళలు, జ్యువెలరీ, రంగురాళ్ల వంటివి. వీటితోపాటు ఫార్మా, ఇంజినీరింగ్ వస్తువులు, రిఫైన్డ్ నూనె ఉత్పత్తులు కూడా పెద్ద ఎత్తున ఎగుమతి అవుతున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ చాలా పరిశ్రమలు స్థానికంగా మార్కెట్ అవసరాలు తీరి వస్తువులు అదనంగా ఉన్నప్పుడు మాత్రమే ఎగుమతుల గురించి ఆలోచిస్తున్నాయి. ఇంకోలా చెప్పాలంటే స్థానిక పరిశ్రమలు సహజ సిద్ధంగా ఎగుమతులకు మొగ్గు చూపడం లేదన్నమాట.

ఎగుమతులు పెరగకపోవడానికి రెండో లోపం... దేశం ఏదో ఒక భారీ ప్రాంతీయ వ్యాపార గ్రూపులో భాగంగా లేకపోవడం. ప్రపంచ వాణిజ్య సంస్థపై మనం చాలాకాలం ఆశలు పెట్టుకున్నాం. ఎదుగుతున్న మార్కెట్లకు కొన్ని లాభాలు అందిస్తుందని ఆశపడ్డాం. ఈ క్రమంలో ప్రాంతీయ లేదా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు చేసుకునే సమయం కాస్తా మాయమైపోయింది. ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (రీజినల్ కాంప్రహెన్సివ్ ఎకనమిక్ పార్ట్‌నర్‌షిప్–ఆర్సీఈపీ) నుంచి వైదొలగాలన్న నిర్ణయం కూడా ఆచితూచి తీసుకున్నదే. ఏదో ఒక దేశం ద్వారా చైనా తన చౌక వస్తువులను దేశంపై గుమ్మరిస్తుందన్న ఆందోళన కూడా ఉండింది. అయినా కూడా... ఇతర ప్రాంతీయ వాణిజ్య గ్రూపుల్లోకి చేరే దిశగా చాలాకాలం క్రితమే ప్రయత్నాలు చేసి ఉండాల్సింది. ఉదాహరణకు... పదకొండు మంది సభ్యులున్న 'కాంప్రహెన్సివ్ అండ్ ప్రోగ్రెసివ్ అగ్రిమెంట్ ఫర్ ట్రాన్స్ పసిఫిక్ పార్ట్‌నర్‌షిప్' (సీపీటీపీపీ). ఈ వ్యాపార వర్గంలో చేరి ఉంటే దేశ విదేశీ వ్యాపారం, ఎగుమతులు పెరిగేందుకు తగిన సహకారం లభించి ఉండేది. ఇప్పటికీ సమయం మించిపోలేదు. ఆస్ట్రేలియా, జపాన్, మలేసియాలు భాగస్వాములుగా ఉండి... అతి జాగ్రత్తగా చైనా లేకుండా చేసుకున్న వ్యాపార వర్గంలో చేరేందుకు భారత్ ప్రయత్నించాలి.

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల విషయానికి వస్తే... యూరోపియన్ యూనియన్‌తో చేసుకున్న ఒప్పందం పదేళ్లుగా అమల్లో లేకుండా పోయింది. భారత్‌కున్న అతి పెద్ద వాణిజ్య భాగస్వాముల్లో ఒకటైన ఈ ప్రాంతంతోనూ వాణిజ్య ఒప్పందం విషయమై ఇటీవలే చర్చలు మొదలయ్యాయి. అదృష్టవశాత్తూ దేశంలోనూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల్లో భాగం కావడం దేశ హితం కోసమే అన్న భావన ప్రబలుతోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియాలతో ఇలాంటి ఒప్పందాలు ఇటీవలే కుదరడం గమనార్హం. గల్ఫ్ కో–ఆపరేషన్ కౌన్సిల్, యునైటెడ్ కింగ్‌డమ్‌లతోనూ ఇదే తరహా ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ప్రయత్నాలు వేగవంతమయ్యాయి.

మళ్లీ వెనక్కి?

యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకోవడం ఏడేళ్లుగా స్తబ్ధుగా ఉంది. ఒప్పందం చేసుకోవడంలో ఉన్న ఇబ్బందులను పరిష్కరించుకునేందుకు చర్చలు ఒక్కటే మార్గమని ఇటీవలే గుర్తించి ఆ దిశగా ముందుకు కదులుతూండటం హర్షించదగ్గ విషయం. పర్యావరణం, లేబర్, డిజిటల్ వాణిజ్యం వంటి వాణిజ్యేతర అంశాలను కూడా ఇప్పుడు చర్చిస్తున్నారు. యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్‌తో ఒప్పందం కుదిరితే చాలా లాభాలుంటాయి. స్విట్జర్లాండ్, నార్వే, ఐస్‌లాండ్ వంటి హైటెక్ దేశాల్లో మన దేశానికి చెందిన నిపుణులు పనిచేయడం సులువు అవుతుంది.

చివరగా... ఎగుమతులు మరింత జోరు అందుకునేందుకు ఉన్న ఇంకో అవరోధం ఇటీవలి కాలంలో పెరిగిపోయిన రక్షణాత్మక ధోరణులు. దిగుమతులకు సంబంధించి ఉన్న అడ్డంకులను తొలగించాల్సిన సమయం ఆసన్నమైంది. విదేశీ తయారీదారుల నుంచి ఎదురయ్యే పోటీని తట్టుకునేందుకు భారతీయులు ఇప్పుడు సిద్ధంగానే ఉన్నారు. స్థానికంగా పారిశ్రామిక రంగానికి సహాయం అవసరమని అనుకుంటే ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల వంటివి ఉండనే ఉన్నాయి. దిగుమతి చేసుకునే వస్తువులు మరింత ఖరీదు చేయడం కంటే దేశీ తయారీ రంగం ఊపందుకునేందుకు ఈ ప్రోత్సాహకాలు సరిపోతాయి. ఆత్మ నిర్భర్ భారత్ విధానం కూడా గతంలోని ఇంపోర్ట్ సబ్‌స్టిట్యూషన్(దిగుమతికి ప్రత్యామ్నాయం) విధానాన్ని గుర్తు చేస్తోంది. లైసెన్స్ రాజ్ కాలంలో ఇది చాలా ప్రధానమైందన్నది తెలిసిందే. దేశంలో ఇప్పటికే దిగుమతి సుంకాలు క్రమేపీ పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం అవి చైనా, ఆగ్నేయాసియా దేశాల సుంకాలకు రెట్టింపు స్థాయిలో ఉండటం గమనార్హం. ఈ పరిస్థితి మారితేనే భారత్ అంతర్జాతీయ వాణిజ్య విపణిలో కీలక పాత్ర పోషించగలుగుతుంది.

వ్యాసకర్త ఆర్థిక వ్యవహారాల సీనియర్ జర్నలిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

చర్చే మేలు



పార్లమెంటును స్తంభింపజేస్తూ ప్రతిపక్షం మణిపూర్‌తో పాటు తమకూ నష్టం కలిగించుకుంటోంది. అసలు చర్చే జరగకపోవడం కన్నా, ఏ నియమావళి ప్రకారం ఏ చర్చ జరిగినా మెరుగే!

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

ఉండగలమా?



కొంతమంది ఇండియాను వదిలిపెట్టి ఇంకో దేశానికి ఎందుకు పోతారని ఒకప్పుడు ఆశ్చర్యపోయేదాన్ని. ఇప్పటి పరిస్థితులను చూస్తుంటే, అలాంటి నిర్ణయం తీసుకునేవాళ్లను నేను ప్రశ్నించను.

– సుఖద, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ముందది ఔషధం



జెలటిన్ అనేది జంతుసంబంధితమైనది అనేది తెలిసిన వాస్తవం. అయితే ఈ కారణంగా ప్రాణాధార ఔషధాలను వాడటానికి జనాలు నిరాకరిస్తారేమోనన్న ఉద్దేశంతో వాటిని శాకాహార, మాంసాహారాలుగా వర్గీకరించడాన్ని భారత ప్రభుత్వం చట్టబద్ధంగా నిషేధించింది. అందుకే క్యాప్సూల్ తయారీలో వాడిన పదార్థాల జాబితా ఎవరూ ఇవ్వరు. స్ట్రిప్స్ మీద ఎరుపు, ఆకుపచ్చ స్టిక్కర్లు కూడా ఉండవు.

– నవీన్ సాదెం, పోస్ట్ డాక్టోరల్ ఫెలో

విస్మరించకూడదు!



ఏ సమాజంలోనైనా చిల్లర శక్తులు ఉంటాయి. తేడా ఏమిటంటే, ఆ చిల్లర శక్తులను ఖండించడంలో కొన్ని సమాజాలు ఏ విధమైన సంకోచాన్నీ చూపవు. కానీ కొన్ని సమాజాల్లో ఆ చిల్లర శక్తులే హీరోలుగా మారిపోతాయి.

– రామి నిరంజన్ దేశాయి, ఆంత్రోపాలజిస్ట్

ఎప్పటికి పూర్తయ్యేను?



చరిత్రాత్మకం. ఇండియాలోని కోర్టుల్లో పెండింగులో ఉన్న కేసుల సంఖ్య అక్షరాలా ఐదు కోట్ల మార్కును దాటింది. కచ్చితంగా చెప్పాలంటే, 5.02 కోట్లు. ఇది మొత్తం దక్షిణ కొరియా జనాభాకు సమానం. ఇప్పుడు తీర్పులు వెలువడుతున్న వేగాన్ని బట్టి ఈ పేరుకుపోయిన కేసులు పూర్తి కావడానికి 323 ఏళ్లు పడుతుంది.

– ఆనంద్ రంగనాథన్, మీడియా ప్యానెలిస్ట్

సురక్షితమేనా?



ఇండియాలోని అత్యంత ఎక్కువ ఫార్చ్యూన్ 500 కంపెనీల కార్యాలయాలుండే నగరం ఇప్పుడు మత విద్వేషాల హింసను ఎదుర్కొంటోంది. భద్రత దృష్ట్యా కంపెనీలు తమ ఉద్యోగులను ఇంటి నుంచి పనిచేయమని చెబుతున్నాయి. క్యాబ్ సర్వీసులు నిలిచిపోయాయి. నగరంలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. ప్రపంచానికి మనం ఏం సందేశం ఇస్తున్నట్టు?

– ప్రశాంత్ కుమార్, జర్నలిస్ట్

ఇలా కూడా చేస్తారా?



ఇటీవల నేను సింగపూర్‌కు వెళ్లినప్పుడు, ఒక క్యాండీ షాపులో ప్రత్యేకంగా 'వేగన్' (శాకాహార) విభాగం ఉండటం గమనించాను. కుతూహలంతో సేల్స్ గర్ల్‌ను అదే విషయం అడిగాను. మామూలు క్యాండీలు బీఫ్, పొసైన్ (పంది)ల జెలటిన్ (జంతు కొవ్వు)తో తయారవుతాయని చెప్పింది. నేనైతే షాకయ్యాను. నిజంగా నాకు ఈ విషయం తెలియదు.

– కార్తీక్, ఎండోక్రైనాలజిస్ట్

ఇన్ బాక్స్

అమెరికాలో ఎందుకా క్యూలు?

కొద్దిరోజులుగా మన దేశంలో జనం టమోటాల కోసం క్యూలు కడుతుంటే, అమెరికాలో ప్రవాస భారతీయులు సన్నబియ్యం కోసం షాపింగ్ మాల్స్‌కు పరుగులు పెడుతున్నారు. మన కేంద్ర ప్రభుత్వం ముందు జాగ్రత్తతో చేసిన బియ్యం ఎగుమతుల నిషేధ ప్రకటన ప్రపంచ వ్యాప్తంగా ప్రవాస భారతీయులు ఉన్న దేశాల్లో ప్రకంపనలు సృష్టించింది. అమెరికాలో ఉండే మన దక్షిణాది రాష్ట్రాలకు చెందిన భారతీయులు, మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలవారు ఉలిక్కి పడ్డారు. చిత్రమేమిటంటే మన కేంద్ర సర్కారు బియ్యం ఎగుమతుల నిషేధానికి ముందు పంచదార, ఆ తర్వాత గోధుమల ఎగుమతులపై నిషేధం విధించినపుడు ఈ రకమైన ప్రకంపనలు కనిపించలేదు. అమెరికాలో వరి పండుతున్నా అక్కడి భారతీయులు ఆందోళన చెందడానికి కారణం ఉంది. అమెరికాలో పొడుగు రకం వరి ఎక్కువ పండిస్తారు. దీనిని ప్రవాస భారతీయులుగాని, చైనావారు గాని ఇష్టపడరు. ఈ కారణంగా సన్నరకం బియ్యం, బాస్మతి బియ్యాన్ని దిగుమతి చేసుకోక తప్పటం లేదు.

కాలిఫోర్నియా రాష్ట్రంలో పండే బంగారం రంగులో ఉండే గోల్డెన్ రైస్ అంటే కొన్ని దేశాలవారికి ఇష్టం. అమెరికా ప్రజల బియ్యం వినియోగం బాగా తక్కువ. సంవత్సరానికి 12 కిలోలు మాత్రమే అక్కడ తలసరి వినియోగంగా ఉంది. ఈ కారణంగా ఎగుమతుల కోసమే అక్కడ వరి పండిస్తున్నారు. అయితే అమెరికా బియ్యం లక్షల సంఖ్యలో ఉన్న చైనా, భారతీయులను ఆకట్టుకోలేకపోతోంది. ఈ కారణంగా సన్న బియ్యంతో పాటు భారత్‌కు చెందిన బాస్మతి, థాయ్‌లాండ్‌కు చెందిన జాస్మిన్ రకాల వృద్ధి కోసం అమెరికాలో ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రపంచ బియ్యం ఉత్పత్తిలో 2 శాతం మాత్రమే అమెరికాలో ఉత్పత్తి అవుతున్నా ఎగుమతుల విషయానికి వచ్చేటప్పటికి ఆ దేశం 5వ స్థానం పొందింది. మొదటి నాలుగు స్థానాల్లో భారత్, థాయ్‌లాండ్, వియత్నాం, పాకిస్తాన్‌లు ఉన్నాయి. అలాగే బియ్యం ఉత్పత్తిలో చైనా, భారత్, వియత్నాం, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్‌లు మొదటి ఐదు స్థానాలు ఆక్రమించాయి. వినియోగంలో చైనా, భారత్, బంగ్లాదేశ్, ఇండోనేషియా, వియత్నాంలు ముందువరుసలో ఉన్నాయి. అమెరికాలో ప్రస్తుతం వచ్చిన బియ్యం సంక్షోభం 2008లో కూడా ఒకసారి వచ్చింది.

చివరగా 'అన్నం పరబ్రహ్మ స్వరూపమ'ని పొగిడినా, అది 'ఊబకాయాని'కి కారణమని దాని వినియోగాన్ని నిరుత్సాహ పరచినా... ప్రపంచ వ్యాప్తంగా 400 కోట్ల మంది బియ్యాన్ని ప్రధాన ఆహారంగా వినియోగిస్తూనే ఉన్నారనేది గమనార్హం.

– పుట్టా సోమన్న చౌదరి, కాకినాడ

సామాజిక అంతరాల తగ్గింపే లక్ష్యం!

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

భారతదేశంలో ఆర్థిక అసమానతల కంటె తీవ్రంగా మెజారిటీ ప్రజలను బాధించేవి సామాజిక అంతరాలు. కుల వ్యవస్థతో వచ్చిన సామాజిక అంతరాలు కొందరిని అస్పృశ్యులను చేస్తే, మరి కొందరిని సేవకా కులాలుగా మార్చాయి. సాహూ మహారాజ్ బ్రిటిష్ వారి పాలనా కాలంలోనే ఇలాంటి వారికి రిజర్వేషన్లు ప్రవేశపెట్టారు. డా॥ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లను సామాజిక అసమానతలు అనుభవిస్తున్న వారికేనని స్పష్టంగా రాశారు. మార్క్స్ కోరిన ఆర్థిక సమానత్వం కంటె ఈ దేశంలో సామాజిక సమానత్వాన్ని సాధించడం ముఖ్యమని ఆయన అన్నారు. అది సాయుధ పోరాటంతో కాకుండా స్టేట్ సోషలిజంతో సాధ్యమని భావించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పాలకులు కులనిర్మూలన దిశగా తమ పాలనను సాగించి ఉంటే సామాజిక అంతరాలు చాలా వరకు తగ్గి ఉండేవి. కానీ ఆ దిశలో తగిన చర్యలు చేపట్టకపోవడం వల్ల అలా జరగలేదు.

ఆంధ్రప్రదేశ్‌కు తాను సీఎం అయిన తర్వాత రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక అంతరాలను తగ్గించాలని జగన్ నడుం బిగించారు. తన పాదయాత్ర సమయంలోనే రాష్ట్రంలోని సామాజిక, ఆర్థిక అంతరాలను గ్రహించారు. అమరావతి ఉన్న మధ్యాంధ్ర ప్రాంతం మొదటి నుంచే అభివృద్ధి చెందిన ప్రాంతం. అక్కడ రాజధాని పెడితే రాయలసీమ, ఉత్తరాంధ్రలు ఎప్పటి లాగే వెనుక బడిపోయే అవకాశముంది. మూడు ప్రాంతాల మధ్య అసమ అభివృద్ధి, సామాజిక అంతరాలు మరీ పెరుగుతాయి. దీన్ని నివారించడానికే విప్లవాత్మకమైన మూడు రాజధానుల అంశం ముందుకు తెచ్చారు.



అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెంది, సామాజిక అంతరాలు తగ్గి బహుజన కులాలకు కొంతవరకైనా సామాజిక న్యాయం జరగాలన్నది జగన్ ప్రభుత్వ లక్ష్యం. అందుకే 'అమ్మ ఒడి' లాంటి అందరికీ నాణ్యమైన ఉచిత విద్యనందించే పథకాలు, ఇంగ్లీషు మీడియం చదువులు, కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం లాంటి వాటిని అందిస్తున్నారు.

ఇటీవలి కాలంలో జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న మరో సాహసోపేత, అద్భుత చర్య అమరావతి భూములను పేదలకు పంచడం. పేదవారికీ, బడుగు, బలహీన జాతుల వారికీ అక్కడి భూములను ఉచితంగా ఇచ్చి, పట్టా కాగితాలను చేతికందించారు. వేలాది మంది నిర్భాగ్యులకు అమరావతి ప్రాంతంలో ఇల్లు కట్టుకునే అవకాశం లభించింది. అమరావతిలో ఇండ్ల స్థలం లభించడంతో బహుజనుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. సమాజం అస్పృశ్యత రుగ్మత నుండి విముక్తమైతే ఎంత సంతోషముంటుందో అమరావతిలో అన్ని సామాజిక వర్గాలకు చోటివ్వడంవల్ల అంతే సంతోషంగా ఉన్నారు జనాలు. ఓ సామాజికవర్గం మాత్రం జగన్ చేసిన, చేస్తున్న అన్ని పనులనూ వ్యతిరేకించినట్లే ఈ భూములు పంచే కార్యక్రమాన్నీ వ్యతిరేకిస్తోంది.


నాలుగేళ్ల పాలనలో అన్ని సమస్యలనూ హుష్‌కాకి అని పరిష్కరించి ఉండక పోవచ్చు కాని, ఆంధ్రప్రదేశ్‌లో గడప గడపకూ అందే పథకాలు కోట్లాదిమంది ముఖాల్లో సంతృప్తి, సంతోషాలు కనబడేట్టు జగన్ మౌలిక మార్పులు తీసుకువచ్చా రన్నది వాస్తవం. ఆయన లక్ష్యం రాష్ట్ర ప్రజలందరి మధ్యనున్న సామాజిక అంతరాలను తగ్గించి ఆర్థిక సాధికారతను సాధించడమే!

వ్యాసకర్త ప్రసిద్ధ కథారచయిత
మొబైల్: 98493 77578

మనిషికి మనిషే దిక్కు

ఓ ధనవంతుడు తన సంపదను చూసుకొని చుట్టుపక్కలవారితో సహా ఎవరితోనూ కలిసి మెలిసి ఉండడం లేదు. ఎవరికీ తాను చేయదగిన సహాయం చేయడం లేదు. అయితే అతడికి దైవ చింతన, సాధుపుంగవులను దర్శించడం వంటి లక్షణాలు మెండు.

ఒకసారి ఓ సాధువు ఆశ్రమానికి వెళ్లిన అతడు ఆయనతో మాటల సందర్భంగా... తన సంపద కారణంగా ఎవరి మీదా ఆధారపడకుండా ప్రశాంతంగా జీవిస్తున్నానని చెప్పాడు. అందుకు ఆ సాధువు తాను బయటకు వెళుతున్నాననీ, తనతో వస్తే ఓ జీవన సత్యాన్ని చెబుతాననీ అన్నాడు. అది మిట్టమధ్యాహ్న సమయం. ఇష్టం లేకపోయినా ధనవంతుడు ఆయనతో బయలుదేరాడు.



జ్యోతిర్మయం

కొంత దూరం వెళ్లిన తరువాత ఎక్కడైనా చెట్టు కనిపిస్తే బాగుండు, ఆ చెట్టు నీడలో కొంత సమయం విశ్రమించవచ్చని అనుకుంటూ ఉన్నాడు. కనుచూపు మేరలో చెట్టు కనబడడం లేదు. ఇది గమనించిన సాధువు 'ఏమిటీ ఏదో వెతుకుతున్నట్టు ఉన్నావు? ఏం కావాలి' అని అడిగాడు.

'మనం కాసేపు విశ్రమించడానికి ఏదైనా చెట్టు నీడ కనిపిస్తుందేమో చూస్తున్నా'నన్నాడు. అంతట సాధువు, 'చెట్టు నీడ కోసం ఎందుకు, నీ నీడ ఉందిగా అందులో సేదదీరు' అన్నాడు. ఆ ధనవంతుడికి సాధువు చెప్పింది అర్థం కాలేదు. 'స్వామీ! ఏం చెబుతున్నారు... నా నీడలో నేనెలా సేద దీరగలను?' అన్నాడు.

'ఇప్పుడు నీ దగ్గర ఉన్న నీ ధనం నీకు నీడ కల్పించలేకపోతోంది. చివరికి నీ నీడ కూడా నీకు ఉపయోగకరంగా లేదు. కానీ నీ నీడ చీమల లాంటి చిన్న చిన్న జీవులు సేదదీరడానికి ఉపయోగపడగలదు. ఈ సూక్ష్మాన్ని గ్రహించగలిగితే నువ్వు డబ్బు దన్నుతో సాటి మనుషులను పట్టించుకోకుండా ఉండలేవు. ఎంత డబ్బున్నా కష్టాల్లో నీకు సాయపడేది మనుషులే అనేది గుర్తెరుగు' అన్నాడు సాధువు. తన కళ్లు తెరిపించిన సాధువుకు నమస్కరించి వెనుతిరిగాడు ఆ సంపన్నుడు.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

ఏఐఎఫ్ఎఫ్‌జీడీసీ డిప్యూటీ చైర్మన్‌గా ఎంపీ కోటగిరి



దెందులూరు: ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ గ్రాస్‌రూట్స్ డెవలప్‌మెంట్ కమిటీ (ఏఐఎఫ్ఎఫ్‌జీడీసీ) డిప్యూటీ చైర్మన్‌గా ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ నియమితులయ్యారు. మంగళవారం కమిటీ సెక్రటరీ జనరల్ జి.ప్రభాకరన్ ఈ మేరకు లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ డిప్యూటీ చైర్మన్‌గా క్షేత్రస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఫెడరేషన్ అభివృద్ధికి, క్రీడాకారుల్లోని నైపుణ్యం గుర్తించి వారు జాతీయ స్థాయిలో రాణించేలా తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

సెప్టెంబర్ నుంచి దుర్గగుడి అభివృద్ధి పనులు

• మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడి



గిరి ప్రదక్షిణలో మంత్రి సత్యనారాయణ

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనులను సెప్టెంబర్ నుంచి చేపట్టనున్నట్లు దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రారంభిస్తారని చెప్పారు. పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం దేవస్థానం నిర్వహించిన ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణలో మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణను ప్రారంభించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. పౌర్ణమికి అమ్మవారికి విశేష అలంకరణతో పాటు విశేష పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మవారి దయతోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందన్నారు. అమ్మవారి అనుగ్రహం సీఎం వైఎస్ జగన్‌పై సమృద్ధిగా ఉందన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు.

గరుడ వాహనంపై గోవిందుని విహారం



గరుడవాహనంపై ఊరేగుతున్న మలయప్పస్వామి

తిరుమల: తిరుమలలో మంగళవారం రాత్రి పౌర్ణమి గరుడ సేవ వైభవంగా జరిగింది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్పస్వామివారు గరుడునిపై ఆశీనులై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్య దేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడ వాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడనని తెలియజెబుతారు. అంతేగాక జ్ఞాన వైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజెబుతున్నాడు.

ఏపీలో రూ.3,593 కోట్ల జీఎస్టీ వసూలు

• గతేడాదితో పోలిస్తే 5% వృద్ధి

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో జూలైలో రూ.3,593 కోట్ల జీఎస్టీ వసూలు అయినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంగళవారం తెలిపింది. గతేడాదితో పోలిస్తే ఏపీలో జీఎస్టీ వసూలు 5 శాతం పెరిగినట్లు పేర్కొంది. తెలంగాణలో జూలై నెలలో రూ.4849 కోట్ల జీఎస్టీ వసూలు అయినట్లు వెల్లడించింది.

చంద్రబాబుది ఏడుపు యాత్ర

• మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, తిరుపతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమకు చేస్తున్న మంచిని చూసి ఓర్వలేక చంద్రబాబు ఏడుపు యాత్ర చేస్తున్నారని రాష్ట్ర అటవీ, ఇంధన, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. తిరుపతిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంతానికి చంద్రబాబు ఏం చేశాడు.. ఆనాడు వైఎస్సార్ హయాంలో, నేడు వైఎస్ జగన్ ఏం చేశారో చర్చించేందుకు సిద్ధమా సవాల్ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలైన పుంగనూరు, పీలేరు, మదనపల్లె, కుప్పం, పలమనేరు, తంబళ్లపల్లెల్లో దారుణమైన పరిస్థితి ఉందని వివరించారు. 14 వందల నుంచి 15 వందల అడుగుల లోతు బోర్లు వేసినా అవి ఫెయిల్ అయ్యేవని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఆవులపల్లి, నేతిగుంటపల్లి, ముదివేడు రిజర్వాయర్లతో ఈ ప్రాంతానికి నీటిని అందించేందుకు, కాలువల ద్వారా అన్ని నియోజకవర్గాల్లోనూ చెరువులను నింపుకోవాలనే మంచి ఉద్దేశంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు వెల్లడించారు. ఈ పనులకు శ్రీకారం చుట్టగా.. ఎన్జీటీకి ఫిర్యాదుల పంపి, సుప్రీంకోర్టుకు వెళ్ళి ఈ ప్రాజెక్టుల మీద చంద్రబాబు స్టే తీసుకువచ్చారని ఆరోపించారు. సొంత జిల్లాలో కూడా ఇలాంటి అడ్డంకులు సృష్టిస్తున్న చంద్రబాబుకు ఏం నైతిక విలువ ఉందని రాయలసీమ ప్రాజెక్టుల యాత్ర అని ప్రశ్నించారు.

ధరలేక 'వెనామీ' డీలా



గణనీయంగా తగ్గిన ధరలు

• ప్రభుత్వం మద్దతు ప్రకటించినా లెక్క చేయని కొనుగోలుదారులు
• రాయితీలతో ఆక్వాకు ప్రభుత్వం దన్ను
• కొనుగోలు వచ్చేసరికి మాట వినని ఎగుమతిదారులు

సాక్షి, అమలాపురం: ప్రభుత్వం అన్ని విధాలా 'మద్దతు' ప్రకటిస్తున్నప్పటికీ వెనామీ రొయ్య కొనుగోలుదారులు, ఎగుమతిదారులు ధరలు తగ్గించేస్తున్నారు. ధరలు కనిష్ట స్థాయికి పడిపోవడంతో పంట పండినా గిట్టుబాటు కావడం లేదని ఆక్వా రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వెనామీ రొయ్యలు వంద కౌంట్ (కేజీకి వంద రొయ్యలు) ధర రూ.190 మాత్రమే ఉంది. 90 కౌంట్ ధర రూ.200, 80 కౌంట్ ధర రూ.210, 70 కౌంట్ ధర రూ.220, 60 కౌంట్ ధర రూ.230, 50 కౌంట్ రూ.240గా ఉంది. 40 కౌంట్ ధర మాత్రం రూ.320 ఉండగా, 30 కౌంట్ రూ.420 వరకూ ఉంది. మార్కెట్‌కు వచ్చే రొయ్యల కౌంట్‌లో 30, 40 కౌంట్‌వి 5 శాతం మాత్రమే ఉంటున్నాయి. అత్యధిక శాతం 70 నుంచి 100 కౌంట్ మధ్యలోనే. గతంలో 100 కౌంట్ ధర రూ.220 నుంచి రూ.230 వరకూ ఉండేది. 80 కౌంట్ 250 వరకు, 60 కౌంట్ ధర రూ.270, 50 కౌంట్ ధర రూ.290 వరకు ఉండేది. కానీ నెల రోజులుగా రొయ్యల ధరలు మాత్రం తగ్గిపోయాయి.

లబోదిబోమంటున్న రైతులు..

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో 1.90 లక్షల ఎకరాల్లో వెనామీ రొయ్యల సాగు జరుగుతోందని అంచనా. రొయ్యల ధరలు తగ్గడం రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. రెండు దశాబ్దాల నాడు ఇవే ధరలు ఉండేవని, మేత, మందులు, కూలి ఖర్చులు మాత్రం మూడు రెట్లు పెరిగాయని వాపోతున్నారు. పంట పండితే లాభం అటుంచి నష్టాలు చవిచూడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.



వెనామీ రొయ్యలు

మద్దతు ధరకు కొనిపించాలి..

వెనామీ రొయ్యల ధరలు తగ్గిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కలగజేసుకుని కనీస మద్దతు ధరకు కొనిపించాలని ఆక్వా రైతులు కోరుతున్నారు. గత ఏడాది అక్టోబరు నెలలో వెనామీ ధరలు గణనీయంగా తగ్గాయి. అప్పట్లో ప్రభుత్వం సీరియస్ అవడంతో ఎగుమతిదారులు ధరలు పెంచి కొనుగోలు చేశారు. 100 కౌంట్ రూ.180 వరకూ తగ్గిపోగా రూ.210కి పెంచగా, 50 కౌంట్ రూ.250 ఉండగా రూ.290కి పెంచారు. 40 కౌంట్ ధర రూ.290 నుంచి రూ.330కి, 30 కౌంట్ రూ.330 నుంచి రూ.380కి పెంచడంతో రైతులు నష్టాల నుంచి గట్టెక్కారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభాన్ని చవిచూసినప్పుడు ప్రభుత్వం ఇలానే కలగజేసుకుని రొయ్యలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించింది.

ప్రభుత్వం వెన్నంటి ఉన్నా..



రొయ్యల ధరలు తగ్గిన ప్రతిసారీ ప్రభుత్వం కలుగజేసుకుంటూనే ఉంటోంది. మంచి కౌంట్‌లు వచ్చినా మార్కెట్‌లో ధరలు లేక రైతులు నష్టపోతున్నారు. కనీస మద్దతు ధరలపై ప్రభుత్వం మరోసారి చొరవ చూపాలి.

– త్సవటపల్లి నాగభూషణం, కోనసీమ ఆక్వా రైతు పరిరక్షణ సమితి గౌరవాధ్యక్షుడు, చెయ్యేరు, కాట్రేనికోన మండలం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

రైతు పరిస్థితి దారుణం



ఆక్వా రైతు పరిస్థితి దారుణంగా ఉంది. ప్రభుత్వం ఇటీవల అధికారులు చేసిన తప్పులు సరి చేసి విద్యుత్ రాయితీ పునరుద్ధరించి మంచి పనిచేసింది. కాని రొయ్యలకు ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నాం. ఇలా అయితే ఎంతోకాలం రొయ్యల సాగు చేయలేం.

– బొరుసు రాము, ఆక్వా రైతు, అమలాపురం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

రికీబుయ్ @ రూ.8,10,000

• ఏపీఎల్- 2లో విశాఖ కుర్రాడికి రికార్డ్ ధర
• రూ.1.8 కోట్లతో ఆటగాళ్ల వేలం

విశాఖ స్పోర్ట్స్: ఐపీఎల్ తరహాలో నిర్వహించనున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) రెండో సీజన్ ఆక్షన్ (వేలం) మంగళవారం విశాఖలో జరిగింది. ఇందులో దేశవాళీ క్రికెట్‌లో సత్తాచాటిన విశాఖ కుర్రాడు రికీబుయ్ ఏపీఎల్ రెండో సీజన్‌లో రూ.8,10,000కు బెజవాడ టైగర్స్ జట్టుకు అత్యధిక ధరకు అమ్ముడుపోయాడు. సౌత్‌జోన్ కెప్టెన్ హనుమ విహారీను రూ.6,60,000తో రాయలసీమ కింగ్స్ ఫ్రాంచైజీ దక్కించుకుంది. ఏపీలోని 6 ఫ్రాంచైజీ జట్లతో ఈ నెల 16 నుంచి వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఏపీఎల్ ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఆంధ్రా తరఫున రంజీలతో సహా అంతర్జాతీయ క్రికెట్‌లో పలు స్థాయిల్లో సత్తా చాటిన 567 మంది ఆటగాళ్లను వారి గ్రేడ్‌ను బట్టి వేలం నిర్వహించారు. 6 ఫ్రాంచైజీలు మొత్తంగా 120 మంది ఆటగాళ్లను జట్లకు ఎంపిక చేసుకున్నాయి. ఏసీఏ పర్యవేక్షణలో ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఐపీఎల్ జట్ల వేలం నిర్వహించే వ్యాఖ్యాత చారుశర్మ ఈ వేలాన్ని నిర్వహించగా..కౌన్సిల్ చైర్మన్ మునీష్ సెహగల్ ప్రారంభించారు. లైనప్‌ను సరి చూసుకుంటూ ఫ్రాంచైజీలు మొత్తంగా రూ.1.8 కోట్లను వినియోగించుకున్నాయి. కాగా, గిరినాథ్‌రెడ్డిని రూ.6,10,000లకు రాయలసీమ కింగ్స్, కేఎస్ భరత్‌ను రూ.6,00,000లకు ఉత్తరాంధ్ర లయన్స్ నెలబెట్టుకున్నాయి. వైజాగ్ వారియర్స్ అశ్విన్ హెబ్బర్‌ను రూ.5,10,000కు, కోస్టల్ రైడర్స్ స్టీఫెన్, లేఖజ్‌లను రూ.4,50,000లకు నిలబెట్టుకున్నాయి. రూ.50,000 కనీస ధరతో బిడ్ ప్రారంభమైంది.



వేలం నిర్వహిస్తున్న చారుశర్మ

నేటి నుంచి విశాఖలో జిల్లా కలెక్టర్ల సదస్సు

• హాజరుకానున్న 26 జిల్లాల కలెక్టర్లు, సీఈసీ అధికారులు

సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తోన్న నేపథ్యంలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అధికారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. రాష్ట్రాల్లో జిల్లా ఎన్నికల అధికారులుగా వ్యవహరించే కలెక్టర్లతో ఈ సదస్సులు ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా.. ఏపీలోని 26 జిల్లాల కలెక్టర్లతో విశాఖ బీచ్ రోడ్డులోని హోటల్‌లో రెండు రోజుల సదస్సు బుధవారం ప్రారంభం కానుంది. తొలి రోజున ప్రతి జిల్లా కలెక్టర్ తమ జిల్లా పరిధిలో నిర్వహిస్తోన్న ఎస్ఎస్ఆర్-2024 వివరాలతో కూడిన ప్రెజెంటేషన్‌ని వివరించేందుకు 15 నిమిషాల సమయాన్ని కేటాయించారు. అనంతరం.. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు తమ సలహాలు అందించనున్నారు. ఓటర్ల జాబితా తయారీ, సమ్మరీ రివిజన్, ఓటర్ల ఫొటో గుర్తింపు కార్డులు ఇంటింట పరిశీలన, ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు, పేరు, చిరునామా సవరణలు, కొత్త ఓటర్ల గణన తదితర అంశాలపై చర్చించనున్నారు. సదస్సులో పాల్గొనేందుకు సీఈసీ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌లు ధర్మేంద్ర శర్మ, నితేష్‌వ్యాస్, డిప్యూటీ ఎన్నికల కమిషనర్ హిర్దేశ్ కుమార్, సీనియర్ ప్రిన్సిపల్ సెక్రటరీ నరేంద్ర బూటోలియా మంగళవారం విశాఖ చేరుకున్నారు. వీరికి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జేసీ కేఎస్ విశ్వనాథన్, ఆర్డీవో భాస్కర్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.



కేంద్ర ఎన్నికల అధికారులకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మల్లికార్జున

మద్యం కోసం డబ్బు అడుగుతున్నాడని మట్టు బెట్టాడు

• సతీష్‌కుమార్ హత్యకేసులో నిందితుడి అరెస్ట్
• వివరాలను వెల్లడించిన ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్



వివరాలు వెల్లడిస్తున్న ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం: మద్యం తాగేందుకు పదే పదే డబ్బు అడగడంతో సతీష్‌కుమార్‌ను కిశోర్ హత్య చేసినట్లు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. ఈశ్వరరెడ్డినగర్‌లో సతీష్‌కుమార్‌ను హత్యచేసిన కిశోర్ తన ఇంట్లోనే కొన్ని రోజులుగా శవాన్ని మట్టితో కప్పి ఉంచిన విషయం తెలిసిందే. నిందితుడు కిశోర్‌ను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఏఎస్పీ ప్రేరణాకుమార్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. బొల్లవరం ప్రాంతానికి చెందిన గుండెబోయిన సతీష్‌కుమార్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈశ్వరరెడ్డినగర్‌కు చెందిన కిశోర్ అనే పూలవ్యాపారి సతీష్‌కు చిన్ననాటి స్నేహితుడు. ఈ క్రమంలో గత నెల 15న సతీష్‌కుమార్ కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కిశోర్‌ను తరచూ కలిసేవాడు. ఈ క్రమంలో గత నెల 24న కిశోర్, సతీష్ కలిసి ఈశ్వర్‌రెడ్డినగర్‌లో మద్యం తాగారు. రోజూ మద్యం తాగేందుకు సతీష్ తనను డబ్బు అడుగుతున్నాడని కిశోర్ అతన్ని దండించాడు. కొంతసేపు వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తర్వాత తన వద్ద ఉన్న కత్తితో సతీష్‌ను పొడిచాడు. సతీష్ చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత మృతదేహాన్ని ఏం చేయాలో తెలియక కిశోర్ తన ఇంట్లోనే మట్టి కప్పి ఉంచాడు. అతని ఒంటిపై 8 కత్తిపోట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సంచలనం కలిగించిన సతీష్‌కుమార్ హత్య కేసును ఫాస్ట్‌ట్రాక్‌గా పరిగణించి త్వరితగతిన ట్రయల్ పూర్తి చేయించి ముద్దాయికి శిక్ష పడేలా ప్రయత్నం చేస్తామని ఏఎస్పీ తెలిపారు.

పెద్దారెడ్డి ఫిర్యాదుపై ఏం చర్యలు తీసుకున్నారు?

• దివాకర్ ట్రావెల్స్ వాహనాలపై తెలంగాణ ప్రభుత్వానికి ఆ రాష్ట్ర హైకోర్టు ప్రశ్న
• టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డికి నోటీసులు

సాక్షి, హైదరాబాద్: బీఎస్-3 వాహనాలను బీఎస్-4గా మార్చి నడుపుతున్నారన్న ఫిర్యాదుపై ఎందుకు విచారణ చేయలేదో చెప్పాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆ రాష్ట్ర హైకోర్టు ప్రశ్నించింది. ఈ మేరకు అధికారులు, సీబీఐతో పాటు టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డికి నోటీసులు జారీ చేసింది. వచ్చే నెలలోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ విచారణను వాయిదా వేసింది. టీడీపీ నేతలు జేసీ దివాకర్‌రెడ్డి, జేసీ ప్రభాకర్‌రెడ్డికి చెందిన దివాకర్ ట్రావెల్స్ బీఎస్-3 వాహనాలను బీఎస్-4గా మార్చి నడపడంపై తాను 2020 అక్టోబర్ 12న తెలంగాణ రవాణా శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశానని, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఏపీలో తన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి, అక్రమాలు తేలడంతో పలు వాహనాలను సీజ్ చేశారని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం వాహనాలను అక్రమంగా నడుపుతున్నారని వివరించారు. ఇది సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో జేసీ ప్రభాకర్‌రెడ్డిపై విచారణ జరిపి.. కేసు నమోదు చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని.. కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని కోరారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రతివాదులైన తెలంగాణ రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి, హోం శాఖ ముఖ్య కార్యదర్శి, రవాణా శాఖ కమిషనర్, డీజీపీ, సీబీఐతో పాటు జేసీ ప్రభాకర్‌రెడ్డికి నోటీసులు జారీ చేస్తూ, విచారణను సెప్టెంబర్ 12కు వాయిదా వేశారు.

తీరంలో బోటు బోల్తా

• ఒకరు గల్లంతు.. ఆరుగురు సురక్షితం
• సంద్రంలో గాలిస్తున్న కోస్టుగార్డు, మెరైన్ బృందాలు
• విజయనగరం జిల్లా పతివాడ బర్రిపేట సముద్రతీరంలో ఘటన

పూసపాటిరేగ: విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం పతివాడ బర్రిపేట సముద్రతీరంలో కెరటాల ఉధృతికి బోటు బోల్తా పడింది. చేపల వేటకు వెళ్లిన ఏడుగురిలో ఒకరు గల్లంతు కాగా, మిగిలిన ఆరుగురు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. మెరైన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పతివాడ బర్రిపేటకు చెందిన వాసుపల్లి అప్పన్న (48), వాసుపల్లి ఎల్లాజీ, వాసుపల్లి రామస్వామి, మైలపల్లి కొర్లయ్య, మైలపల్లి పోలయ్య, మైలపల్లి మసేను, రాయితి అప్పన్నలు మంగళవారం వేకువజామున 3 గంటల సమయంలో ఇంజిన్ బోటుపై సముద్రంలో వేటకు బయలుదేరారు. కేవలం 10 నిమిషాల వ్యవధిలో తీరంలో అలల ఉధృతికి బోటు బోల్తా పడింది. ప్రమాదంలో వాసుపల్లి అప్పన్న మినహా మిగిలిన మత్స్యకారులందరూ ఈదుకుంటూ ఒడ్డుకు చేరారు. అప్పన్న జాడ కనిపించలేదు. బోటు బోల్తాపడినప్పుడు గాయపడి సముద్రపు అడుగుకు చేరి ఉండవచ్చని మత్స్యకారులు భావిస్తున్నారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం మెరైన్, కోస్టుగార్డు బృందాలు గాలిస్తున్నాయి. తహసీల్దార్ ఇ.భాస్కరరావు, మెరైన్ ఎస్ఐ పి.రమేష్ ఆధ్వర్యంలో తీరంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.



వాసుపల్లి అప్పన్న (ఫైల్)

ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్న బాబు అండ్ కో

• 1,038వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: రాష్ట్రంలో ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్న బాబు అండ్‌కోను ప్రజలు నమ్మరని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో పలువురు మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారికి కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన జవాబు చెంపపెట్టు అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం పేదవాడికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తూ రెండంచెల వృద్ధితో దూసుకెళుతుందని తెలిపారు. యువగళం పేరుతో లోకేశ్, వారాహి యాత్ర పేరుతో పవన్, రోడ్‌షోల పేరుతో చంద్రబాబు ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు చేస్తున్న తప్పుడు ప్రచారాలకు చరమగీతం తప్పదని హెచ్చరించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న బాబు పేదవాడికి జానెడు జాగా ఇచ్చి ఇళ్లు కట్టించిన దాఖలాలు లేవని, ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్షలాది ఇళ్లను నిర్మిస్తుంటే అక్కసుతో తప్పుడు కేసులు వేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. నాయకులు బేతపూడి సాంబయ్య, పులి దాసు, మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

రాష్ట్రంలో వనరులు పుష్కలం

• మాజీ క్రికెటర్ అంబటి రాయుడు



విద్యార్థులతో మాట్లాడుతున్న రాయుడు

తెనాలి అర్బన్: విభజన వల్ల ఇబ్బందులు ఉన్నా, వాటిని అధిగమించే వనరులు రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న ఓ కాలేజీలో మంగళవారం 'రాష్ట్ర విభజన వల్ల నష్టాలు–లాభాలు' అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అంబటి రాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి అభివృద్ధి చెందిన నగరాలు ఉన్నాయని, వాటిని మరింత అభివృద్ధి చేయగలిగితే రాష్ట్రానికి ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు. కరోనా వల్ల అన్ని రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నామని, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజలు ఆ సమయంలో ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవించగలిగారని చెప్పారు. మనం అందరం ఒక్కటే అనే భావనను కలిగి ఉంటే రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ పాటిబండ్ల శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా, తెనాలి వైకుంఠపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అంబటి రాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందులపేటకు చెందిన దివ్యాంగుడు ఉయ్యూరి శ్రీకాంత్‌ను ఆయన ఇంటికి వెళ్లి రాయుడు పరామర్శించారు. శ్రీకాంత్‌కు ఎలక్ట్రికల్ వీల్ చైర్‌ను త్వరలో అందిస్తానని రాయుడు చెప్పారు.

బీసీల ద్రోహి చంద్రబాబు

• ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు



రేపల్లె రూరల్: 'రాష్ట్రంలోని బీసీలు, బీసీ ఉప కులాలను కించపరిచేలా మాట్లాడటం టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన బృందానికి అలవాటు. చంద్రబాబు సీఎంగా ఉండగా నాయీబ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానని హెచ్చరించారు. తొక్కతీస్తానని మత్స్యకారులను బెదిరించారు. ఇలా బీసీలను చంద్రబాబు కించపరిచిన, బెదిరించిన ఘటనలు చాలా ఉన్నాయి. బీసీల ద్రోహి, ద్వేషి చంద్రబాబు..' అని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు విమర్శించారు. రేపల్లెలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ లోకేశ్ పాదయాత్రలో పెయిడ్ ఆర్టిస్టులతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని తాను ఆధారాలతో సహా వెల్లడించానని చెప్పారు. దానిని తప్పుదోవ పట్టిస్తూ తానేదో బీసీలను కించపరిచేలా మాట్లాడానని నిరసనలు తెలియజేయడం అవివేకమన్నారు. తమ పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తాను ఎల్లప్పుడూ బీసీల పక్షపాతిగా ఉంటామన్నారు. చెరుకుపల్లిలో దుండగుల చేతిలో మృతిచెందిన అమర్‌నాథ్ కుటుంబానికి ఉద్యోగపరంగా, ఆర్థికంగా, అన్ని విధాలుగా సీఎం జగన్‌తోపాటు తాను అండగా నిలిచామని తెలిపారు. అయినా ఈ ఘటనపై టీడీపీ శవరాజకీయాలు చేసిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వరంగల్ జిల్లాలో అనూరాధ అనే వయుతిపై యాసిడ్ దాడి జరిగితే వైద్య ఖర్చులకు సాయం చేయాలని ఆమె కోరగా... కించపరిచేలా మాట్లాడింది చంద్రబాబేనని గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అనూరాధకు రూ.5లక్షలు ఆర్థిక సాయంతోపాటు ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఉద్యోగాన్ని ఇచ్చి అండగా నిలిచారని గుర్తుచేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునే నైజం వైఎస్సార్ కుటుంబానిదైతే... బాధితులను కించపరిచే నైజం చంద్రబాబుదని మోపిదేవి మండిపడ్డారు.

తడి దుక్కిలో విత్తనాలు విరజిమ్మి..

• ఖరీఫ్ సీజన్‌లో డెల్టా రైతుల మరో ప్రయోగం
• విస్తారంగా కురిసిన వర్షాలతో ప్రత్యామ్నాయం



వలివేరులో వరి విత్తనాలు చిమ్ముతున్న కౌలు రైతు

తెనాలి: భారీ వర్షాలతో నీరు నిలిచిన పల్లపు భూముల్లో వరి సాగు ఆలస్యమవుతోంది. దీంతో కొందరు రైతులు తడి దుక్కిలోనే వరి విత్తనాలు విరజిమ్ముతూ కొత్త ప్రయోగానికి తెరతీశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో గుంటూరు జిల్లా రైతులు చిత్రమైన పరిస్థితి ఎదుర్కోవాల్సి వచ్చింది. రుతుపవనాల జాప్యంతో వర్షాభావం నెలకొంది. తర్వాత విస్తారంగా వర్షాలు కురిశాయి. అప్పటికే కొందరు వెద పద్ధతిలో వరి సాగుకు శ్రీకారం చుట్టారు. భారీ వర్షాలకు నీరు నిలిచిన చేలు, చౌడు నేలల్లో వెద పద్ధతికి అవకాశం లేకుండాపోయింది. చేలల్లో నిలిచిన నీరు పోయేందుకు కొంత సమయం పట్టింది. దీంతో వెదకు సమయం మించిపోయింది. ఇతర ప్రాంతాల్లో నారు కొనుగోలు చేయటం, నాట్లకు కూలీల కొరత సమస్యలు ఎటూ ఉండనే ఉంటాయి. ఇందుకు ప్రత్యామ్నాయంగా రైతులు తడి దుక్కి చేలల్లోనే వరి విత్తనాలను విరజిమ్మటం ఆరంభించారు. గతేడాది గుంటూరు జిల్లా వలివేరుకు చెందిన రైతు గుత్తికొండ రాఘవరెడ్డి తదితరులు విత్తనాలను విరజిమ్మే పద్ధతికి శ్రీకారం చుట్టారు. వెద సాగులో వచ్చినట్టే ఎకరాకు సగటున 35 బస్తాల దిగుబడి తీశారు. దమ్ము కూడా చేయలేదు. దీంతో ఈ ఏడాది మరి కొందరు రైతులు ఇదే విధానానికి ముందుకొచ్చారు. వలివేరు, చుండూరు, కొల్లిపర మండలాల్లో తడి దుక్కిలోనే ఎకరాకు 15 నుంచి 20 కిలోల వరి విత్తనాలను చిమ్మారు. వెద పద్ధతిలో ట్రాక్టరు గొర్రుతో విత్తనాలు నాటితే భూమిలో కొంత లోతులో విత్తినట్టవుతుంది.

'వెద' పద్ధతి పుట్టిందీ ఇక్కడే

పదేళ్ల క్రితం ఖరీఫ్ ఆరంభంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనటం, కాలువలకు తగినంత నీరు సరఫరా లేని రోజుల్లో రైతులు వెద పద్ధతిని ఆరంభించిన విషయం తెలిసిందే. క్రమంగా పశ్చిమ డెల్టాలో 80 శాతం రైతులు వెద పద్ధతిని అనుసరిస్తూ వస్తున్నారు. దీనివల్ల నారుమడులు పెంచడం, 20–25 రోజుల తర్వాత నాట్లు వేయటమనే పద్ధతి పూర్తిగా నిలిచిపోయింది. కూలీల సమస్యను, ఖర్చులను తగ్గించుకోగలిగారు. తాజాగా ఇప్పుడు వెదకు కూడా వీల్లేని పంట చేలల్లో విత్తనాలను నేరుగా విరజిమ్ముతూ మరో ప్రయోగానికి నాంది పలికారు.

క్లుప్తంగా...

బీజింగ్‌లో అనూహ్య వరదలు

20 మంది మృతి..మరో 27 మంది గల్లంతు

బీజింగ్: చైనా రాజధాని బీజింగ్‌లో మునుపెన్నడూ లేని విధంగా కురిసిన భారీ వర్షాలు, వరదలతో కనీసం 20 మంది చనిపోగా మరో 27 మంది గల్లంతయ్యారు. బీజింగ్ ఎండల తీవ్రత అంతగా ఉండదు. కానీ, ఈ ఏడాది వేసవిలో రికార్డు స్థాయిలో ఎండలతో జనం ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా, భారీ వర్షాలు కురియడం కూడా అరుదే. ఈసారి మాత్రం అసాధారణ స్థాయిలో వర్షాలు కురిశాయి. జనావాసాలు నీట మునిగాయి. రహదారులు, వాహనాలు కొట్టుకుపోయాయి. వరదలకు సంబంధించిన ఘటనల్లో బీజింగ్ సిటీ సెంటర్‌లో 11 మంది చనిపోగా, 27 మంది జాడ తెలియకుండాపోయారు. నగర పరిధిలోని హుబే ప్రావిన్స్‌లో మరో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 5 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారని అధికార మీడియా తెలిపింది.

నితీశ్‌కు పట్నా హైకోర్టులో ఊరట

పట్నా: రాష్ట్రంలో వివిధ సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం కులగణన చేస్తామని ప్రకటించి ఆ క్రతువుకు శ్రీకారం చుట్టిన బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు పట్నా హైకోర్టులో భారీ ఊరట లభించింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను కొట్టేస్తూ పట్నా హైకోర్టు మంగళవారం తుది తీర్పు చెప్పింది. కులగణన సర్వేకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు సమర్థించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను పట్నా హైకోర్టు చీఫ్ జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ పార్థసారథిల ధర్మాసనం గత నెల ఏడో తేదీన విచారించి తుది తీర్పును రిజర్వ్‌చేసి మంగళవారం వెలువరించింది. 'ప్రభుత్వ ఉత్తర్వు చెల్లుబాటు అవుతుంది. వెనుకబడిన వర్గాల న్యాయమైన అభివృద్ధిని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చట్టపరమైనదే' అని ధర్మాసనం తెలిపింది. మూడు నెలల క్రితం సర్వేను ఆపాలంటూ స్టే ఉత్తర్వులిచ్చిన హైకోర్టు ఇప్పుడు సర్వేకు పచ్చజెండా ఊపింది. దీంతో హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని పిటిషన్లలో ఒకరి తరఫు న్యాయవాది చెప్పారు. 'ఓబీసీ ప్రధానమంత్రి ఉన్నారని చెప్పుకునే బీజేపీ.. తమ పార్టీపాలిత రాష్ట్రాల్లో కులగణనకు అయిష్టత కనబరుస్తోంది' అని బిహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ ఆరోపించారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలంటూ ఆ అంశాన్ని 'ఇండియా' కూటమి తన ఎజెండాలో చేర్చుకున్న ఈ తరుణంలో పట్నా హైకోర్టు తీర్పు విపక్షాల కూటమికి కొత్త బలాన్ని ఇచ్చింది.



రాజ్యాంగ యంత్రాంగం కుప్పకూలింది

- మణిపూర్‌లో శాంతిభద్రతలు అస్సలు లేవు
- దర్యాప్తు చేసే దమ్ము అక్కడి పోలీసులకు లేదు
- మణిపూర్ ఉదంతంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
- వ్యక్తిగతంగా హాజరుకావాలని డీజీపీని ఆదేశించిన కోర్టు

న్యూఢిల్లీ: మణిపూర్‌లో జాతుల మధ్య వైరంలో మహిళలు సమిధలుగా మారిన వైనాన్ని సర్వోన్నత న్యాయస్థానం మరోమారు తీవ్రంగా తప్పుబట్టింది. మే నాలుగో తేదీన ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరులో తిప్పిన ఘటనకు సంబంధించిన కేసుల విచారణ సందర్భంగా మణిపూర్‌లో శాంతిభద్రతలు, పోలీసుల పనితీరును సుప్రీంకోర్టు తూర్పారబట్టింది. సోమవారం జరిగిన కేసుల వాదోపవాదాలు మంగళవారమూ కొనసాగాయి. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందించింది. 'కేసులను సమర్థవంతంగా దర్యాప్తుచేయలేని స్థితిలో పోలీసులున్నారు. దర్యాప్తులో దమ్ము, చురుకుతనం లేదు. మణిపూర్‌లో హింసాత్మక ఘటనల్లో ఆరువేలకుపైగా ఎఫ్ఐఆర్‌లు నమోదైతే ఎంత మందిని అరెస్టుచేశారు? నగ్న పరేడ్‌కు సంబంధించిన జీరో ఎఫ్ఐఆర్, సాధారణ ఎఫ్ఐఆర్, పూర్తి వివరాలు ఉన్నాయా ? హేయమైన ఘటన జరిగిన చాలా రోజులకు ఎఫ్ఐఆర్ నమోదైంది. కొన్ని ప్రాంతాల్లోకి పోలీసులు కూడా వెళ్లలేని అసమర్థత. పరిస్థితి చేయి దాటడంతో అరెస్టులు చేయలేని దుస్థితి. అక్కడ అసలు శాంతిభద్రతలు అనేవే లేవు. రాజ్యాంగ యంత్రాంగం కుప్పకూలింది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

6,523 ఎఫ్ఐఆర్‌ల నమోదు

కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాల తరఫున కోర్టుకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి వివరణ ఇచ్చారు. 'మేలో హింస మొదలైననాటి నుంచి ఇప్పటిదాకా 6,523 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. నగ్న పరేడ్ ఉదంతంలో జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ కేసులో జువెనైల్‌సహా ఏడుగురిని అరెస్ట్‌చేశారు. ఘటన తర్వాత బాధిత మహిళల వాంగ్మూలం తీసుకున్నారు' అని తెలిపారు. ఈ కేసులో 11 కేసులను సీబీఐకి బదిలీచేస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి తెలిపారు. కాగా, వాంగ్మూలాల కోసం ఆ మహిళలను మళ్లీ విచారించవద్దని సీబీఐకు కోర్టు సూచించింది. తమ ముందు హాజరుకావాలని బాధిత మహిళలను సీబీఐ ఆదేశించిందన్న అంశాన్ని వారి లాయర్ నిజాం పాషా మంగళవారం కోర్టు దృష్టికి తీసుకురావడంతో ధర్మాసనం పై విధంగా మౌఖిక ఆదేశాలిచ్చింది. ఏడో తేదీ(సోమవారం రోజు)న స్వయంగా హాజరై వివరాలు తెలపాలని మణిపూర్ డీజీపీని కోర్టు ఆదేశించింది. 6,523 కేసుల్లో హత్య, రేప్, బెదిరింపులు, లూటీలు, విధ్వంసం ఇలా వేర్వేరుగా కేసులను విభజించి వివరాలు ఇవ్వాలని ఆదేశించింది.

అవిశ్వాసం ఉంటే అభివృద్ధి అసాధ్యం

ప్రధాని మోదీ వెల్లడి

- తొమ్మిదేళ్లలో భారీ మార్పునకు ప్రజలు నాంది పలికారు
- దేశాన్ని ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చారు
- మోదీకి 'లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారం' ప్రదానం




పురస్కారం స్వీకరిస్తున్న ప్రధాని

పుణే: అవిశ్వాసం ఉన్నచోట అభివృద్ధి సాధ్యం కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. దేశంలో ప్రభుత్వ విధానాల్లో, ప్రజల కష్టపడి పనిచేసే తత్వంలో అపరిమితమైన విశ్వాసాన్ని నేడు మనం చూస్తున్నామని చెప్పారు. మహారాష్ట్రలోని పుణేలో మంగళవారం 'లోకమాన్య తిలక్ జాతీయ అవార్డు'ను మోదీ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు అజిత్ పవార్, దేవేంద్ర ఫడ్నవీస్ తదితరులు ప్రధాని మోదీతో కలిసి వేదికను పంచుకున్నారు. ఎన్సీపీలో చీలిక తర్వాత ప్రధాని మోదీ, శరద్ పవార్ ప్రత్యక్షంగా కలుసుకోవడం ఇదే మొదటిసారి. వారిద్దరూ సరదాగా మాట్లాడుకున్నారు. పురస్కార ప్రదానోత్సవంలో మోదీ మాట్లాడుతూ... విశ్వాస లేమి నుంచి అధిక విశ్వాసం దాకా భారతదేశ ప్రయాణం సాగిందని అన్నారు. ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో జరిగిన సర్వే గురించి ప్రస్తావించారు. తమ ప్రభుత్వాన్ని ప్రజలు అత్యధికంగా విశ్వసిస్తున్న దేశాల్లో భారత్ ఉన్నట్లు ఆ సర్వేలో తేలిందన్నారు. గత తొమ్మిదేళ్లలో దేశంలో భారీ మార్పునకు ప్రజలు నాంది పలికారని, దేశాన్ని ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చారని ప్రశంసించారు.

రోడ్ల పేర్లు మారిస్తే కొందరికి నిద్రలేని రాత్రులు

మీడియా స్వేచ్ఛ ప్రాధాన్యతను లోకమాన్య తిలక్ ఆనాడే చాటిచెప్పారని, స్వాతంత్ర్య పోరాట పంథాను సైతం మార్చారని ప్రధాని మోదీ కొనియాడారు. తిలక్ జీవితం ఆదర్శప్రాయమని శ్లాఘించారు. తిలక్ పేరిట నెలకొల్పిన అవార్డును అందుకోవడంతో తన బాధ్యత మరింత పెరిగినట్లు భావిస్తున్నానని తెలిపారు. మన దేశంపై దండెత్తిన విదేశీయుల పేరిట ఉన్న రోడ్ల పేర్లను మార్చి, భారతీయుల పేర్లు పెడితే కొందరు తట్టుకోలేకపోతున్నారని, అరిచి గోల చేస్తున్నారని, నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారని మోదీ మండిపడ్డారు. కోవిడ్–19 వైరస్ వ్యాప్తి ఉధృతంగా ఉన్న సమయంలో మన సైంటిస్టులపై నమ్మకం పెట్టుకున్నామని, వారు వ్యాక్సిన్ అభివృద్ధి చేసి ఇచ్చారని గుర్తుచేశారు. వ్యాక్సిన్ అభివృద్ధిలో పుణే నగరం పాత్ర చాలా కీలకమని పేర్కొన్నారు. లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారం కింద తనకు లభించిన రూ.లక్ష నగదును నమామీ గంగా ప్రాజెక్టుకు అందజేస్తున్నట్లు మోదీ ప్రకటించారు. ముద్రా పథకం కింద రుణాలు, స్వచ్ఛ భారత్, బేటా బచావో, బేటా పడావో, అమృత్ కాల్, కర్తవ్య కాల్ వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. ఎన్సీపీ అధినేత శరద్ పవార్ మాట్లాడుతూ.. దేశంలో మొట్టమొదటి సర్జికల్ స్ట్రైక్ ఛత్రపతి శివాజీ మహారాజ్ హయాంలోనే జరిగిందని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో రెండు శకాలు ఉన్నాయని, అవి తిలక్ శకం, గాంధీ శకమని పేర్కొన్నారు. ఇతరుల భూమిని శివాజీ ఏనాడూ ఆక్రమించలేదని పవార్ గుర్తుచేశారు. ఇతర పార్టీలను చీలుస్తున్న బీజేపీ తీరును పరోక్షంగా తప్పుపట్టారు. లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారాన్ని 1983లో మహారాష్ట్రలో నెలకొల్పారు. తిలక్ వర్ధంతి సందర్భంగా ప్రతిఏటా ఆగస్టు 1న ఈ అవార్డును ప్రదానం చేస్తుంటారు.



కార్యక్రమంలో పవార్‌తో మోదీ మాటామంతీ

టాప్50 ఎగవేతదారుల బకాయిలు రూ.87 వేల కోట్లు

న్యూఢిల్లీ: గీతాంజలి జెమ్స్..ఇరా ఇన్‌ఫ్రా.. ఆర్ఈఐ ఆగ్రో.. ఏబీజీ షిప్‌యార్డు తదితర టాప్–50 ఉద్దేశపూర్వక ఎగవేతదారులు(సంస్థలు) దేశంలోని బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు సుమారు రూ.87,295 కోట్ల మేర బకాయి పడ్డారు. ఇందులో టాప్–10 మంది ఎగవేతదారులు రూ.40,825 కోట్ల మేర షెడ్యూల్ కమర్షియల్ బ్యాంకు(ఎస్సీబీ)లకు బకాయి ఉన్నారని కేంద్రం తెలిపింది. ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ మంగళవారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. గత అయిదు ఆర్థిక సంవత్సరాల్లో కలిపి ఎస్సీబీలు మొత్తం రూ.10,57,326 కోట్ల మేర రుణాలను మాఫీ చేసినట్లు ఆర్‌బీఐ తెలిపిందన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి టాప్–50 ఉద్దేశపూర్వక డిఫాల్టర్లు ఎస్సీబీలకు రూ.87,295 కోట్ల బకాయి పడినట్లు ఆర్‌బీఐ తెలిపిందన్నారు. ఇందులో పరారైన ఆర్థిక నేరగాడు మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ సంస్థ అత్యధికంగా రూ.8,738 కోట్లు ఎస్సీబీలకు బకాయి పడింది. ఉద్దేశపూర్వక ఎగవేతదారులతో బ్యాంకులు రాజీ ఒప్పందం కుదుర్చుకునేందుకు వీలు కల్పించే నిబంధన 2007 నుంచే ఉందని మంత్రి వివరించారు. మరో ప్రశ్నకు సమాధానంగా ఆయన..2022–23 సంవత్సరాల్లో నమోదైన 66,069 ఆన్‌లైన్ మోసాల ఘటనల్లో రూ.85.25 కోట్ల మేర నష్టం జరిగిందని చెప్పారు.

నిర్మాణదశలో ఘోర ప్రమాదం

- గిర్డెర్ లాంచర్ కుప్పకూలడంతో 20 మంది కార్మికుల దుర్మరణం
- మహారాష్ట్రలో సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వే వద్ద ఘటన

ముంబై: మహారాష్ట్రలో నిర్మాణంలో ఉన్న సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వే వద్ద ఘోర ప్రమాదం జరిగింది. వంతెనలోని శ్లాబులను యథాస్థానంలో కూర్చోబెట్టేందుకు వినియోగించే గిర్డెర్ లాంఛర్ కుప్పకూలడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. సెగ్మెంట్ లాంచర్(క్రేన్)తో కలుపుకుని దాదాపు 700 టన్నుల బరువైన గిర్డెర్ లాంఛర్ 35 మీటర్ల ఎత్తునుంచి కిందకు కుప్పకూలింది. దీంతో అక్కడే పనిచేస్తున్న కార్మికులు, సిబ్బంది దాని కింద నలిగిపోయారు. ఈ ఘోర దుర్ఘటనలో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ముంబైను నాగ్‌పూర్‌ను కలుపుతూ 701 కిలోమీటర్ల పొడవైన సమృద్ధి మహామార్గ్ ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మిస్తున్నారు. ముంబైకి 80 కి.మీ.ల దూరంలో థానె జిల్లాలో సార్లాంబే గ్రామం వద్ద సోమవారం అర్ధరాత్రిదాటాక ఈ ఘటన జరిగింది. ఘటనపై నిపుణులతో కూడిన దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసినట్లు ఉపముఖ్యమంత్రి ఫడ్నవిస్ చెప్పారు. పోతపోసిన బాక్స్ శ్లాబులను తర్వాతి రోజు నిర్మాణం కోసం సిద్ధంచేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుల కుటుంబాలకు తలో రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామన ప్రధాని ప్రకటించారు. తలో రూ.5 లక్షల ఆర్థికసాయం అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చెప్పారు. దుర్ఘటన నేపథ్యంలో సంబంధిత ఇద్దరు కాంట్రాక్టర్లపై పోలీసులు కేసు నమోదుచేశారు. మొత్తం ఎక్స్‌ప్రెస్‌వేలో ఇప్పటికే 600 కి.మీ.ల మేర నిర్మాణం పూర్తయి రాకపోకలు సైతం మొదలయ్యాయి. ఈ 101 కి.మీ.ల నిర్మాణ పనులు కొనసాగుతాయి. ఈ ఎక్స్‌ప్రెస్‌వే మీద గత ఆరు నెలల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 88 మంది ప్రాణాలు కోల్పోయారు.

'హరియాణా' ఘర్షణల్లో ఐదుకు చేరిన మరణాలు

గురుగ్రామ్/చండీగఢ్: హరియాణాలోని నుహ్ జిల్లాలో మొదలైన మత ఘర్షణలు పొరుగునే ఉన్న గురుగ్రామ్‌కు పాకాయి. వివిధ హింసాత్మక ఘటనల్లో ఇప్పటి వరకు అయిదుగురు చనిపోయారని పోలీసులు మంగళవారం తెలిపారు. సోమవారం నుహ్ జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనల్లో ఇద్దరు హోంగార్డులు సహా నలుగురు మృతి చెందారు. మరో 23 మంది క్షతగాత్రులు కాగా వారిలో పోలీసులు 10 మంది ఉన్నారు. ముగ్గురు పోలీసు అధికారులకు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలపై పోలీసులు 11 కేసులు నమోదు చేసి, 27 మందిని అదుపులోకి తీసుకున్నారు. నుహ్ జిల్లాలో జరిగిన గొడవల్లో 120 వాహనాలకు దుండగులు నిప్పుపెట్టారు. ఇందులో 8 వాహనాలు పోలీసు అధికారులవే. సోహ్నాలో కొన్ని దుకాణాలకు సైతం ఆందోళనకారులు నిప్పుపెట్టారు. గురుగ్రామ్‌లో జరిగిన కాల్పుల ఘటనల్లో గాయపడిన ఇద్దరిలో ఒకరు చనిపోయారని పోలీసులు చెప్పారు. ఈ ఘటనల నేపథ్యంలో నుహ్ జిల్లాలో కర్ఫ్యూ విధించినట్లు హోం మంత్రి విజ్ చెప్పారు. పథకం ప్రకారమే కొందరు ఘర్షణలకు దిగినట్లు అనుమానం వ్యక్తం చేశారు. గొడవలకు కారణమైన వారిని గుర్తించి, తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ ప్రశాంతంగానే ఉన్నాయన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో 20 కంపెనీల కేంద్ర బలగాలను తరలించనున్నారు. నుహ్, ఫరీదాబాద్‌ల్లో ఇంటర్నెట్ సేవలను బుధవారం వరకు నిలిపివేశారు. నుహ్, ఫరీదాబాద్, పల్వాల్ జిల్లాల్లో విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటించారు. అన్ని మత సంస్థల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. నుహ్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంత్ పవార్, ఎస్పీ నరేంద్ర సింగ్ అన్ని వర్గాల ప్రతినిధులతో శాంతి సమావేశం ఏర్పాటు చేశారు.



దగ్ధమైన పోలీస్ వాహనం





మంగళవారం మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కుకీ వర్గం ప్రజల ఇళ్లకు నిప్పుపెట్టిన దృశ్యం. ఈ మంటల్లో బిహార్, హరియాణా, నాగాలాండ్ వలసదారులకు చెందిన డజనుపైగా ఇళ్లు సైతం కాలిబూడిదయ్యాయి.

8న అవిశ్వాసం

▶ మొదటి పేజీ తరువాయి

ఆందోళనకి దిగారు. ప్రకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. తమ డిమాండ్‌పై ప్రభుత్వం తక్షణమే స్పందించాలంటూ సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. దీంతో ఉభయ సభలను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. లోక్‌సభ, రాజ్యసభ బుధవారానికి వాయిదా పడ్డాయి.

లోక్‌సభలో 'ఢిల్లీ' బిల్లు

లోక్‌సభ మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు నినాదాలు ప్రారంభించారు. కొందరు వెల్‌లోకి దూసుకొచ్చారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ స్పీకర్ స్థానం పక్కనే నిల్చున్నారు. నినాదాలతో హోరెత్తించారు. ఇంతలో స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. హరియాణాలో జరిగిన హింసను బీఎస్పీ ఎంపీ కున్వర్ డానిష్ సభలో ప్రస్తావించారు. నినాదాలు, అరుపులతో గందరగోళం నెలకొనడంతో 15 నిమిషాల్లోనే స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత కూడా నినాదాలు, నిరసనలకు తెరపడకపోవడంతో సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ స్పష్టం చేశారు. మంగళవారం లోక్‌సభలో జనన, మరణాల రిజిస్ట్రేషన్(సవరణ) బిల్లు, ఆఫ్‌షోర్ ఏరియాస్ మినరల్(డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) సవరణ బిల్లు, కానిస్టిట్యూషన్(షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్ అమెండ్‌మెంట్ బిల్లుపై స్వల్ప వ్యవధిపాటు చర్చించి, ఆమోదించారు. అలాగే దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వ పాలనా సేవల నియంత్రణ కోసం ఉద్దేశించిన 'గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ(అమెండ్‌మెంట్) బిల్లు–2023ని లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఢిల్లీ సర్వీసెస్ ఆర్డినెన్స్ స్థానంలో కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చింది. బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తూ సభలో విపక్ష ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. తమ చేతుల్లోని కాగితాలను చించి విసిరేశారు. వారి తీరును కేంద్ర హోంశాఖ అమిత్ షా తప్పుపట్టారు. విపక్ష ఎంపీల నిరసన కేవలం రాజకీయ ప్రేరేపితమని విమర్శించారు. భారత రాజ్యాంగం ప్రకారం ఢిల్లీకి సంబంధించిన చట్టాలను చేసే అధికారం పార్లమెంట్‌కు ఉందని గుర్తుచేశారు.

'ఇండియా' ఎంపీల వాకౌట్

మణిపూర్ హింసాకాండపై ప్రధాని మోదీ మాట్లాడకపోవడాన్ని నిరసిస్తూ రాజ్యసభ నుంచి ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సభ్యులు ప్రశ్నోత్తరాల సమయంలో వాకౌట్ చేశారు. అంతకుముందు మణిపూర్ అంశంపై విపక్ష సభ్యులు ఆందోళనకు దిగడంతో రాజ్యసభ పలుమార్లు వాయిదా పడింది. ప్రతిపక్షాల నినాదాల మధ్యే చైర్మన్ ధన్‌ఖడ్ ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. సభలో ఎంపీల ప్రవర్తన ప్రజల దృష్టిలో హాస్యాస్పదంగా మారుతోందని చెప్పారు. మణిపూర్ హింసపై చర్చ కోసం రూల్ 267 కింద విపక్ష ఎంపీలు ఇచ్చిన 60 నోటీసులను ఆయన తిరస్కరించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖకు సంబంధించిన 'సిటిజెన్స్ డేటా సెక్యూరిటీ, ప్రైవసీ'పై పార్లమెంటరీ స్థాయీ సంఘం ఇచ్చిన నివేదికపై సీపీఎం సభ్యుడు జాన్ లేవనెత్తిన పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను ధన్‌ఖడ్ తోసిపుచ్చారు. సహకార సంఘాల బలోపేతంకు ఉద్దేశించిన మల్టీ–స్టేట్ కో–ఆపరేటివ్ సొసైటీస్(అమెండ్‌మెంట్) బిల్లును ఎగువసభలో మూజువాణి ఓటుతో ఆమోదించారు.

నేడు రాష్ట్రపతితో ప్రతిపక్ష కూటమి భేటీ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష నేతలు నేడు రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయి మణిపూర్ అంశంపై చర్చించనున్నారు. విపక్ష పార్టీల తరఫున కాంగ్రెస్ చీఫ్ ఖర్గే రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరారు. మణిపూర్ అంశంపై ప్రధాని పార్లమెంట్‌లో ఒక ప్రకటన చేయాలని, దీనిపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరగాలన్న తమ డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గకపోవడం వంటి అంశాలపై రాష్ట్రపతికి వివరించనున్నారు.

అంగ్ సాన్ సూకీ జైలు శిక్ష తగ్గింపు

బ్యాంకాక్: పదవీచ్యుతురాలైన అంగ్ సాన్ సూకీ(78) జైలు శిక్షను తగ్గిస్తున్నట్లు మయన్మార్ సైనిక ప్రభుత్వం ప్రకటించింది. రెండున్నరేళ్ల క్రితం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సూకీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని సైనిక పాలకులు కూలదోసి అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. అనంతరం సూకీపై 19 నేరారోపణలు మోపారు. వీటిలో కొన్నిటిపై విచారణ జరిపిన సైనిక కోర్టులు సూకీకి 33 ఏళ్ల జైలు శిక్షలు విధించాయి. బౌద్ధులు మెజారిటీగా ఉన్న మయన్మార్‌లో మంగళవారం 'గౌతమ బుద్ధుని మొదటి ఉపన్యాస'దినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ సందర్భంగా మిలటరీ కౌన్సిల్ చీఫ్, సీనియర్ జనరల్ మిన్ సుమారు 7 వేల మంది ఖైదీలకు క్షమాభిక్ష ప్రకటించారు. వీరిలో సూకీ, మాజీ అధ్యక్షుడు విన్‌మింట్ ఉన్నారు. సూకీకి ఆరేళ్ల జైలు శిక్షను తగ్గిస్తున్నట్లు తెలిపారు. దీని ప్రకారం, ఆమె మరో 27 ఏళ్లపాటు జైలు జీవితం గడపాలి.

భారత్‌తో చర్చలకు సిద్ధమే: షెహబాజ్

ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్చలు జరపడానికి తాము సిద్ధంగా ఉన్నామని పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ వెల్లడించారు. ఇరు దేశాల్లో పేదరికం, నిరుద్యోగంతో పోరాడుతున్న నేపథ్యంలో యుద్ధం అనేది మార్గం కాదన్నారు. పాకిస్తాన్ మినరల్స్ సమ్మిట్ సమావేశం ప్రారంభోత్సవ కార్యక్రమంలో షెహబాజ్ పాల్గొన్నారు.. ఆర్థికంగా కుదేలైన దేశంలో విదేశీ పెట్టుబడుల కోసం ఉద్దేశించిన ఈ సదస్సులో షెహబాజ్ మాట్లాడుతూ పాకిస్తాన్ కోలుకోవడం కోసం ఇరుగు పొరుగు దేశలన్నింటితోనూ తాము మాట్లాడతామని, పొరుగు దేశంతో యుద్ధం అనేది ఇక మార్గం కాదన్నారు. భారత్‌తో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కశ్మీర్ అంశంలో సీమాంతర ఉగ్రవాదాన్ని నిరంతరం ప్రేరేపిస్తూ ఉండడంతో ఇరు దేశాల మధ్య సంబంధాల్లో ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో పాక్ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.

పవన్ ముంజాల్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా హీరో మోటో కార్ప్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ పవన్ ముంజాల్‌తోపాటు ఇతరుల నివాసాలు, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. ఢిల్లీ, గుర్గావ్‌లో ఈ సోదాలు జరిగినట్లు వెల్లడించారు. పవన్ ముంజాల్‌తోపాటు ఇతర నిందితులపై మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద ఈడీ గతంలోనే కేసు నమోదు చేసింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్, కస్టమ్స్(సీబీఐసీ) ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. ఈడీ దర్యాప్తునకు తాము సంపూర్ణంగా సహకరిస్తామని హీరో మోటో కార్ప్ సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఢిల్లీ, గుర్గావ్‌లో పవన్ ముంజాల్ నివాసం, రెండు ఆఫీసుల్లో సోదాలు జరిగాయని తెలియజేసింది. పన్నుల ఎగవేత కేసులో ఐటీ శాఖ గత ఏడాది మార్చిలో పవన్ ముంజాల్ ఇంట్లో సోదాలు నిర్వహించింది.

ఢిల్లీ బిల్లుపై కేంద్రానికి బీజేడీ మద్దతు

న్యూఢిల్లీ: ఢిల్లీ సర్వీసెస్ ఆర్డినెన్స్ స్థానంలో కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లుకు ఒడిశా అధికార పక్షం బిజూ జనతా దళ్(బీజేడీ) మద్దతివ్వనుంది. ప్రతిపక్షాలు ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానానికి సైతం వ్యతిరేకంగా ఓటేయాలని నిర్ణయించింది. ఈ మేరకు బీజేడీ నిర్ణయాన్ని మంగళవారం రాజ్యసభలో ఆ పార్టీ నేత సస్మిత్ పాత్ర ప్రకటించారు. బీజేడీ నిర్ణయం ఢిల్లీ ఆర్డినెన్స్ విషయంలో పార్లమెంట్‌లో ముఖ్యంగా రాజ్యసభలో కేంద్రానికి పెద్ద ఊరటనివ్వనుంది. బీజేపీ కూటమితోగానీ ప్రతిపక్షాలతోగానీ జట్టుకట్టకుండా ఢిల్లీ ఆర్డినెన్స్‌పై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తర్వాత కేంద్రానికి మద్దతు పలికిన రెండో పార్టీ బీజేడీ. రాజ్యసభలో అధికార పక్షంపై ప్రతిపక్ష పార్టీలదే పైచేయిగా ఉంది. బీజేడీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల నిర్ణయంతో రాజ్యసభలో కేంద్రం తీసుకొచ్చే బిల్లును ఓడించాలన్న ప్రతిపక్షాల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్, బీజేడీలకు చెరో 9 మంది సభ్యుల బలముంది. ఈ రెండు పార్టీల 18 మంది సభ్యుల మద్దతుతో కేంద్రం ప్రవేశపెట్టే బిల్లు రాజ్యసభలో నెగ్గేందుకు అవకాశమేర్పడింది.

మైనార్టీలకు దగ్గరవడానికి కార్యక్రమాలు

బీజేపీ ఎంపీలతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ట్రిపుల్ తలాక్ రద్దు నిర్ణయం వల్ల ముస్లిం మహిళలకు ఎనలేని భద్రత లభించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ముస్లిం మహిళల పురోగతికి తాము చేపడుతున్న చర్యల గురించి అందరిలోనూ అవగాహన పెంచాలని తనను కలిసిన పార్టీ ఎంపీలకు చెప్పారు. పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్‌కు చెందిన బీజేపీ ఎంపీలు ప్రధాని మోదీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎంపీలతో మాట్లాడుతూ 2024 ఎన్నికలకు అందరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. రానున్న రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మైనార్టీ వర్గాల ప్రయోజనాల కోసం కేంద్రం తీసుకున్న చర్యల్ని విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రధాని చెప్పినట్లుగా కొందరు ఎంపీలు వెల్లడించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం । 2 । ఆగస్టు । 2023



మణిపూర్ అల్లర్లను వ్యతిరేకిస్తూ మంగళవారం బెంగళూరులో కుకీ తెగ ప్రజల ధర్నా



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా బెళగావిలో బాలల ర్యాలీ

డెంగీ జ్వరం.. జర భద్రం

- రాష్ట్రంలో హఠాత్తుగా పెరిగిన బెడద
- బెంగళూరులో అధికం
- రాష్ట్రంలో ఇప్పటికి 4,739 కేసులు
- వానలతో పాటు వ్యాపించిన జ్వరం

బనశంకరి: రాష్ట్రంలో కొత్తగా కురిసిన వర్షాలతో డెంగీ జ్వరాలు చాపకింద నీరులా వ్యాప్తి చెందుతున్నాయి. జూలై నెలలో 2,489 మంది ఈ విషజ్వరం బారినపడినట్లు వెల్లడైంది. జూలై మూడోవారంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసి వాగులు, వంకలు ఉప్పొంగాయి. నగరాలు, పట్టణాల్లో చిత్తడి నెలకొంది. ఈ ప్రభావంతో డెంగీకి కారణమయ్యే ఈడిస్ ఈజిప్టై దోమల బెడద అధికమైంది.

నెలరోజుల్లో 2,489 మందికి డెంగీ

- ఈ ఏడాది జనవరి నుంచి జూన్ చివరి వరకు రాష్ట్రంలో మొత్తం 2,250 డెంగీ కేసులు నమోదు కాగా గత 30 రోజుల్లోనే అంతకుమించి 2,489 మంది డెంగీ బారిన పడడం తీవ్రతను చాటుతోంది.
- దీంతో ఈ ఏడాదిలో మొత్తం 4,739 కేసులు నమోదయ్యాయి.
- ఇప్పటివరకు 58,781 మందిలో డెంగీ జ్వర లక్షణాలు కనబడగా వీరిలో 37,957 మంది రక్తనమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించామని ఆరోగ్యశాఖ తెలిపింది.





వర్షాకాలంలో దోమల వల్ల విషజ్వరాల వ్యాప్తి పెరుగుతోంది



- జూలై 1 నుంచి ఇప్పటివరకు మొత్తం 17,987 మందిలో డెంగీ జ్వర లక్షణాలు కనబడగా వీరిలో 11,685 మంది రక్తనమూనాలను పరీక్షించారు.
- గత ఏడాది రాష్ట్రంలో మొత్తం 9,620 మందిలో డెంగీ జ్వర లక్షణాలు కనబడగా 9 మంది మృతి చెందారు.

డెంగీ జ్వర లక్షణాలు

- జ్వరం, తలనొప్పి, వాంతులు, గొంతు నొప్పి, కడుపు నొప్పి, చేతులు, కాళ్ల నొప్పులు, శరీరంపై దద్దుర్లు వంటివి ఏర్పడతాయి.

సిలికాన్ సిటీలో తాండవం

రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే రాజధాని బెంగళూరులో డెంగీ విజృంభిస్తోంది. ఇప్పటివరకు 2,519 మంది డెంగీకి నిర్ధారణ అయ్యింది. ఇంతవరకు 6,610 మందిలో డెంగీ రోగ లక్షణాలు కనబడగా వారిలో 4,291 మంది రక్త నమూనాలను ల్యాబ్‌కు పంపించారు. జూలై నెలలో సిలికాన్ సిటీలో మొత్తం 1,774 మంది డెంగీతో బాధపడ్డారు. గత 15 రోజుల్లో 1,599 మంది డెంగీతో ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. దీంతో జ్వరం అంటేనే నగరవాసులు డెంగీ ఏమోనని హడలిపోతున్నారు.

ఇతర నగరాల్లోనూ కేసులు

మిగిలిన నగరాల్లో మైసూరులో 314, విజయపుర 137, శివమొగ్గ 131, బెళగావి 135, తుమకూరు 75, దావణగెరె 71, బాగల్‌కోటే 68, ధార్వాడ 99, గదగ 63, కలబురిగి 85, బళ్లారి 74, చామరాజనగర 57, మండ్య 54, హాసన 78, దక్షిణకన్నడ 86, ఉడుపి 78, చిక్కమంగళూరు 81, కొడగు 88, చిత్రదుర్గ 107 మంది డెంగీ బారిన పడ్డారు. మిగిలిన జిల్లాల్లో 50 కంటే తక్కువ కేసులు నమోదయ్యాయి.



జాగ్రత్త చర్యలు ఇలా

- పగలు, రాత్రి ఇళ్లలోకి దోమలు రాకుండా చర్యలు తీసుకోవాలి
- ఇంటి చుట్టుపక్కల వాననీరు, మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి
- కొబ్బరి చిప్పలు, టైర్లు, పూల కుండీలు తదితరాల్లో నీరు లేకుండా చూసుకోవాలి
- ఇంట్లో దోమతెరలు వాడడం ద్వారా దోమ కాటు నుంచి తప్పించుకోవచ్చు
- నీటి తొట్టెలు, ట్యాంకులను శుభ్రంగా ఉంచుకోవాలి
- ఎక్కువరోజులు జ్వరం వస్తే డాక్టర్లను సంప్రదించాలి.
- డెంగీ జ్వరాల నియంత్రణకు సంబంధిత అధికారులతో చర్చించామని, నియంత్రణ చర్యలు చేపట్టాలని అన్ని స్థానిక సంస్థలకు సూచించినట్లు ఆరోగ్య మంత్రి దినేశ్ గుండూరావ్ తెలిపారు.



బెంగళూరు యలహంకలో సంగీత మొబైల్ షోరూం ప్రారంభోత్సవంలో నటి మృణాలిని రవి

న్యూస్‌రీల్

లింక్ నొక్కితే నిలువు దోపిడీ

- కరెంట్ బిల్లు కట్టలేదని రూ. 2 లక్షలు వసూలు

శివాజీనగర: ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నా ప్రజల్లో చైతన్యం రావడం లేదు. తాజాగా ఓ వ్యక్తి సైబర్ నేరగాడి వలలో పడి రూ. 2 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కబ్బన్ పార్కు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు...గతనెల 13న విఠల్ మాల్యా రోడ్డులో ఉన్న ఓ వ్యక్తికి బెస్కాం సిబ్బంది అంటూ ఫోన్ చేశారు. మీరు కరెంట్ బిల్లు చెల్లించలేదు, సరఫరా తొలగిస్తామంటూ చెప్పారు. దీంతో సదరు వ్యక్తి వెంటనే కరెంట్ బిల్లు చెల్లించడానికి సిద్ధమయ్యాడు. ఇదే సమయంలో సైబర్ నేరగాడు ఓ లింక్‌ను పంపాడు. అది ఓపెన్ చేసిన తక్షణమే అతని ఖాతాలో రూ. 2 లక్షల నగదు బదిలీ అయ్యింది. బాధితుడు లబోదిబో మంటూ కబ్బన్ పార్కు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

కిరాతక ప్రియుడు

- పాత వీడియోలు చూపి బ్లాక్‌మెయిల్
- ప్రియురాలిపై సామూహిక అత్యాచారం



అరెస్టయిన నిందితులు

యశవంతపుర: యువతిని ప్రైవేట్ వీడియోలతో బెదిరించి అత్యాచారానికి పాల్పడిన డ్యాన్స్ మాస్టర్‌తో పాటు అతని ఇద్దరి స్నేహితులను బెంగళూరు కొడిగేహళ్లి పోలీసులు అరెస్ట్ చేశారు. యువతికి నాలుగేళ్ల క్రితం సోషల్ మీడియాలో యాండీ జార్జి పరిచయమయ్యాడు. ఇతడు ఒక ప్రైవేటు స్కూల్‌లో డ్యాన్స్‌మాస్టర్‌గా పనిచేసేవాడు. ఆ పరిచయం ప్రేమగా మారి ఇద్దరూ రెండేళ్ల పాటు షికార్లకు వెళ్లారు. అతడు వేధించడంతో ఆమె కొంత కాలం నుంచి దూరంగా ఉంటోంది. దీంతో యువతితో కలిసి ఉన్న పాత పోటోలు, వీడియోలను చూపిస్తూ బ్లాక్ మెయిల్ చేయసాగాడు. ఇటీవల యాండీ జార్జి, స్నేహితులు సంతోష్, శశిలు కలిసి తనపై సామూహికంగా అత్యాచారం చేసినట్లు యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, పెన్ డ్రైవ్‌ను స్వాధీనం చేసుకున్నారు. యాండీ జార్జి పాఠశాలలోనూ విద్యార్థులతోను అసభ్యంగా ప్రవర్తించినట్లు విచారణలో తేలిందని ఈశాన్య డీసీపీ లక్ష్మీప్రసాద్ తెలిపారు.

200 యూనిట్ల లోపు ఉంటేనే ఉచితం: మంత్రి

శివాజీనగర: 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ ఉపయోగిస్తూ, అర్హత కలిగిన అందరికీ గృహజ్యోతి ఉచిత విద్యుత్ పథకం వర్తిస్తుందని, 200 యూనిట్లు దాటి ఉపయోగిస్తే వర్తించదని ఇంధన శాఖ మంత్రి కే.జే. జార్జ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 5న కల్బుర్గిలో సీఎం సిద్దరామయ్య ఈ పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. జూలై 22 లోపు 200 యూనిట్ల లోపు ఉపయోగించినవారికి ఈ నెల జీరో బిల్లు వస్తుందన్నారు. భాగ్యజ్యోతి, కుటీరజ్యోతి, అమృతజ్యోతి వంటి విద్యుత్ పథకాలను గృహజ్యోతిలో విలీనం చేసినట్లు చెప్పారు.

లోక్‌సభ ఎన్నికలపై ఢిల్లీలో చర్చలు: డీకే

శివాజీనగర: రాబోయే పార్లమెంటు ఎన్నికల గురించి 50 మంది కాంగ్రెస్ నాయకులు ఢిల్లీకి వెళ్లి హైకమాండ్‌ను కలిశారని డీసీఎం డీకే శివకుమార్ అన్నారు. మంగళవారం సదాశివనగరలో నివాసంలో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలకు ఇప్పటినుంచే బాధ్యతలను పంపిణీ చేయడంపై చర్చ జరుగుతోంది. దీంతో పాటుగా గ్యారంటీ పథకాలపై కూడా చర్చిస్తారు. మంత్రులను మాత్రమే కాదు సీనియర్ ఎమ్మెల్యేలు, ఎంపీలను కూడా పిలిచారని తెలిపారు. ఆగస్టు 5న ఉచిత విద్యుత్ గృహజ్యోతి పథకాన్ని ప్రారంభిస్తామన్నారు. కాగా, సీఎం సిద్దరామయ్య, డీకేశి కూడా మంగళవారం ఢిల్లీకి వెళ్లారు.

ఆలయం నేలమట్టం

- స్థానికుల ఆందోళన



కూల్చివేసిన ఆలయం

బనశంకరి: బీబీఎంపీ అధికారులు మంగళవారం 600 సంవత్సరాల చరిత్ర కలిగిన జలకంఠేశ్వర ఆలయాన్ని నేలమట్టం చేశారు. ఫుట్‌పాత్‌ల తొలగించే పేరుతో ఉదయం ఆలయాన్ని తొలగించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆలయాన్ని అక్కడే నిర్మించాలని ఆందోళన చేయడంతో అధికారులు, సిబ్బంది అక్కడి నుంచి ఉడాయించారు. ఈ ఘటనతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసు భద్రత కల్పించారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తొలగించడం ఏమిటని, స్వామి వారి మూల విగ్రహం దెబ్బతిందని ఆలయ అర్చకులు తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ వేపై జరిమానాలు

దొడ్డబళ్లాపురం: బెంగళూరు-మైసూరు ఎక్స్‌ప్రెస్‌వే పై మంగళవారం నుంచి ఆటోలు, బైక్లు, ట్రాక్టర్ల సంచారాన్ని నిషేధించిన నేపథ్యంలో పోలీసులు జరిమానాలు విధించారు. ఉదయం 11 గంటల వరకూ ఎక్స్‌ప్రెస్‌వే పై ఆటో, బైక్, ట్రాక్టర్ల వారికి రహదారిపై సంచరించరాదని అవగాహన కల్పించిన పోలీసులు ఆ తరువాత రహదారిపై వచ్చిన వాహనాలకు ఎడాపెడా జరిమానా విధించారు. దీంతో దెబ్బకు వాహనదారులు సర్వీస్ రోడ్డుపై సంచరించడం ప్రారంభించారు. జరిమానాలు విధించడం పట్ల వాహనదారులు అభ్యంతరం వ్యక్తం చేసారు.



నీలి ఆకాశం, అదే రంగు సముద్రం, తెల్లని నురుగతో అలలు, పాచిపట్టి ఆకుపచ్చగా మారిన శిలలు. మంగళూరు వద్ద బట్టెంపాడిలో కెమెరాకు చిక్కిన ప్రకృతి సౌందర్యం

యువకులకు హనీట్రాప్, ముగ్గురు అరెస్ట్

బనశంకరి: సోషల్ మీడియా టెలిగ్రాం ద్వారా యువకులను పరిచయం చేసుకుని వారితో స్నేహంగా ఉంటూ యువతులతో హనీట్రాప్‌కు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను మంగళవారం పుట్టేనహళ్లి పోలీసులు అరెస్ట్‌చేశారు. శరణ ప్రకాష్‌బళిగేర, అబ్దుల్ ఖాదర్, యాసిన్ పట్టుబడిన నిందితులు. ఈ కేసులో పరారీలో ఉన్న యువతితో పాటు మరో ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

టెలిగ్రామ్ యాప్ ద్వారా ఈ బృందంలోని యువతి, యువకులను పరిచయం చేసుకుని జేపీ.నగర ఐదోస్టేజ్ వినాయకనగర ఇంట్లోకి పిలిపించుకునేది. యువకులు ఇంట్లోకి రాగానే ప్లాన్ ప్రకారం హనీట్రాప్ గ్యాంగ్ ఇంట్లోకి చొరబడి యువకుల మొబైల్ లాక్కుని యువతితో ఏం పని అని మాట్లాడుతూనే మొబైల్లో ఫొటో, వీడియో తీసి డబ్బు ఇవ్వకపోతే మీ కుటుంబ సభ్యులకు ఫొటో పంపించి పరువుతీస్తామని బెదిరించి రూ.50 వేలు లాక్కున్నారు. ఈ ఘటనపై బాధితుడు పుట్టేనహళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.



పోలీసులకు పట్టుబడిన నిందితులు

కంట్లో కారం కొట్టి రూ. 6 లక్షల దోపిడీ

- ఐదుగురు సెక్యూరిటీ గార్డుల అరెస్టు



మైసూరు: బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు తీసుకొచ్చిన నగదును కంట్లో కారం కొట్టి దొంగలు దోచుకుని మాయమయ్యారు. మంగళవారం మైసూరు నగరంలోని పారిశ్రామిక ప్రాంతంలోని భారతీయ స్టేట్ బ్యాంకు ఎదుట ఈ ఘటన జరిగింది.

వివరాలు... హెబ్బాళ పారిశ్రామిక ప్రాంతంలో సిగరెట్, నిత్యావసరాలు సరఫరా చేసే దరసగుప్పే సంస్థ ఉండగా, అందులో బిల్ కలెక్టర్‌గా తులసీదాస్ (56) పని చేస్తున్నారు. ఇతడు సమీపంలోని ఎస్‌బీఐలో కంపెనీ డబ్బులు జమ చేయడానికని ఒక బ్యాగులో రూ.38 లక్షలు, మరో బ్యాగులో రూ.6 లక్షలు తీసుని టాటా ఏస్‌లో వెళ్లారు.

వాహనాన్ని నిలిపి బ్యాగులను తీసుకుని వెళ్తుండగా తెల్ల చొక్కా ధరించిన వ్యక్తి తులసీదాస్ కంట్లో కారం కొట్టి కుడి చేతిలో ఉన్న బ్యాగును తీసుకుని పారిపోయాడు. కొద్ది దూరంలో బైక్‌తో ఉన్న మరో వ్యక్తితో కలిసి పరారయ్యాడు. బాధితుడు హెబ్బాళ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బ్యాంకు వద్ద ఉన్న సీసీ టీవీలో దొంగతనం దృశ్యాలు రికార్డు అయ్యాయి. పోలీసులు దర్యాప్తు జరిపి వివిధ ప్రాంతాల్లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

యువకుడిని ట్రాప్ చేసి రూ.41 లక్షలు టోపీ

దొడ్డబళ్లాపురం: ఫేస్‌బుక్‌లో గీతా సెక్సీ పేరుతో ఉన్న ప్రొఫైల్ నిజమని నమ్మిన కనకపురకు చెందిన యువకుడు సైబర్ నేరస్తుల మాయలో పడి రూ.41 లక్షలు పోగొట్టుకున్న సంఘటన వెలుగు చూసింది. కనకపుర నివాసి రాజేశ్ రూ.41 లక్షలు సమర్పించుకున్న బాధితుడు. కొన్ని రోజుల క్రితం రాజేశ్‌కు గీతా సెక్సీ పేరుగల ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. తన పేరు గీత అని చెప్పిన సైబర్ నేరస్తుడు బెంగళూరు, రామనగర, శివమొగ్గ తదితర జిల్లాల్లో ఎస్కార్ట్ సర్వీస్‌లు ఇస్తానని, నమ్మించాడు.

ఆ మాటలు నమ్మిన రాజేశ్ తన పర్సనల్ విషయాలు ఫోటోలు షేర్ చేసాడు. కొన్ని రోజులకు అపరిచిత వ్యక్తి ఫొటోలు, వివరాలు తీసుకుని బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించాడు. పలు దఫాలుగా మొత్తం రూ.41 లక్షలు తన ఖాతాలోకి వేయించుకున్నాడు. దీంతో బాధితుడు రామనగర సెన్ పోలీసులకు ఫిర్యాదు చేసాడు.



మంగళవారం బెంగళూరు లాల్‌బాగ్‌లో ఫ్లవర్ షోకు ఏర్పాట్లు



పూలతో సింగారించిన స్వాగత తోరణాలు

ఉద్యానంలో పుష్పసౌధం

- 4 నుంచి పంద్రాగస్టు ఫ్లవర్ షో


బనశంకరి: నగరంలో ఒత్తిడి వాతావరణం నుంచి సేదతీర్చేందుకు కమనీయమైన పూలు, పండ్ల ఆకృతులు సిద్ధమవుతున్నాయి. విధానసౌధ నిర్మాత, మాజీ సీఎం కెంగల్ హనుమంతయ్య థీమ్‌తో ఈసారి లాల్‌బాగ్ ఉద్యానంలో స్వాతంత్ర్య దినోత్సవ ఫల పుష్ప ప్రదర్శన జరుగుతుంది. ఈ నెల 4న ఆరంభమై 15వ తేదీ వరకు కొనసాగుతుందని ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుసుమా తెలిపారు. మంగళవారం లాల్‌బాగ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె వివరాలను తెలిపారు. 214వ ఫ్లవర్ షో ను 4వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సీఎం, డీసీఎం ప్రారంభిస్తారు. 7 లక్షల పుష్పాలతో విధానసౌధ నమూనా సిద్ధమవుతోంది. కెంగెల్ హనుమంతయ్య విగ్రహం కూడా ఏర్పాటవుతుంది. ఫ్లవర్ షో టికెట్ ధర రూ.70 కాగా, సెలవు రోజుల్లో రూ.80 గా ఉంటుంది. 12 ఏళ్లలోపు పిల్లలకు రూ.30 చెల్లించాలి. పాఠశాల యూనిఫాంలో వచ్చే 1 నుంచి 10వ తరగతిలోపు బాలలకు ప్రవేశం ఉచితం.



ప్రధాన థీమ్ అయిన విధానసౌధ నిర్మాణ పనులు

కారుతో వెంబడించి, బైక్‌ను ఢీకొట్టి

- ఆనేకల్‌లో యువకుడి హత్య




హేమంత్ (ఫైల్‌ఫొటో), ఘటనా స్థలంలో పరిశీలన

బనశంకరి: బైక్‌పై వెళ్తున్న యువకుడిని కారులో వెంబడించి ఢీకొట్టి మారణాయుధాలతో దారుణంగా నరికి హత్య చేసిన ఘటన ఆనేకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మెణసిగనహళ్లి హేమంత్ (26) హత్యకు గురైన యువకుడు. ఇతను అత్తిబెలె పారిశ్రామికవాడలో హర్డ్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. బైక్‌ను కనమనహళ్లి పిన్ని ఇంటి వద్ద పెట్టి స్కూటీలో టైల్స్ తీసుకురావడానికి సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో బయలుదేరాడు. వణకనహళ్లి శీనప్ప కోళ్లఫారం వద్ద వస్తుండగా కారులో ఎదురుగా వస్తున్న యువకుల గ్యాంగ్ బైక్‌ను ఢీకొట్టారు. హేమంత్ కిందపడి తేరుకుని పరుగు తీశాడు. వెంబడించిన గ్యాంగ్ హేమంత్‌ను కత్తితో పలుమార్లు పొడిచారు. అతని కేకలకు సమీపంలోని ఇళ్లల్లోని వారు బయటకు రావడంతో దుండగులు పారిపోయారు. స్థానికులు ఆనేకల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితున్ని బొమ్మసంద్ర ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడు హేమంత్ పట్ల గ్రామంలో మంచి పేరు ఉంది. అయితే ఎందుకు హత్యకు గురయ్యాడు అనేది పోలీసులకు అంతుపట్టడం లేదు. ఎస్పీ మల్లికార్జున, ఎస్పీ పురుషోత్తం ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఉడుపి వీడియోలు తమాషా కావచ్చు

- సిట్ వేసేది లేదు: సీఎం



ఉడుపిలో విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఎం

శివాజీనగర: ఉడుపి కాలేజీలో వీడియోల చిత్రీకరణపై పోలీసులు సుమోటోగా కేసును నమోదు చేశారు, డీఎస్పీ స్థాయి అధికారి విచారణ చేపట్టారు, కేసును సిట్‌కి అప్పగించే ప్రశ్నే లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. మంగళవారం మంగళూరులో మీడియాతో ఆయన మాట్లాడారు. కేంద్ర మహిళా కమిషన్ సభ్యులు వచ్చి కాలేజీలోని మరుగుదొడ్డిలో కెమెరా అమర్చలేదని చెప్పారన్నారు. హోమ్ మంత్రి ఈ కేసును పిల్లలాట అనడంపై స్పందిస్తూ, పిల్లలాట కాకపోతే కేసు నమోదు అయ్యేదన్నారు. కాలేజీ విద్యార్థులు తమాషా చేసి ఉండవచ్చని అని ఉండవచ్చని సీఎం అన్నారు. కేసు కోర్టులో ఉన్నందున ఎక్కువ మాట్లాడనన్నారు.

ఏడాదిన్నర కిందటే టీటీడీకి నెయ్యి బంద్

కాంగ్రెస్ సర్కారు విధానం వల్లే తిరుమలకు నందిని నెయ్యి సరఫరా స్తంభించిందని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు నళిన్‌కుమార్ కటీల్ ట్వీట్ చేశారు. దీనిపై సీఎం స్పందిస్తూ తిరుమలకు నందిని నెయ్యి నిలిచిపోయింది నిన్న మొన్న కాదు, గత ఒకటిన్నర సంవత్సరం క్రితమే బీజేపీ ప్రభుత్వ హయాంలో నెయ్యి సరఫరా నిలిచిపోయింది, దీనికి కటీల్ దీనికి సమాధానం చెప్పాలి అని డిమాండ్ చేశారు. తాము అడిగిన ధర ఇవ్వడానికి టీటీడీ వారు అంగీకరిస్తే నెయ్యి సరఫరా చేస్తామని తెలిపారు.

తీరప్రాంతంలో భూ పరిరక్షణ

ఉడుపి జిల్లా కాపు తాలూకా పడుబిద్రి వద్ద సముద్ర తీరాన్ని సీఎం పరిశీలించారు. తీరప్రాంతలో భూమి కోతకు గురి కాకుండా శాశ్వతమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పథకానికి ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేయాలన్నారు. ఉడుపి జిల్లాలో అతివృష్టి వల్ల రూ.35 కోట్లు నష్టం జరిగిందని, సహాయక చర్యలకు నిధులు ఇస్తామని చెప్పారు.

మద్యం మత్తులో వాహనం నడిపి

- ఇద్దరిని బలిగొన్న డ్రైవరు

బనశంకరి: మద్యం మత్తులో క్యాంటర్ వాహనం నడుపుతూ ఓ డ్రైవర్ ఇద్దరి ప్రాణాలను బలిగొన్న దుర్ఘటన హెబ్బగోడి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఉదయం తాగిన మత్తులో ఉన్న ఓ క్యాంటర్ వాహనం డ్రైవరు ఆనేకల్ తాలూకా హెబ్బగోడి బయోకాన్ కంపెనీ ముందుభాగంలో వాహనాన్ని అడ్డదిడ్డంగా నడుపుతూ జాతీయ రహదారిలోని పోలీస్ బ్యారికేడ్‌ను ఢీకొట్టి, రోడ్డుపై నడిచి వెళ్తున్న ఇద్దరు పాదచారులు ఆశిక్ (28), మనోజ్‌కుమార్ (30)లను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని డ్రైవర్, క్లీనర్‌ను అరెస్ట్ చేశారు.



మృతి చెందిన యువకులు

క్లుప్తంగా

కలుషిత నీరు తాగి మహిళ మృతి

• చిత్రదుర్గలో 20 మందికి అస్వస్థత

సాక్షి,బళ్లారి: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు తోడు స్థానిక సంస్థల అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వంతో పలు జిల్లాల్లో కలుషిత నీరు తాగి ప్రజలు ఆస్పత్రి పాలవుతున్నారు. మొన్న బీదర్ జిల్లాలో కలుషిత నీరు తాగి 30 మందికి పైగా అస్వస్థతకు గురి కాగా, తాజాగా మంగళవారం చిత్రదుర్గ జిల్లా కవాడిగరహట్టి కాలనీలో 20 మందికి పైగా ఆస్పత్రి పాలయ్యారు. వీరిలో మంజుల(21) అనే మహిళ మృతి చెందగా మిగతా వారు స్థానిక ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. స్థానిక మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయక వల్లే ఆ నీటిని తాగి పలువురు అనారోగ్యం పాలైనట్లు వైద్యులు తెలిపారు.

మౌలిక సౌకర్యాలు కల్పించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్

రాయచూరు రూరల్: ఏపీఎంసీలో రైతులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ అన్నారు. సోమవారం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వర్తకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సంఘం, వర్తకులు, రైతుల మధ్య వారధిగా పని చేసే అధికారులు సామరస్యంగా స్పందించాలన్నారు. తాగునీరు, విద్యుత్, రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లికార్జున గౌడ, ఉపాధ్యక్షుడు బషీరుద్దీన్, వ్యాపారస్తులు, అధికారులున్నారు.

టీ స్టాల్ యజమాని కొడుక్కి 3వ ర్యాంక్

కంప్లి: హంపీలోని విరుపాక్ష దేవస్థానం పక్కన ఏ.నరసరాజు, ఏ.పద్మావతి దంపతులు టిఫిన్, టీ స్టాల్ నడుపుకుంటూ జీవిస్తున్నారు. హొసపేటెలోని ప్రౌఢదేవరాయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్(పీడీఐటీ) కాలేజీలో మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న వీరి కుమారుడు ఏ.పవన్ 2022–23వ సంవత్సరపు మెకానికల్ ఇంజినీరింగ్ పరీక్షల్లో విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ పరిధిలో 9.46 శాతం మార్కులతో 3వ ర్యాంక్ పొందాడు. మంగళవారం జరిగిన వీటీయూ స్నాతకోత్సవంలో పవన్‌కు పట్టా ప్రదానం చేశారు. కాగా అతని సాధనపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఆక్రమణల తొలగింపు

హుబ్లీ: సిటీ కార్పొరేషన్‌లోని కెంపకెరె ఎగువ భాగంలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అంగళ్లు, గ్యారేజ్, ఇళ్లను సంబంధిత అధికారులు మంగళవారం తొలగించారు. జోన్ అసిస్టెంట్ కమిషనర్ బసవరాజ లమాణి నేతృత్వంలో ఉదయమే నాలుగు గ్యారేజీలు, టీ అంగడి, ఒక ఇంటిని కూల్చివేశారు. పాత హుబ్లీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ కలగౌడ పాటిల్, పాలికె అధికారులు, ఇంజినీర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, రెండు జేసీబీలు, ట్రాక్టర్, 20 మందికి పైగా పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వీఎస్కేయూ వీసీగా డాక్టర్ అలీ



బాధ్యతలను స్వీకరిస్తున్న డాక్టర్ సాహెబ్ అలీ

బళ్లారిఅర్బన్: విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం(వీఎస్‌కేయూ)వైస్‌చాన్సలర్‌గా డాక్టర్ హెచ్.సాహెబ్ అలీ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఉన్న చాన్సలర్ ప్రొఫెసర్ సిద్దు పీ.అలగూరు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో అలీ బాధ్యతలను చేపట్టారు.

వేడుకగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం

రాయచూరు రూరల్: నగరంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు శ్రీకారం చుట్టారు. మంగళవారం అధిక శ్రావణమాస పౌర్ణమి సందర్భంగా నగరంలోని జడెలింగేశ్వర ఆలయంలో శివపార్వతులకు జలాభిషేకం, పుష్పాలంకరణ పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు, పదాధికారులు, మహిళలు పాల్గొన్నారు.

అనుమానంతో భార్యకు చిత్రహింసలు

• చావుబతుకుల మధ్య బాధితురాలు

సాక్షి,బళ్లారి: భార్య శీలంపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెను చిత్రహింసలు పెట్టి గాయపరిచిన ఘటన చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరెలో చోటు చేసుకుంది. చెళ్లకెరెలోని పావగడ రోడ్డులో భాస్కర్, రేఖ అనే దంపతులు నివాసం ఉంటున్నారు. చెళ్లకెరె ఆరోగ్య శాఖలో భాస్కర్ ఫార్మసిస్టుగా పని చేస్తుండేవారు. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త నిత్యం వేధించేవాడు. వారిద్దరి మధ్య గొడవలో సోమవారం రాత్రి భార్యను విచక్షణరహితంగా చితకబాది క్రికెట్ వికెట్‌తో విక్షతంగా దాడి చేయడంతో రక్త గాయాలయ్యాయి. ఏమీ తెలియని వాడిలా ఆమెను ఆస్పత్రిలో చేర్పించాడు. వైద్య సిబ్బంది అనుమానంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి సైకో భర్తను పట్టుకుని అసలు విషయాన్ని వెలికితీశారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న మహిళను స్థానికంగా చెళ్లకెరె ఆస్పత్రిలో చికిత్స చేయించిన అనంతరం చిత్రదుర్గంకు, ఆ తర్వాత దావణగెరెకు తరలించారు. రేఖ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు.

గవిమఠం భూముల స్వాహా

- కర్ణాటకలోని అసుండిలో రూ.10 కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతం
- గుట్టుచప్పుడు కాకుండా 47.48 ఎకరాల విక్రయం
- పీఠాధిపతి ప్రధాన శిష్యుడి సహకారంతోనే అక్రమాలు



అసుండిలో కరిబసవస్వామి మఠం ఆలయాన్ని కూల్చివేసి నిర్మించుకున్న ఇల్లు

ఉరవకొండ: కంచే చేను మేసింది. మఠం ఆస్తులను కాపాడాల్సిన వారే స్వాహా చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ అక్రమాలకు వెనుక మఠం పీఠాధిపతి ప్రధాన శిష్యుడి హస్తమున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అత్యంత ప్రఖ్యాతి గాంచిన ఉరవకొండలోని గవిమఠానికి ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మొత్తం 770 శాఖ మఠాలు ఉన్నాయి. ఈ మఠాల పరిధిలో రూ.కోట్ల విలువ చేసే 3 వేల ఎకరాల భూములు, షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఇందులో ఇప్పటికే 1,500 ఎకరాల భూమి అన్యాక్రాంతమైంది. వీటిని రూ. కోట్లకు గవిమఠంలో పనిచేస్తున్న కీలక వ్యక్తి విక్రయించినట్లు తెలుస్తోంది.

అర్చకులే భక్షకులై..

కర్ణాటకలోని బళ్లారి జిల్లా అసుండి గ్రామంలో కరిబసవస్వామి గవిమఠానికి సంబంధించి 47.48 ఎకరాల భూమి ఉంది. ఈ భూములను సాగు చేయడం ద్వారా వచ్చే ఆదాయంతో ఆలయంలో నిత్య పూజలు, భజనలు జరిగేలా చూడాలని 1987లో అప్పటి అర్చకులు మఠం ఎర్రిస్వామి, మఠం రుద్రయ్యస్వామి, మఠం బసవరాజుకు 7వ పీఠాధిపతి అప్పగించారు. ఈ భూములను కొన్నేళ్లుగా అనుభవించి మఠం ఎర్రిస్వామితో పాటు ఆయన కుమారులు మఠం విరుపాక్షి, మఠం శంకరయ్య, మరో అర్చకుడు మఠం రుద్రయ్యస్వామి ప్రస్తుత పీఠాధిపతి వద్ద పనిచేస్తున్న ఓ కీలక వ్యక్తి సహకారంతో ఇతరులకు విక్రయించారు. ప్రస్తుతం మఠం ఎర్రిస్వామి, అతని కుమారుడు మఠం విరుపాక్షి ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో పూజారులుగా కొనసాగుతూ ప్రతి నెలా రూ.15వేల జీతం పొందుతున్నారు. అంతేకాక మఠంలో ఎలాంటి హుండీ ఏర్పాటు చేయకుండా భక్తుల కానుకలను సైతం వారే తీసుకుంటున్నారు. ఈ లెక్కన ప్రతి నెలా రూ.20 వేల వరకు భక్తుల కానుకలు స్వాహా అవుతున్నట్లు తెలుస్తోంది.

అసుండిలో అన్యాక్రాంతమైన మఠం భూముల వివరాలు:

సర్వే నెం.	భూ విస్తీర్ణం
124	15.10 ఎకరాలు
120బీ	03.99 ఎకరాలు
126	16.25 ఎకరాలు
290	12.14 ఎకరాలు
మొత్తం	47.48 ఎకరాలు

నోరుమెదపని అధికారులు

కొన్నేళ్లుగా మఠం పీఠాధిపతులను ఆ మఠం ఏజెంట్ రాజన్నగౌడ్ తన గుప్పిట్లో పెట్టుకుని అంతా తానై నడిపిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. కర్ణాటకలోని మాన్వి తాలూకా కల్లూరులో సర్వే నంబర్ 110, 94, 95లో 60 ఎకరాల గవి మఠం భూమిని రూ.50 లక్షలకు ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. అప్పట్లో దీనిపై విచారణ చేసిన దేవదాయ శాఖ ఉన్నతాధికారులు వాస్తవాలు నిగ్గుతేల్చి ఏజెంట్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయించారు. ప్రస్తుతం ఈ వివాదం కోర్టులో నడుస్తోంది. అలాగే గతంలో మఠం ఇన్‌ఛార్జ్ ఈఓగా పనిచేసిన మల్లికార్జున సైతం కర్ణాటకలోని చేళ్లగుర్కిలో సర్వే నంబర్ 114లో ఉన్న మఠం భూమిని తన పేరుతో పాటు కుటుంబసభ్యుల పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీనిపై అధికారులు విచారణ చేపట్టి, ఆ భూములు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా మఠం అర్చకుడు మఠం ఎర్రిస్వామితో పాటు కుమారులు మఠం విరుపాక్షి, మఠం శంకరయ్య అసుండిలో మఠంలో భూములు విక్రయించి ఉరవకొండలో విలువైన ఆస్తులు సమకూర్చుకున్నట్లు తెలిసింది. ఈ అక్రమాలు తెలిసినా దేవదాయ శాఖ అధికారులు నోరు మెదపకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మీరు చూస్తున్న ఈ ఇల్లు కర్ణాటకలోని అసుండి గ్రామంలోని కరిబసవస్వామి మఠంలో వెలసింది. గతంలో ఇక్కడ మఠానికి చెందిన ఆలయం ఉండేది. ఆలయాన్ని అర్చకుడు కూల్చి వేసి పక్కా భవనం నిర్మించుకున్నాడు. ఇందులోనే ఓ చిన్న గదిలో మూలన కరిబసవస్వామి ఫొటో పెట్టి అప్పుడప్పుడు పూజలు చేస్తుంటారు.

విచారణ జరిపిస్తాం



మఠం భూములు అమ్ముకునే హక్కు అర్చకులకు లేదు. అసుండిలో మఠం భూముల విక్రయాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతాం. కర్ణాటక ల్యాండ్ రెవెన్యూ యాక్టు కింద ధార్మిక సంస్థలకు చెందిన భూములను ఇతర వ్యక్తులకు అమ్ముకునే హక్కు ఉందా? లేదా? అనే అంశంపై ఆరా తీస్తూ ఆ ప్రాంత ఆర్‌డీఓ నుంచి లిఖిత పూర్వక వివరణ కోరాం. స్పష్టత వచ్చిన తర్వాత భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతాం. – చిట్టెమ్మ, సహాయ కమిషనర్, గవిమఠ సంస్థానం, ఉరవకొండ

80 టీఎంసీలకు చేరిన టీబీడ్యాం నీటినిల్వ



తుంగభద్ర జలాశయం

హొసపేటె: రైతుల జీవనాడి తుంగభద్ర జలాశయంలోకి ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండగా మంగళవారానికి డ్యాంలో నీటి నిల్వ 80 టీఎంసీలకు చేరుకుంది. ఎగువన వర్షాలు మరింత జోరుగా కురిస్తే మరికొన్ని రోజుల్లో డ్యాం పూర్తిగా నిండే అవకాశం ఉంది. గరిష్ట నీటిమట్టం 1633 అడుగులకుగాను ప్రస్తుతం డ్యాంలో నీటి మట్టం 1625.81 అడుగులు, ఇన్‌ఫ్లో 39,766 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,066 క్యూసెక్కులుగా ఉందని మండలి అధికారులు తెలిపారు.

నదీ తీర ప్రాంతవాసులకు హెచ్చరిక

కంప్లి: మరికొన్ని రోజుల్లో జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యం గరిష్ట స్థాయికి చేరువయ్యే అవకాశం ఉన్నందున ఏ క్షణంలోనైనా గేట్లు పైకెత్తి వరద నీటిని నదికి విడుదల చేయవచ్చని, ఈనేపథ్యంలో నదీ తీర లోతట్టు ప్రాంతాల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీరావరి అధికారులు హెచ్చరించారు. నదీ తీర వాసులు, పశువులు, గొర్రెల కాపర్లు మేత కోసం నదిలోకి వెళ్లరాదని, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని జిల్లా, తాలూకా యంత్రాంగాలకు హెచ్చరికలు జారీ చేశారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

హుబ్లీ: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ధార్వాడ తాలూకా గరగ గ్రామ గడిగప్ప హనుమంతప్ప షటోజీ(36) అనే వ్యక్తిని గరగ పోలీసులు అరెస్ట్ చేశారు. సదరు గ్రామ ద్యామ్మవ్వన గుడి వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి అరెస్ట్ చేశారు. గరగ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

కర్ణాటక కోటా నీటి కోసం రైతుల్లో ఆందోళన

- నీటి విడుదలపై పాలకులు, అధికారుల మీనమేషాలు
- టీబీ బోర్డు చీఫ్ ఇంజనీర్‌తో రైతు సంఘం నేతల చర్చ



టీబీ బోర్డు చీఫ్ ఇంజనీర్ బసవరాజుతో నీటి విడుదలపై చర్చిస్తున్న రైతు సంఘం నాయకులు

సాక్షి,బళ్లారి: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అంటే ఇదేనేమో. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి తుంగభద్ర డ్యాంలోకి నీరు రాకపోవడంతో ఆందోళన చెందిన రైతులకు జూలై మూడో వారంలో కురిసిన భారీ వర్షాలకు 10 రోజులకే డ్యాంలోకి గరిష్టస్థాయిలో నీరు చేరుకున్నా ఆయకట్టుకు నీటి విడుదలపై పాలకులు, అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటంతో రైతులు అధికారులతో గొడవలకు దిగుతున్నారు. తుంగభద్ర డ్యాం నుంచి ఆంధ్రప్రదేశ్ కోటా ద్వారా హెచ్‌ఎల్‌సీ, ఎల్‌ఎల్‌సీ కాలువలకు జూలై 28న నీరు విడుదల చేశారు. కర్ణాటక కోటా కింద టీబీ బోర్డుకు ఇండెంట్ ఇవ్వకపోవడంతో ఈ ప్రాంత రైతులకు నీరు విడుదల చేయలేదు. దీంతో ఆయకట్టు కింద పంటల సాగుకు రైతులు అన్ని ఏర్పాట్లు చేసుకుని నీటి కోసం ఎదురుచూస్తున్నా ఇప్పటికి కూడా ఐసీసీ సమావేశం ఏర్పాటు చేయనందున నీరు ఎప్పుడు విడుదల చేస్తారోనని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నీటి విడుదలను పట్టించుకోని మంత్రులు, ఎమ్మెల్యేలు

టీబీ డ్యాం నుంచి విజయనగర, కొప్పళ, బళ్లారి, రాయచూరు జిల్లాలకు కర్ణాటకలో నీటి వాటా ఉంది. నాలుగు జిల్లాలకు చెందిన ఇన్‌చార్జ్ మంత్రులు కర్ణాటక కోటా కింద నీరు విడుదల చేయించాలనే ఆలోచన చేయడం లేదని రైతులు మండిపడుతున్నారు. కర్ణాటక కోటా కింద నీరు విడుదల చేసే ముందుగానే నాలుగు జిల్లాలకు చెందిన మంత్రుల్లో ఒకరిని తుంగభద్ర ఐసీసీ సమావేశం నిర్వహించేందుకు అధ్యక్షుడుగా నియమిస్తారు. అలాంటి ప్రక్రియ కూడా పూర్తి చేయకపోడంతో నీటి విడుదల ఎప్పుడు జరుగుతుంది? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. కనీసం కాడా అధ్యక్షుడిని కూడా నియమించకపోవడంతో నీరు విడుదల చేసేందుకు ఇబ్బందులు తలెత్తున్నాయని రైతులంటున్నారు. టీబీబోర్డు కర్ణాటక చీఫ్ ఇంజనీర్ బసవరాజు కర్ణాటక రైతులకు నీరు విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తం గౌడ మండిపడుతున్నారు.

కాలువల గుండా డీపీల నుంచి అక్రమంగా నీటి చౌర్యం

కాడా అధ్యక్షుడు, నాలుగు జిల్లాల మంత్రుల్లో ఒకరిని నీటి విడుదలకు అధ్యక్షుడుగా నియమించనప్పుడు చీఫ్ ఇంజనీర్ అయినా నేరుగా సంబంధిత చీఫ్ సెక్రటరీకి లేఖ రాసి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో బళ్లారి, సిరుగుప్ప, కంప్లి ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు హెచ్‌ఎల్‌సీ, ఎల్‌ఎల్‌సీ కాలువల ద్వారా ఏపీ కోటా కింద వెళుతున్న నీటిని డీపీలకు మళ్లించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, దీంతో రైతులకు, బోర్డు అధికారులకు మధ్య గొడవలు మొదలవుతున్నాయన్నారు. ఒకటి, రెండు రోజుల్లో నీరు విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

సంగీత మొబైల్స్ స్టోర్ ఆరంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే విశ్వనాథ్ తదితరులు

సాక్షి, బెంగళూరు: సంగీత మొబైల్స్ తన సరికొత్త ఫ్లాగ్‌షిప్ గ్యాడ్జెట్ స్టోర్‌ను బెంగళూరులోని యలహంక న్యూటౌన్‌లో ప్రారంభించింది. స్థానిక యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ ఈ స్టోర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మిర్నాళిని రవి, సంగీత మొబైల్స్ ప్రతినిధులు చందు రెడ్డి, భరత్ ప్రభాత్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు స్థలాలను ఇవ్వండి

• ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి



ఎమ్మెల్యే జనార్ధన్‌రెడ్డికి వివరిస్తున్న కమిషనర్

గంగావతి: నగరంలోని రాయచూరు రోడ్డులోని ఆటో నగర్‌లో చట్టపరంగా లబ్ధిదారులకు స్థలాలను కల్పించాలని ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి కమిషనర్‌ను ఆదేశించారు. ఆయన మంగళవారం ఆటోనగర్‌లో స్థలాలను పరిశీలించి మాట్లాడారు. ఆటోనగర్‌లో 40 ఏళ్లుగా గ్యారేజ్ కార్మికులకు ఈ స్థలాలు దక్కకుండా సమస్యగానే మిగిలిందని ఎమ్మెల్యే అన్నారు. ఈ స్థలాలను తక్షణం చట్టప్రకారం నిజమైన లబ్ధిదారులకు కల్పించాలని కమిషనర్‌కు సూచించారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ తక్షణం నియమాల అనుసారంగా ఈ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. కాగా గ్యారేజ్ ఓనర్ల అసోసియేషన్ నాయకులు శివణ్ణ, బషీర్‌సాబ్ ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ హెచ్ఆర్.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎడమ కాలువ ఆధునీకరణ పనులేవీ?



మాట్లాడుతున్న నిజాముద్దీన్

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువ ఆధునీకరణ పనులు చేపట్టడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహించారని జేడీఎస్ గ్రామీణ అధ్యక్షుడు నిజాముద్దీన్ ఆరోపించారు. ఆయన మంగళవారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఎడమ కాలువపై 131 నుంచి 141 మైలు వరకు పూడిక, గడ్డి మొక్కలు మొలిచాయని, నీరు సజావుగా ప్రవహించడానికి ఆటంకంగా ఉన్నాయన్నారు. గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ నీటిపారుదలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించక పోవడాన్ని ఖండించారు. ఈ విషయంలో గతంలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వివరించినా ఫలితం లేదన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

రాయచూరు రూరల్: యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని అదనపు జిల్లాధికారి దుర్గేష్ పిలుపు ఇచ్చారు. మంగళవారం జిల్లాధికారి కార్యాలయంలో మహంత స్వామి జయంతి సందర్భంగా మద్యపాన వ్యసనం నుంచి విముక్తి కోసం ఇలకల్ మహంత శివయోగి చేపట్టిన పోరాటం గురించి మాట్లాడారు. యువత సన్మార్గం వైపు నడవాలన్నారు. మన భారతీయ సంస్కృతిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కోరారు. కాగా ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ పుష్ప విద్యార్థులతో ప్రమాణం చేయించారు.

హొసపేటె: వ్యసన రహిత సమాజ నిర్మాణానికి డాక్టర్ మహంత శివయోగి స్వామి పంతం పట్టారని డిప్యూటీ కలెక్టర్ అనురాధ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో శివయోగి మహంత స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక

కంప్లి: రామసాగర జీపీ రెండో విడత అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలను ఎన్నికల అధికారి నీరావరి శాఖ ఏఈఈ శ్రీనివాస్ నిర్వహించారు. అధ్యక్షురాలిగా ఎం.ఆశ, ఉపాధ్యక్షులుగా ఆర్‌ఎం.రామయ్యల పేర్లను అధికారికంగా ప్రకటించారు. అనంతరం సభ్యులు, పంచాయతీ సిబ్బంది నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానించారు. ఈసందర్భంగా పీడీఓ హనుమంతప్ప, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

శ్రీధరగడ్డ జీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు వీరే

బళ్లారిఅర్బన్: శ్రీధరగడ్డ జీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో మంగళవారం ఆ పంచాయతీకి చెందిన 27 మంది జీపీ సభ్యులు ఓటు వేసి అధ్యక్షురాలుగా బసమ్మను, ఉపాధ్యక్షురాలుగా నాగరత్నను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి సీపీ బోగి తెలిపారు. పీడీఓ ప్రాణేష్, గ్రామ పెద్దలు నందీష్‌గౌడ, జాలిబెంచి మల్లికార్జున, గంగమ్మ, అశోక్‌గౌడ, ఈరణ్ణగౌడ, జెడ్పీ గోపాల్‌కుమార్‌రెడ్డితో పాటు జీపీ సభ్యులు, రూరల్ స్టేషన్ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగుడు మానుకోమన్నందుకు ఆత్మహత్య

హుబ్లీ: తాగుడు అలవాటు మానుకోమన్నందుకు ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ధార్వాడ తాలూకా మాదనబావిలో జరిగింది. తాగుడుకు బానిసగా ఉన్న మోహన్‌కృష్ణ నాయక పాటిల్(52) అనే వ్యక్తిని తాగుడు మానుకోవాలని హితవు పలికారు. ఈ మాటలతో మనోవేదనకు గురైన మోహనకృష్ణ నాయక విత్తనాల షెడ్‌లో ఉన్న క్రిమిసంహారక మందును తాగి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని గరగ పోలీసులు తెలిపారు.

రాఘవ అవార్డులకు ఎంపికలో సీనియర్లకు అన్యాయం



మాట్లాడుతున్న కే జగదీశ్ తదితరులు

బళ్లారి టౌన్: రాఘవ మెమోరియల్ అసోసియేషన్ గత 14 ఏళ్లుగా ఇస్తున్న రాఘవ అవార్డులకు ఎంపికలో ఇటీవల అసలైన సీనియర్ కళాకారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని జిల్లా కళాకారుల వేదిక అధ్యక్షుడు కే.జగదీశ్ ఆరోపించారు. మంగళవారం ముండ్లూరు రామప్ప స్నేహ సంపుట సభాంగణంలో బాధిత కళాకారులతో ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలో తమ వేదిక ఆధ్వర్యంలో రాఘవ, దొడ్డనగౌడల పేరుతో ప్రామాణిక నాటక కళాకారులకు అవార్డులు అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. పలు రకాల అవార్డులతో ఐదు దశాబ్దాలుగా సేవలందిస్తున్న అనేక మంది సీనియర్లు అవార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా ఎంపిక చేయడం లేదన్నారు. వేదిక ప్రముఖులు హెచ్ఎం జగదీశ్, చంద్రశేఖర్, తిమ్మనగౌడ, వీరేశ్‌స్వామి పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

నిందితుల అరెస్టు కోసం ర్యాలీ



ర్యాలీగా వెళుతున్న ఆందోళన కారులు

శ్రీనివాసపురం: తాలూకాలోని చల్దిగానహళ్లికి చెందిన విద్యార్థి కె.రాకేష్ హత్య కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల సంఘాల సమాఖ్య కార్యకర్తలు మంగళవారం పట్టణంలో బృహత్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి తహసీల్దార్ శిరీన్‌తాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రచయిత, నాటకకర్త కోటిగానహళ్లి రామయ్య మాట్లాడుతూ దళిత విద్యార్థి రాకేష్ హత్యను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించకపోవడం శోచనీయమన్నారు. గత్యంతరం లేని పరిస్థితిలో దళిత సంఘాలు ఆందోళన బాట పట్టాయన్నారు. రాకేష్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దళిత నాయకుడు చింతామణి ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ పోలీసులు నిందితులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో దళిత నాయకుడు శ్రీధర్ కల్లీరణ్ణ, వీరభద్రస్వామి, చల్దిగానహళ్లి ఈరణ్ణ, మధు హళియార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రామాణిక సేవతోనే సంతృప్తి



నారాయణమ్మను సన్మానిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: ప్రభుత్వ సేవలను ప్రామాణికంగా నిర్వహించినప్పుడే నివృత్తి అనంతరం మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆహార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టీఎం మల్లికార్జున తెలిపారు. మంగళవారం ఆహార శాఖ కార్యాలయంలో వయో నివృత్తి పొందిన నారాయణాచార్, నారాయణమ్మలను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికి మాట్లాడారు. ప్రభుత్వ విధులను నిర్వహించేవారు ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా వారి పనులను ఎప్పటికప్పుడు చేసివ్వాలన్నారు. కేజీఎఫ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ నివృత్తి అనేది ప్రభుత్వ ఉద్యోగులకు తప్పనిసరన్నారు. విధి నిర్వహణలో ఎలా పని చేశామనేదే మనకు తృప్తిని కలిగిస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు రవిరెడ్డి, వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

వైభవంగా దీపోత్సవం

మాలూరు: బెనఘట్ట గ్రామంలో గంగమ్మ దేవి, మారికాంబా దేవి దీపోత్సవాలను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. దీపోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకం, హోమం, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. మహిళలు ఆరతి, తంబిట్టు దీపాలను తలపై మోసుకుని వచ్చి అమ్మవారికి సమర్పించారు. మాలూరు తాలూకాతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి దీపోత్సవంలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

కంప్లి: వాసవి కల్యాణ మండపంలో వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం లక్ష్మిశంభులింగ మహాయజ్ఞంతో పాటు పంచాక్షరి మంత్ర జపం, గిరిజా కళ్యాణ వైభవంగా జరిగాయి. ఇదే సందర్భంగా నగరేశ్వరుడికి అభిషేకం, కన్యకా పరమేశ్వరి దేవికి పుష్పాలంకరణ భక్తిశ్రద్ధలతో జరిపారు.

చెట్లకు పరిహారం కోసం ధర్నా

శ్రీనివాసపురం: చెన్నై కారిడార్ రహదారి అభివృద్ధికి స్వాధీనం చేసుకున్న రైతుల భూముల్లోని చెట్లకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు కోళ్లు, పశువులతో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా బాధిత మహిళ మంగమ్మ మాట్లాడుతూ చెన్నై కారిడార్ పనులు ప్రారంభించి 8 ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు తమకు పరిహారం అందించక పోవడం శోచనీయమన్నారు. పరిహారం కోసం ఏళ్ల తరబడి తిరుగుతున్నా ఫలితం కనిపించలేదన్నారు. ప్రభుత్వం ఇకనైనా కనికరించి తమకు న్యాయం చేయాలని కోరారు. ధర్నాలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ, జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, మరగల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంత్రితో ఆటోయూనియన్ల భేటీ

బనశంకరి: ఓలా, ఉబర్ మాదిరిగా ఆటోలు, క్యాబ్‌ల బుకింగ్ యాప్ ను ప్రారంభిచాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని రవాణా మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. ట్యాక్సీ యూనియన్లు, ఆటో యూనియన్లతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. యూనియన్ల సభ్యులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. క్యాబ్ అగ్రిగేటర్లు అధిక కమీషన్ వసూలు చేస్తున్నారని తెలిపారు. వైట్‌బోర్డు తో సంచరిస్తున్న అక్రమ బైకు ట్యాక్సీలను నిషేధించాలని కోరారు.

మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యం

కోలారు: మాదక ద్రవ్యాలు, పొగాకు రహిత సమాజ నిర్మాణమే ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ లక్ష్యమని సంస్థ వేమగల్ యోజనాధికారి అనిల్ పిలుపునిచ్చారు. మంగళవారం తాలూకాలోని తొట్లి శాంతినికేతన ఉన్నత పాఠశాలలో ట్రస్టు చైర్మన్ వీరేంద్ర హెగడే మార్గదర్శనంతో నిర్వహిస్తున్న స్వాస్థ్య సంకల్ప కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశ భవిష్యత్ యువకులపైనే ఆధారపడి ఉందన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసలైతే అవి కుటుంబం మొత్తాన్ని బలి తీసుకుంటాయన్నారు. జిల్లా జన జాగృతి వేదిక సభ్యుడు నాగనాళ మంజునాథ్ మాట్లాడుతూ పాఠశాల, కళాశాలల్లో ఇలాంటి జాగృతి కార్యక్రమాలను నిర్వహించి యువతను సరైన దారిలో నడిపించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్‌గౌడ, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు కె ఎం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

కోలారు: మహిళలు, పిల్లల అక్రమ రవాణాకు అరికట్టే దిశగా సమాజంలో జాగృతిని కల్పించాలని డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ శంకర్ వణిక్యాళ్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని బీసీ సంక్షేమ శాఖాధికారి కార్యాలయంలో నిర్వహించిన మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో మాట్లాడారు. మానవ అక్రమ రవాణా అడ్డుకట్టకు ప్రతి ఒక్కరూ చేతులు కలపాలన్నారు. న్యాయ సేవా ప్రాధికార సభ్యుడు, సివిల్ జడ్జి సునీల్ ఎస్.హొసమని మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ద్వారా మహిళలను వేశ్యావాటికలకు తరలింపు, భిక్షాటన, అశ్లీల చిత్రాల నిర్మాణం వంటి వాటిని నిర్వహించే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటివి చేయడం శిక్షార్హ అపరాధమన్నారు. జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం మునేగౌడ, సీనియర్ న్యాయవాది ధన్‌రాజ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వచ్ఛతా కార్యక్రమం


దండి మరిగమ్మ ఆలయం వద్ద శుభ్రతా చర్యలు

గౌరిబిదనూరు: నగరంలోని నెహ్రూజీ కాలనీ 18వ వార్డులో దండి మరిగమ్మ దేవాలయ ఆవరణంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు సోమవారం పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సంచాలకుడు వేణు మాట్లాడుతూ...ఇది కేవలం సేవా కార్యమని, ప్రతి నెల చివరి వారంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతూ ఉంటామన్నారు. శుభ్రత ప్రతి మానవుని జీవితంలో ఒక భాగమని, శుభ్రతగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పూజారి అంజినప్ప, నాగరాజు, సంతోష్, ప్రకాశ్, దిలీప్, ముద్దుకృష్ణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీ.. బైకిస్టు మృతి

మైసూరు: లారీ ఢీకొని బైకిస్టు మృతి చెందిన ఘటన మైసూరు నగరంలో జరిగింది. నజర్‌బాద్‌కు చెందిన మహ్మద్ ఫరాన్ (20), మరో వ్యక్తి బైక్‌లో ఉన్నతి నగర వద్ద వెళ్తుండగా బైక్ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. అదే రోడ్డులో వచ్చిన లారీ ఫరాన్ తలపై దూసుకెళ్లింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఎన్ఆర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

వ్యసనాలకు దూరంగా ఉండాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తుమకూరు: వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుందని పీయూ విద్యాశాఖ సబ్‌డైరెక్టర్ గంగాధర్ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ పీయూ కాలేజీలో శివమయోగి జన్మదినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మత్తు పదార్థాలకు అలవడితే విచక్షణ కోల్పోతారని, వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 9న లోక్ అదాలత్

మండ్య: మండ్య జిల్లాలో సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవల ప్రాధికార సభ్య కార్యదర్శి వాణి ఎ.శెట్టి తెలిపారు. ఈ క్రమంలో మండ్య జిల్లాలోని సహ లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై ఇరుపక్షాలను పిలిపించుకుని మాట్లాడి రాజీ ద్వారా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

విజేతలకు అభినందనలు


ఎన్నికైన వారితో మాజీ ఎమ్మెల్యే శివశంకరరెడ్డి తదితరులు

గౌరిబిదనూరు: తాలూకా మేళ్య గ్రామ పంచాయతీకి రెండో అవధికి అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపొందారు. అధ్యక్ష స్థానానికి పోటీ చేసిన రత్నమ్మ 11 ఓట్లతో విజయం సాధించగా ప్రత్యర్థి తిమ్మక్కకు ఐదు ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన రామలక్ష్మమ్మకు 11 ఓట్లు రాగా ప్రత్యర్థి గంగాధరయ్యకు 5 ఓట్లు మాత్రం వచ్చినట్లు ఎన్నికల అధికారి మంజునాథ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం విజేతలను ఎమ్మెల్యే శివశంకరరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు మరచిపోతున్నాము


సంఘ సేవకులకు సన్మానం

మండ్య: సాంకేతిక యుగంలో వేగంగా అన్నింటిని సాధించుకుంటూనే నైతిక విలువలను పోగొట్టుకుంటున్నామని జిల్లాధికారి డాక్టర్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ వికాస చారిటబుల్ ట్రస్టు, వివిధ సంఘాల సహభాగస్వామ్యంతో బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో కార్గిల్ విజయోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ రక్తదానం, నేత్రదాన శిబిరాన్ని ప్రారంభించి జిల్లాధికారి మాట్లాడారు. యువత లో ధీరత్వ లక్షణాలను పెంపొందించాలని, సైనికుల త్యాగాలను గుర్తు చేస్తూ పెంచాలన్నారు. ఈ సందర్భంగా సంఘ సేవకులను సన్మానించారు.

అద్భుతం కొడచాద్రి ట్రెక్కింగ్

- అందమైన జలపాతాలు
- మైమరిపించే ప్రకృతి సోయగాలు

బనశంకరి: కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలోని కొడచాద్రి అద్భుతమైన ట్రెక్కింగ్‌కు ఖ్యాతి ఘడించింది. ఇక్కడ ప్రసిద్ధిచెందిన మూకాంబికా ఆలయం ఉన్న కొల్లూరు నుంచి 20 కిలోమీటర్లు దూరంలో ఉంది. ఈ ప్రాంతం చుట్టూ అందమైన పచ్చని చెట్లుతో ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఇక్కడకు సెప్టెంబరు నుంచి ఫిబ్రవరి వరకు ట్రెక్కింగ్‌కు ఉత్తమ సమయం. ఈ సీజన్‌లో ట్రెక్కింగ్ కేవలం వాతావరణం ఆహ్లాదకరంగా ఉండటమే కాకుండా అనుకూలంగా సురక్షితంగా ఉంటుంది. 15 కిలోమీటర్లు దూరంలో గల బేస్ నుంచి మొత్తం కాలిబాట గుండా ట్రెక్కింగ్ చేయవచ్చు. లేదంటే జీపులో అనుకూలమైన ప్రాంతానికి వెళ్లి అక్కడ నుంచి ట్రెక్కింగ్ చేయడానికి అవకాశం ఉంటుంది. కర్ణాటక ప్రభుత్వం వారసత్వ ప్రదేశంగా ప్రకటించిన కొడచాద్రి ట్రెక్ దేశంలోనే అత్యుత్తమ ట్రెక్‌లతో ఒకటిగా పేరుపొందింది. ట్రెక్కింగ్ సమయంలో అత్యుత్తమ వృక్షజాలం, జంతుజాలంతో ప్రకృతి అందాలను దగ్గరగా చూసే అవకాశం కలుగుతుంది. పర్వతశిఖరాల సోయగాలు పర్యాటకులను మరో ప్రపంచపు వీధుల్లో విహరించే అనుభవాన్ని కలిగిస్తాయి. ట్రెక్కింగ్ పరంగా ఈ ప్రాంతాన్ని రెండు మార్గాల ద్వారా చేరుకోవచ్చు. నిటారుగా ఉండే ట్రయల్స్‌ను ఎంపిక చేసుకోవడం కాస్త కష్టమైన ట్రెక్ అని చెప్పాలి. ఈ ప్రక్రియలో హిడ్లుమనే జలపాతాన్ని చూసే అవకాశం ఉంటుంది. ఎంతో అందంగా సహజసిద్ధంగా తారసపడే ఈ జలపాతం ప్రమాదకరమైంది. చాలామంది పర్యాటకులు నాగోడి లేదా నిట్టూరు సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న హోమ్‌స్టేలో విడిది చేసేందుకు మొగ్గు చూపుతారు. ఇది వర్షాకాలంలో కొడచాద్రి ట్రెక్ చేయడానికి మరియు చుట్టుపక్కల ప్రదేశాలను అన్వేషించడానికి చాలా సులభంగా ఉంటుంది. జీపు తీసుకుని చివరి ఐదుకిలోమీటర్లు ట్రెక్కింగ్ చేయాలనుకునేవారు తప్పనిసరిగా గైడ్ సాయం తీసుకోవాలి. అక్కడ పరిసరాలపై పూర్తి అవగాహన ఉన్న అనుభవజ్ఞులైన గైడ్‌లు నిత్యం అందుబాటులో ఉంటారు. ఈ ట్రెక్‌ను విజయవంతంగా పూర్తిచే యాలనుకుంటే వీరిసహాయం తప్పక అవసరం ఉంటుంది.


హోరెత్తించే గర్జనతో కిందకు దుముకుతున్న హిడ్లుమనే జలపాతం


ప్రసిద్ధి కొల్లూరు మూకాంబిక ఆలయం

కొడచాద్రి చేరుకోవడానికి ఉత్తమమార్గం

కొడచాద్రి చేరుకోవడానికి సులభతరమైన ఉత్తమమార్గం బెంగళూరు అక్కడ నుంచి నిట్టూరు వరకు క్యాబ్‌ను అద్దెకు తీసుకుని అక్కడ విడిచి చేసి మరుసటిరోజు కొడచాద్రి ట్రెక్‌ను ప్రారంభించవచ్చు. కుందాపుర రైల్వేస్టేషన్ వరకు రైలులో ప్రయాణించి నిట్టూరు వరకు క్యాబ్‌లో ప్రయాణించవచ్చు. విమానాశ్రయం నుంచి సుమారు 2 గంటల 30 నిమిషాల పడుతుంది. కుందాపుర రైల్వేస్టేషన్ నుంచి సుమారు 7 గంటలు సమయం పడుతుంది.



పర్యాటకులను ఆకట్టుకునే పచ్చిక బయళ్లు, ప్రకృతి అందాల మధ్య ట్రెక్కింగ్ చేస్తున్న పర్యాటకులు

కేఎంఎఫ్ నందిని రాయబారిగా శివు

శివాజీనగర: కర్ణాటక పాల సమాఖ్య (కేఎంఎఫ్) నందిని బ్రాండ్ రాయబారిగా ప్రముఖ నటుడు శివ రాజ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో కేఎంఎఫ్ అధ్యక్షుడు ఎస్.భీమానాయక్ శివును కలిసి చర్చించారు. నందిని బ్రాండ్‌కు రాయబారి కావాలని కేఎంఎఫ్ కోరగా ఆయన ఆమోదించారు.

ఒకే కుటుంబంలో ముగ్గురు

ఇంతకు ముందు కన్నడ కంఠీరవుడు డాక్టర్ రాజ్‌కుమార్ కూడా నందినికి బ్రాండ్ అంబాసిడర్ అయ్యారు. ఆ తరువాత పునీత్ రాజ్‌కుమార్ ఆ హోదాలో ఉన్నారు. ఇప్పుడు శివు కూడా ఆ హోదాను చేపట్టారు.

కేఎస్ ఆర్టీసీ దేశంలోనే ముందంజ

బనశంకరి: కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ దేశంలోనే ముందంజలో ఉండటం గర్వకారణంగా ఉందని రవాణా శాఖమంత్రి రామలింగారెడ్డి తెలిపారు. మంగళవారం బెంగళూరు కేంద్ర విభాగం ఆవరణలో రోడ్డు రవాణా సంస్థ 62వ సంస్థాపనా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో మంత్రి రామలింగారెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రయాణికులకు సమర్థవంతమైన సేవలను అందిస్తున్నామని, ఈ సందర్భంగా ఆయన కారుణ్య నియామకాలు, వాహనాల పునఃశ్చేతన, రవాణామిత్ర పథకాలను ప్రారంభించారు. ప్రమాదరహిత డ్రైవర్లకు వెండిపతకాలను మంత్రి ప్రదానం చేసి సన్మానించారు.

నమ్మి చోటిస్తే ప్రాణమే తీశాడు

- వలస కూలీని చంపిన బంధువు


నిందితుడు సుబోధ్, హతుడు సందీప్

దొడ్డబళ్లాపురం: బంధువు కదా అని నమ్మి గదిలో చోటిస్తే ఏకంగా ప్రాణాలే తీశాడు. తన భార్యతో ఎందుకు ఫోన్‌లో మాట్లాడుతున్నావని ప్రశ్నించినందుకు హత్య చేసిన ఘటన చిక్కజాల పరిధిలో జరిగింది. సందీప్ (40) హత్యకు గురైన వ్యక్తి కాగా నిందితుడు అతని చిన్నాన్న కుమారుడు సుబోధ్ మండల్ (30).

నిద్రపోయాక కత్తితో దాడి : బిహార్‌కు చెందిన సందీప్ కొన్ని సంవత్సరాల క్రితం బెంగళూరుకు వచ్చి కూలిపని చేసుకుంటున్నాడు. చిక్కజాలలో స్నేహితులతో కలిసి ఒక గదిలో ఉంటున్నాడు. 3 నెలల క్రితం సుబోధ్ కూడా బెంగళూరుకు వచ్చి సందీప్ గదిలో ఉంటున్నాడు. అయితే అతడు సందీప్ భార్యతో ఎక్కువగా ఫోన్లో మాట్లాడేవాడు. గత శుక్రవారం రాత్రి మద్యం తాగుతుండగా సందీప్ ఈ విషయమై సుబోధ్‌ను ప్రశ్నించడంతో గొడవ పడ్డారు. కాసేపటికి సందీప్ పడుకున్నాక సుబోధ్ కత్తితో అతని పొడిచి హత్య చేసి పరారయ్యాడు. మరుసటిరోజు హత్య వెలుగు చూసింది. సుబోధ్‌ను మంగళవారం అరెస్టు చేసారు.

విక్కీరై పై ఎఫ్ఐఆర్ నమోదు

శివాజీనగర: అల్లర్ల కేసుకు సంబంధించి మాజీ డాన్ ముత్తప్ప రై కుమారుడు రిక్కీ రైపై కేసు నమోదైంది. 2 నెలల క్రితం రిచ్మండ్ రోడ్డు ఓ హోటల్‌లో గొడవ జరిగింది. ఈ విషయంపై 8వ ఏసీఎంఎం కోర్టు ఆదేశాల మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రిచ్మండ్ రోడ్డులోని హోటల్‌లో గొడవ జరగ్గా రిక్కి రై, అనుచరులు అసభ్య పదజాలంతో దూషించి శ్రీనివాస్ నాయుడు అనే వ్యక్తిపై దాడి చేశారనే ఆరోపణ వినిపించింది. ఆ తరువాత రిక్కీ రై సన్నిహితుడు న్యాయవాది నారాయణస్వామిచే శ్రీనివాస్ నాయుడును బెదిరింపులకు దిగారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే హత్య చేస్తామని భయపెట్టారు. ఈ విషయమై ఎఫ్ఐఆర్ నమోదైంది.

మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారం

మైసూరు: ఇంట్లో ఒంటరిగా ఉన్న బుద్ధిమాంద్యం కలిగిన యువతిపై ఒక యువకుడు అత్యాచారం చేశాడు. ఈ ఘటన నంజనగూడు తాలూకా మాద్రళ్లి గ్రామంలో జరిగింది. ఈ ఘటన అనంతరం నిందితుడు గిరీశ్ పరారీ అయ్యాడు. బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. తండ్రి లేని ఆ యువతి తల్లి సమక్షంలో ఉంది. తల్లి కూలి పనులకు వెళ్లిన సందర్భంలో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసుకుని గిరీశ్ ఆ యువతిపై అత్యాచారం చేశాడు. తల్లి ఇంటికి చేరుకునే సమాయానికి అక్కడి నుంచి పరారయ్యాడు.

లారీని ఢీకొన్న బస్సు, నలుగురికి గాయాలు

తుమకూరు: లారీని వెనుక నుంచి ప్రైవేటు బస్సు ఢీకొట్టిన ఘటనలో బస్సులోని నలుగురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన తుమకూరు జిల్లా శిరా తాలూకా చిక్కళ్లి వద్ద జరిగింది. పుణే వైపు వెళుతున్న లారీని బెంగళూరు నుంచి కలబురిగి వైపునకు వెళుతున్న బస్సు ఢీ కొట్టింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. కళ్లంబెళ్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధుడిని రక్షించిన పోలీసులు

మైసూరు: కావేరి నదిలో దూకడానికి యత్నించిన వృద్ధుడిని పోలీసులు రక్షించారు. ఈ ఘటన టి.నరసీపురలో జరిగింది. 70 ఏళ్ల వృద్ధుడు టీ.నరసీపురలో కావేరి నదిలో దూకడానికి యత్నిస్తున్నాడని పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని వృద్ధుడిని రక్షించి వివరాలు సేకరించారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు వృద్ధుడు వాపోయాడు. అతన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విశ్రాంత జవాన్ అరెస్ట్

యశవంతపుర: మహిళా కానిస్టేబుల్‌ను వేధిస్తున్న విశ్రాంత జవాన్‌ను దక్షిణ కన్నడ జిల్లా ఉళ్లాల పోలీసులు అరెస్ట్ చేశారు. కోల్య కనీరుతోట నివాసి ప్రశాంత్ (45) మహిళా కానిస్టేబుల్‌ను అడ్డగించి వేధింపులకు దిగాడు. స్థానికులు అక్కడికి చేరుకుని ప్రశాంత్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

వారికి న్యాయం జరిగే వరకు ధర్మస్థల వెళ్లను

యశవంతపుర: ధర్మస్థలలో విద్యార్థిని సౌజన్య హత్యకు సంబంధించి శాండిల్‌వుడ్ నటుడు దునియా విజయ్ స్పందించారు. సౌజన్య హత్యపై అసంతృప్తి వ్యక్తం చేయటంతో పాటు ఇకపై ధర్మస్థల వెళ్లను, మంజునాథస్వామిని దర్శించుకోనని ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఏటా తను ధర్మస్థల మంజునాథస్వామిని దర్శించుకునేవాడినని, సౌజన్య హత్య తరువాత ఆమె కుటుంబానికి న్యాయం జరిగే వరకు ధర్మస్థల స్వామిని దర్శించుకోకూడదని నిర్ణయించినట్లు ట్విటర్‌లో తెలిపారు. సత్యం అనేది సూర్యుడు వెలుగులాంటిదని, ఎవరూ మాయం చేయటానికి సాధ్యం కాదన్నారు.

మూడున్నరేళ్ల కారాగారం


రాజిక్ (ఫైల్)

యశవంతపుర: 11 ఏళ్ల క్రితం మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో కోర్టు దోషికి శిక్ష విధించింది. 2012లో కడబ తాలూకాకు చెందిన రాజిక్ అనే వ్యక్తి ఒక బాలికపై అత్యాచారానికి పాల్పడాడు. తరువాత జైలుకెళ్లి బెయిల్‌పై విడుదలై కోర్టు విచారణకు రాకుండా తిరుగుతున్నాడు. నిందితునిపై వారంట్ జారీ అయ్యింది. నాలుగు నెలల క్రితం రాజిక్ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచి జైలుకు తరలించారు. కేసును విచారించిన పుత్తూరు కోర్టు జడ్జి యోగేంద్రశెట్టి నేరం జరిగినట్లు నిర్ధారించి దోషి రాజిక్‌కు మూడున్నరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

టమాటా దొంగ అరెస్ట్

బెళగావి జిల్లా రాయభాగ తాలూకాలో టమాటాలు చోరీ చేస్తున్న వ్యక్తిని స్థానిక రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సిద్దాపురకు చెందిన భుజప్ప తాలూకాలోని యల్పారట్టి గ్రామానికి చెందిన రైతు పొలంలో టమాటాలను కోస్తుండగా స్థానిక రైతులు గుర్తించి భుజప్పను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

ఖతర్నాక్ గ్యాంగ్ అరెస్ట్



బనశంకరి: న్యూస్‌చానల్ పేరుతో పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను బెదిరించి దోపిడీకి పాల్పడుతున్న ఖతర్నాక్ గ్యాంగ్‌ను మంగళవారం సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆత్మానంద, కేశవమూర్తి, ఆనంద్ అనే ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.13 వేల నగదు, మొబైల్స్ స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నామని సీసీబీ జాయింట్ పోలీస్ కమిషనర్ ఎస్‌డీ శరణప్ప తెలిపారు. ముగ్గురు రిపోర్టర్లు అని చెబుతూ పారిశ్రామికవేత్తలు, వ్యాపారులకు వ్యతిరేకంగా న్యూస్ ప్రచారం చేసి పోలీసులకు చెప్పి క్రిమినల్ కేసు పెడతామని బెదిరించి లక్షలాది రూపాయలు వసూలు చేశారు. కేసు విచారణ చేపట్టిన సీసీబీ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

నిధులు విడుదల చేయండి

మండ్య: వ్యవసాయ పథకాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శోభకరంద్లాజేను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎన్.చెలువరాయస్వామి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ వర్సిటీల్లో బోధన సిబ్బందికి యూజీసీ ఏడో వేతన సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రం వాటా కింద 50 శాతం కేటాయింపులను రాష్ట్ర సర్కారు విడుదల చేసిందని, అలాగే కేంద్రం వాటా 50 శాతం నిధులు కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని మంత్రి చెలువరాయస్వామి కలుసుకుని పలు విజ్ఞప్తులు చేశారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పన కోసం రూ. 100 కోట్ల నిధులను విడుదల చేయాలని కోరారు.


కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నదిలో మృతదేహం కలకలం

శివమొగ్గ: సొరబ తాలూకా మూగూరు గ్రామ సమీపంలోని వరదా నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించారు. వారం క్రితం బంకసాణ గ్రామంలో వరదా నదిలో తేలుతూ కొట్టుకుపోతున్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ప్రస్తుతం మూగూరు గ్రామ సమీపంలో మరో మృతదేహాన్ని గుర్తించారు. అయితే గత వారం గుర్తించిన మృతదేహం ఇదేనా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇటీవల వరదల్లో కొట్టుకుపోయినవారివే కాచవ్చని అనుమానాలున్నాయి. నదిలో శవాలు కొట్టుకువస్తుండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

ప్రభుత్వ స్థలంలో మొక్కల పెరికివేత

శివమొగ్గ వినోబానగర లేఔట్ శివాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో నాటిన మొక్కలను కొందరు దుండగులు వేర్లతో సహా పెకిలించివేశారు. ఈ ఘటనను ఖండిస్తూ స్నేహజీవి స్నేహితుల బృందం వినోబనగర పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. శివాలయం పక్కనే ఉన్న స్థలంలో స్మార్ట్ సిటీలో భాగంగా 130 మొక్కలను నాటారు. అయితే ప్రభుత్వ స్థలాన్ని కబళించేందుకు కొందరు దుండగులు ఇలా మొక్కలను పెరికివేసి ఉంటారని అనుమానిస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

హోసూరు వార్తలు..

మహిళలపై దాడి.. నలుగురు అరెస్ట్

కెలమంగలం: బాలిక కిడ్నాప్‌పై నిలదీసిన మహిళలపై దాడి చేసిన నలుగురిని కెలమంగలం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని బోడిచిపల్లి గ్రామానికి చెందిన ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి లక్ష్మణన్(24), తమ్ముడు కేశవమూర్తి (22)లు అదే ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలికను కిడ్నాప్ చేశారు. ఈ ఘటనపై హోసూరు మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఈ నేపథ్యంలో బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు లక్ష్మణన్, కేశవమూర్తిలను నిలదీశారు. ఈ సమయంలో వారి మధ్య గొడవ జరిగింది. ఆవేశం చెందిన బాలిక బంధువులు లక్ష్మణన్ సోదరి సుజాత, భార్య శ్వేతలపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వారిని డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కెలమంగలం పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు.

కామాంధునికి 20 ఏళ్ల జైలుశిక్ష

హోసూరు: పెళ్లి చేసుకొంటానని ఆశ చూపి బాలికను నమ్మించి కిడ్నాప్ చేసి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడిన కామ పిశాచికి క్రిష్ణగిరి మహిళా కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా కావేరిపట్టణం సమీపంలోని సలసానపట్టి గ్రామానికి చెందిన ప్రభు (29). అదే ప్రాంతానికి చెందిన 15 ఏళ్ల బాలికను ప్రేమిస్తున్నట్లు నటించి ఆమెను కిడ్నాప్ చేసి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు 2021 అక్టోబరు 21వ తేదీన పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితున్ని అరెస్ట్ చేసి అతనిపై పోక్సో కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. ఈ కేసు క్రిష్ణగిరి మహిళా కోర్టులో జరుగుతూ వచ్చింది. సోమవారం సాయంత్రం కేసు తుది విచారణ జరిపిన న్యాయమూర్తి ఉమాదేవి పై మేరకు తీర్పునిచ్చారు.

అధ్యక్షుని కుటుంబానికి సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

కెలమంగలం: గత ఏడాది దారుణ హత్యకు గురైన తళి సమితిలోని దారవేంద్రం పంచాయతీ అధ్యక్షుడు మూర్తి మొదటి వర్ధంతిని పురస్కరించుకొని తళి సమితి గ్రామపంచాయతీ అధ్యక్షుల సంఘం ద్వారా మంగళవారం ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. సంఘం సభ్యులు ఆయన సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ. 1.50 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

టపాసుల గోదాము పేలుడుకు కారణమేది?

- జిల్లా అధికారుల విచారణ

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి పాతపేటలోని టపాకాయల గోడౌన్ పేలుడుపై ప్రత్యేక అధికారులు విచారణ జరుపుతున్నారు. గత నెల 29వ తేదీ ఉదయం జరిగిన ఈ ఘటనలో ముగ్గురు మహిళలతో పాటు 8 మంది ఘటనా స్థలంలోనే మృతి చెందగా మరొకరు ఆస్పత్రిలో కన్నుమూశారు. గ్యాస్ సిలిండర్ పేలడంతో టపాసుల పేలుడు జరిగిందని వేలిముద్ర నిపుణులు సమాచారం అందజేసినట్లు తమిళనాడు ఆహారభద్రతా శాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. పార్లమెంట్ సమావేశంలో రాజ్యసభ ఎంపీ తంబిదురై ప్రశ్నకు ఇంధన శాఖ మంత్రి మాట్లాడుతూ టపాసులు పేలడం వల్లే ప్రమాదం సంభవించిందని సమాధానమిచ్చారు.

అదనపు రెవెన్యూ అధికారి నేతృత్వంలో


పేలుడులో ధ్వంసమైన చుట్టుపక్కల ఇల్లు

ఈ నేపథ్యంలో ప్రమాదానికి సరైన కారణం ఏది అని కనుగొనేందుకు కలెక్టర్ శరయు ప్రత్యేక అధికార్ల బృందాన్ని నియమించారు. జిల్లా అదనపు రెవెన్యూ అధికారి భవనంతి నేతృత్వంలో అధికారులు విచారణ జరుపుతున్నారు. విచారణ పూర్తి చేసిన తర్వాత ఆధార పూర్వకంగా కలెక్టర్‌కు అప్పగించనున్నట్లు ప్రత్యేక బృందం తెలిపింది.

హొగేనకల్‌లో పడవ ప్రయాణాలకు అనుమతి


హొగేనక్కల్ వద్ద ప్రవహిస్తున్న కావేరి నది

హోసూరు: గత కొద్ది రోజులుగా కావేరి పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో కర్ణాటకలోని కృష్ణరాజసాగర్, కబిని డ్యాంల నుంచి 22,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేసింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరద నీటి ఉధృతి తగ్గింది. మంగళవారం హొగేనక్కల్ వద్ద ప్రవహిస్తున్న కావేరి నదిలో ఆరు ఘనపు అడుగులకు చేరుకోవడంతో పర్యాటకులు నదిలో స్నానం చేసేందుకు, పడవ ప్రయాణాలకు అనుమతినిచ్చింది. కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా నదిలో నీటి ఉధృతి పెరగడంతో హొగేనకల్ వద్ద పర్యాటకులు స్నానాలు చేసేందుకు, పడవ ప్రయాణాలకు అనుమతి రద్దు చేసిన విషయం తెల్సిందే. తాజాగా నీటి ఉధృతి తగ్గడంతో పర్యాటకులకు అనుమతినిచ్చింది.

విద్యార్థిని ఆత్మహత్య

హోసూరు: ప్రియుడితో గొడవపడి ఇంజనీరింగ్ విద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన హడ్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... మధురై జిల్లా కే.పుదూర్ సమీపంలోని మస్ మలై మేడు ప్రాంతానికి చెందిన పీటర్‌బాబు కూతురు ప్లసింగ్‌జెఫా (19) హోసూరు సమీపంలోని ప్రైవేట్ కళాశాల హాస్టల్లో ఉంటూ ఇంజనీరింగ్ చదువుతోంది. బంధువైన ఓ యువకుడిని ప్రేమించింది. సోమవారం ఫోన్‌లో మాట్లాడుతుండగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ప్లసింగ్‌జెఫా ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

పిలిపించి హత్య

బనశంకరి: వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈఘటన సర్జాపుర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అనేకల్‌కు చెందిన మహమ్మద్ సలీం (45) హత్యకు గురైన వ్యక్తి. ఇతని భార్యకు చరణ్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది. సోమవారం రాత్రి చరణ్ పుట్టినరోజు అని చెప్పి మహమ్మద్ సలీంను పిలిపించారు. అనంతరం నిర్జీన ప్రదేశంలో చరణ్, నారాయణప్ప, మహమ్మద్ సలీం ముగ్గురు మందు పార్టీ చేసుకున్నారు. అనంతరం ఇటుకతో మహమ్మద్ సలీంను ఇద్దరు కలిసి హత్య చేశారు. సలీం కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు నారాయణప్పను విచారించారు. ఈ సమయంలో హత్య జరిగిన స్థలానికి నారాయణప్ప వెళ్లి ద్విచక్ర వాహనంలో సలీం మృతదేహాన్ని తీసుకొచ్చాడు. మృతదేహాన్ని పరిశీలించిన కుటుంబ సభ్యులు హత్యగా తేల్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చరణ్, నారాయణప్పను అరెస్ట్ విచారణ చేస్తున్నారు.

సిలిండర్ పేలి పశువులు మృతి

యశవంతపుర: గ్యాస్ లీకై పేలుడు జరగడంతో పశువుల దొడ్డిలోని రెండు ఆవులు మృతి చెందిన ఘటన మంగళవారం చిక్కమగళూరు జిల్లా అజ్జంపుర తాలూకా శివని సమీపంలోని బాణూరు గ్రామంలో జరిగింది. తక్షణం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయటంతో పెద్ద ప్రమాదం తప్పింది. రెండు ఇళ్లు దెబ్బతిన్నాయి. ఇంటిలోని వారు ప్రాణాలతో బయటపడ్డారు.

నగరంలో క్యాన్సర్ డే వాకథాన్

బనశంకరి: ప్రపంచ శ్వాసకోశ క్యాన్సర్ డే సందర్భంగా వాకథాన్ నిర్వహించారు. మంగళవారం నాగరబావిలో లయన్స్‌క్లబ్, కేటీపీఏ, మహారాణి క్లస్టర్ యూనివర్సిటీ, ఎస్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ శ్వాసకోశ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా బలంగా నడవండి, స్వేచ్ఛగా ఊపిరి పీల్చండి, అధిక కాలం జీవించండి అనే నినాదంతో జాగృతి వాకథాన్ నిర్వహించారు. డాక్టర్ తేజస్విని పార్థసారథి, కన్నడ నటి గిరిజా లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బ్యాంకు గ్యారెంటీలు తిరిగి ఇచ్చేయాలి

- భారతి సిమెంట్స్‌పై కేసులో ఈడీకి సుప్రీంకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: భారతి సిమెంట్స్ బ్యాంకు గ్యారెంటీలు వెంటనే తిరిగిచ్చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ సంజయ్ కరోల్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. భారతి సిమెంట్స్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉపసంహరించుకున్నారా అని ధర్మాసనం ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజును ప్రశ్నించింది. ఈ విషయాన్ని మరోసారి సరిచూసు కోవాలని రాజు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ధర్మాసనం గుర్తుచేసింది. ఎఫ్‌డీలు ఎన్‌క్యాష్ చేసుకున్నారని భారతి సిమెంట్స్ తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు. దీంతో బ్యాంకు గ్యారెంటీలు తిరిగి ఇస్తామని రాజు తెలిపారు. అనంతరం బ్యాంకు గ్యారెంటీలు ఈడీ రిటర్న్ చేయాలని ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఎన్‌క్యాష్ చేసుకున్నందున వాటిని తిరిగి ఇవ్వడం సాధ్యం కాకపోవడంతో, ఆ మేరకు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

విజయవంతంగా ముగిసిన హజ్ యాత్ర

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో చేపట్టిన ఏర్పాట్ల నేపథ్యంలో ఈ ఏడాది హజ్ యాత్ర విజయవంతంగా ముగిసింది. ఈ ఏడాది తొలిసారిగా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌నుంచి రాష్ట్రానికి చెందిన హాజీలు యాత్రకు వెళ్లిన సంగతి తెలిసిందే. రాష్ట్రం నుంచి వెళ్లిన చివరి బృందంలోని హాజీలు మంగళవారం తిరిగి వచ్చారు. గన్నవరం విమానాశ్రయంలో హాజీలకు ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్, కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. గౌస్ లాజమ్ మాట్లాడుతూ హజ్ యాత్ర విజయవంతం కావడానికి కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పల్నాడు జిల్లాలో లోకేశ్ పాదయాత్ర

- తొలి రోజు స్పందన అంతంతమాత్రమే...



సాక్షి, నరసరావుపేట: యువగళం పేరుతో టీడీపీ నాయకుడు లోకేశ్ చేపట్టిన పాదయాత్ర మంగళవారం వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం ముప్పరాజువారిపాలెం వద్ద పల్నాడు జిల్లాలోకి ప్రవేశించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన నేతలు, కార్యకర్తలు స్వాగతం పలికారు. తొలి రోజు పాదయాత్రలో భారీగా జనాన్ని చూపించేందుకు టీడీపీ నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 17 నియోజకవర్గాల నేతలు విధిగా తమతో కొందరిని పాదయాత్రకు తీసుకురావాలని టీడీపీ పెద్దల నుంచి ఆదేశాలు అందినా, ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి తరలించిన కొద్దిమంది జనాలతోనే లోకేశ్‌కు స్వాగత కార్యక్రమం ముగిసింది. ఆ తర్వాత స్థానిక ప్రజల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో పాదయాత్ర వెలవెలబోయింది. ముప్పరాజు వారిపాలెం, పుచ్చనూతల, లక్ష్మీపురం, నూజెండ్ల మీదుగా గుర్రపునాయుడు పాలెం వరకు పాదయాత్ర సాగింది. వినుకొండలో బుధవారం బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు అయినా భారీగా జనసమీకరణ చేయాలని మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు లోకేశ్ వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది.


'చంద్రబాబు అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి'

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్ట్, రాజధాని భూములు వంటి అవకాశమున్న ప్రతిదాన్లోను రూ.కోట్లు కొల్లగొట్టిన చంద్రబాబుపై సీబీఐ విచారణ జరిపించాలని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ వరప్రసాదరావు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రాజెక్ట్‌లు, అమరావతి రాజధాని డెవలప్‌మెంట్ పేరుతో తన వాళ్లకు వేలకోట్లు లబ్ధిని చేకూర్చడం ద్వారా చంద్రబాబు పెద్ద ఎత్తున ఆర్థిక ప్రయోజనాలు పొందారన్నారు. పోలవరం ప్రాజెక్ట్‌ను టీడీపీ మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావుకు చెందిన ట్రాన్స్‌స్ట్రాయ్‌కి అప్పగించిన చంద్రబాబు రూ.వందల కోట్లు కొట్టేశారని ఆరోపించారు.

బ్రో.. ఇది పెద్ద స్కామ్.. నిర్మాత ద్వారా పవన్‌కు బాబు ప్యాకేజీ

అమెరికాలో చంద్రబాబు ముఠా డబ్బులు వసూలు చేసింది

- ఆ బ్లాక్‌మనీని వైట్‌మనీగా మార్చి పవన్‌కు ఇచ్చారు.. ఈ విషయాన్ని అంతర్జాతీయ నిఘా సంస్థలకు చెందిన ప్రముఖుడొకరు వ్యాఖ్యానించారు
- బ్రో.. అట్టర్ ఫ్లాప్
- నన్ను కించపరిచేలా ఓ పాత్ర పెట్టిన పవన్‌ది శునకానందం
- ఈ సినిమాకు సోమవారం వచ్చిన వసూళ్లు రూ.2.40 కోట్లే
- పవన్ రెమ్యూనరేషన్ కూడా తిరిగిరాదు
- ఆయన జీవితంపై త్వరలో సినిమా తీస్తాం
- 'నిత్య పెళ్లికొడుకు, పెళ్లిళ్లు–పెటాకులు, తాళి–ఎగతాళి పేర్లు పరిశీలిస్తున్నాం
- మంత్రి అంబటి రాంబాబు



సాక్షి, అమరావతి: తనను కించపరిచేలా బ్రో సినిమాలో ఓ పాత్ర పెట్టి పవన్ కళ్యాణ్ శునకానందం పొందుతున్నారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. బ్రో సినిమా అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. కలెక్షన్లు పెంచుకోవడం కోసమే తన పాత్రపై వివాదం సృష్టిస్తున్నారని ఆరోపించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మంత్రి అంబటి మీడియాతో మాట్లాడారు. బ్రో సినిమా నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌కు అమెరికాలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్నాయన్నారు. చంద్రబాబు ముఠా అమెరికాలో డబ్బులు వసూలు చేసి విశ్వప్రసాద్‌కి ఇస్తే.. ఆ మొత్తాన్ని పవన్ కళ్యాణ్‌కు ప్యాకేజీ రూపంలో అందించారని తీవ్ర విమర్శలు చేశారు. దీనికి ఆధారాలు ఏమిటని ఒక విలేకరి ప్రశ్నించగా.. అంతర్జాతీయ నిఘా సంస్థలకు చెందిన ప్రముఖుడొకరు వ్యాఖ్యానించారని చెప్పారు. తన రెమ్యూనరేషన్ కింద రూ.66 కోట్లు తీసుకున్నారా? లేక రూ.80 కోట్లు తీసుకున్నారా? ఈ మొత్తానికి ఆదాయపన్ను శాఖకు లెక్కలు చెప్పారా? అనేది పవన్ చెప్పాలని డిమాండ్ చేశారు. రెమ్యూనరేషన్ కింద రోజుకు రూ.2 కోట్లు తీసుకున్నారని ఒకరు, 40 రోజులు కాల్షీట్లు ఇచ్చారని ఒకరు, 23 రోజులే ఇచ్చారని ఒకరు చెప్పారని గుర్తు చేశారు. 40 రోజులపాటు కాల్షీట్లు ఇచ్చి ఉంటే పవన్‌కు రూ.80 కోట్లు ముట్టినట్టు స్పష్టంగా తెలుస్తోందన్నారు. నిర్మాత విశ్వప్రసాద్ బ్లాక్ మనీని వైట్‌గా చేసి పవన్‌కు ప్యాకేజీ రూపంలో ఇచ్చారని ఆరోపించారు. ఇది ఒక కుంభకోణమన్నారు. ఇంకా మంత్రి అంబటి రాంబాబు ఏమన్నారంటే..

పవన్ రెమ్యూనరేషన్ కూడా వెనక్కి వచ్చే పరిస్థితి లేదు..

బ్రో సినిమాలో శ్యాంబాబు అని ఒక పాత్రకు పేరు పెట్టి పవన్ కించపరిచి దూషించారు కాబట్టే నేను దీని గురించి మాట్లాడుతున్నా. అంతటితో ఆగకుండా దానిలో నటించిన నటులు ఆ పాత్ర గురించి వివాదాస్పదమయ్యేలా మళ్లీ మళ్లీ మాట్లాడుతున్నారు. బ్రో.. అతిపెద్ద డిజాస్టర్. సోమవారం వరకు రూ.55.26 కోట్ల షేర్ మాత్రమే వసూలు చేసింది. సోమవారం ఒక్క రోజులో వచ్చింది కేవలం రూ.2.40 కోట్లే. ఈ సినిమాకు మొత్తం కలెక్షన్లు రూ.60 – రూ.70 కోట్లు వస్తాయనుకుంటుంటే ఒక్క పవన్ రెమ్యూనరేషనే రూ.50 కోట్లకుపైగా ఉంది. ఈ మొత్తం కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదు.

పవన్‌కు అమ్మవారి శాపం తగిలింది..

పవన్ తన వాహనానికి వారాహి అనే అమ్మవారి పేరు పెట్టారు. దానిపై నుంచి అవాకులుచవాకులు, బూతులు మాట్లాడే ప్రయత్నం చేసినప్పుడే నేను చెప్పా.. పవన్ సినిమాలు ఇక ఆడవని. ఆయనకు అమ్మవారి శాపం తగిలింది. రాజకీయంగానూ ఆయనకు భవిష్యత్తు ఉండదు. తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఇక ఆయన సినిమాలు ఆడవని నిర్మాతలు తెలుసుకుంటే మంచిది. దమ్ముంటే పూర్తి పొలిటికల్ సినిమాలే తీసుకోవచ్చు. శ్యాంబాబు ఎందుకు.. సంబరాల రాంబాబు అని నేరుగా పెట్టుకోవచ్చు. అనవసరంగా ఎవరిని పడితే వారిని కెలకడం సమంజసం కాదని నిర్మాతలు, నటులు, దర్శకులు, త్రివిక్రమ్‌లాంటి రచయితలకు చెబుతున్నా. ఇలా మళ్లీ చేస్తే మీరు మూల్యం చెల్లించుకోవాల్సిన అవసరం ఉంటుందని హెచ్చరిస్తున్నా.

పవన్‌పై సినిమాకు సూచనలు ఇవ్వండి..

పవన్‌పై మేం కూడా ఒక సినిమా తీయాలనుకుంటున్నాం. ఈ కథకు 'నిత్య పెళ్లికొడుకు', 'పెళ్లిళ్లు–పెటాకులు', 'తాళి–ఎగతాళి', 'మూడు ముళ్లు.. ఆరు పెళ్లిళ్లు' 'బ్రో లా బ్రో (మ్యారేజెస్- రిలేషన్స్–అఫెండర్)', 'అయిన పెళ్లిళ్లు ఎన్నో.. పోయిన చెప్పులెన్నో' అనే టైటిల్స్ పరిశీలనలో ఉన్నాయి. పేర్లు, కథలో మార్పులకు సంబంధించి ఎవరైనా సలహాలు సూచనలు ఇవ్వొచ్చు.

మంత్రి అంబటి రాంబాబు పూర్తి ప్రసంగ పాఠం కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగలరు.

తెలంగాణ విద్యుత్ బకాయిలు రూ.6 వేలకోట్లు వసూలు చేస్తాం

- రాజ్యసభలో స్పష్టం చేసిన కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్.కె.సింగ్
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చిన మంత్రి



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.6 వేల కోట్లకుపైగా విద్యుత్ బకాయిలను తెలంగాణ నుంచి వసూలు చేసేందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్.కె.సింగ్ చెప్పారు. ఒక రాష్ట్రం బకాయిలు చెల్లించకుండా మొండికేసిన సందర్భంలో బకాయిల చెల్లింపునకోసం కేంద్రం అనుసరించాల్సిన విధివిధానాలపై న్యాయ, ఆర్థికశాఖలతో చర్చిస్తున్నట్లు తెలిపారు. రాజ్యసభలో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. రాష్ట్ర పన్నుల్లో వాటా కింద తెలంగాణకు ఇచ్చే నిధుల నుంచి ఈ బకాయిల మొత్తాన్ని మినహాయించాలని రిజర్వ్ బ్యాంకును (ఆర్బీఐని) కోరే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు అత్యధికంగా ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వెళ్లాయని చెప్పారు. ఫలితంగా కొత్తగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం తీవ్ర విద్యుత్ కొరతను ఎదుర్కొనడంతో పునర్విభజన చట్టంలో పేర్కొన్న నిబంధనలను అనుసరించి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తెలంగాణకు విద్యుత్ సరఫరా చేయాలని ఏపీని ఆదేశించిందని తెలిపారు. ఏపీ సరఫరా చేసిన విద్యుత్ నిమిత్తం కొంతకాలం సక్రమంగానే చార్జీలను చెల్లించిన తెలంగాణ ప్రభుత్వం.. తరువాత చెల్లింపులు నిలిపివేయడంతో బకాయిలు రూ.6 వేలకోట్లకు పైగా పేరుకుపోయాయని చెప్పారు. బకాయిల చెల్లింపుపై కేంద్ర ప్రభుత్వం ఉభయ రాష్ట్రాల అధికారులతో పలుమార్లు చర్చించిందన్నారు. కేంద్రం ఆదేశాల మేరకే ఏపీ విద్యుత్ సరఫరా చేసినందున తెలంగాణ ప్రభుత్వం బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవలసిన బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వంపైనే ఉందని మంత్రి పేర్కొన్నారు.

కో ఆపరేటివ్ సొసైటీల్లో అవినీతికి చెక్ పెట్టాలి

అవినీతి, అక్రమాల ఊబిలో కూరుకుపోతూ అనేక కో ఆపరేటివ్ సొసైటీలు ఖాయిలా పడుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి చెప్పారు. వీటిని అరికట్టేందుకు చట్టపరంగా పటిష్టమైన చర్యలు తీసుకోకపోతే సహకార స్ఫూర్తికే ముప్పు వాటిల్లుతుందన్నారు. మల్టీ స్టేట్ కో ఆపరేటివ్ సొసైటీల సవరణ బిల్లుపై మంగళవారం రాజ్యసభలో జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేశారు. ఖాయిలా పడిన కో ఆపరేటివ్ సొసైటీలకు పునరుజ్జీవం కల్పించేందుకు కో ఆపరేటివ్ పునరావాస, పునర్నిర్మాణ, అభివృద్ధి నిధి ఏర్పాటు చేయాలని ఈ బిల్లులో ప్రతిపాదించినా.. దీనికోసం బడ్జెట్ గ్రాంట్ చేయడం లేదని చెప్పారు. లాభాల్లో ఉన్న కో ఆపరేటివ్ సొసైటీల లాభాల నుంచి కొంతమొత్తం ఈ నిధికి జమ చేసేలా బిల్లులో నిబంధన రూపొందించారని, ఈ నిధి సక్రమ వినియోగాన్ని పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ఒక పటిష్టమైన యంత్రాంగానికి రూపకల్పన చేయాలని పేర్కొన్నారు. బోర్డును ఏర్పాటు చేసి ఖాయిలా పడిన సొసైటీలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. అర్హతగల సొసైటీలను గుర్తించి వాటికి మాత్రమే ఈ నిధి నుంచి ఆర్థిక సహాయం అందించాలని సూచించారు. సహకార సంఘాలు ఖాయిలా పడటానికి ప్రధాన కారణాలైన రాజకీయ జోక్యం, అవినీతి, అక్రమాలను నిరోధించేలా చర్యలుండాలని ఆయన చెప్పారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

జూన్‌లో 12% పెరిగిన జీఎస్టీ వసూళ్లు

రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: గతేడాది జూన్ జీఎస్టీ వసూళ్లతో పోలిస్తే ఈ ఏడాది జూన్‌లో జీఎస్టీ వసూళ్లు 12 శాతం పెరిగినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. ఈ ఏడాది జూన్‌లో జీఎస్టీ కింద రూ.1,61,497 కోట్లు వసూలైనట్లు చెప్పారు. రాజ్యసభలో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. ఒక్క నెలలో జీఎస్టీ మొత్తం వసూళ్లు రూ.1.6 లక్షల కోట్లు అధిగమించడం జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఇది నాలుగోసారని చెప్పారు. జీఎస్టీ వసూళ్లలో ప్రతి సంవత్సరం సాధిస్తున్న వృద్ధితో అనుకూల ధోరణి కనిపిస్తోందన్నారు. తాత్కాలికంగా అనుమతించిన జీఎస్టీ నష్టపరిహారం కింద మొత్తం సొమ్మును కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు విడుదల చేసిందని, బకాయిలేమీ లేవని చెప్పారు. పార్లమెంటులో చేసిన చట్టానికి లోబడి జీఎస్టీ యాక్ట్ ప్రకారం జీఎస్టీ అమలు చేయడం ద్వారా మొదటి 5 సంవత్సరాలు 2017 జూన్ 1 నుంచి 2022 జూన్ 30 వరకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఏర్పడిన రెవెన్యూ నష్టాలను పూడ్చేందుకు కేంద్రం నష్టపరిహారం చెల్లించిందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నష్టపరిహారం ప్రతి రెండు నెలలకోసారి లెక్కించి విడుదల చేస్తున్నట్లు మంత్రి చెప్పారు.


వ్యవస్థను బలోపేతం చేస్తేనే మీడియేషన్ ద్వారా కేసుల పరిష్కారం: విజయసాయిరెడ్డి

మధ్యవర్తిత్వం (మీడియేషన్)తో కేసులు పరిష్కరించాలంటే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కేంద్రానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి సూచించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కోటికి పైగా కేసులు పరిష్కరించాలంటే ఈ వ్యవస్థను వందరెట్లు బలోపేతం చేయాల్సి ఉంటుందన్నారు. మధ్యవర్తిత్వం బిల్లు–2021పై మంగళవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. దేశంలోని వివిధ కోర్టుల్లో నాలుగున్నర కోట్లకుపైగా కేసులు పెండింగ్‌లో ఉంటే.. అందులో కోటికిపైగా సివిల్ కేసులేనని తెలిపారు. దేశంలో 2022 నాటికి 570 మీడియేషన్ కేంద్రాలు, 16 వేలమంది మీడియేటర్లు ఉన్నారని చెప్పారు. ఈ సివిల్ కేసుల్లో 90 వేల కేసులను మాత్రమే పరిష్కరించగల సామర్థ్యం ప్రస్తుత మీడియేషన్ వ్యవస్థకు ఉందన్నారు. ఈ నేపథ్యంలో బిల్లు చట్టరూపం దాలిస్తే తగినన్ని మీడియేషన్ సెంటర్లు, మీడియేటర్లు లేనందున ఆ వ్యవస్థపై మోయలేనంత భారం పడుతుందన్నారు. వ్యవస్థను వందరెట్లకు పైగా బలోపేతం చేయకపోతే ఈ బిల్లు ప్రయోజనం నెరవేరదని చెప్పారు. కమ్యూనిటీ మీడియేషన్ ఈ బిల్లులోని ప్రధాన అంశాల్లో ఒకటని, సున్నితమైన రాజకీయ అంశాలు ఇమిడి ఉండే కేసుల పరిష్కారం కమ్యూనిటీ మీడియేషన్ ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని చెప్పారు. ఇదే బిల్లుపై వైఎస్సార్‌సీపీ ఎంపీ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రీ లిటిగేషన్ మీడియేషన్ మాండేటరీపై కేంద్రానికి పలు సూచనలు చేశారు. ప్రీ లిటిగేషన్ మీడియేషన్‌కు తగిన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు.



జీవవైవిధ్య పరిరక్షణకు తగినన్ని నిధులేవి?

విస్తారమైన జీవవైవిధ్యం ఉన్న దేశంలో దాని పరిరక్షణకు ఏటా కేంద్ర ప్రభుత్వం రూ.7 కోట్లు మాత్రమే కేటాయిస్తోందని విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యసభలో జీవవైవిధ్య సవరణ బిల్లుపై ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా గుర్తించిన 34 జీవవైవిధ్య హాట్‌స్పాట్లలో నాలుగు మనదేశంలో ఉన్నాయని చెప్పారు. ఈ నాలుగు హాట్‌స్పాట్స్‌లో 90 శాతం ప్రాంతం కోల్పోయినట్లుగా డేటా చెబుతోందన్నారు. వీటి పరిరక్షణకు ప్రభుత్వం వెంటనే పూనుకోవాలని కోరారు. ప్రపంచం మొత్తం మీద నమోదైన జీవరాశుల్లో 96 వేల జాతులు భారత్‌లోనే ఉన్నాయని తెలిపారు. 47 వేల వృక్షజాతులు, ప్రపంచంలోకెల్లా సగం నీటి మొక్కలతో భారత్ విలక్షణమైన జీవవైవిధ్యం కలిగి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా లంకమహేశ్వరం వన్యసంరక్షణ కేంద్రం, తిరుమల, సింహాచలం గిరులతోపాటు అనేక ప్రాంతాల్లో రోగచికిత్సకు వినియోగించే అరుదైన మొక్కలున్నాయని చెప్పారు. ఇలాంటి జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవడానికి ప్రభుత్వం తగినన్ని నిధులతో కార్యాచరణ చేపట్టాలని ఆయన కోరారు. ఇదే బిల్లుపై వైఎస్సార్‌సీపీ ఎంపీ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ వాతావరణ మార్పుల తీవ్రత జీవ వైవిధ్యంపై ప్రభావం చూపుతున్నందున ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్ ఆన్ బయోలాజికల్ డైవర్సిటీ (సీబీడీ)లో భాగంగా దేశ అంతర్జాతీయ బాధ్యతల్లో సమన్వయం అవసరమని చెప్పారు. జీవవైవిధ్యం, ప్రయోజనాలు రక్షించడానికి కేంద్రం చొరవ చూపాలన్నారు. బిల్లులో ప్రయోజనం – భాగస్వామ్య నిబంధనలు నిర్ణయించడంలో స్థానిక సంఘాల ప్రత్యక్ష పాత్రను తీసివేయడం సరికాదని చెప్పారు. పరిహారం విషయాల్లో జరిమానా ఎలా అంచనా వేయాలనే దానిపై న్యాయనిర్ణయ అధికారికి మార్గదర్శకత్వం లేకపోవడం సమస్యలకు తావిచ్చేలా ఉందన్నారు. న్యాయమూర్తులు, లేదా కోర్టులకు కాకుండా ప్రభుత్వ అధికారులకు ఆ తరహా అధికారం అవసరమా అనే ప్రశ్న వచ్చే అవకాశం ఉన్నందున బిల్లులో ఆ అంశాన్ని పరిశీలించాలని ఆయన కోరారు.



అటల్ జ్యోతి కింద ఏపీలో 5,500 సోలార్ వీధిలైట్లు

అటల్ జ్యోతి యోజన ఫేజ్–2 కింద ఆంధ్రప్రదేశ్‌లో యాస్పిరేషనల్ జిల్లాలైన విజయనగరం, విశాఖపట్నాల్లో 5,500 సోలార్ వీధిలైట్లు అమర్చినట్లు కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్.కె.సింగ్ తెలిపారు. విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. అటల్ జ్యోతి పథకం మొదటి ఫేజ్‌లో ఆమోదిత రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ లేదని చెప్పారు. విశాఖపట్నం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు మొత్తం 5,500 సోలార్ వీధిలైట్ల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయగా వాటిని అమర్చినట్లు తెలిపారు.

లోక్‌సభ

గ్రామ సచివాలయాలు విజయవంతం

లోక్‌సభ దృష్టికి తీసుకొచ్చిన వైఎస్సార్‌సీపీ ఎంపీ రెడ్డెప్ప



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో తీసుకొచ్చిన గ్రామ సచివాలయాలు రాష్ట్రంలో విజయవంతంగా పనిచేస్తున్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప చెప్పారు. రిజిస్ట్రేషన్ ఆఫ్ బర్త్స్, డెత్స్ సవరణ బిల్లు–2023పై లోక్‌సభలో మంగళవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు 540కి పైగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. గ్రామ సచివాలయాల అమలు తీరును పలు రాష్ట్రాల ప్రతినిధులు పరిశీలించారని చెప్పడానికి గర్విస్తున్నానన్నారు. బిల్లుకు మద్దతు తెలిపారు. ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసే వైద్యసంస్థలకు బాధ్యతలు జోడించడం సమంజసంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

కడప ఉక్కు పరిశ్రమకు సహకరించండి



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన కడప ఉక్కు పరిశ్రమకు సహకరించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ బి.వి.సత్యవతి కోరారు. ఆఫ్‌షోర్ ఏరియాస్ మినరల్ (డెవలప్‌మెంట్, రెగ్యులేషన్) సవరణ బిల్లుపై లోక్‌సభలో మంగళవారం ఆమె మాట్లాడారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి ఉక్కు పరిశ్రమను వాగ్దానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. రాయలసీమ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న కడప ఉక్కు పరిశ్రమతో స్థానికులకు ఉపాధి లభిస్తుందన్నారు. పరిశ్రమకు ఐరన్ ఓర్ కేటాయించాలని ఆమె కోరారు.

పీకేవీవైలో నిధుల విడుదల



పరంపరాగత్ క్రిషి వికాస్ యోజన (పీకేవీవై)లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని 2,65,000 మంది రైతులకు 2,06,000 హెక్టార్లలో సంప్రదాయ వ్యవసాయం నిమిత్తం రూ.317.21 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. లోక్‌సభలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ తలారి రంగయ్య ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. 14 బీచ్ శాండ్ మినరల్స్‌కు సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ వద్ద పెండింగ్ క్లియర్ చేయాలని కోరారు. ఏపీ సహా పలు ప్రాంతాల్లో గుర్తించిన లిథియం నిల్వల్ని సక్రమంగా వినియోగించుకునేలా దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.

పెరిగిన లబ్ధిదారులు



పీఎం కిసాన్‌సమ్మాన్ నిధిలో భాగంగా తొలి ఇన్‌స్టాల్‌మెంట్ పీరియడ్ (డిసెంబరు 2018–మార్చి 2019)లో 33.16 లక్షలమంది లబ్ధిదారులుండగా 14వ ఇన్‌స్టాల్‌మెంట్ పీరియడ్ (ఏప్రిల్ 2023–జులై 2023) నాటికి 41.33 లక్షలకు చేరారని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఈ పథకంలో భాగంగా లబ్ధిదారులకు కేంద్రం ఏటా రూ.6 వేలు అందజేస్తోందని చెప్పారు.

'జనాభా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి'

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేందుకు అవసరమైన రాజ్యాంగ సవరణ చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి ఢిల్లీలో కేంద్ర పర్యావరణశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి చర్చించారు. కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను బీసీల జనాభా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు.

తక్కువ ధరకే మంచి మద్యం

- నందికొట్కూరు సభలో చంద్రబాబు
- మొక్కుబడిగా ప్రాజెక్టుల బాట మొదటిరోజు
- నిమిషాల వ్యవధిలోనే ముచ్చుమర్రి, బనకచర్ల ఎత్తిపోతల పథకాల పరిశీలన



కర్నూలు (సెంట్రల్)/పాములపాడు: 'మంచి మద్యం.. తక్కువ రేటు' అనేది టీడీపీ ఎన్నికల పాలసీ అని ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రకటించారు. ప్రాజెక్టుల బాటలో భాగంగా మంగళవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. నందికొట్కూరు పటేల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ మద్యం షాపుల్లో ఎందుకు బిల్లులు ఇవ్వడం లేదని, ఎందుకు గూగుల్ పే ద్వారా లావాదేవీలు జరపడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇసుక, మద్యం, ఖనిజ సంపద, గంజాయి ద్వారా వైఎస్సార్‌సీపీ నాయకులు దందా చేస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే వారిపని పడతానని, మురికి కాలువల్లో వేసి తొక్కుతానని తీవ్ర పదజాలంతో దూషించారు. వైఎస్సార్‌సీపీ రైతువ్యతిరేక ప్రభుత్వంగా పనిచేస్తోందన్నారు. నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమకు ఏం చేశారని ప్రశ్నించారు. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని, ఒక్క ఇండస్ట్రీ రాలేదని, ఒక్క రోడ్డు వేయలేదని, ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. ఒక్కరోడ్డు వేయని సీఎం వైఎస్ జగన్ మూడు రాజధానులు కడతారా అని చంద్రబాబు ప్రశ్నించారు. కర్నూలుకు న్యాయ రాజధానిని ఎందుకు తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. 8సార్లు కరెంట్ బిల్లులు పెరిగాయన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో ఓ సైకో అతి చేస్తున్నాడంటూ శాప్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని ఉద్దేశించి పరుష వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు చంద్రబాబు నందికొట్కూరులోని ముచ్చుమర్రి ఇరిగేషన్ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించడం ద్వారా ప్రాజెక్టు బాటను ప్రారంభించారు. మధ్యాహ్నం 3.25 గంటలకు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం పంపుహౌస్ లోపలకు వెళ్లిన ఆయన రెండు నిమిషాలకే బయటకు వచ్చారు. అక్కడ ఏం చూశారో చెప్పలేదు. సాయంత్రం సుమారు 6 గంటలకు పాములపాడు మండలం బనకచర్ల ఎత్తిపోతల పథకాన్ని సందర్శించారు. అక్కడ కూడా పట్టుమని పది నిమిషాలు కూడా ఉండలేదు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా నీటిని తరలిస్తున్నప్పుడు రాయలసీమ ఎత్తిపోతల అనవసరమని అన్నారు. పోతిరెడ్డిపాడు నీటి సామర్థ్యం పెంచుతామని, తెలుగుగంగకు తరలిస్తామని హామీ ఇచ్చిన వైఎస్సార్‌సీపీ దానిని తుంగలో తొక్కిందన్నారు.

ప్రాంతీయ విద్వేషాలకే బాబు యుద్ధభేరి

- రాయలసీమ ద్రోహి బాబు.. ప్రాజెక్టులు దండగ అన్న ఘనుడు
- 14 ఏళ్లు సీఎంగా ఉండి ఒక్క ప్రాజెక్టూ కట్టలేదు.. కుప్పానికే నీళ్లివ్వలేదు
- రైతు రుణమాఫీ దేశ చరిత్రలోనే అతి పెద్ద మోసం
- ప్రజలకు సీఎం జగన్ చేసిన మేలుపై చర్చిద్దాం
- నారావారిపల్లె, కుప్పంలో ఏ గ్రామంలోనైనా సరే.. సిద్ధమా బాబూ?
- వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రాంతాల మధ్య విద్వేషాలకే టీడీపీ అధినేత చంద్రబాబు యుద్ధభేరి కార్యక్రమం చేపట్టారని, ఆయన ఆంధ్రప్రదేశ్ విధ్వంసాన్ని కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, అగ్రిమిషన్ వైస్‌చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటూ.. విజిటింగ్ వీసా మీద ఆంధ్రాకొచ్చి ప్రజలపై యుద్ధభేరి మోగిస్తున్నారన్నారు. ప్రజాసమస్యలపై అసెంబ్లీలో చర్చించే దమ్ములేక వీధిరౌడీలా రోడ్లపై తిరుగుతున్నారని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ చంద్రబాబు చేసిన అతి పెద్ద మోసమని తెలిపారు. దేశ చరిత్రలోనే ఇంతపెద్ద మోసం లేదని చెప్పారు. నాగిరెడ్డి మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు రాయలసీమ ద్రోహి అని, మొదటిసారి ముఖ్యమంత్రి అయిన 28 ఏళ్ల తర్వాత ఆయనకు ఇప్పుడు రాయలసీమ గుర్తుకొచ్చిందని అన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉండి ఒక్క ప్రాజెక్టు కట్టలేదని, సొంత నియోజకవర్గం కుప్పానికే నీళ్లివ్వలేదని, పైగా, సాగునీటి ప్రాజెక్టులు దండగ అన్న ఘనుడని విరుచుకుపడ్డారు. హంద్రీ – నీవాను తాగునీటి ప్రాజెక్టుగా కుదించిన దుర్మార్గుడన్నారు. సీమకు ఐదేళ్లలో బాబు ఇచ్చింది 310 టీఎంసీలేనని, కానీ ఈ నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్ సీమకు 553 టీఎంసీల సాగు నీరిచ్చారని చెప్పారు. కరువు, చంద్రబాబు కవల పిల్లలన్నది తెలుగు ప్రజలందరికీ తెలుసునని ఎద్దేవా చేశారు. ఏటా 300 కరువు మండలాల్ని ప్రకటించిన ఘనచరిత్ర చంద్రబాబుదన్నారు. హంద్రీ–నీవా, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టులు వైఎస్సార్ పుణ్యమేనని తెలిపారు. అక్షరాస్యతలో కుప్పం నియోజకవర్గం, అందులోనూ గుడిపల్లె మండలం చాలా వెనుకబడ్డాయని చెప్పారు. ప్రజలకు సీఎం జగన్ మేలు చేశారో లేదో నారావారిపల్లె, కుప్పంలో బాబు ఎంచుకొన్న ఏ గ్రామాన్నైనా కేస్ స్టడీగా తీసుకుందామని, ఇందుకు చంద్రబాబు సిద్ధమేనా అని సవాల్ చేశారు.

సన్నాఫ్ బాబు తప్ప లోకేశ్ అర్హతేంటి?

- రాజకీయాల్లో కామెడి పీస్ లోకేశ్
- నా కంపెనీల్లో ఉద్యోగులకు జీతాలే నెలకు రూ. 10 కోట్లు ఇస్తున్నా
- వేల కోట్లతో వ్యాపారం చేస్తున్నా.. వందల కోట్లు ట్యాక్స్ కడుతున్నా
- ఆస్తులపై చర్చిద్దాం.. దర్శికి వస్తావా లోకేశ్?
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్



సాక్షి, అమరావతి: సన్నాఫ్ చంద్రబాబు అని చెప్పుకోవడం తప్ప లోకేశ్‌కి ఉన్న రాజకీయ అర్హతేమిటని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ప్రశ్నించారు. రాజకీయాలపై కనీస అవగాహన లేని లోకేశ్ స్థాయికి మించి మాట్లాడటం సరికాదన్నారు. కొడుకును ఎంతగా పైకితేవాలని ప్రయత్నించినా ఆ స్థాయిని అందుకోలేకపోతున్నాడని చంద్రబాబు నిత్యం కుళ్లికుళ్లి ఏడుస్తుంటారని ఎద్దేవా చేశారు. వేణుగోపాల్ మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్ తనయునిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర చరిత్రలోనే 151 స్థానాల్ని గెలుచుకుని సీఎం అయ్యారన్నారు. తండ్రిని మించిన తనయునిగా సుపరిపాలనతో విశేష ప్రజాదరణ పొందుతున్నారని చెప్పారు. లోకేశ్ మాత్రం రాజకీయాల్లో కామెడీ పీస్‌గా మిగిలిపోయారని అన్నారు. తనకు అక్రమ ఆస్తులున్నాయని లోకేశ్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఆయన చెప్పే క్వారీలు, మిగతా ఆస్తులన్నీ ఎప్పటినుంచో తమ కుటుంబానికి ఉన్నవేనన్నారు. 2006లోనే అనేకచోట్ల ఆస్తులున్నాయని, అవన్నీ కష్టార్జితంతో వ్యాపారాలుచేసి సంపాదించుకొన్నవేనని, వాటికి అన్ని ఆధారాలు ఉన్నాయని తెలిపారు. అక్రమంగా ఎక్కడా సెంటు భూమి కూడా ఆక్రమించలేదన్నారు. హైదరాబాద్‌లో రూ.7 కోట్ల విలువైన విల్లా ఉందంటున్నావు కానీ, బెంగళూరులో కూడా రూ.30 కోట్ల విలువైన విల్లా ఉందన్నారు. ప్రకాశం జిల్లాలోని తమ ఇంజినీరింగ్ కాలేజీలో 6 వేలమంది చదువుతున్నారని, ఏటా ప్రతిభ గలిగిన పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్నామని చెప్పారు. తమ కంపెనీల్లో 4 వేలమంది ఉద్యోగులున్నారని, వారికి జీతాల కింద నెలకు రూ.10 కోట్లు ఇస్తున్నానని చెప్పారు. వేలకోట్లతో వ్యాపారం చేస్తున్నానని, వందలకోట్లు ట్యాక్స్ కడుతున్నానని చెప్పారు. లోకేశ్‌లా చిల్లర డబ్బుకు కక్కుర్తిపడే వాడిని కాదన్నారు. తమ ఆస్తులపై చర్చకు వస్తానని, లోకేశ్ దర్శికి వస్తారా అని సవాల్ చేశారు. టీడీపీ హయాంలో కనీస అభివృద్ధికి నోచుకోని దర్శి నియోజకవర్గాన్ని తనహయాంలో వందలకోట్లు వెచ్చించి అభివృద్ధి చేశానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తనపై దర్శిలో పోటీ చేసే దమ్ము లోకేశ్‌కు ఉందా అని సవాల్ చేశారు.





శ్రీదేవి ఆశల

అమ్మ చేతి గోరుముద్దకు ఉన్న రుచి చిన్నారులకే తెలుసు. రుచితో పాటు పోషకాలు నిండుగా ఉంటేనే పిల్లలు బలంగా ఎదుగుతారని స్వయంగా వారికి ఇష్టమైన ఆహారాన్ని తయారుచేస్తూ అందిస్తున్నారు తెలంగాణలోని భువనగిరి వాసి శ్రీదేవి ఆశల. హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో చంటిపిల్లల కోసం టమ్మీ ఫ్రెండ్లీ ఫుడ్ తయారుచేస్తూ బిజినెస్ ఉమన్‌గా రాణిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా ఉన్న శ్రీదేవి పిల్లల ఆహారం వైపుగా చేసిన ఆలోచనను ఇలా పంచుకున్నారు.

స్వానుభవమే పెట్టుబడి

శ్రీదేవి సక్సెస్ స్టోరీ

''ఇంజినీరింగ్ పూర్తయ్యాక పెళ్లవడంతోనే ఉద్యోగరీత్యా బెంగళూరుకు వెళ్లిపోయాను. అక్కడి పనివేళలతో పాటు ఉరుకుల పరుగుల మీద ఉండేది జీవితం. వండుకొని తినడానికి టైమ్ ఉండేది కాదు. కెరియర్‌ను దృష్టిలో పెట్టుకొని ఇన్‌స్టంట్, ఫాస్ట్‌ఫుడ్స్ మీద బాగా ఆధారపడేవాళ్లం. కొన్నాళ్లకు నేను ప్రెగ్నెంట్ అని తెలిసి చాలా సంతోషించాం. మాకు పుట్టబోయే బిడ్డ కోసం చాలా కలలు కన్నాం. కానీ, అబార్షన్ కావడంతో చాలా బాధ అనిపించింది. మా జీవనశైలి సరిగా లేదని డాక్టర్ చెప్పడంతో ఆలోచనల్లో పడ్డాం.

పరిశోధన అంతా ఇంట్లోనే..

అప్పటి నుంచి సమతుల ఆహారం గురించి తెలుసుకోవడం, పుస్తకాలు చదవడం, ఇంట్లో ప్లాన్ చేసుకోవడం .. ఇది కూడా ఒక ప్రాజెక్ట్ వర్క్‌లా చేశాం. సేంద్రీయ ఉత్పత్తులకు పూర్తిగా మారిపోయాం. దీంతో పాటు గర్భవతులకు, చంటిపిల్లలకు కావాల్సిన పోషకాహారం ఇంట్లోనే తయారు చేయడం మొదలుపెట్టాం. బయట కొన్నవాటిలో కూడా ఏయే పదార్థాలలో ఎంత పోషకాహార సమాచారం ఉంటుందో చెక్ చేయడం అలవాటుగా చేసుకున్నాను.

అడిగినవారికి తయారీ..

మా పెద్దమ్మాయి పుట్టిన తర్వాత పాపకు ఇవ్వాల్సిన బేబీ ఫుడ్‌లో ఉండే రసాయనాల పరిమాణం చెక్ చేసినప్పుడు, చూసి ఆశ్చర్యమనిపించింది. నా పాపకు కెమికల్ ఫుడ్ ఎలా తినిపించాలా అని అనుకున్నాను. అందుకే, పాపకు అవసరమైనవన్నీ ఇంట్లోనే తయారుచేసుకునేదాన్ని. మెటర్నిటీ లీవ్ పూర్తయ్యాక ఆఫీసుకు వెళితే నేను ఫిట్‌గా ఉండటం చూసి, మా ఫ్రెండ్స్ ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నావు అని అడిగేవారు. నేను చెప్పే జాగ్రత్తలు విని, మాకూ అలాంటి ఫుడ్ తయారు చేసిమ్మని అడిగేవారు. చుట్టుపక్కల వాళ్లు అడిగినా చేసిచ్చేదాన్ని చిన్నపాప పుట్టిన తర్వాత పిల్లల పోషకాహారంపై దృష్టి పెట్టడం కొంత కష్టంగానే అనిపించింది. ఓ వైపు ఉద్యోగంలో ప్రయాణాలు కూడా ఉండేవి. పిల్లల పోషకాహారంపై ఆసక్తితో పాటు అనుభవం, న్యూట్రిషనిస్టులు, మెంటార్స్ అందరూ నా జాబితాలో ఉన్నారు. దీనినే బిజినెస్‌గా మార్చుకుంటే



తన టీమ్‌తో శ్రీదేవి



ఎలా వుంటుంది... అనే ఆలోచన వచ్చింది.

వేరే రాష్ట్రం కావడంతో..

సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రిజైన్ చేశాను. నేనూ, మా వారు చిదానందం ఇద్దరం చేసిన పొదుపు మొత్తాలను మేం అనుకున్న యూనిట్‌కు తీసుకున్నాం. అయితే, బెంగళూరులో ఉండేవాళ్లం కాబట్టి, అక్కడే అనుకున్న యూనిట్‌ను ఏర్పాటు చేయాలనుకుంటే లైసెన్స్ దగ్గర నుంచి ప్రతిదీ కష్టమయ్యేది. ఒక మహిళ బిజినెస్ పెట్టాలంటే ఎన్ని ఇబ్బందులు ఎదురవుతాయో స్వయంగా ఎదుర్కొన్నాను. షాప్స్‌లో ప్రొడక్ట్స్ ఇవ్వాలనుకుంటే 'రెండు-మూడు నెలలు చేసి మానేస్తారా.. ఆ తర్వాత పరిస్థితి ఏంటి' అనేవారు. ప్రొడక్ట్స్ అమ్మడం ఇంత కష్టమా అనిపించింది. కానీ, ఏడాదిన్నరపాటు అక్కడే బిజినెస్ కొనసాగించాను.

నెలకు 20 లక్షల టర్నోవర్

బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు యూనిట్ షిఫ్ట్ చేసి ఏడాది అవుతోంది. మొదట మేం అనుకున్న పెట్టుబడి కన్నా ఎక్కువే అయ్యింది. అయినా వదలకుండా నమ్మకంతో వ్యాపారాన్ని ముందంజలోకి తీసుకువచ్చాను. 'కచ్చితంగా చేసి చూపిస్తాను అనే ఆత్మవిశ్వాసమే' నా బిజినెస్‌కు పెట్టుబడి అని చెప్పగలను. నేను చూపాలనుకున్నది, చెప్పాలనుకున్నది కరెక్ట్ అయినప్పుడు ఎక్కడా ఆపకూడదు అనే పట్టుదలతో ఉన్నాను. అందుకే రెండున్నరేళ్లుగా ఈ బిజినెస్‌ను రన్ చేస్తున్నాను. ఇందులో మొత్తం 20 మందికి పైగా వర్క్ చేస్తుంటే, ప్రొడక్షన్ యూనిట్‌లో అంతా తల్లులు ఉండేలా నిర్ణయం తీసుకున్నాను. అమ్మలకు మాత్రమే బాగా తెలుసు పిల్లలకు ఎంత జాగ్రత్తగా, ఎలాంటి ఆహారం, ఎంత ప్రేమగా ఇవ్వాలనేది. ఆ ఆలోచనతోనే యూనిట్‌లో అమ్మలు ఉండేలా జాగ్రత్త తీసుకున్నాను. పిల్లల వయసును బట్టి రాగి జావ, మొలకెత్తిన గింజలు, మల్టీగ్రెయిన్స్, వెజిటబుల్స్‌తో తయారైన ఆర్గానిక్ ప్రొడక్ట్స్ తయారుచేస్తాం. నెలకు 20 లక్షలకు పైగా టర్నోవర్ చేస్తున్నాం. ఆన్‌లైన్ ఆర్డర్స్ ద్వారా విదేశాలకు కూడా మా ప్రొడక్ట్స్ వెళుతుంటాయి. ఒక మహిళ జాబ్ చేయడానికే ధైర్యం కావాలి. ఇక బిజినెస్ అయితే మరింత ధైర్యంతో పాటు ఇంటి నుంచి సహకారం కూడా ఉండాలి. అప్పుడే అనుకున్న వర్క్‌లో బాగా రాణిస్తాం'' అని వివరించింది శ్రీదేవి.

– నిర్మలారెడ్డి

పరస్పరం

స్త్రీలలో బ్రెస్ట్ కేన్సర్ ప్రమాదం ఎప్పుడూ పొంచి ఉంటుంది. రేడియేషన్‌తో కూడిన మామోగ్రఫీ కన్నా స్పర్శతో బ్రెస్ట్ కేన్సర్‌ను గుర్తించడాన్ని 'టెక్టయిల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్' అంటారు. స్పర్శ మీద ఎక్కువగా ఆధారపడ్డ అంధ మహిళలకు ఒక ఉపాధిగా స్పర్శతో కేన్సర్‌ను గుర్తించడంలో శిక్షణ ఇస్తున్నారు. ఢిల్లీలో ఇప్పటికే 18 మంది అంధ మహిళలు ఈ శిక్షణ పొందారు. ఇతర అంధ మహిళలను ఈ రంగంలోకి ఆహ్వానిస్తున్నారు. స్త్రీలు పరస్పరం మేలు పొందే ఈ విశేష కార్యక్రమాన్ని 'లైఫ్ సేవింగ్ హ్యాండ్స్' అంటున్నారు.



చూపు లేదు కాని కేన్సర్‌ని గుర్తిస్తారు

న్యూఢిల్లీకి చెందిన 31 ఏళ్ల మీనాక్షి గుప్తా ప్రతి ఉదయం మెట్రోలో ప్రయాణిస్తున్నప్పుడు అందరూ ఆమెను సాధారణ అంధురాలు అనుకుంటారు. కాని తాను పనిచేసే హాస్పిటల్‌కు ఆమె చేరుకున్నాక ఆ అంధురాలిలోని అసామాన్య నైపుణ్యం తెలిసి ఆశ్చర్యపోతారు. ఆమె 'టెక్టయిల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్' నిపుణురాలు. ఇలాంటి నిపుణులను 'మెడికల్ టెక్టయిల్ ఎగ్జామినర్' (ఎం.టి.ఇ) అంటారు. వీరు చేతి స్పర్శతో స్త్రీల వక్షోజాలలో వచ్చిన అతి చిన్న లంప్స్‌ను కూడా గుర్తించి కేన్సర్ బారిన పడకుండా కాపాడుతారు. బ్రెస్ట్ కేన్సర్‌ను స్త్రీలు ఎవరికి వారు స్పర్శ ద్వారా చెక్ చేసుకుంటూ లంప్స్‌ను గుర్తించవచ్చు. కాని అందరూ సరిగ్గా గుర్తించలేరు. చిన్న లంప్స్‌ను అసలు గుర్తించలేరు. కాని 'టెక్టయిల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్' నిపుణులు మాత్రం అతి చిన్న లంప్స్‌ను కూడా గుర్తించడంలో శిక్షణ పొందుతారు.

అంధ మహిళలే ఎందుకు?

'టెక్టయిల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్'ను జర్మనీకి చెందిన గైనకాలజిస్ట్ ఫ్రేన్ హాఫ్‌మేన్ కనుగొన్నాడు. బ్రెస్ట్ కేన్సర్‌ను గుర్తించే మామోగ్రఫీలో రేడియేషన్ ఉంటుంది. ఖర్చు కూడా. కాని చేతులతో గుర్తించడంలో ఎటువంటి రేడియేషన్ ఉండదు. ఖర్చు కూడా ఉండదు. అందుకే చేతి స్పర్శ ద్వారా ఎలా బ్రెస్ట్ కేన్సర్‌ను గుర్తించవచ్చో అతను కొన్ని పద్ధతులను ప్రతిపాదించాడు. ఇందులో శిక్షణకు అంధ మహిళలను ఎంచుకున్నాడు. ఎందుకంటే చూపు లేకపోవడం వల్ల అంధులు స్పర్శ మీద ఎక్కువగా ఆధారపడతారు. వారు తమ స్పర్శతో కచ్చితంగా లంప్స్‌ను గుర్తించగలరని ఊహించాడు. అతని ఊహ నిజమైంది. అంధ మహిళల స్క్రీనింగ్‌లో కేవలం 1 శాతం మాత్రమే తప్పు అంచనా వచ్చి మిగిలిన 99 శాతం నిర్థారిత అంచనా వచ్చింది. దాంతో అతను ఒక సేవాకార్యక్రమంగా 'లైఫ్ సేవింగ్ హ్యాండ్స్' పేరుతో ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, కొలంబియా, మెక్సికో, ఇండియాలలోని ఆయా ప్రభుత్వ అంధుల పర్యవేక్షణ సంస్థలను కోరారు. మన దేశంలో 2017 నుంచి ఈ శిక్షణ జరుగుతోంది. ఇప్పటికి 18 మంది ఎం.టి.ఇలు శిక్షణ పొందారు. మరో 8 మంది ఇప్పుడు శిక్షణ పొందుతున్నారు.



శిక్షణ పొందుతున్న అంధురాలు

9 నెలల శిక్షణ

ఢిల్లీలోని 'బ్లైండ్ ఇండియా సెంటర్ ఫర్ బ్లైండ్ విమెన్ అండ్ డిజేబిలిటీ స్టడీస్' (ఎన్.ఎ.బి.సి.బి.డబ్ల్యు)లో మెడికల్ టెక్టయిల్ ఎగ్జామినర్ (ఎం.టి.ఇ)లుగా శిక్షణను ఇస్తున్నారు. అంధ మహిళలు, చూపు లోపం పాక్షికంగా ఉన్నవారు ఈ శిక్షణను పొందవచ్చు. 9 నెలలు ట్రైనింగ్ ఉంటుంది. ఆరు నెలలు సెంటర్‌లో, మూడు నెలలు ఆస్పత్రిలో పని చేయాలి. ఈ ట్రయినింగ్‌లో ఇంగ్లిష్, కంప్యూటర్‌ను ఆపరేట్ చేయడం, మానవ శరీర నిర్మాణంలో ప్రాథమిక అవగాహన తదితరాలు నేర్పిస్తారు. 'అంధులు బ్రెస్ట్ కేన్సర్‌ను స్పర్శతో ఎలా గుర్తించగలరా అని ముందు సందేహించాను. కాని జర్మనీకి వెళ్లి చూశాక మన దేశంలో అంధ మహిళలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకున్నాను' అన్నారు బ్లైండ్ ఇండియా సెంటర్ డైరెక్టర్ షాలినీ ఖన్నా.

క్యాంపులలో సేవలు


బ్లైండ్ ఇండియా సెంటర్ తరచూ బ్రెస్ట్ కేన్సర్ అవేర్‌నెస్ క్యాంపులను నిర్వహిస్తోంది. ఈ క్యాంపుల్లో ఎం.టి.ఇలు తమ స్పర్శతో స్క్రీనింగ్ సేవలు అందిస్తున్నారు. '4 మిల్లీమీటర్ల చిన్న లంప్‌ను కూడా ఎం.టి.ఇలు గుర్తిస్తున్నారు' అని క్యాంప్ నిర్వాహకులు తెలియచేస్తున్నారు. వీరి నిర్ధారణ తప్పడం లేదు కనుక అంధ మహిళలు ఈ శిక్షణ తీసుకుని ఈ సేవలను కొనసాగిస్తూ ఉపాధి పొందాలని బ్లైండ్ ఇండియా సెంటర్ తెలియచేసింది.

బ్యూటిప్స్

వైటెనింగ్ జెల్



టేబుల్ స్పూను పంచదార పొడిలో స్పూను వేడినీళ్లు పోసి కలపాలి. దీన్లో రెండు టీస్పూన్ల పచ్చిపాలు, స్పూను అలోవెరా జెల్ వేసి కలపాలి. శుభ్రంగా కడిగిన ముఖానికి ఈ మిశ్రమాన్ని రాసి మర్దన చేయాలి. పది నిమిషాలపాటు ఆరనిచ్చి కడిగేయాలి. వారానికి మూడు సార్లు ఈ ప్యాక్ వేయడం వల్ల తేమ అంది, చర్మం పట్టులా నిగారింపుతో మెరుపులీనుతూ కనిపిస్తుంది.




జుట్టు రాలడాన్ని తగ్గించే డికాషన్

మరుగుతున్న రెండు గ్లాసుల నీటిలో మూడు టేబుల్ స్పూన్ల టీపొడి, పది గులాబీ పువ్వులు వేసి పదినిమిషాలపాటు మరిగించాలి. తరువాత చల్లారనిచ్చి వడగట్టి డికాషన్‌ను సీసాలో పోయాలి. తలస్నానం చేసిన జుట్టుకు ఈ డికాషన్‌ను పట్టించి, టవల్ చుట్టుకోవాలి. నీటితో కడగకూడదు. ఇది కండీషనర్‌లా పనిచేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

యూత్ పల్స్

యువతలోని ఒక వర్గం నుంచి బలంగా వినిపిస్తున్న నినాదం... జాయిన్ ది జోమో క్లబ్! ఒకప్పుడు ఫోమో(ఫియర్ ఆఫ్ మిస్సింగ్ ఔట్) క్లబ్‌లో ఉన్నవారు కూడా జోమో (జాయ్ ఆఫ్ మిస్సింగ్ ఔట్) లోకి వచ్చేస్తున్నారు. మెయిన్‌స్ట్రీమ్ ధోరణికి భిన్నంగా కలలు కనే 'జోమో' ట్రెండ్ యువతరం 'సక్సెస్‌తో సంతోషం వస్తుందో లేదోగాని సంతోషంతో మాత్రం తప్పనిసరిగా సక్సెస్ వస్తుంది' అంటోంది...



జోరుగా జోమోయిజం

రాజస్థాన్‌లోని కోట నగరం 'కోచింగ్ హబ్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచింది. తియ్యటి భవిష్యత్ కలలతో పాటు పీడకలలలాంటి ఒత్తిడి, భయం, ఆందోళన ఆ గాలిలోనే తేలియాడుతుంటాయి.

ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అజిత్ కిశోర్ ఐఐటీ కోచింగ్ కోసం ఇక్కడికి వచ్చాడు. తండ్రికి చెరుకుకు సంబంధించిన ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ఉంది. ఐఐటీ–కాన్పూర్‌లో చదివిన అజిత్ సోదరుడు అమెరికాలో సెటిల్ అయ్యాడు. ఈ నేపథ్యంలో తనకు మరో 'ఐఐటీ పుత్రుడు' కావాలనుకున్నాడు తండ్రి. ఫలితంగా అజిత్ కిశోర్ కోట నగరానికి అనివార్యంగా రావాల్సి వచ్చింది.

అజిత్ కిశోర్‌కు ఐఐటీ అంటే బొత్తిగా ఇష్టం లేదు.

'ఆసక్తి లేకపోవడం కాదు, అందుకు తగిన ప్రతిభాసామర్థ్యాలు నాలో లేవు. నాకు సంబంధం లేని విషయానికి నేనెందుకు బాధ పడాలి?' అంటాడు అజిత్.

తరచు కోచింగ్ క్లాసులు ఎగ్గొట్టే బిహార్‌లోని పట్నాకు చెందిన రక్షిత్ కుమార్ 'నాకు ఐఐటీ సీటు కచ్చితంగా రాదు. అయినా సరే, నటించక తప్పదు' అని నవ్వుతూ అంటాడు.

'దీనివల్ల టైమ్, డబ్బు వృథా కదా?' అని అడిగితే రక్షిత్ ఇలా జవాబు ఇస్తాడు...

'నేను చదువులో యావరేజ్ స్టూడెంట్‌ని. మా నాన్నకేమో నేను ఇంజినీర్ కావాలని పట్టుదల. ఫ్యాషన్ డిజైనర్ కావాలనేది నా కల. ఈ విషయాన్ని నాన్నకు చెబితే ఐఏఎస్ ఆఫీసర్ కొడుకు టైలర్ కావాలనుకుంటాడా? అని వెటకారంగా మాట్లాడారు. నిన్ను ఇంజినీర్‌గా చూడాలనేది నా కల. ఏం చేస్తావో, ఎలా చేస్తావో తెలియదు అని ఆర్డర్ జారీ చేశారు. కాబట్టి ఆయన మనసు నొప్పించకుండా ఇక్కడకు రావాల్సి వచ్చింది'

మధ్యప్రదేశ్ నుంచి కోట నగరానికి వచ్చిన అదితిశర్మ తండ్రి డెంటిస్ట్. తల్లి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.

'నా తల్లిదండ్రుల కలల బాధితురాలిని' నవ్వుతూ అంటుంది అదితి.

'ఎందుకలా?' అని అడిగితే...

'నా తల్లిదండ్రులు చదువులో బ్రైట్. నేను మాత్రం బ్రైట్ స్టూడెంట్ కాలేకపోయాను. అందుకు నేనేమీ బాధ పడడం లేదు. చెఫ్ కావాలనేది నా కల' అంటుంది అదితి.

అదితి శర్మలాగే 'కోట మాత్రమే ప్రపంచం కాదు. దీనికి అవతల పెద్ద ప్రపంచం ఉంది. అక్కడ మనకు తగిన అద్భుత అవకాశాలు ఉంటాయి' అనుకునే విద్యార్థులు ఎంతోమంది ఉన్నారు.

కోటలాంటి కోచింగ్ సెంటర్‌లకు ప్రసిద్ధిగాంచిన నగరాలు మన దేశంలో ఎన్నో ఉన్నాయి. అదితిశర్మలాంటి విద్యార్థులు ఎంతో మంది ఉన్నారు.

అదితి శర్మలాంటి వాళ్లను ఆకట్టుకుంటున్న ట్రెండ్... జోమో.

ఫోమో (ఫియర్ ఆఫ్ మిస్సింగ్ ఔట్–తప్పిపోతుందేమో అనే భయం) పాత విషయం అయిపోయింది. జోమో (జాయ్ ఆఫ్ మిస్సింగ్ ఔట్ –తప్పిపోయినందుకు ఆనందం) అనేది కొత్త ట్రెండ్‌గా మారింది.

యూత్‌లో కొంత మంది నుంచి వినిపిస్తున్న 'జాయిన్ ది జోమో క్లబ్' నినాదాన్ని ఎలా చూడాలి? పలాయనవాదమా? కాలహరణమా?

'చాలామంది పిల్లలు తల్లిదండ్రులు ఆదేశించగానే ఓకే చెబుతారు. తాము సాధించగలం అనుకుంటారు. ఒకసారి వృత్తంలోకి వచ్చిన తరువాత పేరెంట్స్, ఉపాధ్యాయులు, ఇతరుల నుండి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వచ్చే ఒత్తిడితో సతమతమవుతారు. ఆ తరువాత పరిణామాలు ఎటో వెళతాయి. మొదటికే మోసం వస్తుంది. తల్లిదండ్రుల కలను నెరవేర్చలేకపోతున్నాను అనే బాధతో ఆత్మహత్యకు పాల్పడే వాళ్లు కూడా ఉన్నారు. దీని కంటే జోమో నయం కదా! జోమో బాయ్స్ అండ్ గర్ల్స్ తమ బలాలు, బలహీనతల విషయంలో చాలా స్పష్టంగా ఉంటున్నారు. ఇఫ్ ఐయామ్ హ్యాపీ ఐయామ్ సక్సెస్‌ఫుల్. సక్సెస్ అంటే అకాడమిక్, ప్రొఫెషన్ సక్సెస్ మాత్రమే కాదు' అంటూ జోమోవాదులను సమర్థించేవాళ్లు ఎంతోమంది ఉన్నారు.

'జోమో' కెరీర్‌కే పరిమితమైన ట్రెండ్ కాదు. సోషల్ మీడియాలోని అనేక అంశాలు ఈ ట్రెండ్ బలపడడానికి కారణం.

'సోషల్ మీడియాలో భాగం కాకపోతే, చురుగ్గా ఉండకపోతే అందరిలా ఎగ్జైట్‌మెంట్‌ను మిస్ అవుతాను, ఒంటరిని అవుతానేమో అనే భయం... ఫోమో. మరోవైపు జోమో మాత్రం అలాంటి భయాలను పక్కనపెడుతుంది. టెక్–ఫ్రీ బ్రేక్స్‌ను ఇష్టపడుతుంది' అంటుంది ఢిల్లీకి చెందిన సీనియర్ క్లినికల్ సైకాలజిస్ట్ భావనా బర్మీ.

రెండు సంవత్సరాల క్రితం ట్రావెల్ ఇండస్ట్రీలో 'జోమో' ట్రెండ్ గట్టిగా వినిపించింది, ఈ ట్రెండ్‌లో భాగంగా ఆఫ్ సీజన్, జనసమూహాలు ఎక్కువగా కనిపించని, పెద్దగా జనాదరణ లేని ప్రదేశాలను ఎంచుకునేవారు. స్థూలంగా చెప్పాలంటే ఇది ఒకే రంగానికి, ఒకే అంశానికి పరిమితమైన ట్రెండ్ కాదు.

> సోషల్ మీడియాలో భాగం కాకపోతే, చురుగ్గా ఉండకపోతే అందరిలా ఎగ్జైట్‌మెంట్‌ను మిస్ అవుతాను, ఒంటరిని అవుతానేమో అనే భయం... ఫోమో. మరోవైపు జోమో మాత్రం అలాంటి భయాలను పక్కనపెడుతుంది. టెక్–ఫ్రీ బ్రేక్స్‌ను ఇష్టపడుతుంది.
>
> – భావనా బర్మీ, క్లినికల్ సైకాలజిస్ట్

ది జోమో కాక్‌టెయిల్



1. సెల్ఫ్ లవ్ 2. కృతజ్ఞత 3. ఉనికి 4. హద్దులు

ఇంటిప్స్

బిస్కెట్లు కరకరలాడాలంటే...

వర్షాకాలంలో కూడా బిస్కెట్లు మెత్తగా అవకుండా కరకరలాడాలంటే ఇలా చేసి చూడండి...

- ప్లాస్టిక్, అల్యూమినియం డబ్బాలు, గాజు పాత్రల్లో బిస్కెట్లు, కుకీలను నిల్వచేయాలి. గాలిచొరబడకుండా పెడితే ఎక్కువ రోజులపాటు క్రిస్పీగా ఉంటాయి.
- డబ్బాల్లో నిల్వచేసేటప్పుడు అడుగు భాగంలో రెండుమూడు వరుసల్లో టిష్యూ పేపర్లు వేసి తరువాత బిస్కట్లు పెట్టాలి. బిస్కట్లపైన మరో రెండు వరుసల్లో





టిష్యూపేపర్లు వేసి పైన బిస్కెట్లు పెట్టాలి. ఇలా నిండుగా పెట్టి గాలిచొరబడకుండా మూత పెట్టాలి.
- జిప్‌లాక్ పౌచ్‌లలో నిల్వచేస్తే కూడా కుకీలు తాజాగా ఉంటాయి.
- గాలిచొరబడని డబ్బాలు, జిప్‌లాక్ పౌచ్‌లను రిఫ్రిజిరేటర్‌లో పెడితే మరిన్ని రోజులు బిస్కెట్లు తాజాగా ఉంటాయి.
- అనుకోకుండా సరిగా నిల్వ చేయనప్పుడు మెత్తబడిన కుకీలను అవెన్ లేదా ఎయిర్‌ఫ్రైయర్‌లో పదినిమిషాలు వేడిచేస్తే మళ్లీ క్రిస్పీగా మారతాయి. వీటిని కూడా నిల్వ చేసుకోవచ్చు.



సాకేత్-మార్టినెజ్ జోడీ శుభారంభం

మిఫెల్ టెన్నిస్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నమెంట్‌లో భారత ప్లేయర్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాకేత్ మైనేని పురుషుల డబుల్స్ విభాగంలో శుభారంభం చేశాడు. తన భాగస్వామి మార్టినెజ్ (వెనిజులా)తో కలిసి సాకేత్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. మెక్సికోలో మంగళవారం జరిగిన డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్-మార్టినెజ్ ద్వయం 6-3, 2-6, 10-5తో ఎర్నెస్టో ఎస్కోబె డో-రోడ్రిగో మెండెజ్ (మెక్సికో) జోడీపై గెలిచింది. 82 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్ జంట మూడు ఏస్‌లు సంధించింది.



తొమ్మిదో ర్యాంక్‌కు ప్రణయ్

గతవారం జపాన్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన ప్రణయ్, సెమీఫైనల్లో ఓడిన లక్ష్య సేన్ ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య ర్యాంకింగ్స్‌లో పురోగతి సాధించారు. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ ఒక స్థానం మెరుగుపర్చుకొని తొమ్మిదో ర్యాంక్‌కు... లక్ష్య సేన్ రెండు స్థానాలు ఎగబాకి 11వ ర్యాంక్‌కు చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ 19వ ర్యాంక్‌లో నిలిచాడు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు 17వ ర్యాంక్‌లో, పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి రెండో ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.

రెండో రౌండ్‌కు ప్రియాంక



బకూ (అజర్‌బైజాన్): అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న ఆంధ్రప్రదేశ్ మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) నూతక్కి ప్రియాంక ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ మహిళల విభాగంలో రెండో రౌండ్‌కు చేరుకుంది. మరీనా బ్రునెల్లో (ఇటలీ)తో జరిగిన తొలి రౌండ్‌లో ప్రియాంక ర్యాపిడ్ ఫార్మాట్ టైబ్రేక్‌లో 1.5-0.5తో గెలుపొందింది. టైబ్రేక్ తొలి గేమ్‌ను 43 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్న ప్రియాంక, రెండో గేమ్‌లో 45 ఎత్తుల్లో మరీనాను ఓడించి ఓవరాల్‌గా 2.5-1.5తో విజయం అందుకుంది. క్లాసికల్ ఫార్మాట్‌లో వీరిద్దరి మధ్య జరిగిన తొలి రెండు గేమ్‌లు 'డ్రా'గా ముగియడంతో విజేతను నిర్ణయించేందుకు ర్యాపిడ్ గేమ్‌లను నిర్వహించారు. రెండో రౌండ్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్‌కే చెందిన కోనేరు హంపితో ప్రియాంక తలపడుతుంది. ఓపెన్ విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ హర్ష భరతకోటి కథ తొలి రౌండ్‌లోనే ముగిసింది. లెవాన్ పాంట్‌సులెయ (జార్జియా)తో టైబ్రేక్ తొలి గేమ్‌లో హర్ష 75 ఎత్తుల్లో ఓడిపోయి, రెండో గేమ్‌ను 66 ఎత్తుల్లో 'డ్రా' చేసుకొని 0.5-1.5తో ఓటమి చవిచూశాడు.

ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో తొలి రోజు భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్ చేరగా... అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జోడీ తొలి రౌండ్‌లో... సిక్కి రెడ్డి-ఆరతి సారా సునీల్ జంట క్వాలిఫయింగ్‌లో నిష్క్రమించాయి. తొలి రౌండ్ మ్యాచ్‌లో గాయత్రి-ట్రెసా జాలీ 21-16, 21-17తో కేథరీన్ చోయ్-జోసెఫిన్ వు (కెనడా)లపై గెలిచారు. అశ్విని-తనీషా 11-21, 21-14, 17-21తో ఫెబ్రియానా కుసుమ-అమాలియా ప్రతవి (ఇండోనేసియా) చేతిలో... సిక్కి రెడ్డి-ఆరతి 14-21, 17-21తో సు యిన్ హుయ్-లీ చి చెన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయారు.

సిరీస్ కోసం భారీ స్కోరు



సామ్సన్

- భారత్ 351/5
- గిల్, ఇషాన్ అర్ధ సెంచరీలు
- సామ్సన్, హార్దిక్ మెరుపులు
- వెస్టిండీస్‌తో ఆఖరి వన్డే

తరూబా (ట్రినిడాడ్): ఎట్టకేలకు వెస్టిండీస్ గడ్డపై టీమిండియా బ్యాటింగ్ పవర్ ఆఖరి వన్డేలో బయటికొచ్చింది. సిరీస్ గెలుచుకొచ్చే ఆటతీరును కనబరిచింది. ఆతిథ్య ప్రత్యర్థి ముందు కఠినమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. సీనియర్లు లేకపోయినా... ఇకపై టీమిండియాకు తురుపుముక్కలు కానున్న బ్యాటర్లు బాధ్యత పంచుకున్నారు. ఓపెనర్లు శుబ్‌మన్ గిల్ (92 బంతుల్లో 85; 11 ఫోర్లు), ఇషాన్ కిషన్ (64 బంతుల్లో 77; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన సంజూ సామ్సన్ (41 బంతుల్లో 51; 2 ఫోర్లు, 4 సిక్సర్లు), తాత్కాలిక కెప్టెన్ హార్దిక్ పాండ్యా (52 బంతుల్లో 70 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపులతో అర్ధ సెంచరీలు సాధించి రాణించారు. ఈ సిరీస్‌లో తమని వణికించిన కరీబియన్ బౌలింగ్‌పై ఈ మ్యాచ్‌లో ఓ ఆటాడుకున్నారు. దీంతో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 351 పరుగుల భారీ స్కోరు చేసింది. విండీస్‌లో వెస్టిండీస్ జట్టుపై భారత్‌కిదే అత్యధిక స్కోరు కావడం విశేషం.

టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకొన్న విండీస్ గత మ్యాచ్‌లాగే భారత్‌ను కట్టడి చేయాలనుకున్న ఆశలకు ఓపెనింగ్ జోడీ నుంచే నిరాశ ఎదురైంది. దాదాపు 20 ఓవర్ల (19.4) పాటు గిల్, ఇషాన్‌లే ఆడేశారు. విండీస్ బౌలర్లను బాదేశారు. యథేచ్ఛగా పరుగులు సాధించారు. దీంతో తొలి వికెట్‌కు 143 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. ఇక్కడే ఇషాన్ అవుటయ్యాక వచ్చిన రుతురాజ్ గైక్వాడ్ (8) తక్కువే చేశాడు. అయితే గిల్‌కు సామ్సన్ జతవ్వడంతో మళ్లీ పరుగులు.... విండీస్‌కు కష్టాలు... కొనసాగాయి. భారీ సిక్సర్లతో వేగంగా (39 బంతుల్లో) అర్ధసెంచరీ చేసిన సంజూ, సెంచరీపై కన్నేసిన గిల్ స్వల్ప వ్యవధిలో నిష్క్రమించారు. అప్పుడు భారత్ స్కోరు 244/3. ఈ దశలో కెప్టెన్ హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ (30 బంతుల్లో 35; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మరో బలమైన భాగస్వామ్యం నమోదు చేయడంతో 45.5 ఓవర్లలోనే భారత్ స్కోరు 300 దాటింది. సూర్య అవుటైనా... 45 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న పాండ్యా



ఇషాన్, గిల్



చుక్కలు చూపించే సిక్సర్లతో స్కోరు వేగాన్ని అమాంతం పెంచాడు. షెఫర్డ్ 2 వికెట్లు తీశాడు. కీలకమైన ఈ మ్యాచ్‌కూ కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ కోహ్లిలకు విశ్రాంతిని కొనసాగించారు. అయితే తుదిజట్టులో ఉమ్రాన్ మాలిక్, అక్షర్ పటేల్ స్థానాల్లో రుతురాజ్, ఉనాద్కట్‌లను తీసుకున్నారు.

352 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ కడపటి వార్తలందేసరికి వెస్టిండీస్ 5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 15 పరుగులు చేసింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (స్టంప్డ్) హోప్ (బి) కరియా 77; గిల్ (సి) కరియా (బి) మోతీ 85; రుతురాజ్ (సి) కింగ్ (బి) జోసెఫ్ 8; సామ్సన్ (సి) హెట్‌మైర్ (బి) షెఫర్డ్ 51; హార్దిక్ పాండ్యా (నాటౌట్) 70; సూర్యకుమార్ (సి) కరియా (బి) షెఫర్డ్ 35; రవీంద్ర జడేజా (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 351.** **వికెట్ల పతనం:** 1-143, 2-154, 3-223, 4-244, 5-309. **బౌలింగ్:** సీల్స్ 8-0-75-0, మేయర్స్ 4-0-25-0, జోసెఫ్ 10-0-77-1, గుడకేశ్ మోతీ 10-1-38-1, షెఫర్డ్ 10-0-73-2, కరియా 8-0-58-1.

భారత్‌కు మూడు పతకాలు

రజతాలు నెగ్గిన వెంకటకృష్ణ, పల్లవి ● కాంస్యం సాధించిన హారిక



వెంకటకృష్ణ



పల్లవి



హారిక

గ్రేటర్ నోయిడా: సొంతగడ్డపై జరుగుతున్న ఆసియా యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల పతకాల వేట కొనసాగుతోంది. మంగళవారం భారత వెయిట్‌లిఫ్టర్లు రెండు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి మూడు పతకాలు గెలిచా రు. భారత్ గెల్చుకున్న మూడు పతకాలూ ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టర్లు వెంకటకృష్ణ, సనపతి పల్లవి, హారిక బెల్లన అందించడం విశేషం. పురుషుల యూత్ 73 కేజీల విభాగంలో ఏలూరు జిల్లాకు చెందిన బి.వెంకటకృష్ణ రజత పతకం సాధించాడు. వెంకటకృష్ణ 271 కేజీలు (స్నాచ్‌లో 120+క్లీన్ అండ్ జెర్క్‌లో 151) బరువెత్తి రెండో స్థానంలో నిలిచాడు. మహిళల జూనియర్ 64 కేజీల విభాగంలో వైజాగ్ అమ్మాయి పల్లవి రజత పతకం సొంతం చేసుకుంది. పల్లవి 196 కేజీలు (స్నాచ్ లో 87+క్లీన్ అండ్ జెర్క్‌లో 109) బరువెత్తి రెండో స్థానాన్ని దక్కించుకుంది. మహిళల యూత్ 59 కేజీల విభాగంలో హారిక కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. హారిక మొత్తం 176 కేజీలు (స్నాచ్‌లో 78+క్లీన్ అండ్ జెర్క్‌లో 98) బరువెత్తి మూడో స్థానాన్ని సంపాదించింది.

సిఫ్ట్ కౌర్‌కు రెండు స్వర్ణాలు



స్వర్ణ పతకాలతో ఆశి, మానిని, సిఫ్ట్ కౌర్

చెంగ్డూ: ప్రపంచ విశ్వ విద్యాలయాల క్రీడల్లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. మంగళవారం భారత షూటర్లు రెండు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం గెలిచారు. పంజాబ్ అమ్మాయి సిఫ్ట్ కౌర్ సమ్రా మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ టీమ్ ఈవెంట్‌లో, వ్యక్తిగత విభాగంలో పసిడి పతకాలు సొంతం చేసుకుంది. టీమ్ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్, ఆశి చౌక్సీ, మానిని కౌశిక్‌లతో కూడిన భారత జట్టు 3527 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. వ్యక్తిగత విభాగంలో సిఫ్ట్ కౌర్ 462.9 పాయింట్లతో విజేతగా నిలువగా, ఆశి చౌక్సీ 461.6 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకొని రజతం గెలిచింది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో అర్జున్ సింగ్ చీమా, వరుణ్ తోమర్, అన్‌మోల్ జైన్‌లతో కూడిన భారత జట్టు 1730 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం భారత్ 11 స్వర్ణాలు, 4 రజతాలు, 6 కాంస్యాలతో కలిపి మొత్తం 21 పతకాలతో నాలుగో స్థానంలో ఉంది.

రెండో సీడ్‌గా జ్యోతి సురేఖ, ధీరజ్





బెర్లిన్ (జర్మనీ): ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఆర్చర్లు వెన్నం జ్యోతి సురేఖ, బొమ్మదేవర ధీరజ్ మెరిశారు. మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ ర్యాంకింగ్ రౌండ్‌లో మహిళల కాంపౌండ్ విభాగంలో జ్యోతి సురేఖ 701 పాయింట్లు... పురుషుల రికర్వ్ విభాగంలో ధీరజ్ 683 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచారు. ఫలితంగా నాకౌట్ దశలో రెండో సీడింగ్ పొందిన జ్యోతి సురేఖ, ధీరజ్‌లకు నేరుగా మూడో రౌండ్‌కు 'బై' లభించింది.

సినిమా



రవితేజ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్‌పై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 20న రిలీజ్ చేయనున్నట్లు గతంలో ప్రకటించారు మేకర్స్. అయితే ఈ సినిమా విడుదల ఆలస్యమయ్యే అవకాశం ఉందనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో 'టైగర్ నాగేశ్వరరావు' విడుదలలో ఎలాంటి మార్పు లేదని, ముందుగా ప్రకటించినట్లు దసరాకి అక్టోబర్ 20నే విడుదల చేస్తామనీ చిత్రబృందం ఓ ప్రకటన రిలీజ్ చేసింది. ''టైగర్ నాగేశ్వరరావు' చిత్రం అక్టోబర్ 20న విడుదల కావడం లేదంటూ కొన్ని శక్తులు వదంతులు వ్యాప్తి చేస్తున్నాయి. ఆ వదంతులను నమ్మవద్దు. మీకు (ప్రేక్షకులు) అత్యుత్తమ సినిమా అనుభూతిని అందించడానికి మేము కృషి చేస్తున్నాం. అక్టోబరు 20 నుంచి బాక్సాఫీస్ వద్ద టైగర్ వేట ప్రారంభమవుతుంది'' అని మేకర్స్ తెలియజేశారు. ఈ చిత్రానికి సహనిర్మాత: మయాంక్ సింఘానియా, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, కెమెరా: ఆర్ మది.

నాయికా ప్రాధాన్యంగా సాగే చిత్రాలు చేయడం అంటే అంత ఈజీ కాదు. కథానుసారం ఫైట్లు చేయాలి.. పవర్‌ఫుల్ డైలాగులు చెప్పాలి.. రెగ్యులర్ కమర్షియల్ చిత్రాలకన్నా కాస్త ఎక్కువగానే ఎమోషన్ పండించాలి.. అవసరమైతే క్యారెక్టర్‌కి తగ్గట్టు సన్నబడాలి లేదా బరువు పెరగాలి లేదా నల్లటి మేకప్ వేసుకోవాలి. అన్నింటికీ మించి సినిమా మొత్తం ఆ నాయిక తన భుజాల మీద మోయాలి. 'లేడీ ఓరియంటెడ్' మూవీ అంటే పెద్ద సవాల్. అలాంటి సవాల్ వస్తే కాదనకుండా ఒప్పేసుకుంటారు కథానాయికలు. ప్రస్తుతం ముగ్గురు నాయికలు తొలిసారి 'హాయ్ హాయ్ నాయికా' అంటూ లేడీ ఓరియంటెడ్ మూవీకి సై అన్నారు.

హాయ్ హాయ్ నాయికా...

ఎమోషనల్ రెయిన్ బో



రష్మికా మందన్నా

రష్మికా మందన్నా క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఈ బ్యూటీ ఇప్పటివరకూ ఎక్కువగా కమర్షియల్ చిత్రాలే చేశారు. 'రెయిన్ బో' చిత్రంతో తొలి సారి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ వరల్డ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు రష్మికా మందన్నా. ఫీల్ గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని దర్శకుడు శాంత రూబన్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం ప్రధానంగా ఎమోషన్స్‌తో సాగుతుందట. ఇందులో మలయాళ నటుడు దేవ్ మోహన్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. ఈ సినిమా తొలి షెడ్యూల్ ముగిసింది. ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రారంభంలో రిలీజ్ కానుంది.

రోడ్ ట్రిప్

మనాలి, లడఖ్ లొకేషన్స్‌తో పాటు నార్త్‌లోని మరికొన్ని ప్రాంతాల్లో రోడ్ ట్రిప్ చేస్తున్నారట హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్. ఇది పర్సనల్ ట్రిప్ కాదు... ప్రొఫెషనల్ ట్రిప్ అని తెలిసింది. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ దర్శకత్వంలో రోడ్ ట్రిప్ నేపథ్యంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ లేడీ ఓరియంటెడ్ మూవీలో అనుపమా పరమేశ్వరన్ మెయిన్ లీడ్ రోల్ చేస్తుండగా, మలయాళ యంగ్ బ్యూటీ దర్శన, సీనియర్ నటి సంగీత లీడ్ రోల్స్ చేస్తున్నారు. ముగ్గురు మహిళల జీవితాల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందని టాక్. మరోవైపు ఈ సినిమా కంటే ముందే 'బటర్ ఫ్లై' అనే ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ చేశారు అనుపమా పరమేశ్వరన్. అయితే ఈ చిత్రం డైరెక్ట్‌గా ఓటీటీలో రిలీజ్ అయ్యింది. ఇప్పుడు అనుపమ చేస్తున్న చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. సో.. వెండితెరపై అనుపమ కనిపించనున్న తొలి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ ఇదే అవుతుందనుకోవచ్చు.

వచ్చే నెలలో ఆరంభం



అనుపమా పరమేశ్వరన్

'సమ్మోహనం, వి, అంతరిక్షం, మహాసముద్రం' వంటి తెలుగు సినిమాలతో నటిగా ప్రేక్షకులతో మంచి మార్కులు వేయించుకున్నారు హీరోయిన్ అదితీరావ్ హైదరి. ఈ బ్యూటీ సౌత్‌లో ఫస్ట్‌టైమ్ ఓ లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. దర్శక-నటుడు రాజేష్ ఎమ్. సెల్వ ఓ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ ప్లాన్ చేస్తున్నారని, ఈ చిత్రంలోని మెయిన్ లీడ్ క్యారెక్టర్‌కు అదితీరావ్‌ని ఎంపిక చేశారనే టాక్ వినిపిస్తోంది. వచ్చే నెలలో చిత్రీకరణ ప్రారంభించుకోనున్న ఈ సినిమా వచ్చే ఏడాదిలో విడుదల కానుంది.



అదితీరావ్ హైదరి

త్రిష, అనుష్క, కాజల్ అగర్వాల్, తమన్నా, నయనతార, సమంత వంటి తారలు ఇప్పటికే పలు లేడీ ఓరియంటెడ్ చిత్రాల్లో నటించారు. ఇప్పుడు మరికొందరు ఈ తరహా చిత్రాలపై మొగ్గు చూపారు. వీరి స్ఫూర్తితో కొందరు యువకథానాయికలు లేడీ ఓరియంటెడ్ చిత్రాలు సైన్ చేయడానికి రెడీ అవుతున్నారు.

బర్త్ డే స్పెషల్



మృణాల్ ఠాకూర్

'సీతారామం'తో తెలుగు ప్రేక్షకుల మనసులు దోచారు హీరోయిన్ మృణాల్ ఠాకూర్. ఆ సినిమా ఘన విజయం సాధించడంతో తెలుగులో ఆమెకు వరుస అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం నాని హీరోగా నటిస్తున్న 'హాయ్ నాన్న' చిత్రంతో పాటు విజయ్ దేవరకొండ హీరోగా చేస్తున్న 'వీడీ 13' (వర్కింగ్ టైటిల్) సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తున్నారామె. కాగా ఆగస్టు 1న మృణాళ్ ఠాకూర్ పుట్టినరోజు. ఈ సందర్భంగా 'హాయ్ నాన్న' టీమ్ నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 21న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఈవీవీ సతీష్.

సెట్స్‌లో... 'గీత గోవిందం' వంటి హిట్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ-డైరెక్టర్ పరశురామ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'వీడీ 13' (వర్కింగ్ టైటిల్). 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా సెట్స్‌లో మృణాల్ బర్త్‌డేని సెలబ్రేట్ చేశారు. ఈ సెలబ్రేషన్స్‌లో విజయ్ దేవరకొండ, పరశురామ్, శిరీష్, హన్షిత పాల్గొన్నారు.

సూపర్ చాన్స్..



అనిఖా

యంగ్ హీరోయిన్ అనిఖా సురేంద్రన్‌కు మంచి ఆఫర్ దక్కినట్లుగా కోలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. ధనుష్ హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న 'డీ 50' (వర్కింగ్ టైటిల్)లో అనిఖా సురేంద్రన్‌కి ఓ లీడ్ రోల్ చేసే చాన్స్ దక్కిందట. ధనుష్ సినిమాలో ఓ లీడ్ యాక్ట్రస్‌గా అంటే అనిఖాకు సూపర్ చాన్స్ అనొచ్చు. ఇక అజిత్ హీరోగా నటించిన 'ఎంతవాడు కానీ', 'విశ్వాసం' వంటి సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించిన అనిఖా, తెలుగులో వచ్చిన నాగార్జున 'ది ఘోస్ట్', 'బుట్టబొమ్మ' వంటి చిత్రాల్లో ఓ లీడ్ యాక్ట్రస్‌గా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

రీల్స్


శరత్‌బాబుకి అంకితం



ఆయుష్, శరత్‌బాబు

ఇటీవల (మే 22) కన్నుమూసిన సీనియర్ నటుడు శరత్‌బాబు ఫ్యామిలీ నుంచి హీరో వస్తున్నాడు. శరత్‌బాబు సోదరుడి కుమారుడు ఆయుష్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'దక్ష'. కాగా గతంలో ఆయుష్‌ని తన నటవారసుడిగా శరత్‌బాబు పేర్కొన్నారు. వివేకానంద విక్రాంత్ దర్శకత్వంలో తల్లాడ శ్రీనివాస్ నిర్మించిన 'దక్ష' ఈ నెల 25న విడుదల కానుంది. ''మా రెండేళ్ల కష్టం ఈ సినిమా. మా ప్రొడ్యూసర్, డైరెక్టర్ రాజీ పడకుండా పూర్తి చేశారు. మా నాన్న (శరత్‌బాబు)గారికి ఈ చిత్రాన్ని అంకితం చేస్తున్నాం'' అన్నారు ఆయుష్. అఖిల్, రవి రెడ్డి, అను, రియా, పవన్, నక్షత్ర తదితరులు నటించిన ఈ సస్పెన్స్ థ్రిల్లింగ్ చిత్రానికి సంగీతం: లలిత్.


కోట బొమ్మాళి పీఎస్‌లో..



శ్రీకాంత్


శ్రీకాంత్ మేక ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజ మార్ని దర్శకత్వంలో జీఏ2 పిక్చర్స్‌పై 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్నారు. వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రత్యేక పాత్రలో, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ''రాజకీయాలు, పోలీసుల మధ్య జరిగే పరిణామాల నేపథ్యంలో 'కోట బొమ్మాళి పీఎస్' రూపొందుతోంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: జగదీష్ చీకటి, సంగీతం: రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్.

మెడికో థ్రిల్లర్



అశ్విన్ బాబు హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'వచ్చినవాడు గౌతం' అనే టైటిల్ ఖరారు చేశారు. మామిడాల ఎంఆర్ కృష్ణ దర్శకత్వంలో ఆలూరి సురేష్ నిర్మిస్తున్నారు. మంగళవారం (ఆగస్టు 1) అశ్విన్ బర్త్ డే సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ను ప్రకటించి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ''మెడికో థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా కోసం అశ్విన్ ఫిజికల్‌గా మేకోవర్ అయ్యారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కె. నాయుడు, సంగీతం: గౌర హరి.

ముక్కోణపు ప్రేమకథ



స్నేహా సింగ్, అభినవ్

అభినవ్ మదిశెట్టి, స్నేహా సింగ్ జంటగా నటించిన చిత్రం 'దిల్ సే'. మంకల్ వీరేంద్ర, రవికుమార్ సబ్బాని స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ నెల 4న రిలీజ్ కానున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుమారుడు పి. కౌశిక్ రెడ్డి, నిర్మాత బెక్కం వేణుగోపాల్ అతిథులుగా హాజరయ్యారు. ''ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది'' అని మంకల్ వీరేంద్ర, రవికుమార్ సబ్బాని అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	68	66,459
నిఫ్టీ ▽	20	19,734

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,280	▽	66
డోజోన్స్	35,571	△	11
ఎఫ్‌టీఎస్ఈ 100	7,666	▽	33
డాక్స్	16,240	▽	206
షాంఘై	3,291	△	15
నికాయ్	33,477	△	304

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,451	▽	116
బంగారం (99.5 స్వచ్ఛత)	59,213	▽	115
వెండి (కిలో)	74,288	△	428

జీఎస్‌టీ వసూళ్ల ఉత్సాహం

- జూలైలో వరుసగా ఐదవ నెల రూ.1.60 లక్షల కోట్లకు పైగా వసూళ్లు
- ఎగవేత నిరోధక చర్యల ఫలితం
- పెరిగిన వినియోగ వ్యయం



న్యూఢిల్లీ: ఎగవేత నిరోధక చర్యలు, అధిక వినియోగదారుల వ్యయాల ఫలితంగా జూలైలో వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు 11 శాతం పెరిగి (2022 ఇదే నెలతో పోల్చి) రూ.1.65 లక్షల కోట్లకు చేరాయి. 2017 జూలై నుంచి జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తర్వాత, నెలవారీ వసూళ్లు రూ.1.60 లక్షల కోట్లను అధిగమించడం వరుసగా ఇది ఐదవ నెల. ఆర్థికశాఖ ప్రకటన ప్రకారం వసూళ్ల తీరును క్లుప్తంగా పరిశీలిస్తే..

- మొత్తం వసూళ్లు రూ.1,65,105 కోట్లు
- సెంట్రల్ జీఎస్‌టీ వాటా రూ.29,773 కోట్లు.
- ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.37,623 కోట్లు
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.85,930 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.41,239 కోట్ల వసూళ్లసహా)
- సెస్ రూ.11,779 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.840 కోట్ల వసూళ్లసహా)

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్లు అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్‌లలో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు చొప్పున ఖజానాకు జమయ్యాయి.


88 శాతం పెద్ద నోట్లు వచ్చేశాయ్: ఆర్‌బీఐ



ముంబై: చెలామణిలో ఉన్న 88 శాతం రూ.2,000 నోట్లు 2023 జూలై 31వ తేదీ నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చేసినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒక ప్రకటనలో పేర్కొంది. వీటి విలువ రూ.3.14 లక్షల కోట్లుగా పేర్కొంది. అటు తర్వాత (జూలై 31 తర్వాత) వ్యవస్థలో ఉన్న పెద్ద నోట్ల విలువ రూ.0.42 లక్షల కోట్లని వెల్లడించింది. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.3.62 లక్షల కోట్ల విలువైన రూ.2,000 బ్యాంక్ నోట్లు చెలామణిలో ఉన్నాయి. ఉపసంహరణ ప్రకటన చేసిన మే 19వ తేదీ నాటికి రూ.3.56 లక్షల కోట్లకు తగ్గాయి. సెప్టెంబర్ 30వ తేదీ వరకూ గడువు ఉన్నప్పటికీ, వాటికి అంతకుముందుగానే మార్చుకోవడానికి ప్రజలు ఉత్సుకత చూపినట్లు తాజా గణాంకాల ప్రకారం తెలుస్తోంది. 2016 నవంబర్‌లో అప్పటి పెద్ద నోట్ల రూ.500, రూ.1,000 నోట్లను రద్దుచేసి కొత్త రూ.500, రూ.2,000 నోట్లను తీసుకువచ్చిన ఆర్‌బీఐ, మే 19వ తేదీన ఒక కీలక ప్రకటన చేస్తూ, రూ.2,000 నోట్లను కూడా సెప్టెంబర్ 30 నాటికి పూర్తిగా వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి 2018–19లోనే ఆర్‌బీఐ రూ. 2,000 నోట్ల ముద్రణను నిలిపివేసింది. 2018 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల గరిష్ట చెలామణి విలువ రూ.6.73 లక్షల కోట్లు. చెలామణిలో ఉన్న మొత్తం రూ.2,000 నోట్లలో ఈ విలువ 37.3 శాతానికి సమానం. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల చెలామణీ విలువ రూ.3.62 లక్షల కోట్లు. చెలామణిలో ఉన్న మొత్తం నోట్లలో ఈ విలువ 10.8 శాతం మాత్రమే.

తయారీ.. వరుసగా 25వ నెలా వృద్ధిబాట

జూలైలో 57.7 వద్ద సూచీ



న్యూఢిల్లీ: భారత్ మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు 70 శాతం వాటా కలిగిన తయారీ రంగం జూలైలో వరుసగా 25వ నెల వృద్ధి బాటన నిలిచినట్లు ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) పేర్కొంది. జూలైలో సూచీ 57.7 వద్ద పటిష్టంగా ఉంది. అయితే జూన్‌కన్నా (57.8) స్వల్పంగా తగ్గింది. సూచీ 50 శాతం ఎగువన ఉంటే, వృద్ధి ధోరణిగా ఆ దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన వరుసగా 25 నెలల నుంచి సూచీ వృద్ధి బాటనే పయనిస్తోంది. అమెరికా అలాగే బంగ్లాదేశ్, నేపాల్ వంటి ఇరుగుపొరుగు దేశాల నుంచి కొత్త ఆర్డర్లు పెరిగినట్లు సూచీకి సంబంధించిన సర్వేలో వెల్లడైనట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్యానల్‌లోని దాదాపు 400 తయారీ సంస్థల పర్చేజింగ్ మేనేజర్స్‌కు పంపిన ప్రశ్నలు, అందిన సమాధానాల ప్రాతిపదికన సూచీ కదలికలు ఉంటాయి. 2005 మార్చిలో ఈ గణాంకాల సేకరణ ప్రారంభమైంది.

సూచీలకు స్వల్ప నష్టాలు

- ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదుడుకులు
- 19,750 దిగువకు నిఫ్టీ



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు మంగళవారం స్వల్పంగా నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ ప్రతికూల ప్రభావాన్ని చూపింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ ఐదు పాయింట్లు పెరిగి 66,533 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 270 పాయింట్ల పరిధిలో కదలాడి 66,388 వద్ద కనిష్టాన్ని, 66,658 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 68 పాయింట్లు నష్టపోయి 66,459 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 30 పాయింట్లు పెరిగి 19,784 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ఇంట్రాడేలో 19,705 – 19,796 శ్రేణిలో కదలాడింది. చివరికి 20 పాయింట్లు పతనమై 19,734 వద్ద స్థిరపడింది. ఇంధన, ప్రభుత్వరంగ బ్యాంకులు, ఎఫ్‌ఎంసీజీ, ఆటో, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ పుంజుకోవచ్చని ఆశలతో ఐటీ స్టాకులకు డిమాండ్ లభించింది. అలాగే ప్రైవేటు బ్యాంకులు, మెటల్ షేర్లకూ గిరాకీ నెలకొనడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.93 కోట్ల ఈక్విటీలను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,036 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ మూడు పైసలు బలహీనపడి 82.26 వద్ద స్థిరపడింది. ప్రపంచ ఆర్థిక వృద్ధి అంచనాలతో ఆసియా మార్కెట్లు లాభపడ్డాయి. త్రైమాసిక ఫలితాలు, యూరోజోన్ జూలై తయారీ రంగ డేటా నిరాశపరచడంతో యూరప్ మార్కెట్లు బలహీనపడ్డాయి. అమెరికా స్టాక్ ఫ్యూచర్లు లాభ, నష్టాల మధ్య ట్రేడవుతున్నాయి. 'దేశీయ కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు కీలక దశకు చేరుకున్న నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్ ఒక పరిమిత శ్రేణిలో స్థిరీకరణ దిశగా సాగుతోంది. వాహన కంపెనీల ఆగస్టు ఆటో అమ్మకాలు, అమెరికా తయారీ రంగ పీఎంఐ, ఉద్యోగ కల్పన డేటా, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ద్రవ్య విధాన వైఖరి అంశాలు రానున్న రోజుల్లో సూచీలకు దిశా నిర్దేశం చేస్తాయి' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ దీపక్ జెసానీ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- హీరో మోటోకార్ప్ షేరు మూడుశాతం పతనంతో కంపెనీకి ఒక్కరోజులోనే రూ.2,007 కోట్ల నష్టం వాటిల్లింది. మనీలాండరింగ్ విచారణలో భాగంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పవన్ కాంత్ ముంజల్‌తో పాటు మరి కొందరి ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించినట్లు వార్తలు వెలుగులోకి వచ్చాయి. ట్రేడింగ్‌లో షేరు 5% పైగా క్షీణించి రూ.3203 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి మూడు శాతం నష్టంతో రూ.3103 వద్ద ముగిసింది.
- పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేరు 5% నష్టపోయి రూ.252 వద్ద ముగిసింది. జూన్ క్వార్టర్‌లో నికర లాభం 5% క్షీణించడంతో అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ట్రేడింగ్‌లో 6% పతనమై రూ.250.50 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. సెన్సెక్స్, నిఫ్టీల్లో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే.

ఏటీఎఫ్ రేటు 8% పెంపు

వాణిజ్య ఎల్‌పీజీ ధర రూ. 100 తగ్గింపు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ధోరణులకు అనుగుణంగా దేశీయంగా ప్రభుత్వ రంగ ఇంధన రిటైల్ సంస్థలు విమాన ఇంధన (ఏటీఎఫ్) రేటును ఏకంగా 8.5 శాతం పెంచాయి. అటు వాణిజ్య వంట గ్యాస్ ధరను సిలిండర్‌కు రూ. 100 మేర తగ్గించాయి. తాజా మార్పులతో ఢిల్లీలో ఏటీఎఫ్ రేటు కిలోలీటరుకు రూ. 7,728 పెరిగి రూ. 98,508కి చేరింది. దీంతో వరుసగా రెండో నెలా విమాన ఇంధనం రేటు పెరిగినట్లయింది. జూలై 1నే ఇది 1.65% మేర (కిలోలీటరుకు రూ. 1,477) పెరిగింది. అంతకు ముందు ఆయిల్ కంపెనీలు నాలుగు సార్లు తగ్గించాయి. ఇక 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధర ఢిల్లీలో రూ. 100 తగ్గి రూ. 1,680కి లభించనుంది. గృహావసరాలకు ఉపయోగించే వంట గ్యాస్ రేటు యథాతథంగా రూ. 1,103 (14.2 కేజీల సిలిండర్) ఉంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) ప్రతి నెలా 1వ తేదీన వంట గ్యాస్, ఏటీఎఫ్ రేట్లను సవరిస్తాయి.

నెమ్మదించిన ఆటో అమ్మకాలు

- ఒక అంకె వృద్ధికి పరిమితమైన మారుతీ, హ్యుందాయ్
- ఎంఅండ్‌ఎం, టయోటా విక్రయాల్లో స్వల్ప వృద్ధి
- టూవీలర్స్‌కు కొనసాగిన డిమాండ్



ముంబై: దేశీయంగా ఆటో అమ్మకాలు జూలైలో నెమ్మదించాయి. మారుతీ సుజుకీ, హ్యుందాయ్ మోటార్స్ కంపెనీల విక్రయాలు ఒక అంకె వృద్ధికి పరిమితమయ్యాయి. మారుతీ సుజుకీ గత ఆర్థిక సంవత్సరం జూలైలో మొత్తం 1,75,916 వాహనాలను విక్రయించగా, జూలైలో ఈ సంఖ్య స్వల్పంగా 3% పెరిగి 1,81,630 యూనిట్లకు చేరింది. ''ఈ జూలైలో మా ఎస్‌యూవీ అమ్మకాలు 42,620 యూనిట్లు. కేరళ ఓనమ్ పండుగ(ఆగస్టు 28)తో ప్రారంభం కానున్న పండుగ సీజన్ నుంచి ఆటో పరిశ్రమ అమ్మకాల్లో వృద్ధి ఆశించవచ్చు'' అని కంపెనీ మార్కెటింగ్ సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు.

- హ్యుందాయ్ మోటార్ ఇండియా ఈ జూలైలో 66,701 యూనిట్లను విక్రయించింది. గతేడాది ఇదే ఏప్రిల్‌లో అమ్మిన 63,851 వాహనాలతో పోలిస్తే నాలుగు శాతం అధికం. ''స్పోర్ట్ యుటిలిటీ వెహికల్(ఎస్‌యూవీ) వాహనాలకు డిమాండ్ లభించడంతో జూలైలో దేశీయంగా 60 వేలకు పైగా అమ్మకాలను సాధించగలిగాము'' అని కంపెనీ సీఓఓ తరుణ్ గార్గ్ తెలిపారు.
- టాటా మోటార్స్ స్వల్పంగా అమ్మకాలు తగ్గాయి. గతేడాది జూలైలో 81,790 వాహనాలకు విక్రయించగా.., ఈ జూలైలో నాలుగు శాతం క్షీణతతో 80,633 యూనిట్లకు పరిమితమయ్యాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా అమ్మకాల్లో 18% వృద్ధి సాధించింది. గతేడాది జూలైలో మొత్తం 56,148 యూనిట్లకు విక్రయించగా, ఈ జూలైలో 66,124 వాహనాలను అమ్మింది. ముఖ్యంగా ప్యాసింజర్ విభాగంలో 29 శాతం వృద్ధిని నమోదు చేసింది.
- ద్విచక్ర వాహన విక్రయాలకు డిమాండ్ కొనసాగడంతో చెప్పుకొదగిన స్థాయిలో విక్రయాలు జరిగాయి. బజాజ్ ఆటో(10% క్షీణత) మినహా రాయల్ ఎన్‌ఫీల్డ్, హీరో మోటోకార్ప్, టీవీఎస్ మోటార్స్ అమ్మకాలు వరుసగా 32%, 12%, 4% చొప్పున పెరిగాయి.
- మొత్తంగా వార్షిక ప్రాతిపదికన ప్యాసింజర్ వాహనాల విక్రయాలు 3% స్వల్ప పెరుగుదల నమోదు చేశాయి. ఈ జూలైలో వీటి విక్రయాలు 3,52,492 యూనిట్లకు చేరాయి.

కంపెనీ	జూలై 2023	జూలై 2022	శాతాల్లో
మారుతీ సుజుకీ	1,81,630	1,75,916	(+)3
హ్యుందాయ్	66,701	63,851	(+)4
టాటా మోటార్స్	80,633	81,790	(+)1
ఎంఅండ్‌ఎం	66,124	56,148	(+)18
హోండా కార్స్	4,864	6,784	(-)28
ఎంజీ మోటార్స్	5,012	5,125	(-)2
టయోటా కిర్లోస్కర్	21,911	19,693	(+)11
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,19,747	3,54,670	(-)10
హీరో మోటోకార్ప్	3,91,310	4,30,684	(-)12
టీవీఎస్ మోటార్స్	3,25,977	3,14,639	(+)4
రాయల్ ఎన్‌ఫీల్డ్	73,117	55555	(+)32
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	5,877	5,982	(-)2
అశోక్ లేలాండ్	15,068	13,625	(+)11
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	5,570	5,360	(+)4
మహీంద్రా ట్రాక్టర్స్	25,175	23,307	(+)8

జాబ్ పాయింట్

ఐబీపీఎస్-4451 పీవో, ఎస్‌వో పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్).. 2024–25 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు /మేనేజ్‌మెంట్ ట్రైనీస్, స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **పోస్టుల వివరాలు:** ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రైనీస్, స్పెషలిస్ట్ ఆఫీసర్స్ పోస్టులు.
» **పోస్టుల సంఖ్య:** పీవో–3,049, ఎస్‌వో–1402
» **అర్హతలు:** పీవో పోస్టులకు ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన అర్హత ఉండాలి. ఎస్‌వో పోస్టులకు సంబంధిత విభాగంలో యూజీ, పీజీ, పీజీ డిప్లొమా తదితర అర్హతలు ఉండాలి. **వయసు:** 01.08.2023 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్(ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలు), ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 01.08.2023
» దరఖాస్తులకు చివరి తేది: 21.08.2023
» పూర్తి వివరాలకు: https://www.ibps.in

తెలంగాణలో 1520 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్((ఎంహెచ్ఎస్ఆర్‌బీ) కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వేల్ఫేర్ విభాగంలో.. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1520
» **జోన్‌ల వారీగా ఖాళీలు:** జోన్1 కాళేశ్వరం–169, జోన్2 బాసర–225, జోన్3 రాజన్న–263, జోన్4 భద్రాద్రి–237, జోన్5 యాదాద్రి–241, జోన్6 చార్మినార్–189, జోన్7 జోగులాంబ–196.
» **అర్హత:** ఇంటర్మీడియట్ వొకేషనల్ ఉత్తీర్ణులవ్వాలి. అభ్యర్థులు మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ ట్రెయినింగ్ కోర్సు పూర్తిచేయాలి. మిడ్‌వైఫరీ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకోవాలి.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, పని అనుభవం ద్వారా ఎంపికచేస్తారు. మొత్తం 100 మార్కులకు ఎంపిక ప్రక్రియ ఉంటుంది. రాతపరీక్ష ద్వారా 80 శాతం వెయిటేజీ ఉంటుంది. అభ్యర్థుల గత పని అనుభవాన్ని ఆధారంగా చేసుకుని మరో 20శాతం వెయిటేజీ కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 25.08.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.09.2023
» **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్.
» **వెబ్‌సైట్:** mhsrb.telangana.gov.in

ఆర్మీ వేల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీల్లో టీచింగ్ స్టాఫ్ పోస్టులు

ఆర్మీ వేల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ దేశంలోని వివిధ కంటోన్మెంట్లు, మిలిటరీ స్టేషన్లలోని ఆర్మీ పబ్లిక్ స్కూళ్లలో..టీచింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టుల వివరాలు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ), పీఆర్‌టీ(ప్రైమరీ టీచర్) పోస్టులు.
» **అర్హత:** పోస్టును అనుసరించి కనీసం 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్/బీఈడీ /బీఈఎల్ఈడీ /పీజీ/డీఈఎల్ఈడీ ఉత్తీర్ణులవ్వాలి. సీటెట్, టెట్ అర్హత సాధించాలి.
» **వయసు:** 49 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ, టీచింగ్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** మొత్తం 200మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 1/4 వంతు రుణాత్మక మార్కు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.09.2023
» **అడ్మిట్ కార్డులు విడుదల:** 20.09.2023.
» **పరీక్ష తేదీలు:** 30.09.2023 నుంచి 01.10.2023.
» **ఫలితాల విడుదల తేది:** 23.10.2023.
» **వెబ్‌సైట్:** www.awesindia.com

ఐఐఎస్ఈఆర్, బెర్హంపూర్‌లో 15 ఫ్యాకల్టీ పోస్టులు

బెర్హంపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్) ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్–02, అసోసియేట్ ప్రొఫెసర్–02,అసిస్టెంట్ ప్రొఫెసర్–గ్రేడ్1–11.
» **విభాగాలు:** బయోలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, మ్యాథమేటిక్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
» **పని అనుభవం:** కనీసం 3 నుంచి 10 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.1,01,500 నుంచి రూ.1,59,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**23.08.2023
» **వెబ్‌సైట్:** www.iiserbpr.ac.in

వాయుసేనలో అగ్నివీర్

ఇంటర్మీడియట్ పూర్తిచేసిన వారికోసం భారతీయ వాయుసేన అగ్నివీర్‌వాయు (01/2024) ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. అగ్నిపథ్ స్కీం కింద భర్తీ చేసే ఈ పోస్టులకు మహిళలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మూడు దశల ఎంపిక ప్రక్రియలో ప్రతిభ చూపిన వారిని వాయుసేనలో అగ్నివీరులుగా తీసుకుంటారు. ఎంపికైన వారికి నాలుగేళ్ల పాటు వాయుసేనలో పనిచేసే అవకాశం లభిస్తుంది. అనంతరం 25 శాతం మందిని శాశ్వత ఉద్యోగులుగా తీసుకుంటారు. మిగతా వారు అగ్నిపథ్ స్కీములో భాగంగా ఇచ్చే ఆర్థిక ప్రోత్సాహకాలతో ఉద్యోగం నుంచి వైదొలుగుతారు..

» 2024(1) బ్యాచ్‌కు ప్రకటన విడుదల
» ఇంటర్‌తోనే ఎయిర్‌ఫోర్స్‌లో కొలువు

అగ్నివీర్‌వాయులో సైన్స్, నాన్ సైన్స్ విభాగాల్లో ఖాళీలున్నాయి. సైన్స్ విభాగంలో పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారు నాన్‌సైన్స్ ఖాళీలకు పోటీ పడవచ్చు. ఇందుకోసం వీరు ప్రత్యేక పరీక్ష రాయాల్సి ఉంటుంది.

అర్హతలు

- **సైన్స్ విభాగం:** ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. లేదా నిర్దేశిత బ్రాంచ్‌ల్లో మూడేళ్ల డిప్లొమా కోర్సు 50 శాతం మార్కులతో పూర్తిచేయాలి. లేదా ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో రెండేళ్ల వొకేషనల్ కోర్సు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- **నాన్ సైన్స్ విభాగం:** ఇంటర్మీడియెట్ ఏదైనా గ్రూప్‌తో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా రెండేళ్ల ఒకేషనల్ కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందాలి. ఏ అర్హతతో దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. టెన్త్/ఇంటర్/ఒకేషనల్ ఇంగ్లిష్‌లో కనీసం 50శాతం మార్కులు సాధించడం తప్పనిసరి.
- **వయసు:** 17 1/2 నుంచి 21 ఏళ్ల లోపు ఉండాలి. అంటే.. 27.06.2003 నుంచి 27.12.2006 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎత్తు:** అన్ని విభాగాలకు పురుషులు 152.5 సెం.మీ.; మహిళలు 152 సెం.మీ. ఉండాలి. ఎత్తుకు తగిన బరువు అవసరం. ఊపిరి పీల్చినప్పుడు, వదిలినప్పుడు ఛాతి వ్యత్యాసం 5 సెం.మీ. ఉండాలి.

ఎంపిక విధానం

మూడు దశల్లో నిర్వహించే అర్హత పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇందులో ఫేజ్–1 రాత పరీక్ష, ఫేజ్–2 ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులు, ఫేజ్–3 మెడికల్ టెస్టులుంటాయి. ఈ మూడింటిలో అర్హత సాధించిన వారిని మాత్రమే తుదిగా ధ్రువపత్రాలను పరిశీలించి ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

ఫేజ్–1 రాత పరీక్ష

ఈ పరీక్షను ఆన్‌లైన్ (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. సైన్స్ సబ్జెక్టులకు పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ఇంగ్లిష్, రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. సైన్స్, నాన్ సైన్స్ రెండింటికీ దరఖాస్తు చేసుకున్నవారికి పరీక్ష సమయం 85 నిమిషాలు ఉంటుంది. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్,రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ నుంచి ప్రశ్నలు వస్తాయి. అన్ని పరీక్షల్లోనూ ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. అలాగే తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. అన్ని ప్రశ్నపత్రాల్లోనూ ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్ ప్రశ్నలు సీబీఎస్ఈ 10 +2 స్థాయిలో ఉంటాయి. ఎంపిక చేసుకున్న పరీక్షను బట్టి ఇంగ్లిష్–20 ప్రశ్నలు, ఫిజిక్స్–25 ప్రశ్నలు, మ్యాథ్స్–25 ప్రశ్నలు, రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు.



ఫేజ్–2 ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్

ఫేజ్–1 రాత పరీక్షలో ప్రతిభ చూపిన అభ్యర్థులకు మాత్రమే ఫేజ్–2కు అవకాశం లభిస్తుంది. ఎంపికైన అభ్యర్థులు నిర్దేశిత సెలక్షన్ కేంద్రాలకు ప్రవేశ పత్రాలతోపాటు అవసరమైన సర్టిఫికేట్లు, వాటి జిరాక్స్ సెట్, ఫోటోలు తదితరాలు తీసుకెళ్లాలి. ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులో భాగంగా 1.6 కిలోమీటర్ల దూరాన్ని పురుషులు 7 నిమిషాలు; మహిళలు 8 నిమిషాల్లో చేరుకోవాలి. అలాగే పురుషులు ఒక్కోటి నిమిషం వ్యవధిలో 10 పుష్ అప్స్, 10 సిట్ అప్స్, 20 స్క్వాట్స్ పూర్తిచేయాలి. మహిళలు 90 సెకన్లలో 10 సిట్ అప్స్, ఒక నిమిషంలో 15 స్క్వాట్స్ పూర్తిచేయగలగాలి. వీటన్నింటిలోనూ అర్హత సాధించినవారికి అడాప్టబిలిటీ టెస్ట్ ఉంటుంది. అభ్యర్థి ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగానికి సరిపోతాడా లేదా అనేది నిర్ణయించడానికి ఆబ్జెక్టివ్ తరహాలో ఈ రాత పరీక్ష ఉంటుంది.

ఫేజ్–3

అడాప్టబిలిటీ టెస్టులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు మెడికల్ టెస్టులు నిర్వహించి శిక్షణ కోసం ఎంపిక చేస్తారు.

10+2 స్థాయిలో ప్రిపరేషన్

సిలబస్ 10+2 సీబీఎస్ఈ స్థాయిలో ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు సంబంధిత టాపిక్స్‌పై ప్రత్యేక దృష్టితో చదవాలి. అలాగే మ్యాథ్స్, ఫిజిక్స్ విభాగాల్లోని అంశాలను ఎంసెట్ స్థాయిలో ప్రిపేరవడం మేలు. దీంతోపాటు వీలైనన్ని మాక్ టెస్టులు రాయాలి. ఫలితంగా ఇన్‌టైంలో పరీక్ష పూర్తిచేయగలుగుతారు. అంతేకాకుండా ఎక్కడ తప్పులు చేస్తున్నారో తెలుస్తుంది. ఇంగ్లిష్‌కు సంబంధించి వ్యాకరణాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. రీజనింగ్ విభాగంలో మాదిరి ప్రశ్నలు ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి ఇటీవలి కాలంలో రక్షణశాఖలో తీసుకొచ్చిన నూతన సాంకేతికత, ఈ విభాగంలో చోటుచేసుకున్న కీలకపరిణామాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. వీటితోపాటు స్పోర్ట్స్, అవార్డులు, బుక్స్, ఎన్నికలు తదితర తాజా పరిణామాలపైనా దృష్టిపెట్టాలి.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేదీ: 17.08.2023
- ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: 13.10.2023
- వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in

కొలువులో ఇలా

సేవానిధి

ప్రతినెల అందుకునే మొత్తంలో 30శాతం కార్పస్ ఫండ్‌కి జమచేస్తారు. ఇలా మొత్తం నాలుగేళ్ల కాలానికి సేవానిధిలో రూ.5.02 లక్షలు అగ్నివీరుని వేతనం నుంచి జమవుతాయి. అంతేమొత్తాన్ని ప్రభుత్వమూ జమచేస్తుంది. రెండు కలిపి రూ.10.04 లక్షలవుతాయి. దీనికి వడ్డీని జతచేసి నాలుగేళ్ల తర్వాత వైదొలుగుతున్న సందర్భంగా అగ్నివీర్‌వాయుకు అందజేస్తారు. స్వయం ఉపాధి/వ్యాపారం కోసం వీరికి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరయ్యేలా ఏర్పాట్లు చేస్తారు. కార్పొరేట్ సంస్థల్లోనూ అవకాశాలు ఉంటాయి. నాలుగేళ్ల సర్వీస్‌లో మధ్యలో వైదొలిగే అవకాశం కూడా ఉంటుంది. అలాంటి సందర్భంలో వేతనం నుంచి జమైన మొత్తాన్ని మాత్రమే అగ్నివీర్‌వాయుకు అందిస్తారు. ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహం మాత్రం దక్కదు.

25 శాతం మందికి శాశ్వత కొలువు

అగ్నివీర్‌వాయు స్కీంలో భాగంగా నాలుగేళ్ల సర్వీస్‌ను పూర్తిచేసుకున్న వారిలో ఒక్కో బ్యాచ్ నుంచి గరిష్టంగా 25శాతం మందిని మాత్రమే శాశ్వత ఉద్యోగంలోకి తీసుకుంటారు. ఇందుకోసం నాలుగేళ్ల వ్యవధిలో చూపిన ప్రతిభ, సంస్థ అవసరాలు ప్రామాణికంగా తీసుకుంటారు. సైన్స్ విభాగంలో అవకాశం వచ్చినవారు గ్రూప్–ఎక్స్(ఫిట్టర్) విధులు నిర్వర్తిస్తారు. వీరికి మొదటి నెల నుంచే రూ.33,100 వేతనంగా లభిస్తుంది.నాన్‌సైన్స్ అభ్యర్థులు గ్రూప్ వై(టెక్నీషియన్) సేవలు అందిస్తారు. వీరికి రూ.26,900 మూలవేతనం చెల్లిస్తారు. ఈ రెండు ట్రేడులవారికీ డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర అలవెన్సులు అందుతాయి. ఎక్స్‌ట్రేడ్‌ల్లోని వారు మొదటి నెల నుంచే రూ.యాభై వేలకు పైగా, వై ట్రే డుల్లో చేరిన వారు సుమారు రూ.45,000 వేతనంగా అందుకోవచ్చు.

పదోన్నతులు

శాశ్వత కొలువు పొందిన తర్వాత సంబంధిత విభాగంలో విధుల్లో పనిచేసే వారు భవిష్యత్తులో ప్రమోషన్ల ద్వారా మాస్టర్ వారెంట్ ఆఫీసర్(ఎండబ్ల్యూవో) స్థాయి వరకు చేరుకోవచ్చు. సర్వీస్‌లో కొనసాగుతూ సంబంధిత పరీక్షల్లో అర్హత పొందిన వారు కమిషన్డ్ ఆఫీసర్లుగా ఎంపికయ్యే అవకాశముంది. అలాగే ఉద్యోగం చేస్తూనే నిర్ణిత వ్యవధి గల ఉన్నత విద్యను కొనసాగించడానికి కూడా అనుమతిస్తారు. పదవీ విరమణ వయసు వరకు ఉద్యోగంలో కొనసాగవచ్చు. అనంతరం ఫించను, ఇతర ప్రయోజనాలు లభిస్తాయి.

ప్రోత్సాహకాలు

అగ్నివీర్‌వాయులో ప్రవేశం పొందిన వారికి 30 వార్షిక సెలవులు ఉంటాయి. ఆరోగ్య సమస్యలను బట్టి సిక్‌లీవ్‌లు కూడా ఇస్తారు. నాలుగేళ్ల సర్వీస్ కాలంలో రిస్క్ అండ్ హార్డ్‌షిప్,రేషన్,డ్రెస్, ట్రావెల్ అలవెన్సులు అందిస్తారు. నాలుగేళ్ల పాటు రూ.48 లక్షలకు లైఫ్ ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. నాలుగేళ్ల సేవలకు గాను వారు పనిచేసిన విభాగాన్ని అనుసరించి అగ్నివీర్‌వాయు సర్టిఫికేట్ అందుతుంది. వీరికి ఫించను, గ్రాట్యుటీ, కరవు భత్యం, మిలటరీ సర్వీస్ పే (ఎంఎస్‌పీ), ఎక్స్‌సర్వీస్‌మెన్ హోదా ఇవేవీ వర్తించవు. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఉండదు.

క్లుప్తంగా...

ఏపీ జెన్‌కో డైరెక్టర్‌గా బాబ్జి

ఆదేశాలు జారీ చేసిన ఇంధన శాఖ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీజెన్‌కో) డైరెక్టర్ (థర్మల్)గా డీఎస్‌జీఎస్ఎస్ బాబ్జి నియమితులయ్యారు. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సెలక్షన్ కమిటీ సిఫార్సులను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తన ఆదేశాల్లో పేర్కొన్నారు. కాగా ఎన్టీపీసీలో కీలక బాధ్యతలు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన బాబ్జి రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు.

కంటైనర్ల హ్యాండ్లింగ్‌లో విశాఖ పోర్టు మరో రికార్డు



పోర్టులోని కంటైనర్ టెర్మినల్

సాక్షి, విశాఖపట్నం: వరుస రికార్డులతో విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) దూసుకుపోతోంది. ఇటీవలే కొత్త కంటైనర్ సర్వీసు ప్రారంభించడం, ఒకే రోజులో అత్యధికంగా ఐరన్‌ఓర్ హ్యాండ్లింగ్, మొదలైన అంశాల్లో రికార్డులు నెలకొల్పిన పోర్టు.. తాజాగా ఒకే నెలలో అత్యధికంగా 20 అడుగుల కంటైనర్లు (టీఈయూ–ట్వంటీ ఎక్విప్‌మెంట్ యూనిట్) సరుకు రవాణా నిర్వహించింది. ఈ ఏడాది మే నెలలో 61,468 టీఈయూలు హ్యాండ్లింగ్ చేయగా.. జూన్ నెలలో 63,256 టీఈయూలు హ్యాండ్లింగ్ చేసి రికార్డు సృష్టించింది. జూలైలో ఏకంగా 66,220 టీఈయూలను హ్యాండ్లింగ్ చేసింది. కంటైనర్ల హ్యాండ్లింగ్‌లో సరికొత్త రికార్డుల్ని నెలకొల్పుతున్న సిబ్బందిని పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు అభినందించారు.

21, 22 తేదీల్లో ఏపీ ఎన్జీవో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు



పోస్టర్ విడుదల చేస్తున్న బండి శ్రీనివాసరావు కె.వి. శివారెడ్డి తదితరులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఏపీ ఎన్జీవో సంఘం 74 ఏళ్లు పూర్తి చేసుకోవడాన్ని పురస్కరించుకుని విజయవాడలో ఈ నెల 21, 22 తేదీల్లో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కె.వి. శివారెడ్డి చెప్పారు. మంగళవారం కలెక్టరేట్ సమీపంలోని ఎన్జీవో హోమ్‌లో మీడియాతో వారు మాట్లాడారు. ఈ కౌన్సిల్ సమావేశాలు ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, ఇతర మంత్రులను ఆహ్వానించామన్నారు. గతంలో పీఆర్సీ కోసం ఆందోళనలు, ధర్నాలు చేశామని, కానీ ఇప్పుడు ఎలాంటి ఆందోళనలు అవసరం లేకుండా ముఖ్యమంత్రి ఒక నెల ముందుగానే పీఆర్సీ కమిషన్ వేశారని తెలిపారు. ఎన్జీవోలకు చెందిన అనేక సమస్యలను సీఎం ఎంతో సాహసోపేతంగా పరిష్కరించారన్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రవిశంకర్, మాజీ అధ్యక్షుడు నారాయణరావు పాల్గొన్నారు.

విశాఖ ఎన్ఐఏ కోర్టుకు జగన్‌పై హత్యాయత్నం కేసు బదిలీ

సాక్షి, అమరావతి: ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేస్తున్న సమయంలో వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నానికి సంబంధించిన కేసు విశాఖపట్నం ఎన్ఐఏ కోర్టుకు బదిలీ అయ్యింది. ఈ విషయాన్ని విజయవాడ ఎన్ఐఏ కోర్టు మంగళవారం ప్రకటించింది. 2018 అక్టోబర్ 25న విశాఖ విమానాశ్రయంలో వైఎస్ జగన్‌పై జానుపల్లి శ్రీనివాసరావు అనే నిందితుడు హత్యాయత్నం చేశాడు. ఈ కేసును ఇప్పటివరకు విజయవాడ ఎన్ఐఏ కోర్టు విచారించింది.

భూ కేటాయింపు విధానానికి సవరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాల్లో ఎస్సీలకు శ్మశాన వాటికల ఏర్పాటు కోసం ఎకరం భూమి ఇచ్చేందుకు వీలుగా భూ కేటాయింపుల విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ జీవో జారీ చేశారు. రాష్ట్రంలో ఎస్సీలకు శ్మశాన వాటికల సమస్య లేకుండా చేయాలని నిర్ణయించిన సీఎం జగన్.. అందుకు భూములు కేటాయిస్తూ ఇటీవల జరిగిన మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నారు. 1,700 రెవెన్యూ గ్రామాల్లో 1,050.08 ఎకరాలను ఎస్సీల శ్మశాన వాటికలకు కేటాయించారు. భూ కేటాయింపు అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. ఈ నిర్ణయాన్ని అమలు చేయాలంటే 2012 భూ కేటాయింపుల విధానాన్ని మార్చాల్సి ఉంది. ఆ విధానం ప్రకారం 10 ఎకరాలు, రూ.50 లక్షల విలువకు లోబడి మాత్రమే భూ కేటాయింపులు చేసే అధికారం కలెక్టర్లకు ఉంది. . ఈ నేపథ్యంలో విలువతో సంబంధం లేకుండా ఒక ఎకరం వరకు భూమిని కలెక్టర్లు శ్మశాన వాటికలకు కేటాయించేలా నిబంధనల్లో సవరణ చేశారు.

నిజాలు దాచి.. నిర్భయంగా అబద్ధాలు

పోలవరం ప్రాజెక్టుపై ఈనాడు మరో అసత్య కథనం

- చంద్రబాబు పాపాలను దాచిపెట్టి.. ప్రస్తుత ప్రభుత్వంపై బురద జల్లే యత్నం
- చంద్రబాబు నిర్వాకం వల్లే పోలవరానికి నిధుల సమస్య
- అడ్డంకులన్నింటినీ తొలగించుకుంటూ వడివడిగా పోలవరాన్ని పూర్తి చేస్తున్న సీఎం వైఎస్ జగన్
- సీఎం జగన్ కృషితో తొలి దశ పూర్తికి రూ.12,911.15 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకారం
- బిల్లుల చెల్లింపులో విభాగాల వారీగా విధించిన పరిమితులు తొలగింపు
- తాగునీటి విభాగం వ్యయాన్నీ ఇస్తామని కేంద్రం వెల్లడి
- ఇవే విషయాలను రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర మంత్రి బిశ్వేశ్వర్ తుడు
- దీన్ని జీర్ణించుకోలేక.. వక్రీకరణలతో రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లిన 'ఈనాడు'



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో టీడీపీ సర్కారు పాపాలను దాచిపెట్టడం, వాస్తవాలను వక్రీకరించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లడంలో రామోజీరావుది అందె వేసిన చేయి అని మరోసారి నిరూపించుకున్నారు. ప్రాజెక్టు తొలి దశ పూర్తికి రూ.12,911.15 కోట్ల అదనపు నిధులు ఇచ్చేందుకు, బిల్లుల చెల్లింపులో విభాగాలవారీగా విధించిన పరిమితులు తొలగించేందుకు జూన్ 5న కేంద్ర ఆర్థిక శాఖ అంగీకరించిందని, తాగునీటి విభాగానికి అయ్యే వ్యయాన్ని కూడా ఇస్తామని కేంద్ర జల్ శక్తి శాఖ సహాయమంత్రి బిశ్వేశ్వర్ తుడు సోమవారం రాజ్యసభలో చెప్పడంతో రామోజీరావు జీర్ణించుకోలేపోయారు. చంద్రబాబు నిర్వాకం వల్ల ఏర్పడిన అడ్డంకులన్నీ సీఎం వైఎస్ జగన్ కృషి వల్ల తొలగుతుండటం, ప్రాజెక్టు శరవేగంగా పూర్తవుతుండటాన్ని ఓర్చుకోలేకపోతున్నారు. ఈ క్రమంలోనే చంద్రబాబు చేసిన పాపాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపైకి నెట్టేలా వాస్తవాలను వక్రీకరిస్తూ మంగళవారం ఓ కథనాన్ని అచ్చేశారు. ఆ కథనంలో వీసమెత్తు నిజం లేదు. అసలు నిజాలివీ..

ఈనాడు ఆరోపణ: పోలవరం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం మరోసారి బయటపడింది. సవరించిన అంచనాల విషయంలో అవసరమైన సమాచారాన్ని పోలవరం ప్రాజెక్టు అథారిటీ కోరినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన కరవైంది.

వాస్తవం: 2017–18 ధరల ప్రకారం పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయం రూ.55,548.87 కోట్లకు ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ ఇవ్వాలని 2020 డిసెంబర్‌లోనే పీపీఏకు రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. పీపీఏ సూచన మేరకు రెండు దశల్లో ప్రాజెక్టును పూర్తి చేయడానికి అంటే... 41.15 మీటర్ల కాంటూర్ వరకు అవసరమైన నిధులు, 45.72 మీటర్ల వరకు నిర్మాణానికి అవసరమైన నిధులకు సంబంధించి సామాజిక ఆర్థిక సర్వే చేయాలి. ఇందులో 41.15 మీటర్ల కాంటూర్ వరకు పూర్తి చేయడానికి రూ.10,911.15 కోట్లు కావాలని 2022 జనవరి 10న పీపీఏకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఆ తర్వాత నిర్వహించిన లైడార్ సర్వేలో 45.72 మీటర్ల పరిధిలోని 5,127 నిర్వాసిత కుటుంబాలకు తొలి దశలోనే పునరావాసం కల్పించాలని తేలింది. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ పునర్నిర్మాణం, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతాన్ని యథాస్థితికి తేవడానికి రూ.2 వేల కోట్లు కలిపి రూ.17,144 కోట్లు అవసరమని మే 4 న పీపీఏకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. 45.72 మీటర్ల వరకు నిర్మాణానికి అవసరమైన నిధులు తేల్చడానికి సామాజిక ఆర్థిక సర్వే చేస్తూ, గ్రామ సభలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని పీపీఏ ద్వారా కేంద్ర జల్ శక్తి శాఖకు పంపుతోంది. కుడి, ఎడమ కాలువల ద్వారా 7.20 లక్షల ఎకరాలకు నీళ్లందించేలా డిస్ట్రిబ్యూటరీలు చేపట్టడానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఏప్రిల్ 16న పీపీఏకు పంపింది. ఇప్పుడు చెప్పండి రామోజీ.. రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ఎక్కడ ఉంది?

ఈనాడు ఆరోపణ: కన్‌స్ట్రక్షన్ (నిర్మాణ) షెడ్యూలును సవరించి రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోంది.

వాస్తవం: టీడీపీ సర్కారు నిర్వాకం వల్లే కన్‌స్ట్రక్షన్ షెడ్యూలు సవరణలో పీపీఏ, రాష్ట్ర జలవనరుల శాఖ చేష్టలుడిగాయి. ప్రాజెక్టు ప్రోటోకాల్‌ను తుంగలో తొక్కి.. వరదను మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు కట్టకుండానే 2018లో ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్‌ను చంద్రబాబు నిర్మించారు. దీంతో 2020లో వచ్చిన భారీ వరదలకు డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ఈ డయాఫ్రమ్ వాల్‌కు మరమ్మతులు చేయాలా? కొత్తది నిర్మించాలా? అనే అంశంపై డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ మేధోమథనం చేస్తున్నాయి. ఇది తేలితేగానీ కన్‌స్ట్రక్షన్ షెడ్యూలు ఖరారు చేయలేరు. ఈ పాపం చంద్రబాబుది కాదనగలరా రామోజీ?

ఈనాడు ఆరోపణ: 2017–18 ధరల ప్రకారం సవరించిన అంచనా వ్యయానికి పెట్టుబడి ఆమోదం రాష్ట్ర పొందలేకపోతోంది.

వాస్తవం: కేంద్ర ప్రభుత్వం నిర్మించాల్సిన పోలవరం ప్రాజెక్టును కమీషన్ల కక్కుర్తితో చేతుల్లోకి తీసుకున్నదే చంద్రబాబు. 2016 సెప్టెంబరు 7న 2013–14 ధరల ప్రకారం పోలవరాన్ని పూర్తి చేస్తామని కేంద్రం వద్ద అంగీకరించారు. కేవలం రూ.20,398 కోట్లతో ప్రాజెక్టు నీటి పారుదల విభాగం పనులను పూర్తి చేస్తానని ఆయన చెప్పడంతో.. ఆ మేరకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో 2014 ఏప్రిల్ 1 నాటికి ఖర్చు చేసిన రూ.4,730.71 కోట్లను మినహాయించి మిగతా రూ.15,667.9 కోట్లను మాత్రమే ఇస్తామని స్పష్టం చేసింది. ఇప్పటికే ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.16,218.78 కోట్లు వ్యయం చేసింది. ఇందులో రూ.14,418.39 కోట్లను కేంద్రం రీయింబర్స్ చేసింది. మరో రూ.1800.39 కోట్లను కేంద్రం రీయింబర్స్ చేయాలి. ఈ పరిస్థితులను ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వైఎస్ జగన్ వివరించి.. తాజా ధరల మేరకు నిధులు ఇచ్చి, విభాగాల వారీగా విధించిన పరిమితులను తొలగించి. తాగునీటి విభాగానికి అయ్యే నిధులను కూడా ఇచ్చి ప్రాజెక్టును పూర్తి చేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందిస్తూ జూన్ 5న కేంద్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే అంశాన్ని కేంద్ర జల్ శక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు సోమవారం రాజ్యసభలో వెల్లడించారు.

వరదపైనా 'బురద' రాతలేల?

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా రామోజీ మాత్రం తనకు అలవాటైన రీతిలోనే యథేచ్ఛగా మరోసారి చెలరేగిపోయారు. వరద సహాయక చర్యలు పక్కాగా జరుగుతున్నా.. జరగడంలేదని చిత్రీకరించేందుకు రామోజీ విషపుత్రిక.. 'ఈనాడు' పడరాని పాట్లు పడుతోంది. వరద లేని గ్రామాల్లోకి వెళ్లి టీడీపీ సానుభూతిపరులను బాధితులుగా చూపిస్తూ, వారితో ఫొటో షూట్లు చేస్తూ.. సాయం అందలేదని చెప్పించి ప్రభుత్వంపై విషం కక్కుతోంది. సాయం అందుకున్న వారి వద్దకు వెళ్లి.. వారు చెప్పని విషయాలను కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా చెప్పినట్లుగా విషం జిమ్ముతోంది. తమను గాలికొదిలేశారని ఈనాడు పత్రికలో మంగళవారం తమ ఫొటోలతో వచ్చిన వార్తలను చూసిన పలువురు బాధితులు ఆ కథనాలను తీవ్రంగా ఖండించారు. ఆ పత్రికలో రాసినట్లు అసలు తాము చెప్పలేదని, తమకు ప్రభుత్వ సాయం అందినా అందలేదని ఎలా రాస్తారని నిలదీశారు. ఈనాడు అసత్య కథనంపై అధికారుల పరిశీలనలో అసలు వాస్తవాలు వెలుగుచూశాయి.

ఊరు మునిగిందంటూ రామోజీ అబద్ధాలు..

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి స్నానాల రేవు వద్ద బాధితులు నిరసన తెలుపుతున్నట్లు ఈనాడు మొదటి పేజీలో ప్రచురించిన ఫొటో అబద్ధానికి పరాకాష్టగా తేలింది. రేషన్ కార్డులో ఎంతమంది పేరున్నా ఒక్కరికే భోజనం ప్యాకెట్ ఇస్తున్నారని, తాగునీరు అందించలేదని బాధితులు చెప్పినట్లు, అన్నిచోట్లా ఇదే పరిస్థితి ఉన్నట్లు ఈనాడు దుష్ప్రచారం చేసింది. అధికారుల పరిశీలనలో వాస్తవానికి ఆ గ్రామంలోకి పూర్తిగా వరద రాలేదని వెల్లడైంది. వరద లేకపోవడంతో 'ఈనాడు' బృందం కొందరు గ్రామస్తులను వారి ఇళ్ల నుంచి నది సమీపంలోని అప్పనపల్లి బాలబాలాజీ గుడికి దగ్గరలోని స్నానాల ఘాట్ వద్దకు తీసుకెళ్లింది. అక్కడ వారు నిరసన తెలుపుతున్నట్లు 'ఫొటోషూట్'కి తెరతీసింది. ఇంకేముంది.. గ్రామంలోకి వరద నీరు వచ్చి మునిగిపోయినట్టుగా ఈనాడు మొదటి పేజీలో ఒక అడ్డగోలు ఫొటోతో అసత్య కథనాన్ని అచ్చేసింది.

ఈనాడు వక్రీకరణలపై బాధితులు ఏమన్నారంటే..

సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు గంటా నర్సింగరావు, వెంకటలక్ష్మి టీ తాగి జీవిస్తున్నట్టు చెప్పినట్టు ఒక దారుణమైన అబద్ధాన్ని 'ఈనాడు' మొదటి పేజీలో అచ్చేసింది. అయితే తాము టీ తాగి బతుకుతున్నట్లు చెప్పలేదని ఆ దంపతులు అధికారుల వద్ద వాపోయారు.

ప్రతి గ్రామానికి ఒక్కో ఇన్‌చార్జ్ అధికారి

మామిడికుదురు మండలంలో రోజూ 5 ట్రాక్టర్లు, 7 బోట్లతో వరద ప్రభావిత లంక గ్రామాల నుంచి పునరావాస కేంద్రాలకు బాధితులను తరలిస్తున్నారు. వారికి నాణ్యమైన భోజనం అందిస్తున్నా చిమిడిపోయిన అన్నం, నీళ్ల చారు ఇస్తున్నారని టీడీపీ వారితో చెప్పిస్తూ ఈనాడు శునకానందం పొందుతోంది. ఆ మండలంలో 35 మంది సభ్యుల ఎన్డీఆర్ఎఫ్ బృందం పనిచేస్తోంది. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అధికారులు వరద బాధిత ప్రాంతాల నుంచి 10,612 మందిని సురక్షిత ప్రాంతాలకు, 32 సహాయ శిబిరాలకు తరలించారు. సహాయ కార్యక్రమాల కోసం 175 బోట్లను వినియోగిస్తున్నారు. బాధితులకు 56,762 ఆహార పొట్లాలు, 2.6 లక్షల తాగునీటి ప్యాకెట్లు, 20,480 వాటర్ లీటర్ల క్యాన్లు అందించారు. కోనసీమ, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో గోదావరి వరద ప్రభావిత గ్రామాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి. సహాయక చర్యల కోసం ప్రతి గ్రామానికి ఒక్కో ఇన్‌చార్జ్ అధికారిని నియమించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు క్షేత్రస్థాయిలో సమర్థవంతవంతంగా సహాయ, పునరావాస కార్యక్రమాల్లో పాల్గొంటుండడం రామోజీకి కంటగింపుగా మారింది. అందుకే అవాస్తవాలు, వక్రీకరణలతో తప్పుడు కథనాలు ప్రచురిస్తూ ప్రభుత్వంపై బురద చిమ్ముతున్నారు.

గ్రామంలో ప్రతి ఒక్కరికీ ఆహార పంపిణీ

అప్పనపల్లి స్నానాల రేవు వద్ద సుమారు 300 మంది బాధితులు ఉండగా అందరికీ అధికారులు ఆహార పొట్లాలు అందించారు. అయితే రామోజీ మాత్రం రేషన్ కార్డుకు ఒక ఆహార పొట్లం చొప్పున 50 రేషన్ కార్డులకు 50 పొట్లాలు మాత్రమే అందించారని తన విషపుత్రిక ఈనాడులో అడ్డగోలు అబద్ధాలను అచ్చేశారు. వాస్తవానికి గోదావరి వరద ఉధృతి ఈ గ్రామానికి లేకపోయినా పక్కనున్న గ్రామాల మాదిరిగానే తమకూ సాయం చేయాలని స్థానిక సర్పంచ్ ఎమ్మెల్యేను కోరడంతో బాలబాలాజీ దేవస్థానం అధికారులు 1,500 ఆహార ప్యాకెట్లు అందించారు. వాటిని అప్పనపల్లి గ్రామంలో అందరికీ పంపిణీ చేశారు. అయితే ఒక రేషన్ కార్డుకు ఒక ఆహారం ప్యాకెట్ మాత్రమే ఇస్తున్నట్లు గ్రామంలో కొందరు టీడీపీ సానుభూతిపరులు తప్పుడు ప్రచారం చేశారు. దీన్ని నిజమని నమ్మించే ప్రయత్నం చేసి ఈనాడు మరోసారి అభాసుపాలైంది.

టీ తాగి బతుకుతున్నామని చెప్పలేదు..

మాకు అధికారులు సురక్షిత తాగునీరు, పాలు అందిస్తున్నారు. టిఫిన్, ఆహారం కూడా పంపిణీ చేస్తున్నారు. ఇలా అన్నీ వస్తున్నాయి. టీ తాగి బతుకుతున్నామని మేము ఈనాడుకు చెప్పలేదు. ఈనాడు కథనం పూర్తిగా అబద్ధం. మాకు ఏ అవసరం వచ్చినా పక్కనే ఉన్న టేకిశెట్టిపాలెం వెళ్లాల్సి వస్తోందని.. పిల్లలు బడికి వెళ్లాలన్నా పడవలపై వెళ్లాల్సిన పరిస్థితి ఉందని మాత్రమే చెప్పాం. అలాగే గ్రామంలో ఎప్పటి నుంచో ఉన్న సమస్యలను మాత్రమే తాము చెప్పాం తప్ప వరద సాయం అందలేదని ఎక్కడా చెప్పలేదు. మా గ్రామ సర్పంచ్ (జనసేన పార్టీ) తమ వద్దకు రాలేదని మాత్రమే చెప్పాం.

– గంటా నర్సింగరావు, వెంకటలక్ష్మి దంపతులు, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి మండలం, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఈనాడు రాసిందంతా అబద్ధం

ప్రభుత్వం సాయం అందించలేదని నేను చెప్పలేదు. ఈనాడులో రాసినవన్నీ అసత్యాలు. నేను చెప్పింది వేరు.. ఈనాడు రాసింది వేరు. ప్రభుత్వాన్ని తప్పుపడుతూ నేనేం మాట్లాడలేదు. ఈనాడు అడిగింది వేరు.. నేను చెప్పింది వేరు. ఆ పత్రిక వార్త ఆధారంగా ప్రభుత్వాన్ని తప్పు పట్టవద్దు. ప్రభుత్వం అన్ని రకాలుగా మాకు సాయం అందిస్తోంది.

– పాపాయమ్మ, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి మండలం



ముంపు ప్రాంతాల్లో ముమ్మర సాయం

- తేరుకుంటున్న గ్రామాలు..
- యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్న సహాయక చర్యలు



చింతూరు మండలం కల్లేరులో వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న మహిళ

చింతూరు/వేలేరుపాడు/పోలవరం రూరల్: గోదావరి నదిలో వరద ప్రవాహం శాంతిస్తుండటంతో విలీన మండలాల్లోని గ్రామాలు, లంక గ్రామాలు ముంపునుంచి బయటపడుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి వెళ్లే ప్రధాన రోడ్డు ముంపు నుంచి పూర్తిగా బయటపడింది. పోలీసు చెక్‌పోస్టు వద్ద యథావిధిగా పోలీసు కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టు ప్రాంతానికి వాహనాల రాకపోకలు కూడా యథావిధిగా సాగుతున్నాయి. వారం రోజులుగా ముంపులో ఉన్న నారుమడులు, నాట్లు వేసిన పొలాలు వరద నీటినుంచి తేరుకున్నాయి. గోదావరి వరద తగ్గడంతో కడెమ్మ స్లూయిజ్ గేట్లు తెరుచుకుని పొలాల్లో చేరిన నీరంతా స్లూయిజ్ ద్వారా నదిలోకి చేరుతోంది. బుధవారం నాటికి పూర్తిస్థాయిలో పొలాలు వరద నీటి నుంచి బయటపడతాయి. వేలేరుపాడు సంతబజారు, తిర్లాపురం, రుద్రమకోట, టేకూరు, ఎడవల్లి, శ్రీరాంపురం, తాట్కూరుగొమ్ము, పాతనార్లవరం గ్రామాల్లోని ఇళ్లు ముంపునుంచి బయటపడ్డాయి.

ముమ్మరంగా సహాయక చర్యలు

వరద పూర్తిస్థాయిలో తగ్గిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని విలీన మండలాల్లో అధికారులు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతున్నారు. వరద నీరు రహదారుల నుంచి తొలగడంతో రోడ్డు మార్గం ద్వారా రవాణా సౌకర్యం మెరుగుపడింది. దీంతో ఇప్పటివరకు జలమార్గంపైనే ఆధారపడి సహాయక చర్యలు చేపట్టిన అధికారులు మంగళవారం నుంచి రోడ్డు మార్గం ద్వారా ముంపు ప్రాంతాలకు నిత్యావసర సరుకులు, కూరగాయలను పంపిస్తున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ వారం రోజులుగా చింతూరులోనే మకాం వేసి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఇక్కడి పరిస్థితిని ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఇతర ప్రభుత్వ పెద్దలు సమీక్షిస్తున్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముంపు గ్రామాల్లో పర్యటిస్తూ వరద బాధితుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళుతున్నారు. మంగళవారం నుంచి చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లోని వరద బాధితులకు కుటుంబానికి 25 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. వంటనూనె, కందిపప్పు, కూరగాయలు కూడా అందచేస్తున్నారు. రెండు, మూడ్రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. మరోవైపు వరద తగ్గడంతో ముంపు గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశారు. పారిశుధ్య నిర్వహణకు నాలుగు మండలాలకు ప్రత్యేకంగా ఎంపీడీవోలను నియమించడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పంచాయతీ కార్యదర్శులు, కార్మికులను రప్పించారు. దెబ్బతిన్న రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించడంతో పాటు రహదారులపై పేరుకుపోయిన బురదను తొలగిస్తున్నారు. ముంపు గ్రామాల్లో రెండో విడత కూడా నిత్యావసరాలు, కూరగాయలను పంపిణీ చేస్తున్నారు.

రంగంలోకి వైద్య బృందాలు

చింతూరు డివిజన్‌లోని ముంపు ప్రాంతాల్లో వైద్యసేవలు అందించేందుకు 20 వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. వరద తగ్గడంతో ముంపు గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ప్రభుత్వం ముందుచూపుతో కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో ఏడేసి చొప్పున, చింతూరు, ఎటపాక మండలాల్లో మూడేసి చొప్పున బృందాలను నియమించింది. ఒక్కో బృందంలో వైద్యాధికారి, సూపర్‌వైజర్‌తో పాటు ఏఎన్ఎం, ఆశాతో కూడిన ఆరుగురు సభ్యులు ఉన్నారు. వైద్యబృందాలు ముంపు గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. అనారోగ్యంగా ఉన్న వారికి మందులు అందజేయడంతో పాటు అవసరమైతే సమీప ఆస్పత్రులకు తరలిస్తున్నారు. వైద్యబృందాలు గ్రామాల్లో పర్యటించేందుకు గాను 11 వాహనాలను ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీఎంవో డాక్టర్ ప్రసాదరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య వైద్యసేవలను పర్యవేక్షిస్తున్నారు. ఈ బృందాలు వారం రోజుల పాటు వైద్యసేవలు అందిస్తాయని, అవసరమైతే మరికొన్ని రోజులు అందుబాటులో ఉంచుతామని వైద్యశాఖ అధికారులు తెలిపారు.

పట్టణాల్లో స్వచ్ఛతపై సర్వే

- 16 వరకు ప్రజాభిప్రాయ సేకరణ
- 123 పట్టణాలను పరిశీలిస్తున్న క్యూసీఐ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో అనుసరిస్తున్న పరిశుభ్రత, పారిశుధ్య విధానాలపై స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం–అర్బన్) సర్వే ప్రారంభించింది. స్థానిక పరిస్థితులు, ప్రజల నుంచి అందిన అభిప్రాయాల ఆధారంగా అక్టోబర్ నెలలో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ప్రదానం చేయనుంది. ఇందుకోసం రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో పారిశుధ్య విధానాలపై ఎస్‌బీఎం ప్రజల అభిప్రాయాలు తీసుకుంటోంది. మరోపక్క క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) సిబ్బంది పట్టణాల్లో పర్యటిస్తూ స్వచ్ఛ విధానాలను అంచనా వేస్తున్నారు. ఈ నెల 16 లోగా ప్రజాభిప్రాయ సేకరణ, సర్వే పూర్తి చేయాలని కేంద్రం గడువు విధించింది.

గత ఏడాది 11 పురస్కారాలు: గత ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో రాష్ట్రం 11 పురస్కారాలను సొంతం చేసుకుంది. జాతీయ స్థాయిలో టాప్–10 నగరాల్లో విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగరాలు ఎంపికయ్యాయి. కర్నూలు, నెల్లూరు, కడప, రాజమహేంద్రవరం పట్టణాలు కూడా టాప్–100లో నిలిచాయి. ఇవిగాక 50 వేల నుంచి లక్ష జనాభా కేటగిరీలో టాప్–100లో 21 నగరాలు అవార్డులు పొందాయి. ఈసారి ఇంతకంటే ఎక్కువ అవార్డులు సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

10 లక్షల మంది అభిప్రాయాలు

ఇప్పటి దాకా రాష్ట్రం నుంచి 10,44,338 మంది అభిప్రాయాలు తెలిపారు. అత్యధిక మంది అభిప్రాయాలు తెలిపిన రాష్ట్రంగా ఏపీ రెండో స్థానంలో నిలిచింది. ప్రజలు ఐదు మార్గాల్లో అభిప్రాయాలు చెప్పవచ్చని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ వెంకట మురళి తెలిపారు. 'ఎస్ఎస్2023 ఓట్ ఫర్ యువర్ సిటీ' యాప్‌తో పాటు https://vfcity-prod.sbmurban.org/లేదాhttps://www.mygov.in/mygov-survey/swachh-survekshan–2023/ వెబ్‌సైట్ల ద్వారా పట్టణాలు, గ్రామాల్లోని పారిశుద్ధ్యంపై అభిప్రాయాలను తెలియజేయాలన్నారు.

అసలు సూత్రధారి సూర్యనారాయణే


- ఆయన వల్ల ఖజానాకు రూ.124 కోట్ల నష్టం వాటిల్లింది
- పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగిరెడ్డి వాదన



సాక్షి, అమరావతి: వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగి, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ వ్యాపారులతో కుమ్మక్కై ఖజానాకు రూ.124 కోట్ల నష్టం కలిగించారని పోలీసుల తరఫున రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ యర్రంరెడ్డి నాగిరెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఈ వ్యవహారంలో కీలక సూత్రధారి సూర్యనారాయణేనని పేర్కొన్నారు. ఇతర నిందితులు, వ్యాపారులతో సూర్యనారాయణ వందల సంఖ్యలో ఫోన్‌కాల్స్ మాట్లాడారని, ఇందుకు సంబంధించి పక్కా ఆధారాలున్నాయని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. తమపై ఎలాంటి లావాదేవీలు నడిపారు, ఎలా ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చారు వంటి కీలక వివరాలను వ్యాపారులు వాంగ్మూలాల రూపంలో తెలియచేశారని వివరించారు. తనకు వ్యతిరేకంగా వాంగ్మూలాలు ఇస్తే అంతుచూస్తానని, వ్యాపారాలు ఎలా చేస్తారో చూస్తానంటూ వ్యాపారులను సూర్యనారాయణ బెదిరించారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సూర్యనారాయణ నుంచి కీలక సమాచారం రాబట్టాల్సి ఉన్నందున ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారించాల్సి ఉందన్నారు. అందువల్ల అతనికి ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని కోర్టును కోరారు. అంతకు ముందు సూర్యనారాయణ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. ఏ విచారణల నివేదికల ఆధారంగా కేసు నమోదు చేశారో.. ఆ నివేదికల్లో సూర్యనారాయణ పేరు లేదన్నారు. గవర్నర్‌ను కలిసి జీపీఎఫ్ మొత్తాల మళ్లింపుపై ఫిర్యాదు చేసిన నాటినుంచే సూర్యనారాయణకు ప్రభుత్వం నుంచి వేధింపులు మొదలయ్యాయన్నారు. అందులో భాగంగానే ఈ కేసు నమోదైందన్నారు. ఈ కేసులో మిగిలిన నిందితులకు బెయిల్ మంజూరు చేసిందని తెలిపారు. సూర్యనారాయణకు సైతం బెయిల్ ఇవ్వాలని, ఏ షరతులు విధించినా వాటికి కట్టుబడి ఉంటామని రవిప్రసాద్ తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

శాంతించిన గోదావరి

- భద్రాచలం వద్ద 28.70అడుగులకు తగ్గిన నీటి మట్టం
- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ



సాక్షి, అమరావతి/ధవళేశ్వరం/శ్రీశైలం ప్రాజెక్ట్: ఎగువన వర్షాలకు విరామం ఏర్పడటం.. ఉప నదుల్లో ప్రవాహం తగ్గడంతో గోదావరిలో వరద మరింతగా తగ్గింది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలం వద్ద నీటిమట్టం 28.70 అడుగులకు తగ్గింది. పోలవరం ప్రాజెక్టులోకి 7,69,998 క్యూసెక్కులు చేరుతుండగా.. 48 గేట్ల ద్వారా అంతేస్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీలోకి 8,40,962 క్యూసెక్కులు చేరుతుండగా.. డెల్టాకు 11,500 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 8,29,462 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.70 అడుగులకు చేరుకోవడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. బుధవారం ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి మరింతగా తగ్గనుంది.

కృష్ణాలోనూ తగ్గిన వరద

కాగా.. కృష్ణా నదిలోనూ వరద తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం 6 గంటలకు 42,899 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 852.3 అడుగులు, 85.20 టీఎంసీలకు చేరుకుంది. మూసీ నుంచి పులిచింతలలోకి 10,422 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 33.8 టీఎంసీలకు చేరుకుంది. మున్నేరు, కట్టలేరు, బుడమేరుల్లోనూ వరద తగ్గడంతో ప్రకాశం బ్యారేజీలోకి 21,364 క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణా డెల్టాకు రెండు వేల క్యూసెక్కులను వదులుతూ మిగులుగా ఉన్న 19 వేల క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. కృష్ణాలో ఎగువన కూడా వరద తగ్గింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 28,250 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 80 టీఎంసీలకు చేరుకుంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943